మాలెల గత వారం పత్రికల్లో వచ్చిన వ్యాసాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
# వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
విశాఖపట్నం
: fb.com/vaartha Digital
Published from Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupati, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem, Srikakulam
10-6-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 130 పేజీలు: 16 వెల: 6.50

కాక్రోచ్ పార్టీకి పోటీగా 'ఇష్క్ కరో' పార్టీ

హెచ్-1బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు

5లో

## విశాఖ స్టీల్ ప్లాంట్‌లో
# ఎన్నడూ చూడని విషాదం

### మృతుల కుటుంబాలకు రూ. 25 లక్షల పరిహారం, ఉద్యోగం: డి.సిఎం పవన్ కల్యాణ్



మంగళవారం విశాఖలో మీడియాతో డి.సిఎం పవన్

**విశాఖపట్నం, జూన్9, ప్రభాతవార్త :** విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడడం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు ప్రకటించారు.మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. గాయపడిన వారి వైద్య ఖర్చులన్నింటినీ ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుందని స్పష్టం చేశారు.ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సుమారు రూ.1.72 కోట్లు, >>4



ప్రమాదం జరిగిన ప్రదేశాన్ని పరిశీలిస్తున్న మంత్రి లోకేష్

### బాధితులను పూర్తిగా
## ఆదుకొంటాం
### మంత్రి లోకేష్ హామీ, విశాఖ చేరిన ముగ్గురు సభ్యుల కమిటీ

**విశాఖపట్నం, జూన్ 9 ప్రభాతవార్త :** విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు..కేజీహెచ్ మార్చురీవద్ద మృతుల కుటుంబాలను, వివిధ ఆసుపత్రుల్లో >>4



మంగళవారం ఆర్టీజీఎస్ సమీక్షలో ముఖ్యమంత్రి చంద్రబాబు

### ప్రతి రోజు మంచినీటి శాంపిళ్లు తీయాలి

### రూరల్ అన్న క్యాంటీన్లు సమర్థంగా నిర్వహించాలి

### ఆర్టీజిఎస్ సమీక్షలో సిఎం చంద్రబాబు

## ఆన్‌లైన్ ప్రభుత్వ సేవలకు
# ప్రత్యేక యాప్

**విజయవాడ,జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** మన మిత్ర ద్వారా ప్రభుత్వ సేవలన్నింటినీ ఆన్ లైన్‌లో వినియోగించుకునేలా ఏర్పాట్లు చేశామని.. దీంతో పాటు ప్రత్యేకంగా ఓ యాప్ రూపొందించాలని ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు ఆదేశించారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆర్టీజీఎస్, క్షేత్ర స్థాయిలో వివిధ శాఖల పనితీరుపై ముఖ్యమంత్రి సమీక్షి ం చారు. ప్రజలకు అందించే ప్రభుత్వ సేవల్లో ఎలాంటి ఇబ్బందులు లేకుండా చూడాలని స్పష్టం చేశారు. ఈ సందర్భంగా ముఖ్యమంత్రి చంద్రబాబు మాట్లాడుతూ..."ప్రభుత్వం అందించే అన్ని సేవలను ఆన్ లైన్ చేశాం. మన మిత్ర వాట్సాప్ ద్వారా ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేందుకు ప్రజల్లో అవగాహన పెంచాలి. ఇదే సందర్భంలో ఆన్ లైన్లో ప్రభుత్వ సేవలను వినియోగించుకునేలా యాప్ రూపొందించాలి. రాష్ట్రంలోని అన్న క్యాంటీన్లను పూర్తి స్థాయిలో సమర్థవంతంగా నిర్వహించాలి. అర్బన్ ప్రాంతాల్లో అన్న >>4

## నెహ్రూను దాటేసిన 'పుష్కర మోడీ'



### పన్నెండేళ్ల పాలన పూర్తి చేసుకున్న ఎన్డీయే

### నేడు కేబినెట్ భేటీలో ప్రధానికి ఘనసత్కారం

**న్యూఢిల్లీ,జూన్ 9:** కేంద్రంలో బిజెపి ఆధ్వర్యంలోని ఎన్‌డీయే కూటమి 12 ఏళ్ల అధికారం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా బుధ, గురు వారాల్లో ఎన్డీయే పక్షాల కీలక భేటీ జరగనున్నది. 12 ఏళ్ల పూర్తైన సందర్భాన్ని సెలబ్రేట్ చేసుకోవడంతోపాటు, భవిష్యత్‌లో ఎలా కలిసి ముందుకు వెళ్లాలి అనే అంశాలపై ఈ భేటీ జరగనుంది. ఇప్పటికే ఎన్డీయేకు చెందిన నేతలు సమావేశం కోసం ఢిల్లీ చేరుకున్నారు. ఇక గురువారం ప్రధాని మోడీ ఎన్డీయే పాలిత రాష్ట్రాల సిఎంలు, డిప్యూటీ సిఎంలతో కూడా భేటీ కానున్నారు. తమ పాలన ఉన్న రాష్ట్రాల్లో వికసిత్ భారత్ కోసం ఎలా పని చేయాలి, పశ్చిమాసియా సంక్షోభాన్ని ఎలా ఎదుర్కోవాలి వంటి అంశాలపై మోడీ వారితో చర్చించే అవకాశం ఉంది. ఎన్డీయే పాలనలోకి వచ్చి 12 ఏళ్లపూర్తిచేసుకున్న సందర్భంగా ప్రధానిమోడీ సోషల్ మీడియాలో పోస్టుచేస్తూ 12 యేళ్లలో దేశంలో ఎన్నో మార్పులు వచ్చాయని పేర్కొన్నారు. దశాబ్దాలపాటు నిరాదరణకు గురైనవారికి అభివృద్ధి ఫలాలను చేరవేయడంపైనే తమ సర్కారు దృష్టిపెడుతుందన్నారు. ప్రధానిగా మూడోసారి బాధ్యతలుచేపట్టి రెండేళ్లయిన నేపథ్యంలోసోమవారం ఆయన సోషల్‌మీడియాలో పోస్టుపెట్టారు. తమ ప్రభుత్వం తెచ్చిన ప్రత్యక్ష నగదు బదిలీ, స్వచ్ఛభారత్, పిఎం ఆవాస్‌యోజన ఆయుష్మాన్‌భారత్ వంటిపథకాలు ప్రత్యేకించి ప్రస్తావించారు. ప్రజలకు అవకాశాలు గౌరవం కల్పించడమే లక్ష్యంగా వాటిని >>4

# ఆక్వాకు అగ్రప్రాధాన్యం

### ఫీడ్ ధరలపై రైతులు, తయారీదారులు పరస్పర అంగీకారంతో ముందుకు రావాలి

### ఆక్వా విద్యుత్ కనెక్షన్లు యూనిట్‌కు రూ. 1.50 రాయితీ: మంత్రి అచ్చెన్నాయుడు



**విజయవాడ, జూన్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో ఆక్వాకల్చర్ రంగాన్ని మరింత బలోపేతం చేయడంతో పాటు రొయ్యల రైతుల ప్రయోజనాల పరిరక్షణకు ప్రభుత్వం ప్రాధాన్యత ఇస్తోందని వ్యవసాయ, మత్స్యశాఖల మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడు తెలిపారు. విజయవాడలోని మత్స్యశాఖ కమిషనర్ కార్యాలయంలో రొయ్యల రైతులు, ఫీడ్ తయారీ సంస్థలు, సముద్ర ఆహార ప్రాసెసింగ్ యూనిట్లు, ఎగుమతిదారులు తదితర రంగ ప్రతినిధులతో నిర్వహించిన ఉన్నత స్థాయి సమీక్షా సమావేశంలో ఆయన మాట్లాడారు. రొయ్యల ఫీడ్ ధరల పెరుగుదలపై రైతులు, పరిశ్రమ వర్గాలు తమ అభిప్రాయాలను ప్రభుత్వ దృష్టికి తీసుకువచ్చాయని మంత్రి తెలిపారు. ఫిష్‌మీల్, సోయాబీన్ తదితర ముడి పదార్థాల ధరలు పెరగడంతో ఉత్పత్తి వ్యయాలు అధికమయ్యాయని తయారీ సంస్థలు వివరించగా, ఇప్పటికే ఖర్చుల భారంపెరిగిన నేపథ్యంలో ధరల పెంపును నియంత్రించాలని రైతులు కోరినట్లు చెప్పారు. ఆక్వాకల్చర్ రంగ సమగ్ర ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకుని రైతులు, తయారీదారులు చర్చల ద్వారా అందరికీ ఆమోదయోగ్యమైన పరిష్కారానికి రావాలని ప్రభుత్వం సూచించినట్లు తెలిపారు. ఇరు వర్గాలు ఏకాభిప్రాయానికి వచ్చిన తర్వాత తమ ప్రతిపాదనలను ప్రభుత్వానికి సమర్పించాలని కోరినట్లు పేర్కొన్నారు. ఫీడ్ ధరల నిర్ణయంలో శాస్త్రీయ విధానాన్ని అనుసరించాల్సిన అవసరం ఉందని సమావేశంలో అభిప్రాయాలు వ్యక్తమైనట్లు మంత్రి వెల్లడించారు. ముడి పదార్థాలధరలు, టోకు ధరలసూచీతో పాటు మార్కెట్ పరిస్థితులను పరిగణన లోకి తీసుకుని భవిష్యత్తులో పారదర్శక ధరల వ్యవస్థ ఏర్పాటుపై ప్రభుత్వం సానుకూలంగా పరిశీలిస్తోందన్నారు. ఆక్వాకల్చర్ రైతులకు విద్యుత్ రాయితీపై మంత్రి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు ఆదేశాల మేరకు జూన్ 1 నుంచి అదనంగా 12 వేల ఆక్వాకల్చర్ విద్యుత్ కనెక్షన్లకు యూనిట్‌కు రూ.1.50 చొప్పున రాయితీ అందించే ప్రక్రియ తుది దశలో ఉందన్నారు. ఉత్తర్వులు జారీ అయిన తర్వాత అర్హత కలిగిన అన్ని ఆక్వాకల్చర్ కనెక్షన్లు అవి చిన్న, పెద్ద ఫారాలు అయినా, ఆక్వా జోన్ లేదా నాన్‌ఆక్వా జోన్‌లో ఉన్నా ఈ పథకం పరిధిలోకి వస్తాయని స్పష్టం చేశారు. ఈ నిర్ణయంతో ఉత్పత్తి వ్యయం తగ్గడంతో పాటు రైతులకు గణనీయమైన ఆర్థిక ఉపశమనం లభిస్తుందనితెలిపారు. మత్స్య, ఆక్వా కల్చర్ రంగాల్లో స్థిరమైన అభివృద్ధి, పోటీతత్వ సామర్థ్యాల పెంపు, రైతుల సంక్షేమం కోసం ప్రభుత్వం నిరంతరం కృషి చేస్తోందని మంత్రి అచ్చెన్నాయుడు పునరుద్ఘాటించారు.

## నాలుగు రాజ్యసభ నామినేషన్లు సక్రమమే
### - రిటర్నింగ్ అధికారి వనితా రాణి

**విజయవాడ, జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** రాజ్యసభ ఎంపి ఎన్నికలకు సంబంధించి నలుగురు అభ్యర్థులు దాఖలు చేసిన నామినేషన్లు సక్రమంగా ఉండడంతో వాటిని ఆమోదించినట్టు ఎన్నికల రిటర్నింగ్ అధికారి ఆర్.వనితా రాణి వెల్లడించారు.మంగళవారం అసెంబ్లీ కమిటీ హాల్లో రాజ్యసభ అభ్యర్థుల నామినేషన్ల పరిశీలన కార్యక్రమం జరిగింది. రాజ్యసభ ఎంపి అభ్యర్థులుగా తెలుగుదేశం పార్టీ తరుపున చింతకాయల విజయ్, బాష్యం రామకృష్ణ, సానా సతీష్,జనసేన పార్టీ తరపున లింగమనేని రమేష్‌లు దాఖలు చేసిన నామినేషన్లను సమక్రమంగా ఉండడంతో పరిశీలన అనంతరం నలుగురు అభ్యర్డుల నామినేషన్లను ఆమోదించినట్టు ఆమె వెల్లడించారు. నాలుగు రాజ్యసభ స్థానాలకు నలుగురు అభ్యర్థులు మాత్రమే నామినేషన్లు దాఖలు చేయడంతో వారంతా ఏకగ్రీవంగా ఎన్నికవుతారు. ఈ నామినేషన్ల పరిశీలనలో ఆయా అభ్యర్థుల తరుపున వారి ప్రతినిధులు పాల్గొన్నారు.



మంగళవారం ప్రధాని మోడీ ప్రభుత్వంపై పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

## పునరుత్పాదక ఇంధనంలో
# భారత్ టాప్

### 290 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో అమెరికాను దాటిన వైనం

### సౌరశక్తి, పవనశక్తిలో 3,4 స్థానాలు: కేంద్రమంత్రి ప్రహ్లాద్ జోషి

**తిరుపతి,జూన్ 9ప్రభాతవార్తప్రతినిధి:** పునరుత్పాదక ఇంధన రంగంలో 290 గిగావాట్ల స్థాపిత సామర్థ్యంతో భారత్ అమెరికాను అధిగమించిందని, సౌరశక్తి పవనశక్తి రంగాల్లో ప్రపంచంలో వరుసగా మూడు, నాలుగో స్థానాల్లో భారత్ నిలిచిందని కేంద్ర వినియోగదారుల వ్యవహారాలు, ఆహార, పునరుత్పాదక ఇంధన శాఖల మంత్రి ప్రహ్లాద్ జోషి తెలిపారు. గత 12 సంవత్సరాల్లో ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో దేశ ఆర్థిక వ్యవస్థ గణనీయంగా అభివృద్ధి చెందిందని, మౌలిక సదుపాయాల అభివృద్ధిద్వారా భారీ పెట్టుబడులు, యువతకు ఉపాధి అవకాశాలు లభించాయని పేర్కొన్నారు. గత 11 సంవత్సరాల్లో 60 వేల కిలో మీటర్లకు పైగా కొత్తరహదారులు, హైస్పీడ్ కారిడార్లు నిర్మించామని వెల్లడించారు. సెమీ కాన్ ఇండియా కార్యక్రమం ద్వారా 1.69 >>4



మంగళవారం కర్నూలులో రాస్తా రోకో చేస్తున్న వామపక్షాలు

### పెట్రోలు, డీజిల్ ధరల పెంపుపై
## కదంతొక్కిన వామపక్షాలు
### రాష్ట్ర వ్యాప్తంగా భారీ రాస్తారోకోలు

**విజయవాడ,జూన్9,ప్రభాతవార్తప్రతినిధి:** పెట్రోల్, డీజిల్ గ్యాస్‌ధరలను తగ్గించాలని కోరుతూ సిపిఎం పిలుపుమేరకు మంగళవారం రాష్ట్రవ్యాప్తంగా రాష్ట్ర రోకో నిర్వహించారు. పలు జిల్లాల్లో చేపట్టిన ఈ కార్యక్రమంలో కార్యకర్తలు, ప్రజలు పెద్ద ఎత్తున పాల్గొన్నారు. కేంద్ర ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. మోడీ ప్రభుత్వం 12 ఏళ్ల పాలనలో ప్రజలపై అనేక భారాలు మోపిందని, తక్షణమే భారాలను తగ్గించాలని డిమాండ్ చేశారు. ఇక కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భారీగా పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను తక్షణమే తగ్గించాలని డిమాండ్ చేస్తూ విజయవాడ రాణిగారితోట, నేతాజీవంతెన జంక్షన్ జాతీయరహదారిపై మంగళ వారం సిపిఎం, సిపిఐ, ఇతర >>4

### మౌలిక వసతుల కల్పనకు
# భారీ ప్రణాళికలు
### డ్రైనేజి వ్యవస్థ ఆధునీకరణకు రూ. 29 వేల కోట్లు
### ప్రజాధనం వృధాకానివ్వొద్దు: మంత్రి నారాయణ



మంగళవారం అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్‌ను జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభిస్తున్న మంత్రి నారాయణ

**విజయవాడ,జూన్9, ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలోని పట్టణ ప్రాంతాలలో మౌలిక వసతుల కల్పనే ధ్యేయంగా ప్రభుత్వం ప్రత్యేక ప్రణాళికలతో ముందుకు సాగుతోందని పురపాలక, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి పొంగూరు నారాయణ స్పష్టం చేశారు. స్థానిక మురళీ ఫార్చ్యూన్ హోటల్‌లో హడ్కో ఆధ్వర్యంలో మంగళవారం ఏర్పాటు చేసిన అర్బన్ ఛాలెంజ్ ఫండ్ కెపాసిటీ బిల్డింగ్ రెండు రోజుల వర్క్ షాపులో భాగంగా తొలి రోజు వర్క్ షాపును పురపాలక, పట్టణాభివృద్ధి మంత్రి పొంగూరు నారాయణ జ్యోతి ప్రజ్వలనతో ప్రారంభించారు. ఈసందర్భంగా మంత్రి పి.నారాయణ మాట్లాడుతూరాబోయే మూడేళ్లలో ప్రజల ప్రాథమిక అవసరాలైన ఐదు ప్రధాన అంశాలకు అత్యున్నత ప్రాధాన్యత ఇస్తున్నట్లు తెలిపారు. నాణ్యమైన మంచినీటి సరఫరా, ఘన వ్యర్థాల నిర్వహణ, వాడుక నీటి నిర్వహణ, అంతర్గత రోడ్ల అభివృద్ధి, వీధి దీపాల ఏర్పాటు వంటి అంశాలపై ప్రభుత్వం ప్రత్యేక దృష్టి సారించిందన్నారు. హడ్కో దేశవ్యాప్తంగా ప్రతిష్టాత్మకంగా >>4

### మీనాక్షి నటరాజన్
## నామినేషన్ తిరస్కృతి

**భోపాల్,జూన్ 9:** రాజ్యసభ ఎన్నికలపై ఉత్కంఠ పెరుగుతోంది. ఈ నెల 18వ తేదీ జరిగే ఎన్నికల్లో గెలిస్తే రాజ్యసభలో మూడింటి రెండొంతుల మెజార్టీ సాధించే అవకాశం ఉండటంతో బిజెపి వీటిని ప్రతిష్టాత్మకంగా తీసుకుంటోంది. ఇదే క్రమంలో మధ్యప్రదేశ్ నుంచి పోటీకి దిగిన కాంగ్రెస్ అభ్యర్థి మీనాక్షి నటరాజన్‌ను ఓడించేందుకు ఇప్పటికే కాంగ్రెస్ ఎమ్మెల్యేలను ప్రలోభాలకు గురిచేస్తుండటంతో వారంతా బెంగళూరు క్యాంప్ కు తరలివెళ్లారు. అయితే ఆ తర్వాత కూడా మీనాక్షి నటరాజన్‌కు షాక్ తప్పలేదు. మధ్యప్రదేశ్ నుంచి కాంగ్రెస్ రాజ్యసభ అభ్యర్థిగా మీనాక్షి నటరాజన్ సమర్పించిన నామినేషన్ అఫిడవిట్‌లో ఆమె తెలంగాణలో నమోదైన ఓ క్రిమినల్ కేసుకు సంబంధించిన సమాచారాన్ని దాచిపెట్టినట్లు నిర్ధారించి ఎన్నికల అధికారులు దాన్ని తిరస్కరించారు. నటరాజన్ అభ్యర్థిత్వాన్ని >>4

10-6Pg2exHMNWJQE.qxd:10-6Pg2exHMNWJQE.qxd 1/1/02 5:41 AM Page 1



## Format C-7

(for political parties to publish in the newspapers, social media platforms & website of the party)

Information regarding individuals with pending criminal cases, who have been selected as candidates, along with the reasons for such selection, as also as to why other individuals without criminal antecedents could not be selected as candidates

(As per the Commission's directions issued in pursuance of the Order dated 13.02.2020 of the Hon'ble Supreme Court in contempt petition(C) no. 2192 of 2018 in WP(C) no. 536 of 2011)

Name of Political Party : **TELUGU DESAM PARTY**
*Name of the Election : **BIENNIAL ELECTIONS TO COUNCIL OF STATES (RAJYA SABHA) 2026**
Name of State/UT: **ANDHRA PRADESH**

(1) Name of the Constituency - **Council of States (Rajya Sabha)**
Name of the candidate - **Vijay Chintakayala**

| Sl. No | | | |
|---|---|---|---|
| 1. | Criminal antecedents | | |
| | a. | Nature of the offences | 1. U/s Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000.<br>Allegation is that there is a post in social media harming the reputation of a person.<br><br>2. U/S Sec. 66(C) IT Act 2000 and 465,469,471,153 (A), 505(2) r/w 120-B IPC<br>Allegation is that created a fake and morphed video and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour/alarming news and there by create communal disharmony among the public.<br><br>3. U/S Sec. 324, 506 r/w, 34 IPC<br>Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and beat him on 16th April, 2022.<br><br>4. U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861<br>Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following COVID norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police.<br><br>5. U/S Sec. 341, 186 r/w, 34 IPC<br>Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in mobile dispensing unit by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works.<br><br>6. U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC<br>Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. |
| | b | Case no. | 1. FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District<br>2. FIR No. 12/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District.<br>3. FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural<br>4. FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhaptnam Rural.<br>5. FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural<br>6. FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Visakhapatnam Rural. |
| | c | Name of the Court | Not Applicable |
| | d | Whether charges have been framed or not (Yes/No) | No |
| | e | Date of conviction, if any | Not Applicable |
| | f | Details of punishment undergone, if any | Not Applicable |
| | g | Any other information required to be given | NIL |
| 2. | The reasons for the selection of the candidate. Selection shall be with reference to the qualifications, achievements and merit of the candidate, and not mere "winnability" at the polls (not more than 100 words) | | He has been actively involved in social service activities and has been great supporter of the marginalized sections of the society. |
| 3 | Reasons as to why other individuals without criminal antecedents could not be selected as candidates (not more than 100 words) | | No other suitable candidate was available. |

(2) Name of the Constituency- **Council of States (Rajya Sabha)**
Name of the candidate- **Chintakayala Vijay** and so on

* In the case of election to Council of States or States or election to Legislative Council by MLAs, mention the election concerned in place of name of Constituency.

**Signature of office bearer of the Political Party**
**Name and designation**
**P. Ashok Babu**
**State General Secretary, TDP**

## 18, 19 తేదీల్లో పబ్లిక్ అండర్‌టేకింగ్స్ కమిటీ సమీక్షలు

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ శాసనసభ ప్రజా రంగ సంస్థల కమిటీ(సిపియు) సమావేశాలు 18,19 తేదీలలో అమరావతిలోని ఆంధ్రప్రదేశ్ శాసనసభ కార్యాలయ కమిటీ హాల్-1లో నిర్వహించనున్నట్లు శాసనసభ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర ఒక ప్రకటనలో తెలిపారు. ప్రభుత్వ రంగ సంస్థల కమిటీ సమావేశంలో సంబంధిత అథారిటీలు, కార్పొరేషన్ల స్థాపన లక్ష్యాలు, ఆర్థిక పరిస్థితి, ఆస్తులు-అప్పులు, సంస్థల కార్యకలాపాలు, సాధించిన విజయాలు, సిబ్బంది వివరాలు, ఖాళీలు, రోస్టర్ అమలు తదితర అంశాలపై సమగ్ర సమీక్ష నిర్వహించనున్నారు. అలాగే ప్రభుత్వ విధానాల అమలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలు, ప్రైవేట్ భాగస్వామ్య విధానాలు, అవుట్‌సోర్సింగ్ వ్యవస్థ, ఖాతాల నిర్వహణ, ఆడిట్ అభ్యంతరాల పరిష్కారం, పనితీరు, సామర్థ్య పెంపు చర్యలు, ఈఆఫీస్ అమలు పరిస్థితులపై కూడా కమిటీ పరిశీలన చేయనుంది. 18న వ్యవసాయం, పట్టు పరిశ్రమ, సహకార రంగం, రైతు సంక్షేమం, పశుసంవర్ధక, మత్స్య, వెటర్నరీ, సామాజిక సంక్షేమ రంగాలకు సంబంధించిన సంస్థలను సమీక్షించనున్నారు. వీటిలో ఎపి స్టేట్ సీడ్స్ సర్టిఫికేషన్ ఏజెన్సీ, రైతు సాధికార సంస్థ, స్టేట్ అగ్రికల్చర్ మేనేజ్‌మెంట్ అండ్ ఎక్స్టెన్షన్ ట్రైనింగ్ ఇన్‌స్టిట్యూట్, ఎపి స్టేట్ షీప్ అండ్ గోట్ డెవలప్‌మెంట్ కోఆపరేటివ్ ఫెడరేషన్, మీట్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్, ఎపి స్టేట్ ఫిషర్‌మెన్ కోఆపరేటివ్ సొసైటీస్ ఫెడరేషన్, ఎపి వెటర్నరీ కౌన్సిల్, ఎపి పారా వెటర్నరీ అండ్ అలైడ్ కౌన్సిల్ వంటి సంస్థలు ఉన్నాయి. 19న ఎపి కమిషన్ ఫర్ బ్యాక్‌వర్డ్ క్లాసెస్, ఎంజెపి ఎపిబిబిసిడబ్ల్యూ రెసిడెన్షియల్ ఎడ్యుకేషన్ సొసైటీ, ఎపి స్టేట్ సివిల్ సప్లైస్ కార్పొరేషన్, ఎపి స్టేట్ హౌసింగ్ కార్పొరేషన్ లిమిటెడ్, ఎపి మినరల్ డెవలప్‌మెంట్ కార్పొరేషన్, ఆర్థిక, పరిపాలనా అంశాలపై సమీక్ష నిర్వహించనున్నారు.

## Format C-1

(for candidate to publish in Newspaper, TV)

**Declaration about criminal cases**

(As per the judgment dated 25th September, 2018 of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & ORS. Vs. Union of India & Anr.)

Name and address of candidate: **VIJAY CHINTAKAYALA &**
D. No.14-40/2, Velama Veedhi, Narsipatnam, Anakapalli District, Andhra Pradesh - 531116.
Name of the political party : **TELUGU DESAM PARTY**
(Independent candidates should write "Independent" here)
Name of the Election: **ELECTION TO THE COUNCIL OF STATES (RAJYA SABHA)**
* Name of the constituency: **ANDHRA PRADESH (STATE)**

I **VIJAY CHINTAKAYALA** (name of candidate), a candidate for the above-mentioned election; declare for public information the following details about my criminal antecedents:

**(A) Pending criminal cases**

| Sl. No | Name of Court | Case No. and dated | Status of case(s) | Section(s) of Acts concerned and brief description of offence(s) |
|---|---|---|---|---|
| 1 | NOT APPLICABLE | FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalgiri, Guntur District, AP Dated. 01-10-2022 | The FIR is under investigation | U/S Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000 & Allegation is that there is a post in social media harming the reputation of Wife of Smt. Y.S.Bharathi Reddy, w/o Jagan Mohan Reddy. |
| 2 | NOT APPLICABLE | FIR No.12/2022 of CCPS, CBCID Police Station, Mangalgiri, Guntur District, AP Dated. 05-09-2022 | The FIR is under the stage of investigation | U/S Sec. 66(C) IT Act 2000 and 465, 469, 471, 153(A), 505(2) r/w 120-B IPC & Allegation is that created a fake and morphed video of Shri Kuruva Gorantla Madhav and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour / alarming news and there by create communal disharmony among the public. |
| 3 | NOT APPLICABLE | FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural. Dated. 17-04-2022 | The FIR is under investigation | U/S Sec. 324, 506 r/w, 34 IPC & Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and bet him on 16th April, 2022. |
| 4 | NOT APPLICABLE | FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Dated. 24-11-2021 | The FIR is under investigation | U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861 & Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following covid norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police. |
| 5 | NOT APPLICABLE | FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Dated. 07-03-2021 | The FIR is under investigation | U/S Sec. 341, 186 r/w, 34 IPC & Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in MDU Rice vehicles by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works. |
| 6 | NOT APPLICABLE | FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural. Dated. 12-12-2019 | The FIR is under investigation | U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC & Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. |

**(B) Details about cases of conviction for criminal offences**

| Sl. No | Name of court & date (s) of orders (s) | Description of offence (s) & punishment imposed | | Maximum Punishment Imposed |
|---|---|---|---|---|
| 1 | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE |
| 2 | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE |
| 3 | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE | NOT APPLICABLE |

- In the case of election to Council of States or election to Legislative Councils by MLAs, mention the election concerned in place of name of constituency.

**Sd/- Vijay Chintakayala**

10-6Pg3exHMNWJQECTBPGOL.qxd:10-6Pg3exHMNWJQECTBPGOL.qxd 1/1/02 5:43 AM Page 1



## Format C-2

**(for political party to publish website, newspapers, TV)**

**Declaration about criminal antecedents of candidates set up by the party**

*(As per the judgment dated 25th September, 2018, of Hon'ble Supreme Court in WP (Civil) No. 536 of 2011 (Public Interest Foundation & Ors. Vs. Union of India & Anr.)*

Name of political party : **TELUGU DESAM PARTY**

Name of Election : **BIENNIAL ELECTIONS TO COUNCIL OF STATES (RAJYA SABHA) 2026**

Name of State/ UT : **ANDHRA PRADESH**

| 1 | 2 | 3 | 4 | | 5 | | |
|---|---|---|---|---|---|---|---|
| **Sl. No** | **Name of constituency** | **Name of candidate** | **(A) Pending criminal cases** | | **(B) Details about cases of conviction for criminal offences** | | |
| | Council of States (Rajya Sabha) | Vijay Chintakayala | Name of Court, case No. & status of the case(s) | Section of the Acts concerned & brief description of offence(s) | Name of Court & date (s) of order(s) | Description of offence (s) & punishment imposed | **Maximum Punishment Imposed.** |
| 1 | Council of States (Rajya Sabha) | Vijay Chintakayala | FIR No. 14/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District Chargesheet not filed. | U/s Sec. 419, 469, 153(A) and 505(2), 120-B/ r/w.34 IPC and Sec.66-C of IT Act-2000. Allegation is that there is a post in social media harming the reputation of a person. | Not Applicable | Not Applicable | Not Applicable |
| 2 | | | FIR No. 12/2022 of CCPS, CBCID Police Station, Mangalagiri, Guntur District. Chargesheet not filed | U/S Sec. 66(C) IT Act 2000 and 465,469,471,153 (A), 505(2) r/w 120-B IPC Allegation is that created a fake and morphed video and the same was circulated in social media and conspired to promote enmity between different groups on the basis of caste by spreading rumour /alarming news and there by create communal disharmony among the public. | | | |
| 3 | | | FIR No. 81/2022, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Chargesheet not filed | U/S Sec. 324, 506 r/w, 34 IPC Allegation is that the complainant lodged a report stating that in a village festival, the accused persons made altercation with De-facto complainant and beat him on 16th April, 2022. | | | |
| 4 | | | FIR No. 293/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhaptnam Rural. Chargesheet not filed | U/S Sec. 188, 353, 153a, 505, 504, 269, 270 r/w, 34 IPC, 3 PA-1922, 3 EDA 1897, 51 (b) DMA-2005,30 PA-1861 Allegation is that while police officers were on bandobust duty, the accused persons conducted dharna on the road without following COVID norms and obstructed the police from discharging their duties by using insulting words and created fear to the public and disobeyed the orders promulgated by the police. | | | |
| 5 | | | FIR No. 83/2021, Narsipatnam Town Police Station, Narsipatnam, Visakhapatnam Rural Chargesheet not filed | U/S Sec. 341, 186 r/w, 34 IPC Allegation is that during municipal elections, the accused persons given loud slogans against distribution of cash in mobile dispensing unit by using loud speakers and obstructed the vehicle moments of Municipal Commissioner and Assistant Election Authority and thereby obstructed election related works. | | | |
| 6 | | | FIR No. 528/2019, Narsipatnam Town Police Station, Visakhapatnam Rural. Charge sheet not filed | U/S Sec. 448, 341, 509, 506 r/w, 109 IPC Allegation is that the while De-Facto complainant was trying to erect YSRCP party flag on the top of their house, Rajana Harsha and others trespassed in to top of their house and restrained him and obstructed him to not to launch the YSR flag and also scolded in filthy language and threatened him and his family with dire consequences. | | | |

**Signature of office bearer of the Political Party**
**Name and designation**
**P. Ashok Babu**
**State General Secretary, TDP**

**పారిశ్రామిక వికాసమే కీలక దిశ... విధ్వంసానికి స్వస్తి, విశ్వవిఖ్యాతమవుతున్న ఏపి ఖ్యాతి**

# ఎపి ఈజ్ బ్యాక్

## దేశవ్యాప్త చర్చగా మారిన నాయుడు గిరీ

**● రాష్ట్రానికి వరదలా పెట్టుబడులు ● చరిత్రలో ఎన్నడూ లేని విధంగా ఎంఓయూల ఛేజింగ్. ● రెండేళ్లలో పెట్టుబడులు పెట్టడానికి 800 కంపెనీల ఆసక్తి ● పెట్టుబడుల సాకారానికి నిత్యం కేంద్రంతో సంప్రదింపులు ● ఎంఓయూల అమలుకు నోడల్ అధికారులు ● ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్‌తో మారుతోన్న ఎపి ముఖ చిత్రం ● ఎంఒయుల అమలును పర్యవేక్షిస్తోన్న సిఎం చంద్రబాబు, మంత్రి లోకేష్**



సిఎం చంద్రబాబు సమక్షంలో జరిగిన ఓ పారిశ్రామిక ఒప్పందం (ఫైల్)

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** ఆంధ్రప్రదేశ్ పారిశ్రామిక ముఖచిత్రం శరవేగంగా మారుతోంది. రెండేళ్లల్లో సీఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం తీసుకున్న చర్యలతో పెద్ద ఎత్తున పెట్టుబడులు ఏపీకి వస్తున్నాయి. ప్రభుత్వాన్ని ఏర్పాటు చేసినప్పటి నుంచి సీఎం చంద్రబాబు పారిశ్రామిక విధానంలో తన స్టైల్ మార్చారు. గతానికి భిన్నంగా వెళ్లడం మొదలు పెట్టారు. 201419 మధ్య కాలంలో నాటి ప్రభుత్వం స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ విధానాన్ని అవలంభించింది. ఆ స్పీడుతోనే నాడు కొన్ని కీలక పెట్టుబడులు తెచ్చింది. కియా కార్ల కంపెనీని తెచ్చి ఉమ్మడి అనంతపురం జిల్లా.. ప్రత్యేకించి పెనుకొండ ప్రాంతం రూపు రేఖలు మార్చింది. ఇప్పుడు స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ నుంచి ఈజ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ వైపు కూటమి ప్రభుత్వం అడుగులు వేసింది. దీంట్లో భాగంగా పెద్ద ఎత్తున పెట్టుబడులు వచ్చాయి. భారీ స్థాయిలో ఎంఓయూలు కుదుర్చుకున్నారు. గత రెండేళ్ల కాలంలో సుమారు 800 కంపెనీలు ఏపీలో పెట్టుబడులు పెట్టేందుకు ఆసక్తిని కనబరిచాయి. ప్రస్తుతం రెండేళ్ల కాలంలో రూ.23 లక్షల కోట్ల పెట్టుబడులు పెట్టేందుకు వివిధ కంపెనీలు ఆసక్తి కనబరిస్తే.. వీటి ద్వారా సుమారు 23 లక్షల ఉద్యోగాలు రానున్నాయి. వీటిల్లో రూ.21.64 లక్షల కోట్ల పెట్టుబడులు వివిధ ఎంఓయూల ద్వారానే వస్తున్నాయి. 2025 ఏడాదిలో నిర్వహించిన భాగస్వామ్య సదస్సులో కుదుర్చుకున్న ఒప్పందాలతో పాటు వివిధ వేదికల మీద వివిధ సందర్భాల్లో కుదుర్చుకున్న ఒప్పందాలన్నీ కలిపి మొత్తంగా రూ. 21.64 లక్షల కోట్లుగా ఉంటే వీటి ద్వారా 21.20 లక్షల ఉద్యోగాలు రానున్నాయి

**రికార్డు స్థాయిలో పెట్టుబడులు... పర్ఫెక్ట్ మానిటరింగ్:** 'ఆంధ్రప్రదేశ్ ఈజ్ బ్యాక్' అనే నినాదం ఇప్పుడు దేశవ్యాప్తంగా మారుమోగుతోంది. గత ఐదేళ్ల కాలంలో రాష్ట్రం వైపు చూడటానికే భయపడి, పెట్టుబడులు వెనక్కి తీసుకుని పారిపోయిన కంపెనీలు నేడు ఏపీ వైపు క్యూ కడుతున్నాయి. ఎంఓయూలు కుదుర్చుకోవడం, ఆ తర్వాత వాటిని పక్కన పెట్టేయడమనేది గతంలో జరిగిన వ్యవహారం. ఆ విధానానికి కూటమి ప్రభుత్వం చెక్ పెట్టింది. ఎంఓయూల విషయంలో గతంలో ఎన్నడూ లేని విధంగా కూటమి ప్రభుత్వం వ్యూహాత్మకంగా అడుగులు వేస్తోంది. కుదుర్చుకున్న ఎంఓయూలను నిరంతరం మానిటర్ చేసేందుకు ఓ ప్రత్యేక వ్యవస్థను ఏర్పాటు చేసింది. చరిత్రలో ఎన్నడూ లేని విధంగా... కుదిరిన ప్రతి ఒప్పందాన్ని నిరంతరం పర్య వేక్షిస్తూ, కంపెనీలు క్షేత్రస్థాయిలోకి వచ్చేలా ప్రభుత్వం చేస్తున్న ఛేజింగ్ సరికొత్త రికార్డులు సృష్టిస్తోంది. ముఖ్యమంత్రి చంద్రబాబు, ఐటీ శాఖ మంత్రి లోకేష్ నేతృత్వంలో స్పీడ్ ఆఫ్ డూయింగ్ బిజినెస్ అంటే ఏమిటో ఏపీ దేశానికి కళ్లకు కట్టినట్టు చూపిస్తోంది. ఫలితంగానే దేశానికి వచ్చిన ఎఫ్‌డిఐల్లో 25.3శాతం ఎఫ్‌డిఐలు రాష్ట్ర ప్రభుత్వానికి వచ్చాయి. పెట్టుబడుల పర్యవేక్షణ బాధ్యతలను ప్రభుత్వం అధికారులకు ప్రత్యేకంగా అప్పగించింది. కేవలం అధికారులుగా కుర్చీలకే పరిమితం కాకుండా ప్రభుత్వం తరపున మార్కెటింగ్ మేనేజర్లుగా మారి పారిశ్రామికవేత్తల వెంట పడాలి. వారి సమస్యలను పరిష్కరించి పరిశ్రమలు స్థాపించేలా చూడాలని సీఎం చంద్రబాబు నిరంతరం అధికారులకు నిర్దేశిస్తూ ఉంటారు. ఎంఓయూల అమలుకు మూడు రీజియన్లకు ప్రత్యేక నోడల్ అధికారులను నియమించడంతో పాటు, జిల్లా కలెక్టర్లకు నిర్దిష్టమైన బాధ్యతలు అప్పగించారు. ఎంఓయూల విషయంలో దేశంలో మరే రాష్ట్రంలో లేనివిధంగా ఛేజింగ్ చేస్తుండడం వల్లే వల్లే అతి తక్కువ కాలంలోనే కంపెనీలు సాకారమవుతున్నాయి.

**36 రోజుల్లోనే ఆమ్కా.. గూగుల్ కోసం నిబంధనల మార్పు:** పెట్టుబడులు, పరిశ్రమలను గ్రౌండ్ చేసే విషయంలో ప్రభుత్వ వేగానికి, పట్టుదలకు తిలీదితి ప్రాజెక్టే నిలువెత్తు నిదర్శనం. కేవలం 36 రోజుల్లోనే ఈ ప్రాజెక్టు రాష్ట్రంలో అడుగుపెట్టి పనులు ప్రారంభించింది. ఆమ్కా విషయంలోనే కాదు ఇదే వేగంతో కేంద్ర ప్రభుత్వంతో నిత్యం సంప్రదింపులు జరుపుతూ, ప్రత్యేక ఫోకస్ పెట్టడం ద్వారా దిగ్గజ సంస్థలన్నీ ఏపీ వైపు చూస్తున్నాయి. ప్రతిష్టాత్మక గూగుల్ డేటా సెంటర్ ప్రాజెక్టును రాష్ట్రానికి తీసుకురావడం కోసం ప్రధాని నరేంద్ర మోదీతో సీఎం చంద్రబాబు, మంత్రి నారా లోకేష్ చర్చించి.. అవసరమైన మేరకు నిబంధనల్లోనే కీలక మార్పులు చేసేందుకు అంగీకరించేలా కేంద్రాన్ని ఒప్పించారు. అలాగే ఆర్సెల్లార్ మిట్టల్ ప్రాజెక్టు కోసం ప్రత్యేకంగా స్లర్రీ పైప్ లైన్ ఏర్పాటు చేసేందుకు కేంద్రాన్ని సీఎం చంద్రబాబు ఒప్పించగలిగారు. ఈ విధంగా ఏపీలో పారిశ్రామికాభివృద్ధి కోసం రాష్ట్ర ప్రభుత్వం నిత్యం సంప్రదింపులు జరుపుతూనే ఉంది. తద్వారా ఏపీకి మరిన్ని పెట్టుబడులు వచ్చేందుకు.. కంపెనీలు ఎస్టాబ్లిష్ చేసేందుకు మార్గాన్ని కల్పిస్తోంది. ఏపీకి పొరుగునున్న రాష్ట్రాలను కాదని ఏపీకి కంపెనీలు క్యూ కట్టడం ఆయా రాష్ట్రాల్లో చర్చనీయాంశంగా మారింది. దీంతో పెట్టుబడుల విషయంలో నాయుడు గిరీ అంటూ జాతీయ పత్రికల్లో వచ్చిన కథనాలు ఆయా రాష్ట్రాల్లో చర్చకు దారి తీస్తున్నాయి. రాయల్ ఎన్‌ఫీల్డ్ సంస్థ తమిళనాడును కాదని ఏపీలో పెట్టుబడులు పెట్టడానికి ముందుకు రావడంతో తమిళనాడులో జరిగిన చర్చే దీనికి నిదర్శనం.

**ఎంఓయూల సాకారమిలా:** గతంలో లక్షల కోట్ల ఎంఓయూలు అంటూ ప్రచారం జరిగి.. క్షేత్రస్థాయిలో రూపాయి పెట్టుబడి కూడా రాని పరిస్థితి ఉండేది. కానీ ప్రస్తుత కూటమి ప్రభుత్వంలో రూ. 21.64 లక్షల కోట్ల మొత్తం ప్రతిపాదిత పెట్టుబడుల్లో గణనీయమైన పురోగతి కన్పిస్తోంది. ఇప్పటికే ప్రాసెస్ లోకి వచ్చిన ఎంఓయూలు 68.02 శాతంగా ఉన్నాయి... డీపీఆర్ సబ్మిషన్ నుంచి గ్రౌండింగ్ దశ వరకు చేరిన ఎంఓయూలు 60.44 శాతంగా ఉంటే... భూ కేటాయింపులు దశను పూర్తి చేసుకున్న ఎంఓయూలు 21.39 శాతంగా ఉన్నాయి. మొత్తం పెట్టుబడుల్లో అతి తక్కువ కాలంలో మిగిలిన 68 శాతానికి పైగా పెట్టుబడులు ఇప్పటికే ప్రాసెస్ లోకి కీలక పరిణామంగా చెప్పవచ్చు. పెట్టుబడులను ఆకర్షించేలా పాలసీలు రూపొందిస్తూ ముందుకు వెళ్తుండడంతో ఏపీపై పారిశ్రామిక వేత్తల్లో నమ్మకం పెరిగింది. అధికారుల్లో జవాబుదారీతనం కూడా పెరగడంతో జాతీయ, అంతర్జాతీయ పారిశ్రామిక వర్గాల్లో "ఏపీ ఈజ్ బ్యాక్" అనే చర్చ ఇప్పుడు బలంగా వినిపిస్తోంది. రాబోయే రోజుల్లో ఆంధ్రప్రదేశ్ యువతకు లక్షలాది ఉద్యోగాలు రావడం ఖాయమనే అభిప్రాయం వివిధ వర్గాల్లో వ్యక్తమవుతోంది.

# సమాజ మార్పుకు విద్యే ఆయుధం

**● విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం స్నాతకోత్సవ సభలో రాష్ట్ర గవర్నర్ ఎస్. అబ్దుల్ నజీర్**



**నెల్లూరు(వైద్యం), జూన్ 9 ప్రభాతవార్త:** ప్రపంచాన్ని మార్చడానికి ఉపయోగించగల అత్యంత శక్తివంతమైన ఆయుధం విద్య అని నెల్సన్ మండేలా చెప్పిన సందేశాన్ని గుర్తుచేస్తూ, విద్యార్థులు తమ విద్యను వ్యక్తిగత అభివృద్ధికే కాకుండా సమాజ శ్రేయస్సుకు వినియోగించాలని రాష్ట్ర గవర్నర్, విశ్వవిద్యాలయాల ఛాన్సలర్ ఎస్. అబ్దుల్ నజీర్ పిలుపునిచ్చారు. మంగళవారం విక్రమ సింహపురి విశ్వవిద్యాలయంలో నిర్వహించిన 10, 11, 12వ స్నాతకోత్సవ కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా డా. కె.ఐ. వరప్రసాద్ రెడ్డి, ప్రొఫెసర్ గోబర్ధన్ దాస్, రాజ్యసభ సభ్యులు బీద మస్తాన్ రావు యాదవ్‌లకు విశ్వవిద్యాలయం ప్రదానం చేసిన గౌరవ డాక్టరేట్లపై అభినందనలు తెలిపారు. అలాగే డిగ్రీలు, పీజీ పట్టాలు, పీహెచ్‌డీలు, స్వర్ణ పతకాలు అందుకున్న విద్యార్థులకు శుభాకాంక్షలు తెలియజేశారు. విక్రమ సింహపురి విశ్వవిద్యాలయం గత పదిహేడు సంవత్సరాలుగా నాణ్యమైన విద్య, పరిశోధన, సామాజిక సేవల ద్వారా విశేష ప్రగతి సాధించిందని గవర్నర్ ప్రశంసించారు. విశ్వవిద్యాలయం ఇటీవల నాక్ నుంచి 3.23 సీజీపీఏతో ఏ గ్రేడ్ పొందడం గర్వకారణమన్నారు. ఈ విజయంతో జాతీయ స్థాయిలో మరింత ఉన్నత స్థానాలను సాధించే సామర్థ్యం విశ్వవిద్యాలయానికి ఉందని పేర్కొన్నారు. ప్రస్తుత కాలంలో డిజిటల్ పరివర్తన, కృత్రిమ మేధస్సు ప్రాధాన్యం పెరుగుతోందని పేర్కొన్న గవర్నర్, ఉన్నత విద్యాసంస్థలు సాంకేతిక పరిజ్ఞానాన్ని స్వీకరించి విద్యార్థులను భవిష్యత్ సవాళ్లకు సిద్ధం చేయాలని సూచించారు. విద్యార్థులు తమ వృత్తి జీవితంలో కమ్యూనికేషన్ నైపుణ్యాలు, వ్యక్తిత్వ వికాస నైపుణ్యాలు, నాయకత్వ లక్షణాలను నిరంతరం పెంపొందించుకోవాలని సూచించారు. కరుణ, నిజాయితీ, వినయం, పరస్పర గౌరవం వంటి విలువలను జీవితాంతం పాటించాలని పిలుపునిచ్చారు. యువత పెద్ద కలలు కనాలని, పట్టుదలతో కృషి చేస్తే ఏ లక్ష్యాన్నైనా సాధించగలరని ప్రోత్సహించారు. ఈ కార్యక్రమంలో ఎంపీ వేమిరెడ్డి ప్రభాకర్ రెడ్డి, ఎంఎల్సీ బీద రవిచంద్ర, ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, వేమిరెడ్డి ప్రశాంతి రెడ్డి, తదితరులు పాల్గొన్నారు.

VIJAYAWADA MUNICIPAL CORPORATION
'E' Procurement Notice No.11/VMC/CDB/2026-27, Dt.09-06-2026
Roads, Drain, repairs, maintenance works, Toilets, Street Light Maintenance, 15th FCG works, Selection of Agency / Firm for Providing Voice Conference, SMS, Bulk WhatsApp and Voice Conference Broadcast Services to Vijayawada Municipal Corporation (Offline Tender) (Total 160 works)-Est. Amount Rs.2668.64 Lakhs.
All rights are reserved to the Commissioner to Cancel or Reject the tenders without assigning any reasons there of
Further details and any corrigendum can be seen@www.tender.apeprocurement.gov.in.
Sd/-
For COMMISSIONER

10-6pg7exHMNWJQE.qxd:10-6pg7exHMNWJQE.qxd 1/1/02 6:10 AM Page 1





దగ్ధమవుతున్న లారీలు

# ఘోర రోడ్డు ప్రమాదం

## డ్రైవర్ సజీవ దహనం

### అనంతపురం జిల్లా జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద ఘటన

**డి.హీరేహాళ్, జూన్ 9 ప్రభాతవార్త:** అనంతపురం జిల్లా డి.హిరెహాళ్ మండలం జాజరకల్లు టోల్ ప్లాజా వద్ద 150 ఎ జాతీయ రహదారిపై మంగళవారం ఘోర రోడ్డు ప్రమాదం చోటుచేసుకుంది. జరిగిన ఈ రోడ్డు ప్రమాదంలో రెండు లారీలు పూర్తిగా దగ్ధమైన లారీ డ్రైవర్ సజీవ దహనమైన సంఘటన చోటుచేసుకుంది. సమాచారం అందుకున్న రాయదుర్గం రూరల్ సిఐ వెంకటరమణ బొమ్మనహాల్ ఎస్.ఐ. నబీ రసూల్‌తో కలిసి ఘటనా స్థలానికి చేరుకున్నారు. సంఘటన విషయమై సిఐ అందించిన వివరాల మేరకు ఈ ఘటనలో కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ దీక్షిత్ (32) మంటల్లో చిక్కుకుని సజీవ దహనం కాగా సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ ముత్తురాజ్ స్వల్ప గాయాలతో బయట పడ్డాడని సిఐ చెప్పారు. కర్ణాటక చిత్రదుర్గం నుండి బళ్లారి సమీపంలోని జిందాల్ పరిశ్రమకు కంకరతో వెళుతున్న లారీ, జిందాల్ నుండి బెంగళూరుకు సిమెంట్ ట్యాంకర్‌తో వెళ్తున్న లారీ డీజిల్ ట్యాంకును కంకర్ లారీ ఢీకొనడంతో ఈ ఘటన చోటుచేసుకుందని సిఐ తెలిపారు. ప్రత్యక్ష సాక్షులు అందించిన కథనం మేరకు కంకర్ లోడుతో వెళ్తున్న లారీ డ్రైవర్ నిద్దుర మత్తులో రాంగ్ రూట్‌లో వెళ్లి ఎదురుగా వస్తున్న సిమెంట్ ట్యాంకర్ లారీ డీజిల్ ట్యాంకును గుద్దడంతో ట్యాంకు పగిలి మంటలు చోటుచేసుకున్నాయని తెలిపారు.

ఈ ప్రమాదాన్ని గమనించిన సిమెంట్ ట్యాంకర్ లారీ డ్రైవర్ అప్రమత్తమై లారీ ఆపి దిగి పరిగెత్త డంతో ప్రాణాపాయంతప్పి స్వల్పగాయాలతో బయటపడడం జరిగిందని మంటల్లో సజీవదహనమైన మరణించిన లారీ డ్రైవర్‌కు భార్య, కూతురు ఉన్నారని సిఐ వివరించారు. కంకర్‌లారీ డ్రైవర్ అజాగ్రత్తగా అతివేగంతో లారీని నడపడమే ప్రమాదానికి కారణమైందని మంటల్లో సజీవ దహన మైన లారీ డ్రైవర్ కర్ణాటక హిరియూరు సమీపంలోని గౌడనహాళ్లికి చెందినవ్యక్తని సిఐ చెప్తారు. రాయదుర్గం, బళ్లారి అగ్నిమా పక దళాలు సంఘటన స్థలానికి చేరుకొని మంటలను అదుపులోకి తెచ్చారు.

# మీనాక్షి నటరాజన్ నామినేషన్ తిరస్కృతి

>> రద్దు చేయాలని కోరుతూ బిజెపి నాయకులు రిటర్నింగ్ అధికారికి ఫిర్యాదు చేయడంతో ఆ మేరకు ఇసి అధికారులు వెంటనే నిర్ణయం తీసేసుకున్నారు. కాంగ్రెస్ ఈ అభ్యంతరాన్ని తీవ్రంగా వ్యతిరేకించింది. అది నిరాధారమైనదని పేర్కొంది. నటరాజన్ ఎలాంటి క్రిమినల్ కేసును ఎదుర్కోవడం లేదని, అందువల్ల బిజెపి పేర్కొన్న విషయాన్ని వెల్లడించాల్సిన అవసరం ఆమెకు లేదని ప్రతిపక్ష నాయకుడు ఉమాంగ్ సింఘర్, ఇతర పార్టీ నాయకులు స్పష్టం చేశారు. తెలంగాణ విషయం కేవలం ఒక కోర్టు నోటీసుకు మాత్రమే సంబంధించింది కానీ, అధికారికంగా నమోదైన క్రిమినల్ కేసుకు కాదని కాంగ్రెస్ నేతలు తెలిపారు. ఇసి మార్గదర్శకాల ప్రకారం, అభ్యర్థులు అధికారికంగా నమోదై, కోర్టులలో పెండింగ్‌లో ఉన్న క్రిమినల్ కేసులను మాత్రమే వెల్లడించాలి కానీ, సాధారణ న్యాయపరమైన నోటీసులను కాదని ఆ పార్టీ వాదిస్తోంది.

# నేడు ఢిల్లీకి సిఎం చంద్రబాబు

**విజయవాడ జూన్ 9, ప్రభాతవార్తప్రతినిధి:** సిఎం చంద్రబాబు నాయుడు రెండు రోజుల పర్యటనుకు ఢిల్లీ వెళుతున్నారు. జూన్ 10,11వ తేదీల్లో సిఎం ఢిల్లీలో ఉండనున్నారు. 10వ తేదీ బుధవారం ఉదయం 11.30 గంటలకు గన్నవరం ఎయిర్‌పోర్ట్ నుంచి ఢిల్లీ బయలుదేరి వెళతారు. ఢిల్లీలోని భారత్ మండపంలో జరిగే ఎన్డీఏ భాగస్వామ్య పక్షాల సమావేశానికి సిఎం చంద్రబాబు హాజరవుతారు. మధ్యాహ్నం 3.00 గంటల నుంచి రాత్రి 9.00 గంటల వరకు జరిగే ఈ సమావేశంలో సిఎం చంద్రబాబు పాల్గొంటారు. 11వ తేదీ గురువారం రాష్ట్రపతి భవన్‌లో నిర్వహించే నీతి ఆయోగ్ 11వ గవర్నింగ్ కౌన్సిల్ సమావేశంలో ముఖ్యమంత్రి పాల్గొంటారు. ఉదయం 9.15 గంటల నుంచి సాయంత్రం 5.00 గంటల వరకు సీఎం కార్యక్రమంలో పాల్గొంటారు. అనంతరం ఢిల్లీనుంచి రాత్రి 9.00 గం.కు అమరావతి చేరుకుంటారు.

# భారీ ప్రణాళికలు

>> చేపట్టిన అర్బన్ ఇన్వెస్ట్‌మెంట్ విండో వర్క్ షాపు వల్ల పట్టణ ప్రాంతాల అభివృద్ధికి హడ్కో అందిస్తున్న సాంకేతిక, ఆర్థిక మార్గదర్శకాలు ఎంతో దోహదపడతాయన్నారు.

రాష్ట్రంలోని ప్రతి ఇంటికి తాగునీటి కుళాయి కనెక్షన్ అందించేందుకు రూ.17,394 కోట్ల అంచనాతో ప్రణాళికలు రూపొందించినట్లు తెలిపారు. ఇందులో భాగంగా అమృత్ 1.0, అమృత్ 2.0, పథకాల ద్వారా ఇప్పటికే రూ.12,395 కోట్ల విలువైన పనులు ప్రారంభమైనట్లు వెల్లడించారు. రాష్ట్రవ్యాప్తంగా ఉన్న కచ్చా డ్రైన్లను శాశ్వత డ్రైన్లుగా మార్చేందుకు దాదాపు రూ. 29,000 కోట్లు అవసరమవుతాయని తెలిపారు. జనసాంద్రత ఆధారంగా హై, మీడియం,లో డెన్సిటీ ప్రాంతాలుగా విభజించి పనులను చేపడుతున్నట్లు పేర్కొన్నారు. మొదటి విడతలో హై, మీడియం డెన్సిటీ ప్రాంతాల్లో డ్రైనేజీ పనులను రూ.9,000 కోట్లతో పూర్తి చేయాలని అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు.కేంద్ర ప్రభుత్వం కేటాయించిన అర్బన్ క్లియరెన్స్ ఫండ్‌లో రాష్ట్రానికి లభించే రూ.3,600 కోట్లతో పాటు, రాష్ట్ర వాటాగా రూ.10,800 కోట్లను హడ్కో మరియు ఇతర బ్యాంకుల ద్వారా సమీకరించేందుకు 72 మున్సిపాలిటీలకు రీపేమెంట్ సామర్థ్యం ఉంద న్నారు. మిగిలిన మున్సిపాలిటీల్లో రూ.5,000 కోట్ల విలువైన పనులను యాన్యుటీ మోడల్‌ద్వారా చేపట్టేందుకు ఆర్థిక శాఖఅనుమతి లభించినట్లు వెల్లడించారు.ప్రజాప్రతినిధుల ఒత్తిళ్ల కారణంగాఅవసరం లేకుండా మంచి రోడ్లు, డ్రైన్లను తొలగించి కొత్త నిర్మాణాలు చేపట్టవద్దని ఇంజనీర్లు, అధికారులకు స్పష్టమైన ఆదేశాలు ఇచ్చినట్లు మంత్రి తెలిపారు. నిజంగా అవసరమైన ప్రాంతాల్లో మాత్రమే పనులు చేపట్టాలని సూచించారు. వర్షాకాలం ప్రారంభమైన నేపథ్యంలో మున్సిపల్ కమిషనర్లు పట్టణాల్లోని డ్రైన్లలో పూడికతీత (సిల్ట్ క్లియరెన్స్) పనులను యుద్ధ ప్రాతిపదికన చేపట్టాలని ఆదేశించారు.



మంగళవారం విశాఖలోని ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న డి.సిఎం పవన్ కల్యాణ్

# ఎన్నడూ చూడని విషాదం

>> కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.45.75 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. బాధిత కుటుంబాల పిల్లల విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగేందుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు.ప్రమాదంపై సమగ్ర విచారణ కోసం బొకరో స్టీల్ ప్లాంట్ కు చెందిన త్రిసభ్య కమిటీని నియమించినట్లు పవన్ కల్యాణ్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో జరిగిన లోపాలు, సాంకేతిక సమస్యలు వంటి అంశాలను అన్ని కోణాల్లో పరిశీలించి కమిటీ నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు.ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటించడం లేదని వారు ఆవేదన వ్యక్తంచేశారని తెలిపారు. పాత యంత్రాలు, దశాబ్దాల నాటి పరికరాలను ఆధునీకరించకుండా వినియోగించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపించారని చెప్పారు."నా వద్ద ఉన్న సమాచారం ప్రకారం గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ద్రవ ఉక్కును మోసుకెళ్లే ల్యాడిల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోయి ఇంత మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఎప్పుడూ జరగలేదు. గతంలో కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినా, ఈ తరహా పేలుడు ఇదే మొదటిసారి" అని పవన్ కల్యాణ్ పేర్కొన్నారు. చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో కూడా పారిశ్రామిక ప్రమాదాలు జరిగినప్పటికీ, ఈ స్థాయిలో ద్రవ ఉక్కు ల్యాడిల్ పేలిన ఘటనలు అరుదుగా నమోదయ్యాయని తెలిపారు.మృతుల కుటుంబాలకు మరో కీలక భరోసా ఇస్తూ, ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలో నివసిస్తున్న కుటుంబాలు ఉద్యోగి పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు అదే నివాసంలో కొనసాగవచ్చని చెప్పారు. టౌన్‌షిప్ వెలుపల అద్దె ఇళ్లలో ఉంటున్న బాధిత కుటుంబాలు కోరుకుంటే వారికి ప్లాంట్ క్వార్టర్లను కేటాయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.స్టీల్ ప్లాంట్‌లో నెలకొన్న కార్మిక సమస్యలు, యాజమాన్య లోపాలు, భద్రతా ప్రమాణాల అమలుపై త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని పవన్ కల్యాణ్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయమని ఆయన స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు. అనంతరం పవన్ కల్యాణ్ విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్ ను సందర్శించి ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మరోసారి హామీ ఇచ్చారు.



మంగళవారం విశాఖలోని ఆసుపత్రిలో బాధితులను పరామర్శిస్తున్న మంత్రి లోకేష్

# బాధితులను పూర్తిగా ఆదుకొంటాం

>> చికిత్స పొందుతోన్న బాధితులను ఆయన మంగళవారం పరామర్శించారు.అనంతరం స్టీల్ ప్లాంట్‌లో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు.అనంతరం మంత్రి నారా లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందన్నారు. ఘటన జరిగిన కొద్ది సేపటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడుకి సమాచారం అందించడంతో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి. కుమారస్వామి ప్రకటించిన రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందించే చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. ఈ ప్రమాదానికి సంబంధించిన కారణాలను నిర్ధారించేందుకు నిపుణుల కమిటీ సమగ్ర విచారణ నిర్వహిస్తోందని, కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయాలు, వ్యాఖ్యలు చేయడం సముచితమని చెప్పారు. ప్రతి ఘటనను ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నతస్థాయిలో సమీక్షి స్తున్నామని పేర్కొన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మరింత బలోపేతం చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ అన్నారు. ఇప్పటికే కేంద్రం సహకారంతో భారీ ఆర్థిక ప్యాకేజీ, బకాయిల చెల్లింపులు, కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ వంటి చర్యల ద్వారా కర్మాగారం స్థిరీకరణ దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం మా ఉద్దేశంకాదు. "కేవలం ఆర్థిక సహాయం ప్రకటించి చేతులు దులుపుకోవడం తమ ఉద్దేశం కాదు అని తెలిపారు. బాధిత కుటుంబాలకు దీర్ఘకాలిక భరోసా కల్పించడం, వారి పిల్లల భవిష్యత్తును ఆదుకోవడం ప్రభుత్వ బాధ్యత" అని మంత్రి స్పష్టం చేశారు.ప్రమాదానికి గల కారణాలపై పూర్తి స్థాయి దర్యాప్తు నిర్వహించేందుకు ముగ్గురు సీనియర్ నిపుణులతో కమిటీని కేంద్ర ప్రభుత్వం నియమించిందన్నారు. కమిటీ ప్రమాద స్థలాన్ని పరిశీలించి, కార్మికులతో మాట్లాడి, సాంకేతిక అంశాలను అధ్యయనం చేసి నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. నివేదిక ఆధారంగా భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన చర్యలు తీసుకుంటామని తెలిపారు.ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న గాయపడిన కార్మికులను పరామర్శించిన సందర్భంగా, ఒక కార్మికుడు "మమ్మల్ని మాత్రమే కాదు, విశాఖ ఉక్కును కూడా కాపాడండి" అని కోరిన విషయాన్ని మంత్రి ప్రస్తావించారు. విశాఖ ఉక్కుపై కార్మికులకు ఉన్న అనుబంధం, భావోద్వేగం తనను కదిలించిందన్నారు. విశాఖ ఉక్కు కర్మాగారానికి పూర్వ వైభవం తీసుకురావడం, కార్మికుల సంక్షేమాన్ని కాపాడడం, బాధిత కుటుంబాలకు అండగా నిలవడం ఎన్డీఏ ప్రభుత్వాల బాధ్యతగా భావిస్తున్నామని మంత్రి నారా లోకేష్ స్పష్టం చేశారు.

# రాష్ట్రంలో కొనసాగుతున్న విభిన్న పరిస్థితులు

**విజయవాడ,జూన్ 9,ప్రభాతవార్తప్రతినిధి:** రాష్ట్రంలో విభిన్న వాతావరణ పరిస్దితులు కొనసాగుతున్నాయి.మృగశిర కార్తె వచ్చినా ఎండల తీవ్రత తగ్గడంలేదు. రాష్ట్రమంతటా దాదాపు 40 డిగ్రీల సగటు ఉష్ణోగ్రతలు కొనసాగుతున్నాయి. మంగళవారం అనకాపల్లి జిల్లా మాకవరపాలెంలో 42.7 డిగ్రీలు, విజయనగరం జిల్లా దత్తిరాజేరులో 42.4, మన్యం జిల్లా భామినిలో 42.2, పశ్చిమగోదావరి జిల్లా తణుకులో 42, ఏలూరు జిల్లా కక్కునూరు, పోలవరం జిల్లా కూనవరం, కాకినాడ జిల్లా పిఠాపురంలో 41.6, తూర్పుగోదావరి జిల్లా కొవ్వూరు, విశాఖ జిల్లా అక్కిరెడ్డిపాలెం 41.5 డిగ్రీల చొప్పున గరిష్ఠ ఉష్ణోగ్రతలు రికార్డు అయినట్లు పేర్కొన్నారు. రాష్ట్రంలో రేపు అక్కడక్కడ పిడుగులతో కూడిన మోస్తరు వర్షాలు కురిసే అవకాశం ఉందని విపత్తుల నిర్వహణ సంస్థ మేనేజింగ్ డైరెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ప్రజలు తగినజాగ్రత్తలు తీసుకుని అప్రమత్తంగా ఉండాలని సూచించారు. ఈ పరిస్దితులు రెండు రోజులు కొనసాగవచ్చు నన్నారు. అంచనాల బట్టి బుధవారం అల్లూరి, పశ్చిమగోదావరి, ఏలూరు, గుంటూరు, మార్కాపురం, ప్రకాశం, నెల్లూరు, కర్నూలు, నంద్యాల, అనంతపురం, వైఎస్సార్ కడప, చిత్తూరు జిల్లాల్లో అక్కడక్కడ ..పిడుగులతో కూడిన తేలికపాటి నుంచి మోస్తరు వర్షాలు.. కురిసే అవకాశం ఉందన్నారు. ఆకస్మికంగా ఈదురుగాలులు, ఉరుములతో వర్షం పడే సమయంలో ప్రజలు చెట్ల క్రింద, విద్యుత్ స్తంబాలు, హోర్డింగ్స్ క్రింద నిలబడొద్దని సూచించారు. పొలాల్లో పనిచేసే రైతులు, పశుకాపరులు మరింత అప్రమత్తంగా ఉండాలని, ఆకాశం మేఘావృతమై ఉరుములు వినిపించిన వెంటనే సురక్షిత ప్రాంతాలకు వెళ్లాలన్నారు. వర్షపు గాలుల వల్ల ఎక్కడైనా విద్యుత్ వైర్లు తెగిపడి ఉంటే వాటిని గమనిస్తూ, వాటికి వీలైనంత దూరంగా ఉండాలన్నారు. మరోవైపు విజయనగరం, పార్వతీపురంమన్యం, అల్లూరి సీతారామరాజు, పోలవరం, కాకినాడ, కోనసీమ, తూర్పుగోదావరి, పశ్చిమగోదావరి, ఏలూరు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ..41 42 డిగ్రీల.. మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని తెలిపారు. శ్రీకాకుళం, అనకాపల్లి, కృష్ణా, ఎన్టీఆర్, గుంటూరు, బాపట్ల, పల్నాడు జిల్లాల్లోని కొన్ని ప్రాంతాల్లో ..40 41 డిగ్రీల..మధ్య ఉష్ణోగ్రతలు రికార్డు అయ్యే అవకాశం ఉందని ప్రఖర్ జైన్ వెల్లడించారు.

# వామపక్షాలు

>> వామపక్ష పార్టీల ఆధ్వర్యంలో భారీ రాస్తారోకో నిర్వహించారు.

ఈ నిరసన కార్యక్రమంలో వామపక్షాల ముఖ్య నాయకులు, కార్యకర్తలు, సామాన్య ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి రోడ్డుపై బైఠాయించారు. ఆందోళన కారణంగా జాతీయ రహదారికి ఇరువైపులా కిలోమీటర్ల మేర వాహనాలు నిలిచిపోయి ట్రాఫిక్‌కు తీవ్ర అంతరాయం ఏర్పడింది. ఈ సంద ర్భంగా సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు చిగురుపాటి బాబురావు, సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి. ఈశ్వర్ మాట్లాడుతూ.. కేంద్రంలోని నరేంద్ర మోడీ ప్రభుత్వం కార్పొరేట్ కంపెనీలకు రూ. కోట్ల లాభాలు చేకూరుస్తూ, సామాన్య ప్రజలపై మాత్రం మోయలేని భారాలు మోపుతోందని మండిపడ్డారు. పెంచిన ఇంధన ధరలను తగ్గించేంత వరకు తమ ఉద్యమం ఆగేది లేదని స్పష్టం చేశారు. అలాగే, రాష్ట్రంలోని టిడిపి కూటమి ప్రభుత్వం కూడా దేశంలో ఎక్కడా లేని విధంగా పెట్రోల్, డీజిల్ ధరలను అదనంగా పెంచేసి ప్రజలను ఆర్థికంగా తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తోందని ధ్వజమె త్తారు. ప్రజల నడ్డి విరుస్తున్న పాలకులకు పరిపాలించే అర్హతలేదని వారు ఆగ్రహం వ్యక్తంచేశారు. ఈ నిరసన కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ సభ్యులు దోనేపూడి కాశీనాథ్, రాష్ట్ర నాయకులు వి. వెంకటేశ్వర్లు, కె. శ్రీదేవి, ఆంధ్ర మాల్యాద్రి, సిపిఐ నగర కార్యదర్శి జి. కోటేశ్వర రావుతో పాటు సిపిఐ ఎంఎల్ ,ఇతర వామపక్ష పార్టీల నేతలు, కార్యకర్తలు పెద్ద సంఖ్యలో పాల్గొని కేంద్ర, రాష్ట్రప్రభుత్వాలకు వ్యతిరేకంగా పెద్ద ఎత్తున నినాదాలు చేశారు. గుంటూరు. విజయ నగరం, పల్నాడు,ఏలూరు,శ్రీకాకుళం తదితర జిల్లాల్లో పెట్రోలు ధరల పెంపుకు నిరసనగా వామపక్షాలు ఆందోళన చేసాయి.

# 'పుష్కర మోడీ'

>> తెచ్చామని, వికసిత్ భారత్ లక్ష్యసాధనలో మరింత ముందుకు పోయేందుకు ప్రజాదీవెనలే మరింత ముందుకు నడిపిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఎన్డీయే 12ఏళ్ల పాలన వేడుకలతోపాటు ప్రధాని మోడీ ప్రధానిగా రికార్డుకాలం పూర్తిచేసుకున్నారు. మొత్తం 4399 రోజులు ప్రధానిగా పదవిలోకొనసాగి ఎన్నికైన ప్రధానిగా నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. జవహర్‌లాల్‌నెహ్రూ 1952 మే 13నుంచి 1964 మే 27వరకూ నిరాఘాటంగా పదవిలో కొనసాగి 4398 రోజులు గడిపారు. ఇపుడు ప్రధానిగామోడీ నెహ్రూ రికార్డును కూడా అధిగమించారు. అత్యధికకాలం ప్రధానిగా కొనసాగిన నేతల జాబితాలో మూడోస్థానంలో ఇందిరాగాంధీ నిలిచారు. ఆమె 1966 జనవరి 24నుంచి 1977 మార్చి 24వరకూ వరుసగా 4077 రోజులుపదవిలో ఉన్నారు. అలాగే దేశ చరిత్రలో అత్యధికకాలం పాలన కొనసాగించిన ఎన్నికైన ప్రభుత్వ అధినేతగా కూడా మోడీ రికార్డుసాధించారు. సిక్కిం సీఎంగా పవన్‌కుమార్ చామ్లింగ్ 8930 రోజులు పనిచేస్తే ప్రధాని మోడీ ఈ ఏడాది మార్చినలోనే ముఖ్యమంత్రి, ప్రధానిగా మొత్తం ఆరికార్డును అధిగమించారు. 2001 నుంచి 2014వరకూ గుజరాత్ సిఎంగా మోడీ పనిచేసిన సంగతి తెలిసిందే. ఇక ఎన్డీయే పాలన వేడుకలను దేశవ్యాప్తంగా నిర్వహించేందుకు ప్రధాన పక్షం బిజెపి నిర్ణయించింది. నియోజకవర్గాల్లో ప్రత్యేకకార్యక్రమాలనిర్వహణకు కార్యాచరణ ప్రకటించింది. దేశ రాజధాని ఢిల్లీలోకూడా ప్రధాని మోడీ రికార్డు పాలనతో ఆయన్ను సత్కరించేందుకనిర్ణయించింది. ప్రధానిమోడీ అద్యక్షతన కేబినెట్‌సమావేశం కూడా జరుగుతోంది. ఆ భేటీలోనే ప్రధానిని మంత్రివర్గం మొత్తం సత్కరించనున్నది. అలాగే బిజెపి కేంద్ర కార్యాలయంలో కూడా 12 ఏళ్ల వేడుకలను ఘనంగా నిర్వహించనున్నారు. అధ్యక్షుడు నితిన్‌నబీన్‌సింగ్, జెపినడ్డా, రక్షణ, హోంమంత్రులు రాజ్‌నాథ్‌సింగ్, అమిత్‌షాలతోపాటు ఇతర కేంద్రమంత్రులు, ఎంపిలు పార్టీ సీనియర్లు ఈ వేడుకలకు హాజరుకానున్నారు.

## వారం - వర్జ్యం

10-06-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
అధిక జ్యేష్ఠమాసం, ఉత్తరాయణం
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, మృగశిర కార్తె
దశమి రా.12.54
ఉత్తరాభాద్ర ఉ.9.18
వర్జ్యం : రా.8.46-రా.10.17
దు. ఉ.11.40-మ.12.32
శుభసమయం: ఉ.8.00-9.00
రాహుకాలం - మ.12.00-1.30

## వార్తాఫలం

**మేషం:** నూతన పరిచయాలు పెరుగుతాయి. వ్యవహారాలలో ఆటంకాలు ఎదురైనా ధైర్యంతో ముందుకు సాగుతారు.

**వృషభం:** క్రయ విక్రయాలలో ఆచితూచి వ్యవహరించండి. లాభనష్టాలు అనుకూల ప్రతికూల వ్యవహారాలు రెండు సమానంగా ఉంటాయి.

**మిథునం:** కోర్టు కేసులు పరిష్కార దశకు చేరుకుంటాయి. కుటుంబ సభ్యులను కలిసి ఆనందంగా గడుపుతారు. వాహన సౌఖ్యం.

**కర్కాటకం:** వివాదాలకు దూరంగా ఉండండి. ఉద్యోగులకు ఆకస్మిక బదిలీలు ఉంటాయి. వాహనయోగం కలదు.

**సింహం:** సంతాన విద్యావిషయంలో ఎక్కువ ప్రాముఖ్యత కనబరుస్తారు. పేరు ప్రఖ్యాతల కోసం విశేషంగా శ్రమిస్తారు.

**కన్య :** ఋణాలు తీరి ఊరట చెందుతారు. ముఖ్యమైన వ్యవహారాలలో ఎదురైనా ఆటంకాలు తొలగుతాయి. వస్త్రలాభం.

**తుల :** సెంటిమెంట్లు వస్తు భద్రత పట్ల జాగ్రత్తలు పాటించండి. వస్తు, వస్త్రాలు కొనుగోలు చేస్తారు. బంధువుల కలయిక.

**వృశ్చికం:** మిత్రులను కలిసి ఆనందంగా గడుపుతారు. అన్ని విషయంలో ఒప్పందాలు కుదురుతాయి. శుభవార్తలు అందుకుంటారు.

**ధనుస్సు:** పనులు సకాలంలో పూర్తి చేస్తారు. సంఘసేవాకార్యక్రమాలలో చురుకుగా పాల్గొంటారు. ఆభరణాలుకొనుగోలు.

**మకరం:** దూర ప్రాంతాల నుండి వచ్చిన సమాచారం ఆనందం కలిగిస్తుంది. వివాదాలకు దూరంగా వుండండి. కొత్త పరిచయాలు.

**కుంభం:** ఇళ్ళకు సంబంధించిన నూతన ఒప్పందాలు కుదురుతాయి. వ్యాపారాలలో పట్టుదలతో ముందుకు సాగుతాయి.

**మీనం:** బాధ్యతలు సమర్థవంతంగా పూర్తి చేస్తారు. పరిచయాలు పెరుగుతాయి. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు.

- శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

# ప్రభుత్వ సేవలకు ప్రత్యేక యాప్

>> క్యాంటీన్ల సేవలను ఏ విధంగా అందిస్తున్నారో... రూరల్ ప్రాంతాల్లోని అన్న క్యాంటీన్లల్లోనూ అదే స్థాయిలో సేవలు అందించాలి. ప్రజలకు అందే తాగునీటి విషయంలో చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. తాగునీటి కాలుష్యం అనేది ఉండకూడదు. తాగునీటిలో ఎలాంటి మలినాలు కలవకుండా జాగ్రత్తలు తీసుకోవాలి. ప్రతి రోజూ తాగునీటి శాంపిళ్లు తీయాలి. తాగునీటి సరఫరా విషయంలో ఎలాంటి నిరక్ష ్యం చూపొద్దు. పరిసరాల పరిశుభ్రత విషయంలో ప్రజల భాగస్వామ్యాన్ని పెంచాలి. ప్రజల్లో అవగాహన వస్తేనే క్లీన్ అండ్ గ్రీన్ తరహా కార్యక్రమాలను విజయవంతం చేయగలం. ప్రకృతి పట్ల, పరిసరాల శుభ్రత పట్ల ప్రజల్లో అవగాహన పెంచేలా వినూత్న కార్యక్రమాలు చేపట్టాలి. జలధార కార్యక్రమాన్ని రాష్ట్ర వ్యాప్తంగా నిర్వహిస్తున్నామన్నారు. ఆ కార్యక్రమం ఫలితాలు కన్పించాలి. చెరువులను సిద్ధం చేసుకోవాలి. వర్షాకాలంలో చెరువులన్నీ నిండేలా చూడాలి. వర్షపు నీటిని ఒడిసి పట్టాలి. ప్రతి కుంటనూ, ప్రతి చెరువునూ ఆన్ లైన్లో పెట్టేలా చర్యలు తీసుకోవాలి. రాష్ట్రంలోని ప్రభుత్వ భూములకు రక్షణ కల్పించేలా ఎప్పటికప్పుడు వాటిని పర్యవేక్షి ంచుకునేలా ఓ వ్యవస్థను ఏర్పాటు చేయాలి. దీని కోసం టెక్నాలజీని వినియోగించాలి. ఈ మేరకు అనంతపురం జిల్లాలో అమలు చేస్తున్న పైలెట్ ప్రాజెక్టును పరిశీలించాలి. గంజాయిని అరికట్టేందుకు మూలాల్లోకి వెళ్లాలి. గంజాయి సాగు, రవాణ, అమ్మకం, వినియోగం అనేది ఎక్కడా కన్పించకూడదు. మహిళలపైనేరాలను అరికట్టేలా చర్యలుతీసుకోవాలి... వివిధనేరాలకు పాల్పడితే ఎలాంటి శిక్షలు పడతాయి.. శిక్షలు పడిన వారికి సంబంధించిన వివరాలను ఎప్పటికప్పుడు ప్రచారం చేయాలి అన్నారు. ఈ సమీక్షలో మంత్రి కొలుసు పార్ధసారథి, సీఎస్ సాయి ప్రసాద్ సహా వివిధ శాఖల ఉన్నతాధికారులు పాల్గొన్నారు.

**'ఆర్థిక వ్యవహారాలల పర్యవేక్షణకు ఎఐ టాస్క్‌ఫోర్స్**

ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్‌ఫోర్స్ ఏర్పాటు చేయాలని ముఖ్యమంత్రి చంద్రబాబు ఆదేశిం చారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్సు పై ప్రత్యేక దృష్టి పెట్టాలన్నారు. రాష్ట్ర స్థూల ఉత్పత్తి లక్ష్యాలు, కీపెర్ఫార్మెన్సు ఇండికేటర్లపై సీఎం సమీక్షించారు. క్యాంపు కార్యాలయంలో సమీక్షకు ఆర్థిక, ప్రణాళిక, వ్యవసాయ, ఉద్యాన, రవాణా, పర్యాటకశాఖల ఉన్నతాధికారులు హాజరయ్యారు. రాష్ట్ర, జిల్లా, మండల స్థాయిలో 2026-27 ఆర్థిక సంవత్సరానికి వివిధ ప్రభుత్వ శాఖలకు పెర్ఫార్మెన్సు ఇండికేటర్లను సిఎం నిర్దేశించారు. జాతీయ సగటు కంటే తక్కువగా ఉన్న సూచికలను మెరుగు పరచడం, అగ్రశ్రేణి రాష్ట్రాలతో సమానంగా లక్ష్యాలను చేరుకోవటమే లక్ష్యంగా పని చేయాలని సీఎం దిశానిర్దేశం చేశారు.నిర్దేశించుకున్న లక్ష్యాలతో పాటు రియల్ గ్రోత్ ఆధారంగా పనితీరును అంచనా వేసేలా స్కోరింగ్ విధానాన్ని అమలు చేయాలని నిర్ణయించారు. రాష్ట్ర క్షేత్రస్థాయి ఆర్థిక స్థితిగతులను విశ్లేషించేందుకు ప్రతి నెలా 12వ తేదీన ఆర్థిక నివేదికలను సిద్ధం చేయాలని సూచించారు. మౌలిక సదుపాయాలపై చేసే వ్యయం 3.5 రెట్ల మేర ఆర్థిక కార్యకలాపాలను ప్రోత్సహించేలా ఉండాలని ముఖ్యమంత్రి చంద్రబాబు దిశానిర్దేశం చేశారు. రియల్ టైమ్‌లో ఆర్థిక వ్యవహారాల పర్యవేక్షణకు ఏఐ టాస్క్ ఫోర్సు ఏర్పాటు చేయాలన్నారు. 2047 స్వర్ణాంధ్ర లక్ష్యాలకు అనుగుణంగా డేటా డ్రివెన్ గవర్నెన్స్‌పై ప్రత్యేక దృష్టి పెట్టాలని అధికారులకు సీఎం ఆదేశించారు.

# పునరుత్పాదక ఇంధనంలో భారత్ టాప్

>> లక్షల కోట్ల రూపాయలు పెట్టుబడులు ఆకర్షించామని, ఎలక్ట్రానిక్స్ తయారీ 28 రెట్లు పెరిగిందని, మొబైల్ ఫోన్ ఎగుమతులు 163 రెట్లు వృద్ధిచెంది దేశ ఎగుమతుల్లో కొత్త రికార్డులు సృష్టించాయని వివరించారు. మంగళవారం మధ్యాహ్నం తిరుపతిలో మీడియా ప్రతినిధులతో కేంద్రమంత్రి జోషి మాట్లాడారు. ప్రధానమంత్రి మోడీ నాయకత్వంలో భారత్ చీకటి నుంచి విద్యుత్ మిగులు దేశంగా మారిందని తెలిపారు. ప్రధానమంత్రి నరేంద్ర మోడీ నాయకత్వంలోని కేంద్ర ప్రభుత్వం 12 సంవత్సరాల పాలనలో దేశం విద్యుత్ కొరత నుంచి విద్యుత్ మిగులు దేశంగా ఖ్యాతి గడించిందని కేంద్ర మంత్రి జోషి అన్నారు. విశ్వాసానికి, అభివృద్ధికి, జనకళ్యాణానికి 12 సంవత్సరాలు కార్యక్రమంలో భాగంగా కేంద్ర ప్రభుత్వ విజయాలను వివరించారు.

2014కు ముందు దేశంలో గరిష్ట విద్యుత్ డిమాండ్ 123 గిగావాట్లు ఉన్న సమయంలో ఉత్తర భారతదేశంలోని అనేక ప్రాంతాలు విద్యుత్ కోతలతో ఇబ్బందులు పడ్డాయని, ఆ తరువాత మోడీ ప్రభుత్వ హయాంలో ఈ ఏడాది మే 23న నమోదైన 280 గిగావాట్ల గరిష్ట విద్యుత్ డిమాండ్‌ను విజయవంతంగా నిర్వహించగలిగామని తెలిపారు. ప్రస్తుతం దేశ విద్యుత్ ఉత్పత్తి సామర్థ్యం 538 గిగావాట్లకు చేరుకోగా, అందులో 33 శాతం పునరుత్పాదక ఇంధన వనరుల నుంచే వస్తోందని చెప్పారు. మోడీ ప్రభుత్వం అభివృద్ధి ఫలాలు సమాజంలోని చివరి వ్యక్తికి చేరేలా పనిచేస్తోందని పేర్కొన్న ఆయన, అంతర్జాతీయ ద్రవ్య నిధి , ప్రపంచ బ్యాంకు అధ్యయనాల ప్రకారం దేశంలో బహుముఖ పేదరికం 2013-14లో 29.17 శాతం ఉండగా, ప్రస్తుతం 11.28 శాతానికి తగ్గిందన్నారు. ఫలితంగా 25 కోట్లకు పైగా ప్రజలు పేదరికం నుంచి బయటపడ్డారని జోషి తెలిపారు. 2047 నాటికి వికసిత భారత్ లక్ష ్య సాధనలో ప్రతి రాష్ట్ర అభివృద్ధి కీలకమని కేంద్ర ప్రభుత్వం విశ్వసిస్తోందన్నారు. ఆంధ్రప్రదేశ్ అభివృద్ధికి కేంద్ర ప్రభుత్వం పూర్తి సహకారం అందిస్తోందని, అమరావతి రాజధాని నిర్మాణం, పోలవరం ప్రాజెక్టు, విశాఖ స్టీల్ ప్లాంట్, దక్షి ణ తీర రైల్వే జోన్ వంటి ప్రాజెక్టులకు కేంద్రం గణనీయమైన సహాయం అందించిందని చెప్పారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు వివిధ సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలను సమర్థవంతంగా అమలు చేస్తున్నందుకు అభినందనలు తెలిపారు.

అంతకుముందు విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన ఉద్యోగులకు సంతాపం ప్రకటించిన కేంద్ర మంత్రి, బాధిత కుటుంబాలకు గాయపడిన వారికి ప్రభుత్వం అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర రెవెన్యూ శాఖ మంత్రి అనగాని సత్యప్రసాద్, రాష్ట్ర ఇంధన శాఖ మంత్రి గొట్టిపాటి రవికుమార్, రాష్ట్ర బిజెపి అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, చంద్రగిరి ఎమ్మెల్యే పులివర్తి నాని, టిడిపి బోర్డు సభ్యులు పనబాక లక్ష్మి ్మ, భాను ప్రకాష్ రెడ్డి, రాష్ట్ర యాదవ కార్పొరేషన్ చైర్మన్ నరసింహ యాదవ్, రాష్ట్ర హ్యాండ్ క్రాఫ్ట్ చైర్మన్ పసుపులేటి హరిప్రసాద్, తిరుపతి జిల్లా బిజెపి అధ్యక్షుడు సామంచి శ్రీనివాస్, బి జె పి స్టేట్ వైస్ ప్రెసిడెంట్ కోలా ఆనంద్, మీడియా కోఆర్డినేటర్ శ్రీధర్ వర్మ, ప్రజాప్రతినిధులు, పార్టీ నాయకులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా కేంద్ర సమాచార, ప్రసార మంత్రిత్వ శాఖ ప్రచురించిన ప్రధానమంత్రి మోడీ ప్రభుత్వ 12 సంవత్సరాల అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలపై పుస్తకాలను కేంద్ర మంత్రి ప్రహ్లాద్ జోషి ఆవిష్కరించారు.

10-6Pg5.qxd:10-6Pg5.qxd 1/1/02 5:46 AM Page 1



# అప్పీలు విచారణకు 43యేళ్లా?

## - అలహాబాద్ హైకోర్టుపై సుప్రీంకోర్టు ఆగ్రహం



**న్యూఢిల్లీ, జూన్ 9:** అలహాబాద్ హైకోర్టు ఒక హత్య కేసు పరిష్కారంలో అసాధారణంగా 43యేళ్ల ఆలస్యం చేయడాన్ని సుప్రీంకోర్టు తీవ్రంగా పరిగణించింది. అసంతృప్తి వ్యక్తం చేసింది. ఇది భారతదేశంలో నిరంతరంగా పేరుకుపోతున్న న్యాయపరమైన కేసుల సమస్యను ఎత్తి చూపుతోంది. నాలుగు దశాబ్దాలుగా నేరారోపణ నీడలో ఉన్న విజయ్ సింగ్ దాఖలు చేసిన అప్పీలు విచారణ సందర్భంగా కోర్టు ఈ వ్యాఖ్యలు చేసింది. ఈ సుదీర్ఘ ఆలస్యాలు కలవర పాటుకు గురిచేస్తున్నాయని, పేరుకు పోతున్న కేసులను పరిష్కరించేందుకు ఎలాంటి చర్యలు తీసుకుంటున్నారని హైకోర్టును సుప్రీంకోర్టు ప్రశ్నించింది. తన సొంత సోదరుడిని హత్య చేసినందుకు కాన్పూర్ సెషన్స్ కోర్టుచే దోషిగా నిర్ధారించబడిన విజయ్ సింగ్, తన శిక్షను సవాలు చేస్తూ దాఖలు చేసిన అప్పీల్‌పై తీర్పు ఇవ్వడానికి అలహాబాద్ హైకోర్టు దాదాపు 43 ఏళ్ల తీసు కోవడంతో, నాలుగు దశాబ్దాలకు పైగా బెయిల్‌పైనే ఉన్నాడు. 1983 నవంబర్‌లో తన సోదరుడిని కాల్చి చంపినప్పుడు 28 ఏళ్ల యువకుడైన విజయ్, నత్తనడకన సాగే న్యాయ పంపిణీ వ్యవస్థ కారణంగా ఇప్పుడు డెబ్బై ఏళ్ల వృద్ధుడిగా ఉన్నాడు. అతని క్రిమినల్ అప్పీల్‌ను పరిష్కరించడంలో జరుగుతున్న అసాధారణ జాప్యాన్ని "ఆందోళనకరమైన పరిస్థితి"గా అభివర్ణిస్తూ, అలహాబాద్ హైకోర్టులో న్యాయ పంపిణీ వ్యవస్థను అడ్డుకుంటున్న పెండింగ్ కేసులను పరిష్కరించడానికి ఎలాంటి వినూత్న చర్యలు తీసుకోవచ్చునని సుప్రీంకోర్టు ఆశ్చర్య పోయింది. విజయ్ తన అప్పీల్ ఫలితం కోసం ఎదురుచూస్తూ, కేవలం మూడు నెలలు మాత్రమే కస్టడీలో గడిపి, దాదాపు 43 ఏళ్లపాటు బెయిల్‌పైనే ఉన్నారని ధర్మాసనం పేర్కొంది. దోషిగా నిర్ధారించబడటానికి వ్యతిరేకంగా చేసిన అప్పీల్‌ను హైకోర్టు ఫిబ్రవరి 9న కొట్టివేసిన తీర్పును సవాలు చేస్తూ ఆయన దాఖలు చేసిన పిటిషన్ పెండింగ్‌లో ఉన్నంత కాలం బెయిల్‌పైనే కొనసాగేందుకు అనుమతించాలని ధర్మాసనం నిర్ణయించింది. అలహాబాద్ హైకోర్టులో త్వరిత గతిన విచారణ జరపాలని ఆదేశాలు కోరుతూ వ్యాజ్యదారులు తరచుగా సుప్రీంకోర్టును ఆశ్రయిస్తుంటారని ఎత్తి చూపుతూ, పాత కేసుల పరిష్కారాన్ని వేగవంతం చేసేందుకు తీసుకోవాల్సిన చర్యలపై జస్టిస్ ప్రశాంత్ కుమార్ మిశ్రా, జస్టిస్ ఏఎస్ చందుర్కర్‌లతో కూడిన ధర్మాసనం సీనియర్ న్యాయవాది సిద్ధార్థ్ దేవ్, న్యాయవాది జోహెబ్ హుస్సేన్‌ల నుండి సూచనలు కోరింది. మూడు దశాబ్దాలకు పైగా పెండింగ్‌లో ఉన్న ప్రాసిక్యూషన్ అప్పీళ్లను కొట్టివేయడం ద్వారా పేరుకుపోయిన కేసుల భారాన్ని తగ్గించవచ్చని దేవ్ సూచించగా, కేవలం కేసులు ఎక్కువ కాలం పెండింగ్‌లో ఉన్నాయనే కారణంతో వాటిని కొట్టివేయడానికి తీర్పు ప్రక్రియ ప్రాథమిక సూత్రాలు అనుమతించవని ధర్మాసనం పేర్కొంది. అటువంటి విధానం ప్రజా ప్రయోజనాలను ప్రతికూలంగా ప్రభావితం చేస్తుందని, అలాగే తమ వాదనలు వినిపించే అవకాశాన్ని కక్షి దారులకు దూరం చేస్తుందని హెచ్చరించింది. సుదీర్ఘ జాప్యాన్ని ఎత్తి చూపుతూ, విజయ్ సుప్రీం కోర్టులో తన అప్పీలులో, తనకు ఇప్పుడు 72 ఏళ్లు వచ్చాయని, తన జీవితంలో ఎక్కువ భాగం ఒక నేరారోపణ నీడలోనే గడిపానని సమర్పించారు. "నాలుగు దశాబ్దాలకు పైగా, యవ్వనంలో, మధ్య వయస్సులో, ఇప్పుడు వృద్ధాప్యంలో కూడా, ఆయన ఆ నేరారోపణ నీడలోనే జీవించారు," అని పిటిషన్‌లో పేర్కొన్నారు. క్రిమినల్ అప్పీలు హైకోర్టులో 40 ఏళ్లపాటు పెండింగ్‌లో ఉండి, విచారణకు వచ్చి కొట్టివేయబడింది.




# కాక్రోచ్ పార్టీకి పోటీగా ఇష్క్ కరో పార్టీ

## - ప్రకటించిన సుప్రీం మాజీ జడ్జి కట్జూ - పేదరికం, నిరుద్యోగంపై పోరాడుతాం - టిఎంసి ఎంపి మహువా మొయిత్రాను ఆహ్వానించిన జస్టిస్ మార్కండేయ

**న్యూఢిల్లీ, జూన్ 9:** గత కొన్ని వారాలుగా 'కాక్రోచ్ జనతా పార్టీ' (సిజెపి) వార్తల్లో నిలిచిన తర్వాత, మాజీ సుప్రీంకోర్టు న్యాయమూర్తి జస్టిస్ మార్కండేయ కట్జూ 'ఇష్క్ కరో పార్టీ (ఐకెపి) అనే ఒక కొత్త పార్టీని స్థాపించారు. "దేశం ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కరించడానికి చేపట్టే ఒక ప్రయత్నం" అని కట్జూ పేర్కొన్నారు. తన కొత్త పార్టీలో చేరాలని తృణమూల్ కాంగ్రెస్ ఎంపి మహువా మొయిత్రాకు కట్జూ ఆహ్వానం పంపారు. మరోవైపు, నేషనల్ టెస్టింగ్ ఏజెన్సీ (ఎన్‌టిఏ) నిర్వహించిన నీట్ వంటి పోటీ పరీక్షలలో లోపాల కారణంగా కేంద్ర విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలని డిమాండ్ చేసిన కాక్రోచ్ జనతా పార్టీ వ్యవస్థాపకుడిని 'మూర్ఖుడు' అని పేర్కొంటూ కట్జూ తన 'ఎక్స్' ఖాతాలో విమర్శలు గుప్పించారు. తమ పార్టీని కేవలం ఒక జోక్ గానో లేదా "అబ్బాయిలు, అమ్మాయిల మధ్య ప్రేమను ప్రోత్సహించే వాలెంటైన్స్ డే లాంటిది"గానో ప్రజలు పొరబడే అవకాశం ఉందని జస్టిస్ కట్జూ 'ఎక్స్'లో పేర్కొన్నారు. "కానీ అది పూర్తిగా అపోహ మాత్రమే" అని ఆయన అన్నారు. ప్రజల మధ్య 'ఐక్యత' ద్వారా భారతదేశంలోని పేదరికం, పిల్లలలో పోషకాహార లోపం, నిరుద్యోగం, ఇతర సమస్యలను నిర్మూలించవచ్చని ఆయన తెలిపారు. "కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి. అప్పుడే ఆధునిక దృక్పథం కలిగిన నాయకుల నేతృత్వంలో, ప్రజల దయనీయ పరిస్థితుల నుండి విముక్తి కోసం మనం ఒక బలమైన ప్రజా పోరాటాన్ని (జన్ సంఘర్ష్) నిర్వహించగలము" అని ఆయన ఎక్స్‌లో రాసుకొచ్చారు. రాజకీయ నాయకులు కేవలం అధికారం కోసమే పాకులాడుతున్నారని, ప్రజల పట్ల వారికి "నిజమైన శ్రద్ధ" లేదని ఆయన ఆరోపించారు. "ఈ దుస్థితిని ఎదుర్కోవడం, ప్రజల మధ్య ఐక్యతను పెంపొందించడం ఐకెపి లక్ష్యం. కులం, మతం, జాతి వంటి భేదాలు లేకుండా మన ప్రజలందరి పట్ల మనం ప్రేమను (ఇష్క్) కలిగి ఉండాలి" అని ఆయన అన్నారు.

దీప్కేపై కట్జు విమర్శలు: ఢిల్లీలోని జంతర్ మంతర్ వద్ద జూన్ 6న బొద్దింకల జనతా పార్టీ తన మొదటి నిరసనను చేపట్టిన నేపథ్యంలో, కేంద్ర విద్యాశాఖ మంత్రి రాజీనామాతో ఎలాంటి మార్పు రాదని చెబుతూ, ఆ పార్టీ సిద్ధాంతాన్ని, దాని వ్యవస్థాపకుడు అభిజీత్ దీప్కేపై కట్జు విమర్శలు గుప్పించారు. "భారత విద్యాశాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేయాలన్నది అభిజిత్ దీప్కే ప్రధాన డిమాండ్లలో ఒకటి కావడమే అతను ఒక మూర్ఖుడని చెప్పడానికి స్పష్టమైన నిదర్శనం. కానీ ఆయన రాజీనామా చేస్తే, ఆయన స్థానంలో మరో మంత్రిని నియమిస్తారు.



# మహాయుతిలో శివసేన షిండేకు అవమానం!

**ముంబయి,జూన్ 9:** మహారాష్ట్ర అధికార మహాయుతి కూటమిలో అంతర్గత విభేదాలు మరోసారి రోడ్డున పడ్డాయి. నవీ ముంబై అంతర్జాతీయ విమానాశ్రయంలో జరిగిన ఒక హైప్రొఫైల్ కార్యక్రమ ఆహ్వాన పత్రిక వివాదం కూటమి భాగస్వామ్య పక్షాల మధ్య తీవ్ర ఉద్రిక్తతలకు దారితీసింది. మహారాష్ట్ర రాష్ట్ర అవతరణ దినోత్సవం సందర్భంగా ఎయిర్‌పోర్టులో ఏర్పాటు చేసిన 20 అడుగుల ఛత్రపతి శివాజీ మహారాజ్ విగ్రహ ఆవిష్కరణ కార్యక్రమానికి రాష్ట్ర డిప్యూటీ సీఎం, పట్టణాభివృద్ధి శాఖ మంత్రి ఏక్‌నాథ్ షిండేను ఆహ్వానించకపోవడం రాజకీయంగా దుమారం రేపింది. ఈ విమానాశ్రయ ప్రాజెక్టును పర్యవేక్షించే సీఐడీసీవో సంస్థ నేరుగా షిండే మంత్రిత్వ శాఖ పరిధిలోనే పని చేస్తుండటం గమనార్హం. అదానీ ఎయిర్‌పోర్ట్ అథారిటీ, సీఐడీసీవో సంయుక్తంగా నిర్వహించిన ఈ వేడుకకు ముఖ్యమంత్రి దేవేంద్ర ఫడ్నవీస్ ముఖ్య అతిథిగా హాజరై విగ్రహాన్ని ఆవిష్కరించారు. ఈ కార్యక్రమంలో మంత్రులు గణేశ్ నాయక్, అదితి తత్కరేలు పాల్గొన్నప్పటికీ డిప్యూటీ సీఎంలు ఏక్‌నాథ్ షిండే, సునేత్రా పవార్‌లను కనీసం సంప్రదించకుండా, ఆహ్వాన జాబితా నుంచి పూర్తిగా పక్కన పెట్టడం కలకలం సృష్టించింది. దీనిపై షిండే నేతృత్వంలోని శివసేన వర్గం తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేసింది. కొందరు అధికారులు రాజకీయ ఒత్తిళ్లకు లొంగి పనిచేస్తున్నారని, ప్రాజెక్టు క్రెడిట్ షిండేకు దక్కకుండా చేసేందుకే ఈ కుట్ర పన్నారని రాష్ట్ర మంత్రి సంజయ్ శిర్సాత్ బహిరంగంగానే అసంతృప్తి వెళ్లగక్కారు. మరోవైపు ఈ వివాదం ప్రతిపక్షాలకు మంచి అస్త్రంగా మారింది. శివసేన నేత అంబాదాస్ దాన్వే అధికార కూటమిపై వ్యంగ్యాస్త్రాలు సంధించారు.

# అఫ్ఘానిస్థాన్‌పై పాక్ దాడి

## ఆ దేశ సార్వభౌమాధికారంపై పోరాటం

### ఐక్యరాజ్యసమితిలో భారత్‌ప్రతినిధి హారీష్ పర్వతనేని ధ్వజం

**న్యూయార్కు, జూన్ 9:** అఫ్ఘనిస్థాన్‌పై పాకిస్థాన్ సైన్యం జరిపిన వైమానిక దాడులను భారత్ తీవ్రంగా ఖండించింది. ఐక్యరాజ్యసమితి వేదికగా పాకిస్థాన్‌పై భారత్ తీవ్ర స్థాయిలో విరుచుకుపడింది. ఈ చర్య ఆఫ్ఘనిస్థాన్ సార్వభౌమాధికారంపై జరిగిన స్పష్టమైన దాడి అని, ఇది ఆ దేశంతో పాటు యావత్ ప్రాంతీయ శాంతికి పెను ముప్పు అని భారత్ ఆందోళన వ్యక్తం చేసింది. ఐరాస సర్వసభ్య సమావేశంలో భారత శాశ్వత ప్రతినిధి, అంబాసిడర్ హరీశ్ పర్వతనేని మాట్లాడుతూ పాకిస్థాన్ దాడుల్లో అమాయక పౌరులు ప్రాణాలు కోల్పోవడంపై తీవ్ర విచారం వ్యక్తం చేశారు. ఆఫ్ఘనిస్థాన్‌లోని ఐక్యరాజ్యసమితి సహాయ మిషన్ (యూఎన్ఏఎంఏ) నివేదికలను ఆయన ఉటంకించారు. ఈ ఏడాది తొలి మూడు నెలల్లోనే 372 మంది పౌరులు మరణించారని, మరో 397 మంది గాయపడ్డారని తెలిపారు. వీరిలో అత్యధికులు పవిత్ర రంజాన్ మాసంలోనే లక్ష్యంగా చేసుకుని జరిపిన దాడుల్లో మరణించడం అత్యంత దారుణమని ఆయన పేర్కొన్నారు. ఇదే సమావేశంలో ఐక్యరాజ్యసమితి నివేదికల విశ్వసనీయతను పాకిస్థాన్ ప్రశ్నించడాన్ని భారత్ తీవ్రంగా తప్పుబట్టింది. బహుళ పక్షవాదం, ఐక్యరాజ్యసమితి పట్ల మద్దతు అనేది ఎవరి ఇష్టానుసారం వారు ఎంచుకునే మెనూ కాదు. మీకు నచ్చినప్పుడు దాన్ని స్వీకరించి, నచ్చనప్పుడు తిరస్కరించడం కుదరదని పర్వతనేని పాకిస్థాన్‌కు తీవ్ర స్థాయిలో హితవుపలికారు. ఆఫ్ఘనిస్థాన్‌లో శాంతి, స్థిరత్వం కోసం యూఎన్ఏఎంఏ చేస్తున్న కృషికి భారత్ పూర్తి మద్దతు ఇస్తుందని స్పష్టం చేశారు. అంతర్జాతీయ చట్టాలను, ముఖ్యంగా అంతర్జాతీయ మానవతా చట్టాలను గౌరవించాలని, పౌరుల రక్షణను నిర్ధారించాలని ఐరాస సెక్రటరీ జనరల్ చేసిన పిలుపును భారత్ సమర్థిస్తోందని పర్వతనేని తెలిపారు. ఈ దాడులపై పూర్తిస్థాయిలో దర్యాప్తు జరిపి జవాబుదారీతనాన్ని నిర్ధారించాలని, ఇలాంటివి పునరావృతం కాకుండా చూడాలని యూఎన్ఏఎంఏ చేసిన డిమాండ్‌కు భారత్ మద్దతు తెలుపుతోందని ఆయన వివరించారు. ఇటువంటి దారుణమైన హింసాత్మక చర్యలు ఆమోదయోగ్యం కావని భారత్ స్పష్టం చేసింది.

# హెచ్1బి వీసా ఫీజును రద్దుచేసిన బోస్టన్ కోర్టు!



**బోస్టన్,జూన్ 9:** అమెరికాలో ఉద్యోగాలు ఆశిస్తున్న భారతీయ టెక్ నిపుణులతో పాటు ఇతర విదేశీ నిపుణులకు భారీ ఊరట లభించింది. డొనాల్డ్ ట్రంప్ అధ్యక్షుడిగా ఉన్నప్పుడు హెచ్1బీ వీసాలపై విధించిన లక్ష డాలర్లు సుమారు రూ. 95.8 లక్షలు భారీ ఫీజును అమెరికా ఫెడరల్ కోర్టు రద్దు చేసింది. ఈ ఫీజు పెంపు చట్టవిరుద్ధమైన పన్ను కిందకు వస్తుందని, కాంగ్రెస్ ఆమోదం లేకుండా అధ్యక్షుడు ఇలాంటి పన్ను విధించలేరని బోస్టన్‌లోని ఫెడరల్ కోర్టు స్పష్టం చేసింది. ట్రంప్ సర్కారుగత ఏడాది ప్రకటించిన ఈ ఫీజును సవాలు చేస్తూ డెమొక్రాటిక్ పార్టీకి చెందిన 20 రాష్ట్రాల అటార్నీ జనరల్స్ కోర్టులో దావా వేశారు. దీనిపై విచారణ జరిపిన యూఎస్ డిస్ట్రిక్ట్ జడ్జి లియో సొరోకిన్ తీర్పు ఇచ్చారు. "చట్టం ద్వారా కాంగ్రెస్ అధికారం ఇస్తే తప్ప, పన్ను విధించే అధికారం అధ్యక్షుడికి లేదు. హెచ్1బీ పిటిషన్లపై విధించిన ఈ ఫీజు కాంగ్రెస్ అనుమతి లేని పన్ను అని కోర్టు నిర్ధారించింది. అందువల్ల ఈ విధానాన్ని చట్టవిరుద్ధమైనదిగా ప్రకటిస్తూ, పూర్తిగా రద్దు చేస్తున్నాం" అని తీర్పులో వెల్లడించారు. ఈ ఫీజు పెంపు వల్ల హెచ్1బీ వీసా దరఖాస్తులు భారీగా పడిపోయినట్లు ప్రభుత్వ గణాంకాలే చెబుతున్నాయి. 2026 ఆర్థిక సంవత్సరంలో 3,43,981గా ఉన్న హెచ్1బీ రిజిస్ట్రేషన్లు, 2027 ఆర్థిక సంవత్సరానికి 2,11,600కి పడిపోయాయి. దాదాపు 38.5 శాతం తగ్గుదల నమోదైంది. ఈ ఏడాది ఫిబ్రవరి 15 నాటికి కేవలం 85 మంది మాత్రమే లక్ష డాలర్ల ఫీజు చెల్లించినట్లు ప్రభుత్వం మార్చిలో కోర్టుకు తెలిపింది. సాధారణంగా హెచ్1బీ వీసా కోసం కంపెనీలు 2,000 నుంచి 5,000 డాలర్ల వరకు ఫీజు చెల్లిస్తాయి. అమెరికన్ ఉద్యోగుల స్థానంలో తక్కువ జీతాలకు విదేశీయులను నియమించుకోవడానికి హెచ్1బీ కార్యక్రమాన్ని దుర్వినియోగం చేస్తున్నారని ట్రంప్ ప్రభుత్వం ఆరోపించింది. ఈ విధానం వల్ల దేశ ఆర్థిక, జాతీయ భద్రతకు ముప్పు వాటిల్లుతోందని తన ఉత్తర్వుల్లో పేర్కొంది. ఇమ్మిగ్రేషన్ వ్యవస్థను మెరుగుపరిచే క్రమంలో కొన్ని ఇబ్బందులు ఎదురవుతాయని, కేవలం భారత్‌ను లక్ష్యంగా చేసుకున్నది కాదని రూబియో వివరించారు. దేశంలో వలసల సంక్షోభాన్ని ఎదుర్కోవడంలో భాగంగానే ఈ చర్యలు తీసుకుంటున్నామని ఆయన స్పష్టం చేశారు.

# ఇరాన్‌పై నిరంతర దాడులు చేస్తే ఇజ్రాయెల్ ఒంటరికాక తప్పదు!

## నెతన్యాహుకు ట్రంప్ హెచ్చరికలు

**వాషింగ్టన్, జూన్ 9:** ఇరాన్‌పై నిరంతరం దాడులు చేస్తూ ఉద్రిక్తతలు పెంచితే అంతర్జాతీయంగా ఇజ్రాయెల్ ఒంటరిగా మిగిలిపోయే ప్రమాదం ఉందని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ హెచ్చరించారు. ఇజ్రాయెల్ ప్రధాని బెంజమిన్ నెతన్యాహుతో జరిపిన ఫోన్ సంభాషణల్లో ట్రంప్ ఈ వ్యాఖ్యలు చేశారు. ఇరాన్‌తో అణు ఒప్పందాన్ని కుదుర్చుకోవడానికి వాషింగ్టన్ ప్రయత్నిస్తున్న తరుణంలో, ఇజ్రాయెల్ జరుపుతున్న సైనిక దాడులు అమెరికా వ్యూహాలకు అడ్డంకిగా మారడమే ఈ హెచ్చరికకు ప్రధాన కారణం. వారాంతంలో లెబనాన్‌లోని హిజ్బుల్లా స్థావరాలపై ఇజ్రాయెల్ జరిపిన దాడులకు ప్రతీకారంగా ఇరాన్ దాదాపు 30 బాలిస్టిక్ క్షిపణులను ఇజ్రాయెల్‌పైకి ప్రయోగించింది. దీనికి బదులుగా ఇజ్రాయెల్ కూడా ఇరాన్ వైమానిక రక్షణ వ్యవస్థలు, పెట్రోకెమికల్ కేంద్రాలపై దాడులు చేసింది. ట్రంప్ జోక్యంతో ఇరుదేశాలు ప్రస్తుతానికి దాడులను నిలిపివేశాయి. ఇరాన్‌పై మరింత పెద్ద ఎత్తున దాడులు చేయాలన్న నెతన్యాహు ప్రణాళికను ట్రంప్ జోక్యం చేసుకుని విరమింపజేశారు. బీబీ (నెతన్యాహు), నువ్వు జాగ్రత్తగా ఉండాలి లేకపోతే త్వరలోనే నువ్వు ఒంటరిగా పోరాడాల్సి వస్తుందని తాను హెచ్చరించినట్లు ట్రంప్ స్వయంగా వెల్లడించారు. ఇరుపక్షాలు పరస్పరం దాడులు చేసుకుంటున్నందున ఇక యుద్ధాన్ని ఆపాలని ఆయన స్పష్టం చేశారు. మరోవైపు నెతన్యాహు మాత్రం తమ సరిహద్దు రక్షణ కోసం, ఇరాన్ అణు సామర్థ్యాన్ని దెబ్బతీయడానికి ఈ దాడులు తప్పనిసరని సమర్థించుకున్నారు. అమెరికా రక్షణ దళాలు ఇరాన్ క్షిపణులను అడ్డుకోవడంలో సహాయపడినప్పటికీ, ఇజ్రాయెల్ చేస్తున్న ఎదురు దాడుల్లో మాత్రం నేరుగా పాల్గొనలేదు.

# జైపూర్‌లోని బాణసంచా గిడ్డంగిలో అగ్నిప్రమాదం

## చిన్నారి సహా ఏడుగురు మృతి - మరో నలుగురి పరిస్థితి విషమం



**జైపూర్, జూన్ 9:** జైపూర్‌లోని ఖోహ్ నాగోరియన్ ప్రాంతంలో మంగళ వారం ఒక అక్రమ బాణసంచా గిడ్డంగిలో భారీ అగ్ని ప్రమాదం సంభవించి, ఒక చిన్నారితో సహా ఏడుగురు మృతి చెందగా, మరో ఐదుగురు తీవ్రంగా గాయపడ్డారు. అధికార వర్గాల సమాచారం ప్రకారం, ఖోహ్ నాగోరియన్‌లోని ఐటీఐ కళాశాల సమీపంలో ఉన్న అయేషా నగర్ తలై ప్రాంతంలోని ఒక గిడ్డంగిలో ఉదయం 11 గంటల ప్రాంతంలో ఈ అగ్నిప్రమాదం జరిగింది. ఈ ఘటనలో ఏడుగురు ప్రాణాలు కోల్పోగా, నలుగురి పరిస్థితి విషమంగా ఉంది. క్షతగాత్రులు ఓ ప్రైవేటు ఆసుపత్రిలోని బర్న్ వార్డులో చికిత్స పొందుతున్నారు. ఆసుపత్రి ప్లాస్టిక్ సర్జన్ డాక్టర్ ఆర్.కె. జైన్ మాట్లాడుతూ, నలుగురి పరిస్థితి విషమంగా ఉందని, కాలిన గాయాలు తీవ్రంగా ఉన్నాయని తెలిపారు. జైపూర్ పోలీస్ కమిషనర్ సచిన్ మిట్టల్ మాట్లాడుతూ, ఆ గిడ్డంగిని బాణసంచా నిల్వ చేయడానికి ఉపయోగిస్తున్నారని, అసలు ఫ్యాక్టరీ కొద్ది దూరంలోనే ఉందని ధ్రువీకరించారు. నివాస ప్రాంతంలో గిడ్డంగిని అక్రమంగా నడుపుతున్నారని, యజమాని, ఇంటి యజమాని, బాధ్యులుగా తేలిన పోలీసులపై చర్యలు తీసుకుంటామని ఆయన అన్నారు.

# సంక్షిప్తంగా..


## కేరళ మాజీ సిఎం విజయన్ కుమార్తె వీణకు ఇడి సమన్లు

**కొచ్చిన్, జూన్ 9:** కేరళ మాజీ ముఖ్యమంత్రి పినరయి విజయన్ కుమార్తె వీణకు ఈడీ సమన్లు జారీచేసింది. కొచ్చిన్ మినరల్స్ అండ్ రూటిల్ లిమిటెడ్ అక్రమ లావాదేవీల్లో ఆమె ప్రమేయం ఉన్నట్లుగా ఆరోపణలు రావడంతో కంపెనీల చట్టం ఉల్లంఘన కింద అభియోగాలు నమోదయ్యాయి. ఈ నేపథ్యంలోనే శుక్రవారం కొచ్చి కార్యాలయం ముందు హాజరవ్వాలని ఈడీ ఆదేశించింది. వీణతోపాటు సిఎంఆర్ఎల్‌కు సంబంధించిన మరో తొమ్మిది మందికి సమన్లు జారీ చేసినట్లు అధికారులు వెల్లడించారు. ఈడీతో కీలక పత్రాలను పంచుకోవడానికి నిరాకరిస్తూ కంపెనీ దాఖలు చేసిన పిటిషన్‌ను కార్పొరేట్ నేరాలను విచారించే ప్రత్యేక న్యాయస్థానం తిరస్కరించింది.

ఈ క్రమంలోనే ఈడీ దర్యాప్తును ముమ్మరం చేసింది.

ఈ దర్యాప్తులో భాగంగా ఇప్పటికే పలు డాక్యుమెంటరీ, డిజిటల్, ఆర్థిక ఆధారాలను సేకరించినట్లు అధికారులు వెల్లడించారు.

## సన్నీలియోన్‌కు సిఐడి నోటీసులు



**ముంబయి,జూన్ 9:** బాలీవుడ్ హాట్ బ్యూటీ సన్నీ లియోన్ ఒక భారీ ఆర్థిక వివాదంలో చిక్కుకోవడం ఇప్పుడు తీవ్ర సంచలనంగా మారింది. కర్ణాటకకు చెందిన శివమ్ అసోసియేట్స్ అనే సంస్థ దాదాపు రూ.2,400 కోట్ల మేర అక్రమ డిపాజిట్లు సేకరించి, ప్రజలను మోసం చేసినట్లు ఆరోపణలు ఎదుర్కొంటోంది. ఈ సంస్థ యజమాని శివానంద నీలణ్ణవర్‌పై ఇప్పటికే కేసులు నమోదు కాగా, ఈ అక్రమ సొమ్ము వ్యవహారంలో సన్నీ లియోన్‌కు కర్ణాటక సీఐడీ అధికారులు నోటీసులు జారీ చేయడం హాట్ టాపిక్‌గా మారింది. శివమ్ అసోసియేట్స్ అధినేత 2023లో ఛాంపియన్ అనే సినిమాను నిర్మించాడు. ఈ చిత్రంలో ఒక ఐటెం సాంగ్ చేసినందుకు సన్నీ లియోన్‌కు ఏకంగా రూ.1 కోటి పారితోషికం ఇచ్చినట్లు బ్యాంక్ రికార్డుల ద్వారా అధికారులు గుర్తించారు.

## హార్ముజ్ జలసంధిలో కుప్పకూలిన హెలికాప్టర్

**టెహ్రాన్, జూన్ 9:** అమెరికా సైన్యానికి చెందిన అపాచీ హెలికాప్టర్ సోమవారం హర్మూజ్ జలసంధి సమీపంలో కుప్పకూలింది. ఈ ప్రమాదంలో హెలికాప్టర్‌లోని ఇద్దరు సిబ్బంది సురక్షితంగా బయటపడ్డారని, వారికి ఎటువంటి గాయాలు కాలేదని అధికారులు వెల్లడించారు. ఈ విషయాన్ని అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ స్వయంగా ధృవీకరించారు. న్యూయార్క్‌లో మీడియా ప్రతినిధులతో మాట్లాడిన ట్రంప్, "పైలట్లు క్షేమంగా ఉన్నారు, ఎవరికీ ఎటువంటి గాయాలు కాలేదని పేర్కొన్నారు. ఈ ఘటనకు సంబంధించిన పూర్తి వివరాలతో కూడిన అధికారిక నివేదికను విడుదల చేస్తామని ఆయన తెలిపారు. ప్రపంచం చమురు రవాణాలో ఐదో వంతు వాటా కలిగిన హర్మూజ్ జలసంధి అత్యంత కీలకమైన ప్రాంతం.

## అన్నామలై 'వియ్ ది లీడర్స్' ఉద్యమానికి అనూహ్య స్పందన

**చెన్నై,జూన్ 9:** తమిళనాడు బీజేపీ మాజీ అధ్యక్షుడు కె. అన్నామలై ప్రారంభించిన వి ది లీడర్స్ ఉద్యమానికి ప్రజాక్షేత్రంలో అనూహ్య స్పందన లభిస్తోంది. ఈనెల 5న ప్రారంభమైన ఈ ఉద్యమంలో కేవలం మూడు రోజుల వ్యవధిలోనే సుమారు 17 లక్షల మంది సభ్యులుగా చేరారని అన్నామలై ప్రకటించారు. ఈ భారీ సభ్యత్వ నమోదు ప్రస్తుతం తమిళనాడు రాజకీయాల్లో తీవ్ర చర్చనీయాంశంగా మారింది. తమిళనాడులో సమూల రాజకీయ మార్పు తీసుకురావడమే లక్ష్యంగా ఈ ఉద్యమాన్ని చేపట్టినట్లు అన్నామలై తన సోషల్ మీడియా వేదికగా పేర్కొన్నారు. ప్రజల నుంచి వస్తున్న స్పందనను బట్టి వారు మార్పును ఎంత బలంగా ఆకాంక్షిస్తున్నారో స్పష్టమవుతోందని ఆయన అభిప్రాయపడ్డారు.

# అణు క్షిపణులను మొహరించిన భారత్!




**న్యూఢిల్లీ,జూన్ 9:** భారతదేశ రక్షణ, అణు ఆయుధ విధానంలో చరిత్రాత్మక మార్పు చోటుచేసుకున్నది. రక్షణ రంగ చరిత్రలోనే మొట్టమొదటిసారిగా భారత్ ప్రయోగించేందుకు సిద్ధంగా ఉండేలా 12 అణు బాంబులను మోహరించినట్లు అంతర్జాతీయ ఆయుధాల పర్యవేక్షణ సంస్థ స్టాక్‌హోమ్ ఇంటర్నేషనల్ పీస్ రీసెర్చ్ ఇన్‌స్టిట్యూట్ సిప్రీ తన నివేదికలో వెల్లడించింది. దశాబ్దాలుగా అనుసరిస్తున్న వ్యూహాత్మక విధానాన్ని పక్కనబెట్టి భారత్ ఈ అడుగు వేయడం అంతర్జాతీయంగా ప్రాధాన్యం సంతరించుకుంది. సాధారణంగా శాంతి సమయాల్లో భారత్ తన అణుబాంబులను, వాటిని ప్రయోగించే క్షిపణులు లేదా యుద్ధ విమానాలను వేర్వేరు ప్రాంతాలలో భద్రపరుస్తుంది. కానీ ఇప్పుడు తొలిసారిగా అణుబాంబులను నేరుగా ప్రయోగించే వ్యవస్థలతో అనుసంధానించి, సైనిక స్థావరాల్లో లేదా భూగర్భ క్షిపణి కేంద్రాల్లో యుద్ధానికి సిద్ధంగా ఉంచినట్లు సిప్రి నివేదిక పేర్కొంది.

# రెబెల్ ఎమ్మెల్యేలు,ఎంపిలపై టిఎంసినేత కల్యాణ్‌బెనర్జీ ధ్వజం

**కోల్‌కత్తా, జూన్ 9:** పశ్చిమ బెంగాల్‌లో ప్రస్తుత పరిణామాలపై తృణమూల్ కాంగ్రెస్ (టీఎంసీ) స్పందించింది. టీఎంసీ చీఫ్ విప్‌గా నియమితులైన కల్యాణ్ బెనర్జీ మాట్లాడుతూ, గతంలో మమతా బెనర్జీ నాయకత్వాన్ని ఆకాశనికెత్తిన వారే, ఇప్పుడు పార్టీ అధికారంలో లేదనే సాకుతో విమర్శలు చేస్తున్నారని మండిపడ్డారు. ఇది కేవలం అధికారం కోసం చేస్తున్న ద్రోహమని ఆయన ధ్వజమెత్తారు. పశ్చిమ బెంగాల్‌లో అధికారం కోల్పోయిన తృణమూల్ కాంగ్రెస్ ప్రస్తుతం తీవ్ర సంక్షోభంలో కూరుకుపోయింది. పార్టీ అధినేత్రి మమతా బెనర్జీ నాయకత్వంపై తిరుగుబాటు బావుటా ఎగురవేసిన సుమారు 20 మంది లోక్‌సభ ఎంపీలు, పార్లమెంటులో బీజేపీ నేతృత్వంలోని ఎన్డీఏ ప్రభుత్వానికి మద్దతు ఇచ్చేందుకు సిద్ధమయ్యారు. తమను ప్రత్యేక వర్గంగా గుర్తించాలని కోరుతూ లోక్‌సభ స్పీకర్ ఓం బిర్లాకు లేఖ రాసినట్లు రెబల్ ఎంపీ కకోలీ ఘోష్ దస్తిదార్ ప్రకటించారు. రాష్ట్రంలో 15 ఏళ్ల టీఎంసీ పాలనకు తెరదించుతూ ఇటీవల జరిగిన అసెంబ్లీ ఎన్నికల్లో ఆ పార్టీ పరాజయం పాలైన విషయం తెలిసిందే. ఈ ఓటమి అనంతరం పార్టీలో అసమ్మతి జ్వాలలు మిన్నంటాయి. ఇప్పటికే 58 మంది టీఎంసీ ఎమ్మెల్యేలు పార్టీ అధికారిక శాసనసభాపక్ష నేత అభ్యర్థిని కాదని, బహిష్కరణకు గురైన నేతకు మద్దతు తెలపడం గమనార్హం. తాజాగా ఈ సంక్షోభం పార్లమెంటుకు సైతం పాకింది.

## ఇజ్రాయెల్ గడ్డపై ఛత్రపతి శివాజీ విగ్రహం



**టెల్ అవీవ్,జూన్ 9:** మరాఠా సామ్రాజ్య స్థాపకుడు ఛత్రపతి శివాజీ మహారాజ్ కీర్తిప్రతిష్టలు మరోసారి ప్రపంచవ్యాప్తం కానున్నాయి. ఇజ్రాయెల్‌లో శివాజీ మహారాజ్ భారీ విగ్రహాన్ని ఏర్పాటు చేయనున్నట్లు ముంబైలోని ఆ దేశ కాన్సులేట్ జనరల్ ప్రకటించింది. ప్రపంచవ్యాప్తంగా యూదులు శతాబ్దాలుగా హింసను ఎదుర్కొన్నప్పటికీ భారత్‌లో మాత్రం వారు ఎలాంటి వివక్ష లేకుండా సురక్షితంగా జీవించారనే చారిత్రక బంధానికి ప్రతీకగా ఈ విగ్రహాన్ని ప్రతిష్ఠిస్తున్నారు. కొంకణ్ తీర ప్రాంతంలో నివసించే బెనె ఇజ్రాయెల్ అనే యూదు సమాజానికి, మరాఠా సామ్రాజ్యానికి మధ్య 17వ శతాబ్దం నుంచే బలమైన సైనిక బంధం ఉంది. యూదుల యుద్ధ నైపుణ్యాలను, వారి పట్టుదలను గుర్తించిన శివాజీ మహారాజ్ వారిని తన సైన్యంలో, నౌకాదళంలో కీలక పదవుల్లో నియమించారు.

10-6Pg6exHMNWJQE.qxd:10-6Pg6exHMNWJQE.qxd 1/1/02 6:19 AM Page 1



## 'విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదు'

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** విశాఖ స్టీల్ ప్లాంటు ప్రమాదాన్ని రాజకీయం చేయడం సమంజసం కాదని మున్సిపల్ పరిపాలన శాఖ మంత్రి పి.నారాయణ వ్యాఖ్యానించారు. విపత్కర పరిస్థితులకు అందరం బాధితులకు అండగా ఉండాల్సిన అవసరాన్ని గుర్తించాలన్నారు. విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ఘటనపై ప్రభుత్వం వెంటనే స్పందించిందని వెల్లడించారు. ఈ ఘటన నేపథ్యంలో తిరుపతిలో జరగాల్సిన కార్యక్రమాన్ని రద్దు చేశామని ఆయన వివరించారు. మంగళవారం తెలుగుదేశం పార్టీ కేంద్ర కార్యాలయంలో నిర్వహించిన గ్రీవెన్స్‌లో మంత్రి నారాయణ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ బాధితులకు వైద్యం, సహాయ చర్యలపై ప్రభుత్వం దృష్టి సారించిందన్నారు. సిఎం చంద్రబాబు నాయుడు, డిప్యూటీ సిఎం పవన్ కల్యాణ్, నారా లోకేశ్‌తోపాటు మంత్రులు ఈ ఘటనపై ప్రత్యేక దృష్టి పెట్టారని మంత్రి పి.నారాయణ చెప్పారు. విశాఖ ఘటనపై వైసిపి అనవసర రాజకీయాలు చేస్తోందంటూ మండిపడ్డారు. వైసిపి శవ రాజకీయాలకు పాల్పడుతోందని ఆయన ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రజలను రెచ్చగొట్టే రాజకీయాలు మానుకోవాలని ఆ పార్టీ నేతలకు మంత్రి నారాయణ హితవు పలికారు. 2029 ఎన్నికల్లో వైసిపికి ప్రజలు తగిన గుణపాఠం చెబుతారని పేర్కొన్నారు. గ్రీవెన్స్ సెల్‌కు 56 మంది ఫిర్యాదుదారులు వచ్చారని మంత్రి పి.నారాయణ వివరించారు. ఈ ఫిర్యాదుల్లో 60 శాతానికిపైగా రెవెన్యూ సమస్యలే ఉన్నాయని తెలిపారు. గత ప్రభుత్వ హయాంలో రెవెన్యూ అవకతవకల వల్ల ప్రజలు ఇబ్బందులు ఎదుర్కొన్నారని గుర్తు చేశారు. రెవెన్యూ సమస్యల పరిష్కారంపై సిఎం చంద్రబాబు వారానికి ఒకసారి సమీక్ష నిర్వహిస్తున్నారని వివరించారు. రెవెన్యూ అంశాల పరిష్కారానికి మంత్రుల కమిటీ పని చేస్తోందని ఈ సందర్భంగా మంత్రి నారాయణ గుర్తు చేశారు. గ్రీవెన్స్‌కు వచ్చిన ఫిర్యాదులను సంబంధిత జిల్లా కలెక్టర్లు, అధికారులకు పంపించామని మంత్రి నారాయణ తెలిపారు. ఇక పెన్షన్లు, మున్సిపల్ సమస్యలు, కుటుంబ వివాదాలపై కూడా ఫిర్యాదులు అందాయని వివరించారు. ఈ సమస్యల పరిష్కారానికి నేరుగా జిల్లా కలెక్టర్లతోపాటు కమిషనర్లతో మాట్లాడామని మంత్రి నారాయణ చెప్పారు.

## 'జగన్ అసత్యప్రచారాలు మానుకోవాలి'

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కూటమి ప్రభుత్వంపై మాజీ సీఎం వైఎస్ జగన్ అసత్యప్రచారాలు మానుకోవాలని రాజ్యసభ సభ్యుడు, టిడిపి నేత సానా సతీష్ అన్నారు. వైసిపి అధినేత జగన్ మహిళా సమస్యలపై చేసిన వ్యాఖ్యలపై సానా సతీష్ తీవ్రస్థాయిలో ఆరోపణలు చేసారు. సొంత తల్లిని, చెల్లిని వెన్నుపోటు పొడిచిన జగన్, మహిళల గురించి మాట్లాడటం అత్యంత విడ్డూరంగా, నైతికత లేని చర్యగా ఉందన్నారు. జగన్ ఐదేళ్ల పాలనలో జరిగిన కొన్ని వాస్తవాలను సానా సతీష్ ఈ సందర్భంగా గుర్తు చేశారు. వైసిపి అధికారంలో ఉన్న కాలంలో జగన్ 11 మందిని రాజ్యసభకు నామినేట్ చేశారని, అయితే ఆ 11 సీట్లలో ఒక్కటంటే ఒక్క సీటు కూడా మహిళకు కేటాయించలేదని ఆయన ధ్వజమెత్తారు. తల్లి వైఎస్ విజయమ్మ విశాఖపట్నం లోక్‌సభ స్థానంలో ఓడిపోయేలా చేశారని, ఆ తర్వాత ఆమెతో బలవంతంగా పార్టీ నుంచి రాజీనామా చేయించారని ఆరోపించారు. పెయిడ్ మీడియా ద్వారా మహిళలపై విషపూరిత ప్రచారాలు చేయించడమే జగన్ నైజమని విమర్శించారు. "తన సొంత తల్లిని, చెల్లిని మోసం చేసిన వ్యక్తి, ఇక రాష్ట్రంలోని మహిళల సంక్షేమం గురించి ఎలా మాట్లాడగలరు?" అని సతీష్ నిలదీశారు. ఇదే సమయంలో మహానాడు వేదికగా మంత్రి నారా లోకేష్ రాబోయే ఎన్నికల్లో మహిళలకు 33శాతం సీట్లు కేటాయిస్తామని ప్రకటించిన విషయాన్ని ఆయన ప్రస్తావించారు. లోకేష్ తీసుకున్న ఈ నిర్ణయం జగన్‌ను తీవ్రమైన ఆత్మరక్షణలో పడేసిందని, ఇప్పుడు ఆయనకు ఏం చేయాలో పాలుపోని నిస్సహాయ స్థితి ఏర్పడిందని ఎద్దేవా చేశారు.

## నేడు విశాఖకు వైసిపి అధినేత వైఎస్ జగన్

**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** వైజాగ్ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో మృతిచెందిన వారి కుటుంబాలను మాజీ ముఖ్యమంత్రి వైఎస్సార్సీపీ అధినేత వైఎస్ జగన్ ఈ నెల 10 బుధవారం పరామర్శించనున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులను ఆసుపత్రిలో వైఎస్ జగన్ పరామర్శిస్తారు. బాధిత కుటుంబాలను కలువనున్నారు.

## బీహార్ బస్సు ఘటనలో మృతిచెందిన ముగ్గురి భౌతిక కాయాల నెల్లూరుకు తరలింపు

### వివరాలు వెల్లడించిన మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి



**నెల్లూరు(వైద్యం), జూన్ 9 ప్రభాతవార్త:** బీహార్ రాష్ట్రంలోని ఔరంగాబాద్ సమీపంలో జరిగిన బస్సు ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురు యాత్రికుల భౌతిక కాయాలను వారి స్వస్థలాలకు చేర్చేందుకు రాష్ట్ర ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపట్టిందని రాష్ట్ర దేవాదాయ శాఖ మంత్రి ఆనం రామనారాయణ రెడ్డి తెలిపారు. ప్రమాదంలో మృతి చెందిన ముగ్గురి మృతదేహాలను ఔరంగాబాద్ నుండి పాట్నాకు తరలించిన అనంతరం, ఇండిగో విమానం 6ఌ619 ద్వారా హైదరాబాద్‌కు, అక్కడి నుంచి ఇండిగో విమానం 6ఌ6174 ద్వారా చెన్నైకి తరలిస్తున్నట్లు మంత్రి తెలిపారు. ఈ విమానం నేడు రాత్రి 10.05 గంటలకు చెన్నై టెర్మినల్1కు చేరుకోనుందని పేర్కొన్నారు. మృతదేహాలతో పాటు సమన్వయ బాధ్యతలు నిర్వహిస్తున్న సోమా పెంచల ప్రసాద్ ప్రయాణిస్తున్నారని తెలిపారు. చెన్నై విమానాశ్రయంలో మృతదేహా లను స్వీకరించి, అక్కడి నుంచి సురక్షితంగా నెల్లూరు జిల్లాకు తరలించి సంబంధిత కుటుంబ సభ్యులకు అప్పగించేందుకు జిల్లా యంత్రాంగం అన్ని ఏర్పాట్లు పూర్తి చేసినట్లు వెల్లడించారు. మృతుల కుటుంబాలకు అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం సిద్ధంగా ఉందని మంత్రి తెలిపారు. అలాగే ప్రమాదంలో గాయపడిన యాత్రికులకు వైద్య సేవలు, స్వస్థలాలకు తరలింపు కార్యక్రమాలను కూడా ప్రభుత్వం నిరంతరం పర్యవేక్షిస్తోందన్నారు.

## సహకార రంగం బలోపేతానికి సహకార భూమి



**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త:** రాష్ట్రంలో సహకారరంగం బలోపేతానికి సహకారభూమి పత్రిక అండగా ఉంటుందని ఆప్కాబ్ చైర్‌పర్సన్ గన్ని వీరాంజనేయులు కొనియాడారు. సహకారభూమి పత్రిక మూడవ వార్షికోత్సవ ప్రత్యేక సంచికను మంగళవారం విజయవాడలోని సహకారభూమి జర్నల్ కో-ఆపరేటివ్ సొసైటీ కార్యాలయంలో వీరాంజనేయులు ఆవిష్కరించారు. ఈసందర్భంగా ఆయన మాట్లాడుతూ సహకారభూమి పత్రిక వ్యవస్థాపకులైన సహకారవేత్తలు, సీనియర్ జర్నలిస్టులు, సంఘాలు ఏవిధమైన ప్రయోజనాలు ఆశించకుండా సహకార ఉద్యమం సజీవంగా ఉండాలని దాని విలువలు సమాజానికి తెలియచేయాలనే లక్ష్యంతో ఈపత్రికను నిర్వహిస్తున్నారని కొనియాడారు. సహకార రంగానికి సంబంధించిన సమాచారం, చరిత్ర, విలువలు, విజయగాధలను ప్రజలకు చేరవేస్తూ ఈపత్రిక ఒక ఉద్యమంలా పనిచేస్తుందన్నారు. సహకార రంగం ద్వారా ప్రజలకు అందుతున్న సేవలు, ఇందులోని విజయాలు, సవాళ్ళు ప్రజలకు తెలియచేసేందుకు ఇటువంటి పత్రికల అవసరం ఉందన్నారు. ఈపత్రికకు అన్ని విధాల మద్దతు అందించే అంశాన్ని ఆప్కాబ్, జిల్లాకేంద్రసహకారబ్యాంకులు, పిఏసిఎస్‌లస్థాయిలో పత్రిక విస్తరణకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఆప్కాబ్ జనరల్‌బాడీ సమావేశంలో చర్చించి పత్రిక అభివృద్ధికి సహకరిస్తామని చైర్మన్ ప్రకటించారు. పత్రికను డిజిటల్ రూపంలోనూ అందుబాటులోకి తేవాలని, ఇందుకు రూ.50వేలు, పత్రిక కార్యాలయం నిర్వహణకు రూ.10వేలు వ్యక్తిగత విరాళం ప్రకటించిన వీరాంజనేయులు ఈమొత్తాన్ని పత్రిక నిర్వాహకులకు అందచేసారు. ఈకార్యక్రమంలో ఆపా ్కబ్ యండి ఆర్‌వి.రామకృష్ణ, నాబార్డ్ ప్రతనిధి చంద్రమూర్తి, వెటరన్ జర్నలిస్ట్ వడ్లమూడి పద్మావతి, ఆంధ్రప్రదేశ్ వర్కింగ్ జర్నలిస్ట్ యూనియన్ కార్యదర్శి చావా రవి, జర్నలిస్టులు దాసరి కేశవులు, ఇఫ్కో రవీంద్ర, జివి.రంగారెడ్డి, ప్రసాదరెడ్డి, టి.వి.నరసి ంహారావు, దుర్గరాజు స్వాతి, డి.రామారావు, వై.శ్రీనివాసరావు, శివప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

# గరివిడి పశువైద్య కళాశాలకు విసిఐ అనుమతి నో

- ఇంటర్ షిప్ విద్యార్థులకు గన్నవరం, ప్రొద్దుటూరు, తిరుపతి కళాశాలలకు తరలింపు
- త్వరలో పరిశీలనకు రానున్న వెటర్నరీ కౌన్సిల్ బృందం

**గరివిడి(విజయనగరం జిల్లా), జూన్ 9 ప్రభాతవార్త:** గరివిడి పశువైద్య కళాశాలకు ఈ ఏడాది కూడా వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (న్యూ ఢిల్లీ) అనుమతులు లభించలేదు. గతేడాది మాదిరిగానే ఇక్కడ ఇంటర్ షిప్‌కి వెళ్లే 70 మంది విద్యార్థులకు పశు వైద్య మండలి అనుమతులతో నిర్వహిస్తున్న తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలలకు విద్యార్థులను తరలించారు. గరివిడి పశువైద్య కళాశాల ఏర్పడి ఏళ్ళు గడుస్తున్నా ఇక్కడి కళాశాలలో మౌలిక సౌకర్యాలు లేమి, ఆపై తగినంత మంది బోధనా సిబ్బంది లేకపోవడంతో గత మూడు దఫాలుగా పరిశీలనకు విచ్చేసిన విసిఐ బృందం అనుమతులు మంజూరు చేయలేదు. న్యూ ఢిల్లీ నుండి వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా బృందం ఆగమనం సమయంలో తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పశువైద్య కళాశాలల నుండి డెప్యూటేషన్‌పై ప్రొఫెసర్లను తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం అధికారులు హుటాహుటిన గరివిడి కళాశాలకు పంపించడం, పరిశీలన అనంతరం మళ్ళీ ప్రొఫెసర్లను తిరిగి అదే కళాశాలలకు పంపించే నేపథ్యంలో విసిఐ బృందం అనుమతులు నిరాకరిస్తూనే ఉంది. గరివిడి పశువైద్య కళాశాలలో చదివే విద్యార్థుల భవితవ్యం దృష్ట్యా గత ఏడాది విద్యార్థులను ఇంటర్ షిప్ కోసం తిరుపతి, గన్నవరం, ప్రొద్దుటూరు పంపించారు. అక్కడ విద్యాభ్యాసం చేసినట్లుగా అనుమతులు కేంద్రం నుండి మంజూరు చేయించారు. ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు, పశు సంవర్ధక శాఖ మంత్రి కింజరాపు అచ్చెన్నాయుడులు కేంద్ర పశుసంవర్ధక శాఖ మంత్రి, ఇతర మంత్రులు, అధికారులతో సంభాషించి అనుమతులు పొందారు. ఈ ఏడాది కూడా గరివిడి పశువైద్య కళాశాలకు విసిఐ అనుమతులు రాకపోవడంతో అదే విధానాన్ని తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయం ఉన్నతాధికారులు అవలంబించి ఇక్కడి ఇంటర్ షిప్ విద్యార్థులను ఆ మూడు కళాశాలలకు పంపించారు. ఇప్పటికైనా విద్యార్థుల భవిష్యత్తు దృష్ట్యా గరివిడి పశువైద్యకళాశాలకు వెటర్నరీ కౌన్సిల్ ఆఫ్ ఇండియా అనుమతులు మంజూరు అయ్యేవిధంగా ప్రభుత్వం కృషి చేయాల్సిన అవసరం ఉంది. అలాగే గరివిడి కళాశాలలో విసిఐ అనుమతులు పొందేందుకు అవసరమైన మౌలిక సౌకర్యాలు కల్పించడంతో పాటు అవసరమైన ప్రొఫెసర్లను పూర్తి స్థాయిలో నియమించాల్సిన అవశ్యం ఎంతైనా ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, తిరుపతి పశువైద్య విశ్వవిద్యాలయ ఉన్నతాధికారులు చర్యలు చేపట్టాల్సి ఉంది. పశువైద్య విద్యార్థులు ప్రతీ ఏటా వేరే కళాశాలలకు ఇంటర్ షిప్‌కి వెళ్లే అవకాశం లేకుండా ప్రభుత్వం గరివిడి కళాశాలపై దృష్టి పెట్టాల్సిన అవసరం ఉంది. ఆ దిశగా ప్రభుత్వం, ఉన్నతాధికారులు కృషి చేస్తారని గంపెడాశతో గరివిడి పశువైద్య విద్యార్థులు నిరీక్షిస్తూ ఉన్నారు.

# అసోం వాసుల చెంతకు వెంకన్న

- స్థలం కేటాయింపుతో త్వరలో గువాహటిలో శ్రీవారి ఆలయ నిర్మాణం





**తిరుమల, జూన్ 9 ప్రభాతవార్తప్రతినిధి:** ఏడుకొండల వేంకటేశ్వరస్వామి ఆలయాలను హిందువులు ఉన్న ప్రతిచోటా నిర్మించాలని, ఆధ్యాత్మిక వాతావరణంతోబాటు సనాతన ధర్మాన్ని విస్తరించాలని టిటిడి భావిస్తోంది. ఇందులో భాగంగా ముఖ్యమంత్రి చంద్రబాబు సూచనల మేరకు దేశవ్యాప్తంగా రాష్ట్ర రాజధానుల్లో శ్రీవారి ఆలయాల నిర్మాణ కార్యక్రమం చేపడుతోంది. అసోం ప్రభుత్వం కేటాయించిన 10.33 ఎకరాల భూమిని మంగళవారం టిటిడి అధికారులు అధికారికంగా స్వాధీనం చేసుకున్నారు. అసోంలోని కామ్రూప్ జిల్లాలోని సోనాపూర్ సర్కిల్ పరిధిలో వేంకటేశ్వరస్వామి ఆలయ నిర్మాణం కోసం ఈ భూమిని అసోం ప్రభుత్వం కేటాయించింది. గతంలో టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, టిటిడి ఉన్నతాధికారులు అసోం ప్రభుత్వ ప్రతినిధులతో పలుమార్లు చర్చలు జరిపి ఆలయ నిర్మాణానికి అవసరమైన చర్యలు చేపట్టారు. చంద్రబాబు, టిటిడి పాలకమండలి కూడా అసోం ప్రభుత్వానికి ప్రత్యేకంగా లేఖలు రాశారు. ఈ నేపథ్యంలో టిటిడి ఎస్టేట్ అధికారి సువర్ణమ్మ, ఇఇ సురేంద్ర రెడ్డికి అసోం మెట్రోపాలిటన్ డిప్యూటీ కమిషనర్ ల్యాండ్ పొజెషన్ సర్టిఫికెట్ అందజేశారు. త్వరలో గువహటిలో భూమిపూజ చేసి శ్రీవారి ఆలయ నిర్మాణానం చేపట్టనున్నారు. ముఖ్యమంత్రి ప్రత్యేక చొరవతో ఈ ప్రక్రియ వేగవంతమై సఫలమవడం ఆనందదాయకమన్నారు. అసోం లో శ్రీవారి ఆలయ నిర్మాణం ఈశాన్య భారతం లో సనాతన ధర్మ ప్రచారానికి, ఆధ్యాత్మిక చైతన్య విస్తరణకు ఒక చారిత్రాత్మక మైలు రాయిగా నిలవనుందని ఛైర్మన్ పేర్కొన్నారు. ఈ కార్యక్రమానికి సహకరించిన ముఖ్యమంత్రి బిశ్వ శర్మకి, అసోం ప్రభుత్వానికి టిటిడి ఛైర్మన్ బీఆర్ నాయుడు, ఇఒ ముద్దాడ రవిచంద్ర టిటిడి తరఫున కృతజ్ఞతలు తెలియజేశారు.

# పెట్రోల్, డీజిల్, వంటగ్యాస్ ధరలు తగ్గించాలి

### తిరుపతిలో వామపక్ష పార్టీల రాస్తారోకో

**తిరుపతి, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** పెట్రోల్, డీజిల్, సిఎన్‌జీ, వంటగ్యాస్ ధరలను తగ్గించాలని డిమాండ్ చేస్తూ వామపక్ష పార్టీల రాష్ట్రవ్యాప్త పిలుపు మేరకు మంగళవారం తిరుపతిలో రాస్తారోకో నిర్వహించారు. తిరుపతి ఆర్టీసీ బస్టాండ్ వద్ద ఉన్న అంబేద్కర్ విగ్రహం నుండి సిపిఎం, సిపిఐ, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ, ఎస్‌యుసిఐ పార్టీల ఆధ్వర్యంలో ప్రదర్శన నిర్వహించి పూర్ణకుంభం సర్కిల్ వద్దకు చేరుకుని రాస్తారోకో చేపట్టారు. ఈ కార్యక్రమానికి సిపిఎం నగర కార్యదర్శి కే. వేణుగోపాల్, సిపిఐ నగర కార్యదర్శి జె. విశ్వనాథ్ అధ్యక్షత వహించారు. అనంతరం జరిగిన సభలో సిపిఎం జిల్లా కార్యదర్శి వందవాసి నాగరాజు, సిపిఐ రాష్ట్ర కార్యవర్గ సభ్యులు డి.రామానాయుడు, సిపిఐ(ఎంఎల్) న్యూడెమోక్రసీ నగర కార్యదర్శి వెంకటరత్నం, సుసి పార్టీ కార్యదర్శి హరీష్ ప్రసంగించారు. వక్తలు మాట్లాడుతూ 2014లో కేంద్రంలో బిజెపి ప్రభుత్వం అధికారంలోకి వచ్చినప్పటి నుంచి కార్పొరేట్ అనుకూల విధానాలను అమలు చేస్తూ ప్రజలపై భారాలు మోపుతోందని విమర్శించారు. ధరల నియంత్రణ, ఉపాధి కల్పన, ప్రజా సంక్షేమం పేరుతో ఇచ్చిన హామీలకు విరుద్ధంగా నేడు సామాన్య ప్రజల జీవనం మరింత భారంగా మారిందని అన్నారు. "ఒకే దేశం – ఒకే పన్ను" అంటూ జీఎస్టీని అమలు చేసిన కేంద్ర ప్రభుత్వం పెట్రోల్, డీజిల్‌ను మాత్రం జీఎస్టీ పరిధిలోకి తీసుకురాకపోవడం ప్రజలను మోసం చేయడమేనని అన్నారు. పెట్రోల్, డీజిల్ ధరల పెరుగుదల ప్రభావం కేవలం వాహనదారులకే పరిమితం కాదని, రైతుల సాగు ఖర్చులు, రవాణా వ్యయం, కూరగాయలు, పండ్లు, పాలు, నిత్యావసర వస్తువుల ధరలు పెరగడానికి ప్రధాన కారణమవుతోందని తెలిపారు. దీంతో ప్రతి కుటుంబంపై ప్రత్యక్షంగా, పరోక్షంగా ఆర్థిక భారం పడుతోందని పేర్కొన్నారు. రాష్ట్రంలోనూ, కేంద్రంలోనూ ఎన్డీఏ కూటమి ప్రభుత్వాలే అధికారంలో ఉన్నప్పటికీ ప్రజల సమస్యలకు పరిష్కారం చూపడంలో విఫలమయ్యాయని విమర్శించారు. వంటగ్యాస్ ధరలను తగ్గించి సబ్సిడీని పునరుద్ధరించాలని, ఆటో డ్రైవర్లు, రవాణా కార్మికులకు ప్రత్యేక రాయితీలు కల్పించాలని, నిత్యావసర వస్తువుల ధరలను నియంత్రించాలని నాయకులు డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో సిపిఎం నాయకులు ఎన్.మాధవ్, పి. సాయిలక్ష్మి ్మ, పి. బుజ్జి, పార్థసారథి, కేఆర్‌ఎస్ వాసు, సిపిఐ నాయకులు రాధాకృష్ణ, ఎన్.డి. రవి, చంద్రశేఖర్ రెడ్డి, శివ, నదియా, మంజుల, చలపతి, రామకృష్ణ తదితరులు పాల్గొన్నారు.

# దుర్గమ్మ ఆలయంలో నూతన అన్నప్రసాద, లడ్డూపోటు

**ఇంద్రకీలాద్రి, జూన్ 9 ప్రభాతవార్త:** దుర్గమ్మ ఆలయంలో నిర్మాణంలో వున్న నూతన అన్నప్రసాద భవనం, లడ్డూ పోటు భవనాలను ఇఓ వికె శీనా నాయక్, చైర్మన్ బొర్రా రాధాకృష్ణలు మంగళవారం పరిశీలించారు. ఇఇ ఎల్ రమాదేవిని అడిగి పనుల పురోగతి తెలుసుకున్నారు. గడువులోగా పనులు పూర్తవ్వాలని ఆదేశించారు. దుర్గమ్మ ఆలయంలో పరిసరాల పరిశుభ్రత, స్వచ్ఛమైన తాగునీరు భక్తులకందించే ఏర్పాట్లు ఖచ్చితంగా అమలు చేయాలని ఇఓ వికె శీనా నాయక్ అధికారులకు, సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన ఆలయ ప్రాంగణంలో పరిశీలన చేశారు. శివాలయం నుండి పూజా మండపం వద్దకు వచ్చే దారిలో అపరిశుభ్రత వుండడంతో వెంటనే పరిశుభ్రం చేయాలని ఆదేశించారు. ఆలయంలోని పలు ప్రాంతాల్లో వున్న మంచినీటి పంపులను పరిశీలించి స్వచ్ఛమైన తాగునీరు అందేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. చండీహోమం యాగశాల వద్ద భక్తులకు పలు సౌకర్యాలు కల్పించాలని, నిరంతరం ఆలయంలో దుర్గమ్మవారి నామస్మరణ వినిపంచేలా చర్యలు తీసుకోవాలని, రు.500 టికెట్ భక్తులకు లడ్డూ ప్రసాదం ఉచితంగా అందుకునే ఏర్పాటుపై మైక్‌లో సూచనలందించాలని ఆదేశాలిచ్చారు.

**వేదపాఠశాలలో ప్రవేశాలకు ఆసక్తులకు ఆహ్వానం:** శ్రీ దుర్గామల్లేశ్వర స్వామివార్ల దేవస్థానం ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న పోరంకి వేదపాఠశాలలో వేదం, స్మార్త కోర్సుల్లో చేరగోరు విద్యార్దులకు 2026-27 విద్యా సంవత్సరానికి నూతన ప్రవేశ దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఇఓ వికె శీనా నాయక్ తెలిపారు. ఋగ్వేదం, కృష్ణ యజుర్వేదం, సామవేదం, అధర్వణ వేదం, ఆపస్తంబ పౌరోహిత్య, స్మార్త విద్య కోర్సులు బోధిస్తామన్నారు. విధిగా ఉపనయనం జరిగి నిత్య సంధ్యావందనం చేస్తూ, తెలుగు చదవగలిగిన బాలురకు ప్రవేశార్హతలన్నారు. అలాగే 10 నుండి 12 వయస్సు విద్యార్దులకు వేదవిద్య ప్రవేశానికి, 10 నుండి 13 వయస్సు విద్యార్దులకు స్మార్త విద్యకు అర్హులన్నారు. విద్యార్దులకు ఉచిత భోజనం, వసతి, వస్త్రాలు, వైద్య సదుపాయాలతో పాటు కోర్సు పూర్తి చేసి తుది పరీక్షల్లో ఉత్తీర్ణులైన వారికి యోగ్యతాపత్రంతో పాటు రు.3లక్షల స్టైఫండ్ అందిస్తామన్నారు.



ఇఓ, చైర్మన్లు నిర్మాణంలో వున్న భవనాలు పరిశీలిస్తున్న దృశ్యం

**నిత్యాన్నదాన పథకానికి విరాళం:** దుర్గమ్మ ఆలయంలో జరుగుతున్న నిత్యాన్నదాన పథకానికి విజయవాడకు చెందిన గుండా కృష్ణ కార్తీక్ మంగళవారం రు.1,01,116ల విరాళమందించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అధికారులు దుర్గమ్మవారి చిత్రపటం, ప్రసాదం, శేషవస్త్రం అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

## నెల్లూరులో వివాహిత దారుణ హత్య

**నెల్లూరు క్రైం, జూన్ 9 ప్రభాతవార్త:** నగర శివారులోని పడారుపల్లి చెరువు కట్ట వద్ద మంగళవారం జరిగిన దారుణ ఘటన స్థానికంగా కలకలం రేపింది. వివాహేతర సంబంధం నేపథ్యంలో చోటుచేసుకున్న గొడవ, ఒక మహిళ ప్రాణాలను బలితీసుకుంది. తనను మోసం చేసిందన్న అనుమానంతో ప్రియుడే అత్యంత దారుణంగా ఆమెను కత్తితో పొడిచి చంపాడు. సేకరించిన సమాచారం మేరకు కనుపర్తిపాడు గ్రామానికి చెందిన రేవంతి (35)కి, సుమన్ అనే వ్యక్తితో 18 ఏళ్ల క్రితం వివాహమైంది. వీరికి ఇద్దరు సంతానం. అయితే, భర్తతో వచ్చిన మనస్పర్థల కారణంగా ఆమె గత కొంత కాలంగా పిల్లలతో కలిసి కనుపర్తిపాడులోనే ఒంటరిగా నివాసం ఉంటోంది. ఈ క్రమంలో స్థానికుడైన కడప శ్రీకాంత్ అనే యువకుడితో ఆమెకు పరిచయం ఏర్పడింది. ఈ పరిచయం కాలక్రమంలో వివాహేతర సంబంధానికి దారితీసింది. కొంతకాలం సజావుగా సాగిన వీరి బంధంలో రెండు నెలలుగా విభేదాలు మొదలయ్యాయి. రేవంతి మరో వ్యక్తితో ఫోన్‌లో మాట్లాడుతోందని, ఆమె ప్రవర్తనలో మార్పు వచ్చిందని శ్రీకాంత్ అనుమానించేవాడు. ఈ విషయమై వారిద్దరి మధ్య తరచూ గొడవలు జరుగు తుండేవి. తనను మోసం చేస్తోందన్న కోపంతో రేవంతిని అంతం చేయాలని శ్రీకాంత్ పథకం రచించాడు. మంగళవారం రేవంతి, శ్రీకాంత్ ఇద్దరూ నెల్లూరు నగరానికి కలిసి వెళ్లారు. తిరుగు ప్రయాణంలో, పడారుపల్లి చెరువు కట్ట సమీపానికి రాగానే మళ్లీ ఇద్దరి మధ్య వాగ్వాదం చోటుచేసుకుంది. కత్తితో శ్రీకాంత్ రేవంతిపై విచక్షణారహితంగా దాడి చేశాడు. తీవ్ర రక్తస్రావం కావడంతో ఆమె అక్కడికక్కడే ప్రాణాలు కోల్పోయింది. హత్య అనంతరం నిందితుడు శ్రీకాంత్ నేరుగా వేదాయపాలెం పోలీస్ స్టేషన్‌కు వెళ్లి, తాను రేవంతిని హత్య చేసినట్లు అంగీకరిస్తూ పోలీసుల ఎదుట లొంగిపోయాడు. సమాచారం అందుకున్న పోలీసులు వెంటనే సంఘటనా స్థలానికి చేరుకుని మృతదేహాన్ని స్వాధీనం చేసుకున్నారు. పోస్టుమార్టం నిమిత్తం మృతదేహాన్ని ప్రభుత్వ ఆసుపత్రికి తరలించి, కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. నిందితుడిని అదుపులోకి తీసుకుని విచారిస్తున్నారు.

## మానసిక ఒత్తిడిని అధిగమించేందుకు యోగా

**విజయవాడ, జూన్ 9, ప్రభాతవార్త :** నిత్యం ఎన్నో సమస్యలతో సతమత మవుతున్న ప్రజలు మానసిక ఒత్తిడి ని అధిమించేందుకు ప్రతిరోజూ 45 నిముషాలపాటు యోగాసనాలు వేయాలని ఎన్‌టిఆర్ జిల్లా కలెక్టర్ డాక్టర్ లక్ష్మీశా సూచించారు. విజయ వాడ బిఆర్‌టిఎస్ రోడ్డులో మంగళ వారం యోగాభ్యాసనలో ప్రజలు, అధికారులతో కలసి కలెక్టర్ పాల్గొని యోగాసనాలు వేసారు. ప్రతి ఒక్కరూ తమ జీవితంలో యోగాను బాగస్వామ్యం చేసుకోవాలన్నారు. యోగాసాధన వల్ల మానసిక ఒత్తిడిని అధిగమించటంతోపాటు, ఏకాగ్రత, ఆత్మవిశ్వాసం పెరుగుతా యన్నారు.

## వృద్ధురాలికి తిరుపతి కలెక్టర్ సాయం



**తిరుపతి, జూన్ 9 ప్రభాతవార్త ప్రతినిధి:** కర్ణాటక రాష్ట్రానికి చెందిన శారదమ్మ(75) దిక్కు తోచని స్థితిలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయం ఆవరణలో జిల్లా కలెక్టర్ డాక్టర్ సలిజామల వేంకటేశ్వర్‌ను కలసింది. ఆ వృద్ధురాలి దీనస్థితిని గమనించిన కలెక్టర్ కొడుకుస్థానంలో సాయమందించారు. తనకు ఆశ్రయం కల్పించాలని కోరగా వెనువెంటనే మానవతా దృక్పథంతో స్పందించిన జిల్లా కలెక్టర్ ఆమెకు ఆశ్రయం కల్పించారు. కర్ణాటక రాష్ట్రానికి చెందిన పి.శారదమ్మ తన భర్తతో కలసి బళ్ళారి పట్టణంలోని ఆలయ పరిసరాల్లో చిన్నపాటి పనులు చేసుకుంటూ జీవనం గడుపుకునేది. వారికి ఇద్దరు పిల్లలు ఉన్నారు. శారదమ్మ తన భర్త మరణించిన అనంతరం జీవనోపాధి లేక ఒంటరిగా మిగిలిపోయింది. దిక్కు తోచని స్థితిలో వేంకటేశ్వర స్వామి దిక్కని తలచి తిరుపతి నగరం చేరుకుంది. వృద్ధురాలి దయనీయ స్థితిని చూసిన పలువురు స్థానికులు జిల్లా కలెక్టర్ ను కలసి తన పరిస్థితిని వివరించాలని సూచించారు. ఈ నేపథ్యంలో మంగళవారం జిల్లా కలెక్టర్ కార్యాలయ ఆవరణలో జిల్లా కలెక్టర్ ను కలిసిన వృద్ధురాలు తన భర్త మరణానంతరం తన ఇద్దరు పిల్లలు తనకు ఆశ్రయం కల్పించలేదని, దుర్భర పరిస్థితిలో తిరుపతి చేరుకున్నానని తెలిపింది. అనంతరం తిరుపతిలోని పలు వృద్ధాశ్రమాలను ఆశ్రయించగా తనకు ఆశ్రయం కల్పించడానికి వృద్ధాశ్రమాలు తిరస్కరించాయని తెలిపారు. పేద ప్రజల కష్టానికి చలించే జిల్లా కలెక్టర్ ఉన్నారని స్థానిక ప్రజల సూచనలతో తిరుపతి జిల్లా సచివాలయానికి చేరుకున్నానని, తనకు ఆశ్రయం కల్పించాలని జిల్లా కలెక్టర్‌కు ఆమె విన్నవించుకుంది. వృద్ధురాలి నిస్సహాయ పరిస్థితి, కన్నీటిని చూసిన జిల్లా కలెక్టర్ చలించి మానవతా దృక్పథంతో సహాయక చర్యలకు పూనుకున్నారు. వెంటనే బీ.టి.ఆర్. కాలనీలో ఉన్న రాష్ట్రీయ సేవా సమితి ప్రతినిధులను సంప్రదించి వృద్ధురాలిని వృద్ధాశ్రమంలో చేర్పించి ఆశ్రయం, వైద్యం, అవసరమైన సంరక్షణ చర్యలు చేపట్టాలని దివ్యాంగులు, ట్రాన్స్‌జెండర్లు వయోవృద్ధుల సంక్షేమ శాఖ అధికారిని ఆదేశించారు. జిల్లా కలెక్టర్ ఆదేశాలతో తక్షణమే ఆమెను రాష్ట్రీయ సేవా సమితి వృద్ధాశ్రమంలో చేర్పించారు. తనకు ఆశ్రయం కల్పించిన జిల్లా కలెక్టర్‌కు అధికారులకు ధన్యవాదాలు తెలిపింది. వృద్ధులు నిరాశ్రయుల సంక్షేమానికి ప్రాధాన్యత ఇస్తూ అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు జిల్లా యంత్రాంగం కట్టుబడి ఉందని ఈ సందర్భంగా కలెక్టర్ డాక్టర్ వెంకటేశ్వర్ తెలిపారు.

## గంజాయి తరలిస్తున్న ఇద్దరు అరెస్ట్

### 140 కేజీల గంజాయి, లారీ స్వాధీనం



**విజయవాడ, జూన్ 9 ప్రభాతవార్త:** విజయవాడ పటమట పోలీసులు, రాష్ట్ర ఈగల్ బృందం సంయుక్తంగా మంగళవారం జరిపిన తనిఖీలో అక్రమంగా గంజాయి తరలిస్తున్న లారీతో పాటు, రూ.70 లక్షల విలువైన 140 కేజీల గంజాయిని విజయవాడ పోలీసులు స్వాదీనం చేసుకున్నారు. పక్కా సమాచారం మేరకు విజయవాడ, పటమట పోలీస్ స్టేషన్ పరిదిలోని నిడమానూరు ప్రాంతంలో పటమట ఇన్స్పెక్టర్పవన్ కిషోర్, ఈగల్ టీం ఇన్స్పెక్టర్ రవీంద్ర గారు వారి వారి సిబ్బందితో కలిసి వాహనాలు తనిఖీ చేస్తున్న సమయంలో ఒక లారీని ఆపి వాహనాన్ని తనిఖీ చేయగా అందులో గంజాయి కలిగిన బ్యాగులను గుర్తించి డ్రైవరు ను అదుపులోనికి తీసుకున్నట్లు డి.సి.పి. కృష్ణ కాంత్ పటేల్,ఈగల్ ఎస్.పి. నగేష్ మంగళవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో తెలిపారు. తమిళనాడు, ధర్మపురి జిల్లా, హరూర్ ఏరియాకు చెందిన సెల్వం (39), పట్టుకోనంపట్టి ఏరియాకు చెందిన టి.ప్రదీప్ (36)ఇద్దరూ తమిళనాడులోని ఒక సరుకు రవాణా సంస్థలో లారీ డ్రైవర్లు గా పనిచేస్తున్నారు, వీరు ఒరిస్సాలో స్టీల్ కాయిల్స్ లోడ్ వేసుకుని వస్తుండగా శ్రీకాకుళం జిల్లా సమీపంలో ఒక వ్యక్తి సేల్వంతో మాట్లాడి గంజాయిని కోయంబత్తూరుకు రవాణా చేస్తే 30 వేల రూపాయలను ఇస్తామని చెప్పగా ఆ డబ్బులకు ఆశ పడిన డ్రైవర్ సెల్వం తనతోపాటు వస్తున్న మరో డ్రైవర్ ప్రదీప్ లారీలో లోడ్ వేయించి ఇద్దరూ ఒకరి వెనకాల మరొక లారీని నడుపుకుంటూ కోయంబత్తూరు వెళ్తున్నారు. ఈ క్రమంలో మంగళవారం తెల్లవారుజామున నిడమానూరులో పోలీసులు లారీని ఆపి తనిఖీ చేయగా గంజాయి బయటపడింది. ఇద్దరు నింధితులను అదుపులోకి తీసుకుని సుమారు 7 లక్షల రూపాయల విలువైన గంజాయిని, గంజాయి తరలించడానికి ఉపయోగించిన ఒక లారీని స్వాధీనం చేసుకుని అరెస్టు చేసినట్లు డిసిపి తెలిపారు. ఈ కేసులో మరో ముగ్గురు నిందితులు పరారీలో ఉన్నారని తెలిపారు. గంజాయి సరఫరా చేస్తున్న ఒరిస్సా, గజపతి జిల్లాకు చెందిన ఆరూప్ సింగ్ (24), రాజేష్ కుమార్ సింగ్ (25), కేరళ, మళప్పురం జిల్లా కు చెందిన మొహమ్మద్ సోహెల్ (27) పరారీలో ఉన్నట్లు పోలీసులు తెలిపారు. ఆంధ్రప్రదేశ్ రాష్ట్రాన్ని మాదకద్రవ్య రహిత రాష్ట్రంగా మార్చాలనే ఉద్దేశంతో రాష్ట్ర డి.జి.పి., ఎన్.టి.ఆర్ జిల్లా పోలీస్ కమీషనర్, ఈగల్ టీంల పర్యవేక్షణలో గంజాయి రవాణా, విక్రయం, కొనుగోలు, సరఫరాలపై పటిష్టమైన నిఘా ఏర్పాటు చేసినట్లు వారు డి.సి.పి. తెలిపారు. విలేకరుల సమావేశంలో ఏ.డి.సి.పి. ఎన్.బి.ఎం. మురళి కృష్ణ గారు, సెంట్రల్ ఏ.సి.పి. దామోదర్, పటమట ఇన్స్పెక్టర్ పవన్ కిషోర్, ఈగల్ ఇన్స్పెక్టర్ రవీంద్ర, సిబ్బంది పాల్గొన్నారు.

## 53 కిలోల గంజాయి పట్టివేత

### నిందితుడు అరెస్టు.. కారు, మొబైల్ సీజ్



**నల్లమాడ జూన్ 9 ప్రభాతవార్త:** శ్రీసత్యసాయి జిల్లా నల్లమాడ మండల పరిధిలోని పులగంపల్లి వద్ద మంగళవారం కారులో అక్రమంగా తరలిస్తున్న 53కిలోల గంజాయిని స్వాదీనం చేసుకున్నట్లు డీఎస్పీ శివనారాయణ, సిఐ శ్రీనివాసులు తెలిపారు. గంజాయిని అక్రమంగా తరలిస్తున్నారని సమాచారం రావడంతో జిల్లా ఎస్పీ సతీష్ కుమార్, డి.ఎస్.పి శివన్నారాయణ ఆదేశాల మేరకు తమ ఆధ్వర్యంలో నల్లమడ ఎస్సై సతీష్, సిబ్బందితో కలిసి మంగళవారం పులగంపల్లి క్రాస్‌లో ప్రత్యేక నిఘ ఏర్పాటు చేశారు. కదిరి నుంచి ఓడిసి వైపు అనుమానస్పదంగా వెళుతున్న హుండాయ్ ఏపీ 39 ఎన్ఏ 7507 నెంబరు గల కారును తనిఖీ చేయగా కార్ డిక్కీలో 24 ప్యాకెట్లలో 53 కిలోల గంజాయి దాచి ఉండగా గుర్తించి స్వాధీనం చేసుకున్నట్లు తెలిపారు. కారు డ్రైవింగ్ చేస్తూ గంజాయి తరలిస్తున్న నల్లమాడ మండలం సి రెడ్డివారిపల్లికి చెందిన బి వెంకటరమణను అదుపులోకి తీసుకొని కారు, మొబైల్ ఫోన్‌ను సీజ్ చేసినట్లు సిఐ తెలిపారు. ప్రాథమిక దర్యాప్తులో సిరెడ్డివారిపల్లికి చెందిన మల్లికార్జున ఆదేశాల మేరకు వెంకటరమణ గంజాయిని తరలిస్తున్నట్లు తెలిసిందని పోలీసులు తెలిపారు. కేసు నమోదు చేసి నిందితుడిని రిమాండ్ కు తరలించినట్లు వారు తెలిపారు. ఈ వ్యవహారంలో మరికొందరి ప్రమేయం ఉన్నట్లు అనుమానాలు వ్యక్తం అవుతున్నందున తదుపరి దర్యాప్తు కొనసాగుతోందని సిఐ వివరించారు.





## మృతుల కుటుంబాలకు లోకేష్ భరోసా

(ప్రభాతవార్త -విశాఖపట్నం)

విశాఖ స్టీల్‌ప్లాంట్ ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబ సభ్యులను రాష్ట్ర మంత్రి నారా లోకేష్ పరామర్శించారు. కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాసవర్మ, టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాసరావు, చింతకాయల విజయ్, హోంమంత్రి వంగలపూడి అనిత తదితరులతో కలిసి బాధిత కుటుంబాలను ప్రమాదం జరిగిన తీరును అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు.

### మృతుల కుటుంబాలకు

# రూ.25 లక్షల పరిహారం, ఉద్యోగం

- 36 ఏళ్ల చరిత్రలో విశాఖ స్టీల్ ప్లాంట్ లో ఇలాంటి ఘటన జరగలేదన్న పవన్ కళ్యాణ్



విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర పారిశ్రామిక ప్రమాదంలో ఎనిమిది మంది కార్మికులు మృతి చెందడం, మరో ఆరుగురు తీవ్రంగా గాయపడడం రాష్ట్రవ్యాప్తంగా విషాదాన్ని నింపింది. ప్రమాద స్థలాన్ని సందర్శించిన ఆంధ్రప్రదేశ్ ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. మృతుల కుటుంబాలకు రూ.25 లక్షల చొప్పున పరిహారం, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించనున్నట్లు ప్రకటించారు. మంగళవారం ఉదయం ప్రమాదం జరిగిన స్టీల్ మెల్టింగ్ షాప్‌ను పరిశీలించిన అనంతరం మీడియాతో మాట్లాడిన ఆయన, తీవ్రంగా గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న కార్మికులకు ఒక్కొక్కరికి రూ.10 లక్షల చొప్పున తక్షణ ఆర్థిక సాయం అందజేస్తామని తెలిపారు. గాయపడిన వారి వైద్య ఖర్చులన్నింటినీ ప్లాంట్ యాజమాన్యమే భరిస్తుందని స్పష్టం చేశారు. ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన శాశ్వత ఉద్యోగుల కుటుంబాలకు పదవీ విరమణ ప్రయోజనాల కింద సుమారు రూ.1.72 కోట్లు, కాంట్రాక్ట్ ఉద్యోగుల కుటుంబాలకు రూ.45.75 లక్షలు అందజేస్తామని వెల్లడించారు. బాధిత కుటుంబాల పిల్లల విద్యాభ్యాసం నిరంతరాయంగా కొనసాగేం దుకు అవసరమైన సహకారం అందిస్తామని చెప్పారు. ప్రమాదంపై సమగ్ర విచారణ కోసం బొకరో స్టీల్ ప్లాంట్ కు చెందిన త్రిసభ్య కమిటీని నియమించినట్లు పవన్ కళ్యాణ్ తెలిపారు. ప్రమాదానికి దారితీసిన కారణాలు, భద్రతా ప్రమాణాల అమలులో జరిగిన లోపాలు, సాంకేతిక సమస్యలు వంటి అంశాలను అన్ని కోణాల్లో పరిశీలించి కమిటీ నివేదిక సమర్పిస్తుందని చెప్పారు. ఆ నివేదిక ఆధారంగానే తదుపరి చర్యలు తీసుకుంటామని వెల్లడించారు. ఈ సందర్భంగా కార్మికులతో మాట్లాడిన విషయాన్ని ప్రస్తావిస్తూ, ప్లాంట్‌లో భద్రతా ప్రమాణాలు సక్రమంగా పాటించడం లేదని వారు ఆవేదన వ్యక్తం చేశారని తెలిపారు. పాత యంత్రాలు, (తరువాయి 8వ పేజీలో)

### విశాఖ ఉక్కు ప్రమాద బాధిత కుటుంబాలకు

# అండగా ప్రభుత్వం

- మంత్రి నారా లోకేష్
- బొకారో నుండి విశాఖపట్నం చేరుకున్న త్రీ మెన్ కమిటీ సభ్యులు



విశాఖపట్నం, జూన్ 9 ప్రభాతవార్త

విశాఖ ఉక్కు కర్మాగారంలో జరిగిన దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబాలకు రాష్ట్ర ప్రభుత్వం పూర్తి స్థాయిలో అండగా ఉంటుందని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు. కేజిహెచ్ మార్చురీ వద్ద మృతుల కుటుంబాలను, వివిధ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతోన్న బాధితులను ఆయన మంగళ వారం పరామర్శిం చారు. అనంతరం స్టీల్ ప్లాంట్ లో ప్రమాద స్థలాన్ని పరిశీలించారు. ఈ పర్యటనలో కేంద్ర ఉక్కు శాఖ సహాయ మంత్రి భూపతి రాజు శ్రీనివాస్ వర్మ, హోంమంత్రి వంగలపూడి అనిత, విశాఖ పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాస్‌లు వున్నారు. అనంతరం నారా లోకేష్ విలేకరులతో మాట్లాడుతూ ప్రమాదం జరిగిన వెంటనే ప్రభుత్వం అత్యంత వేగంగా స్పందించిందన్నారు. ఘటన జరిగిన కొద్ది సేపటికే ముఖ్యమంత్రి నారా చంద్రబాబునాయుడుకి సమాచారం అందించడంతో పాటు సంబంధిత అధికారులు, ప్రజాప్రతినిధులతో సమన్వయం చేసి సహాయక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. బాధిత కుటుంబాలకు కేంద్ర ఉక్కు శాఖ మంత్రి హెచ్.డి.కుమారస్వామి ప్రకటించిన రూ.25 లక్షల ఆర్థిక సాయాన్ని త్వరితగతిన అందించే చర్యలు జరుగుతున్నాయని వెల్లడించారు. ప్రభుత్వం ఇచ్చిన హామీలను తప్పకుండా అమలు చేస్తుందని స్పష్టం చేశారు. విశాఖ ఉక్కు కర్మాగారం సంక్షోభంలో ఉన్న సమయంలో ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వంతో నిరంతర చర్చలు జరిపి కర్మాగారానికి ఊరట కల్పించేలా చర్యలు తీసుకున్నామని మంత్రి గుర్తుచేశారు. కర్మాగార పరిరక్షణ విషయంలో రాష్ట్ర ప్రభుత్వానికి ఉన్న చిత్తశుద్ధి గతంలోనూ, ప్రస్తుతం కూడా స్పష్టంగా కనిపిస్తోందన్నారు. ఈ ప్రమా దానికి సంబంధించిన కారణాలను నిర్ధారించేందుకు నిపుణుల కమిటీ సమగ్ర విచారణ నిర్వహిస్తోందని, (తరువాయి 8వ పేజీలో)



కిమ్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితుడితో మాట్లాడుతున్న లోకేష్



సెవెన్ హిల్స్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శిస్తున్న లోకేష్

### క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి: లోకేశ్

గాజువాక,జూన్ 9,ప్రభాతవార్త :

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో చోటుచేసుకున్న దురదృష్టకర అగ్నిప్రమాదంలో గాయపడి, నగరంలోని కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రులను రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేశ్ పరామర్శించారు. ప్రమాదంలో తీవ్రంగా గాయపడిన ఆర్.మల్లికార్జున రావు, గుడివాడ,అర్జున అప్పారావు, బి.సత్యానందలను ఆయన ఆసుపత్రిలో కలిసి, వారి ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. బాధితులకు అందుతున్న క్షతగాత్రులకు ఎలాంటి లోటు లేకుండా అత్యంత మెరుగైన, నాణ్యమైన వైద్య సేవలు అందించాలని వైద్యులను ఆదేశించారు. వైద్యానికి అయ్యే ఖర్చు (తరువాయి 8వ పేజీలో)



కేజీహెచ్‌లో స్టీల్ ప్లాంట్ బాధిత కుటుంబ సభ్యులతో మాట్లాడుతున్న మంత్రి లోకేష్

### విదేశాల నుంచి రాగానే

# విశాఖకు పరుగులు

### విషాద వేళ బాధిత కుటుంబాలకు అండగా నిలిచిన లోకేష్

(ప్రభాతవార్త-విశాఖపట్నం)



ప్రజా సమస్యల పట్ల తన నిబద్ధతను మరోసారి చాటుకున్నారు మంత్రి నారా లోకేష్. విదేశీ పర్యటన ముగించుకుని రాష్ట్రానికి చేరుకున్న వెంటనే విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం గురించి తెలుసుకున్న ఆయన, ఆలస్యం చేయకుండా హుటాహుటిన విశాఖపట్నానికి చేరుకుని బాధిత కుటుంబాలను మంగళవారం పరామర్శించారు. వ్యక్తిగత, రాజకీయ కార్యక్రమాల కంటే బాధితుల కష్టాన్ని ముందుగా గుర్తించి వారి వద్దకు చేరుకోవడం విశేషంగా నిలిచింది. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన కార్మికుల కుటుంబ సభ్యులను కలిసి వారి బాధను పంచుకున్న లోకేష్, ఈ క్లిష్ట సమయంలో ప్రభుత్వం అండగా ఉంటుందని భరోసా ఇచ్చారు. కుటుంబ సభ్యుల ఆవేదనను ఓపికగా విన్న ఆయన, వారి సమస్యలను అడిగి తెలుసుకుని ధైర్యం చెప్పారు. ప్రమాదంలో కుటుంబ పెద్దలను కోల్పోయిన వారికి సానుభూతి తెలియజేస్తూ, ప్రభుత్వం తరఫున అవసరమైన సహాయ సహకారాలు అందించేందుకు చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు. ఈ సందర్భంగా కేంద్ర ఉక్కు శాఖ సహాయమంత్రి భూపతి రాజు శ్రీనివాస వర్మ , రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, మంత్రి గుమ్మిడి సంధ్య రాణి, ఎంపీ ఎం. శ్రీభరత్ తదితరులు కూడా ఆయన వెంట ఉన్నారు. బాధిత కుటుంబాలతో మాట్లాడిన లోకేష్, వారి భవిష్యత్ భద్రత, పిల్లల విద్య, కుటుంబ అవసరాలపై ప్రత్యేక దృష్టి సారించాలని అధికారులకు సూచించినట్లు సమాచారం. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న వారి ఆరోగ్య పరిస్థితిపై కూడా లోకేష్ ఆరా తీశారు. వైద్యులతో మాట్లాడి వారికి అత్యుత్తమ వైద్యం అందించాలని కోరారు. గాయపడిన కార్మికులు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షిస్తూ, అవసరమైన వైద్య సహాయంలో ఎలాంటి లోటు ఉండకూడదని స్పష్టం చేశారు. ప్రమాదం వెనుక ఉన్న కారణాలను పూర్తిగా వెలికితీసేందుకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న లోకేష్, విచారణ కమిటీ నివేదిక వచ్చిన తర్వాత బాధ్యులపై తగిన చర్యలు తీసుకుంటామని తెలిపారు. భవిష్యత్తులో ఇలాంటి (తరువాయి 8వ పేజీలో)

### అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పతక విజేత

## చైత్రదీపికకు స్పీకర్ అభినందనలు

విశాఖపట్నం జూన్ 9 (ప్రభాత వార్త )

ఇటీవల తైవాన్‌లో జరిగిన అంతర్జాతీయ స్థాయి రోలర్ స్కేటింగ్ ఛాంపియన్‌షిప్ పోటీల్లో అద్భుత ప్రతిభ కనబరిచి పతకాలు కైవసం చేసుకున్న నగరానికి చెందిన పి.చైత్రదీపికను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు ఘనంగా అభినందించారు. విజయవాడలోని స్పీకర్ క్యాంపు కార్యాలయంలో ఆయనను చైత్రదీపిక మర్యాదపూర్వకంగా కలి శారు. ఇటీవల తైవాన్ వేదికగా జరిగిన '2026 తైవాన్ ఆర్టిస్టిక్ రోలర్ స్కేటింగ్ ఓపెన్ కాంపి టీషన్స్'లో చైత్రదీపిక (తరువాయి 8వ పేజీలో)



### విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో ఘోర ప్రమాదం

#### అవంతి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి



విశాఖపట్నం, ప్రభాత వార్త జూన్, 9:

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో చోటుచేసుకున్న ఘోర ప్రమాదంపై మాజీ మంత్రి అవంతి శ్రీనివాసరావు తీవ్ర దిగ్భ్రాంతి వ్యక్తం చేశారు. ఈ దుర్ఘటనలో తొమ్మిది మంది కార్మికులు మృతి చెందడంపై ఆయన తీవ్ర ఆవేదన వ్యక్తం చేశారు. బాధిత కుటుంబాలకు తన ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రమాదంలో గాయపడిన క్షతగాత్రులకు మెరుగైన వైద్య సహాయం అందేలా ప్రభుత్వం అన్ని రకాల చర్యలు తీసుకోవాలని కోరారు.

### మూడు జిల్లాలకు

# గేమ్‌చేంజర్‌గా సెమీ రింగ్ రోడ్

### నెలాఖరులోపు తుది అలైన్మెంట్ ప్లాన్ సిద్ధం : వీఎంఆర్డీఏ మెట్రోపాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్

విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త :

విశాఖపట్నం, విజయనగరం, అనకాపల్లి జిల్లాల భవిష్యత్ రవాణా అవసరాలను దృష్టిలో పెట్టుకుని ప్రతిపాదించిన 120 మీటర్ల వెడల్పు కలిగిన సెమీ రింగ్ రోడ్ ప్రాజెక్టు పనులను వేగవంతం చేయాలని వీఎంఆర్డీఏ మెట్రో పాలిటన్ కమిషనర్ ఎన్.తేజ్ భరత్ ఆదేశించారు. ఈ మేరకు రాంబిల్లి నుంచి భోగాపురం వరకు నిర్మించనున్న సెమీ రింగ్ రోడ్ తుది అలైన్మెంట్ ప్రణాళికను ఈ నెలాఖరులోగా సిద్ధం చేయాలని సంబంధిత కన్సల్టెంట్‌కు సూచించారు. రాష్ట్ర ప్రభుత్వం, ముఖ్యమంత్రి ఆదేశాల మేరకు చేపడుతున్న ఈ కీలక ప్రాజెక్టు పురోగతిని సమీక్షించిన మెట్రోపాలిటన్ కమిషనర్, భవిష్యత్తులో పెరుగుతున్న ట్రాఫిక్ ఒత్తిడిని



దృష్టిలో ఉంచుకుని ప్రణాళికలను రూపొందించాలని అధికారులను ఆదేశిం చారు. అలాగే రహదారి మార్గంలో అవసర మయ్యే మైనర్, మేజర్ వంతెనల నిర్మాణ అవసరాలను గుర్తించి నివేదికలో పొందు పరచాలని సూచించారు.

ప్రాజెక్టు పరిధిలో అభివృద్ధి చేయాల్సిన భూముల వివరాలను కూడా సమగ్రంగా తుది ప్లాన్‌లో చేర్చాలని స్పష్టం చేశారు. ఓఎస్‌డీ కృష్ణ నాయక్, ప్రధాన ఇంజనీర్ వినయ్ కుమార్, పర్యవేక్షణ ఇంజనీర్ మధుసూదన రావు, కార్యనిర్వహక ఇంజనీర్ దుర్గాప్రసాద్, ప్లానింగ్ అధికారులు మౌనిక, రోహిణి, కిషోర్‌తో పాటు ఎస్టేట్ విభాగ అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

### విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటన

#### విచారణకు 'త్రిసభ్య కమిటీ'..

#### రంగంలోకి కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు!



8లో

## కనులు విందుగా వార్షిక పైడితల్లమ్మ పండగ

- మొక్కులు చెల్లించుకున్న భక్తులు
- అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించిన ఎమ్మెల్యే గంటా శ్రీనివాస్‌రావు, ఈవో దంపతులు



సింహాచలం, ప్రభాత వార్త జూన్ 9:

ఏడు గ్రామాల ఆరాధ్య దేవత సింహాద్రి అప్పన్న సోదరి శ్రీ పైడితల్లమ్మవారి పండగ అంగరంగ వైభవంగా మంగళవారం ఉదయం ప్రారంభమైంది. గ్రామాచారాన్ని అనుసరించి తెల్లవారుజాము నుండి అమ్మవారికి అభిషేకం, ధూప, దీప, నైవేద్యాలతో అర్చకులు విశేష పూజలు చేశారు. దేవస్థానం తరపున ఈవో జె. వెంకట్రావు దంపతులు అమ్మవారికి నూతన వస్త్రాలు సమర్పించారు. భీమునిపట్నం శాసన సభ్యుడు గంటా శ్రీనివాసరావు, దేవస్థానం ధర్మకర్తల మండలి సభ్యులు, స్థానిక నేతలు అమ్మవారిని దర్శించుకున్నారు. ఈవో, అర్చకులు (తరువాయి 8వ పేజీలో)

## ఏపీఎల్ క్రికెట్ పోటీలను ప్రారంభించిన గంటా

మధురవాడ, ప్రభాత వార్త జూన్ 9:



ఏసీఏ - వీడీసీఏ స్టేడియంలో ఆంధ్ర ప్రీమియర్ లీగ్ (ఏపీఎల్) క్రికెట్ పోటీలను భీమిలి ఎమ్మెల్యే గంటా శ్రీనివాసరావు మంగళవారం ప్రారంభించారు. సింహాద్రి వైజాగ్ లయన్స్, కాకినాడ కింగ్స్ తలపడిన మొదటి రోజు మ్యాచ్ లో టాస్ వేశారు. ఈ రెండు టీంలతో పాటు తుంగభద్ర వారియర్స్, కాపిటల్ అమరావతి రాయల్స్, విజయవాడ సన్ షైనర్స్, భీమవరం బుల్స్, రాయల్స్ ఆఫ్ రాయలసీమ టీంలు పాల్గొంటున్నాయి. ఈనెల 30 వ తేదీ వరకూ విశాఖపట్నం, కడప, మంగళగిరిలలో ఏపీఎల్ మ్యాచ్ లు క్రికెట్ ప్రియులకు వినోదం అందించనున్నాయని గంటా ఈ సందర్భంగా మాట్లాడుతూ చెప్పారు. ఐపీఎల్ మాదిరిగా ఏపీఎల్ ను కూడా ఆదరించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో గవర్నింగ్ కౌన్సిల్ చైర్మన్, ఎమ్మెల్యే సుజయ్ కృష్ణ రంగారావు, టీమిండియా టీ 20 మాజీ మేనేజర్ ప్రశాంత్ తదితరులు పాల్గొన్నారు.

## స్టీల్ ప్లాంట్ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉంది

### బొత్స సత్యనారాయణ

విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త:

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘోర ప్రమాదం వెనుక కుట్ర కోణం దాగి ఉందని, సంస్థ ప్రైవేటీకరణ ప్రయత్నాల ఫలితంగానే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని శాసన మండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ ఆరోపించారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో గాయపడి నగరంలోని కింగ్ జార్జ్ హాస్పిటల్ లో చికిత్స పొందుతున్న బాధితులను మాజీ మంత్రులు కురసాల కన్నబాబు, గుడివాడ అమర్నాథ్, జిల్లా పార్టీ అధ్యక్షుడు కె కె రాజు తదితరులతో కలిసి పరామర్శించిన (తరువాయి 8వ పేజీలో)

#### ప్రైవేటీకరణ కుట్రలతోనే ప్రమాదాలు

#### మృతుల కుటుంబాలకు రూ. కోటి పరిహారం ఇవ్వాలి



## క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించండి: లోకేశ్

(7వ పేజీ తరువాయి)

గురించి ఆందోళన చెందాల్సిన అవసరం లేదని, యాజమాన్యమే పూర్తి బాధ్యత వహిస్తుందని స్పష్టం చేశారు.

**అధైర్యపడొద్దు.. అండగా ఉంటాం!...**

అనంతరం ఆసుపత్రి ప్రాంగణంలో ఉన్న బాధిత కుటుంబ సభ్యులను మంత్రి లోకేశ్ కలిసి ఓదార్చారు. ప్రమాద వివరాలు అడిగి తెలుసుకుని వారికి ధైర్యం చెప్పారు. ఈ క్లిష్ట సమయంలో కూటమి ప్రభుత్వం తరఫున అన్ని విధాలా అండగా ఉంటామని, బాధితులెవరూ అధైర్యపడాల్సిన అవసరం లేదని భరోసా ఇచ్చారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు సమన్వయంతో బాధితులకు ఇప్పటికే భారీ సహాయక ప్యాకేజీని ప్రకటించాయని, అది త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.

**తరలివచ్చిన ప్రజాప్రతినిధులు...**

మంత్రి లోకేశ్ పరామర్శ సమయంలో ఆయన వెంట కేంద్ర ఉక్కు, భారీ పరిశ్రమల శాఖ సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మ, రాష్ట్ర హోంమంత్రి వంగలపూడి అనిత, గిరిజన సంక్షేమ శాఖ మంత్రి శత్రుచర్ల సంధ్యారాణి, విశాఖపట్నం ఎంపీ ఎం.శ్రీభరత్, టీడీపీ రాష్ట్ర అధ్యక్షుడు, గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు తదితరులు ఉన్నారు. ప్రజాప్రతినిధులంతా బాధిత కుటుంబాలకు తమ ప్రగాఢ సానుభూతిని తెలియజేస్తూ, ప్రభుత్వ పరంగా అన్ని రకాల సహాయ సహకారాలు అందిస్తామని స్పష్టం చేశారు.

### విదేశాల నుంచి రాగానే
## విశాఖకు పరుగులు

(7వ పేజీ తరువాయి)

ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాల అమలుపై ప్రత్యేక దృష్టి పెట్టనున్నట్లు చెప్పారు. విదేశీ పర్యటన నుంచి తిరిగి వచ్చిన వెంటనే విశాఖకు చేరుకుని బాధిత కుటుంబాలను పరామర్శించడం, వారి బాధను పంచుకోవడం, ధైర్యం చెప్పడం ద్వారా లోకేష్ తన మానవీయ వైఖరిని మరోసారి చాటుకున్నారని స్థానికులు, కార్మిక వర్గాలు అభిప్రాయపడుతున్నాయి. విషాద సమయంలో ప్రజల పక్కన నిలబడటమే ప్రజా ప్రతినిధి బాధ్యత అని ఆయన చర్యల ద్వారా స్పష్టమైందని పలువురు పేర్కొంటున్నారు. స్టీల్ ప్లాంట్ ప్రమాదం రాష్ట్రాన్ని దిగ్భ్రాంతికి గురిచేసిన వేళ, బాధిత కుటుంబాలకు ప్రత్యక్షంగా చేరుకుని భరోసా ఇవ్వడం ద్వారా లోకేష్ చూపిన స్పందన వారికి మానసిక ధైర్యాన్ని ఇచ్చిందనే అభిప్రాయం వ్యక్తమవుతోంది. ఆయన పరామర్శతో బాధిత కుటుంబాలు కొంత ఊరట పొందినట్లు స్థానికులు చెబుతున్నారు.

## కనులు విందుగా వార్షిక పైడితల్లమ్మ పండగ

(7వ పేజీ తరువాయి)



ఎమ్మెల్యే కి స్వాగతం పలికి ఆలయ మర్యాదలు చేశారు. చుట్టు పక్కల ప్రాంతాల నుండే కాకుండా రాష్ట్రం నలుమూలల్లో ఉన్న అడివివరం ఆడపడుచులు తమ పుట్టిల్లకు వచ్చి అమ్మవారికి పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించుకుని మొక్కులు చెల్లించుకున్నారు. ఉదయం నుండి అమ్మవారి ఆలయం భక్తులతో కిటకిటలాడింది. ఎండ తీవ్రతను దృష్టిలో

ఉంచుకుని దేవస్థానం షామియానాలు ఏర్పాటు చేసినప్పటికీ ఉక్కపోతతో భక్తులకు ఇబ్బంది తప్పలేదు. చంటి పిల్లలతో వచ్చిన భక్తులను అధికారులు పక్క నుండి పంపించి కాస్తా ఊరటనిచ్చారు. దేవస్థానంతో పాటు స్వచ్ఛంద సంస్థలు భక్తులకు పులిహోర, చక్కెర పొంగలి ప్రసాదాలను, శీతల పానీయాలు పంపిణీ చేశారు. నేల వేషాలు, పులివేషాలతో అడివివరం గ్రామంలో సందడి నెలకొంది. అమ్మవారి అలంకరణ ప్రత్యేక ఆకర్షణగా నిలిచింది. గ్రామ సంప్రదాయాన్ని అనుసరించి సాయంత్రం గాంధీ నగర్ లో ఉన్న శదకం పట్టు వద్ద పూజారులు విశేష ఉత్సవం నిర్వహించి అమ్మవారి ఊరేగింపు నిర్వహించారు. మాజీ కార్పొరేటర్ కో. ఆపరేటివ్ బ్యాంకు అధ్యక్షులు కర్రి స్వామి, జనసేన వార్డ్ అధ్యక్షులు మజ్జి సూరిబాబు ఆధ్వర్యంలో పలు సంస్కృతి కార్యక్రమాలు ఘనంగా నిర్వహించారు.

## అండగా ప్రభుత్వం

(7వ పేజీ తరువాయి)

కమిటీ నివేదిక వచ్చిన తర్వాతే తుది నిర్ణయాలు, వ్యాఖ్యలు చేయడం సముచితమని చెప్పారు. వాస్తవాలు బయటకు రాకముందే ఊహాగానాలు, అపోహలు సృష్టించడం సరికాదన్నారు. రాష్ట్రంలో ఎక్కడ ఏ ప్రమాదం జరిగినా ప్రభుత్వం అత్యంత బాధ్యతాయుతంగా స్పందిస్తోందని, ప్రజల ప్రాణాలు, భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని మంత్రి తెలిపారు. ప్రతి ఘటనను ముఖ్యమంత్రి పర్యవేక్షణలో ఉన్నతస్థాయిలో సమీక్షిస్తున్నామని పేర్కొ న్నారు. విశాఖ ఉక్కు కర్మాగారాన్ని మరింత బలోపేతం చేసి, గత వైభవాన్ని తిరిగి తీసుకురావడం రాష్ట్ర ప్రభుత్వ లక్ష్యమని మంత్రి లోకేష్ అన్నారు. ఇప్పటికే కేంద్రం సహకారంతో భారీ ఆర్థిక ప్యాకేజీ, బకాయిల చెల్లింపులు, కార్యకలాపాల పునర్వ్యవస్థీకరణ వంటి చర్యల ద్వారా కర్మాగారం స్థిరీకరణ దిశగా ముందుకు సాగుతోందని వివరించారు. భవిష్యత్తులో ఇటువంటి ఘటనలు పునరావృతం కాకుండా భద్రతా ప్రమాణాలను మరింత కట్టుదిట్టం చేయడానికి ప్రభుత్వం కట్టుబడి ఉందని, బాధిత కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని మంత్రి నారా లోకేష్ హామీ ఇచ్చారు.

### అంతర్జాతీయ రోలర్ స్కేటింగ్ పతక విజేత
## చైత్రదీపికకు స్పీకర్ అభినందనలు

(7వ పేజీ తరువాయి)

భారతదేశం తరపున ప్రాతినిధ్యం వహించారు. ఈ పోటీల్లో అద్భుతమైన క్రీడా నైపుణ్యాన్ని ప్రదర్శించిన ఆమె యూత్ కేటగిరీ ఇన్-లైన్ ఈవెంట్‌లో రజత పతకం, సోలో డాన్స్ ఈవెంట్‌లో కాంస్య పతకం, అలాగే క్యాడెట్ కేటగిరీ షో గ్రూప్ ఈవెంట్‌లో రజత పతకాలు సాధించారు.వరుసగా నాలుగోసారి అంతర్జాతీయ స్థాయిలో తన అద్భుత క్రీడా ప్రతిభతో దేశానికి విశేషమైన గౌరవాన్ని తీసుకువచ్చారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు గారు చిన్నారితో రోలర్ స్కేటింగ్ క్రీడా విశేషాలను ముచ్చటిస్తూ అడిగి తెలుసుకున్నారు. రాష్ట్ర, జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఇప్పటివరకు స్కేటింగ్ పోటీల్లో ఏకంగా 61 పతకాలు సాధించి నందుకు చైత్రదీపికను ఆయన ప్రత్యేకంగా ప్రశంసించారు. అంతర్జాతీయ క్రీడా వేదికలపై మున్ముందు ఇలాగే త్రివర్ణ పతాకాన్ని సగర్వంగా ఎగురవేసి, భవిష్యత్తులో రాష్ట్రానికి, దేశానికి మరిన్ని పతకాలు సాధించిపెట్టాలని స్పీకర్ ఈ సందర్భంగా ఆకాంక్షించారు.

## విశాఖ స్టీల్‌ప్లాంట్ దుర్ఘటన
### విచారణకు 'త్రిసభ్య కమిటీ'..

గాజువాక,జూన్ 9,ప్రభాతవార్త :

విశాఖ స్టీల్‌ప్లాంట్‌లో తొమ్మిది మంది కార్మికుల ప్రాణాలను బలిగొన్న ఘోర ప్రమాదంపై కేంద్ర ప్రభుత్వం దర్యాప్తును ముమ్మరం చేసింది. తీవ్ర కలకలం రేపిన ఈ దుర్ఘటనకు గల కారణాలను విశ్లేషించేందుకు, భద్రతా లోపాలను పరిశీలించేందుకు కేంద్ర ఉక్కు మంత్రిత్వ శాఖ ముగ్గురు సభ్యులతో కూడిన ఉన్నత స్థాయి నిపుణుల కమిటీని రంగంలోకి దించింది.

సెయిల్ పరిధిలోని బొకారో స్టీల్ ప్లాంట్ డైరెక్టర్ ఇన్‌ఛార్జ్ ప్రియారంజన్ నేతృత్వంలో ఏర్పాటైన ఈ నిపుణుల కమిటీ మంగళవారం ఉక్కునగరానికి చేరుకుంది. ఈ బృందంలో సెయిల్ సీజీఎం జితేంద్ర కుమార్, మాజీ సీజీఎం గోపాల్ సింగ్ సభ్యులుగా ఉన్నారు. ప్రమాదం జరిగిన ఎస్ఎంఎస్-2 విభాగంలో క్షేత్రస్థాయి పరిస్థితులను పరిశీలించిన కమిటీ, అనంతరం కేంద్ర సహాయ మంత్రి భూపతిరాజు శ్రీనివాసవర్మతో ప్రత్యేకంగా భేటీ అయింది. ప్రమాదానికి దారితీసిన సాంకేతిక కారణాలపై లోతుగా అధ్యయనం చేసి, 15 రోజుల్లోగా కేంద్ర ప్రభుత్వానికి సమగ్ర నివేదిక సమర్పించాల్సిందిగా కేంద్రం ఈ కమిటీని ఆదేశించింది.

# రూ.25 లక్షల పరిహారం, ఉద్యోగం

(7వ పేజీ తరువాయి)

దశాబ్దాల నాటి పరికరాలను ఆధునీకరించకుండా వినియోగించడం వల్లే ఇలాంటి ప్రమాదాలు చోటుచేసుకుంటున్నాయని కార్మికులు ఆరోపించారని చెప్పారు.

"నా వద్ద ఉన్న సమాచారం ప్రకారం గత 36 ఏళ్ల స్టీల్ ప్లాంట్ చరిత్రలో ద్రవ ఉక్కును మోసుకెళ్లే ల్యాడిల్ బకెట్ ఈ స్థాయిలో పేలిపోయి ఇంత మంది ప్రాణాలు కోల్పోయిన ఘటన ఎప్పుడూ జరగలేదు. గతంలో కొన్ని చిన్నపాటి ప్రమాదాలు జరిగినా, ఈ తరహా పేలుడు ఇదే మొదటిసారి" అని పవన్ కళ్యాణ్ పేర్కొన్నారు. చైనా, ఫ్రాన్స్ వంటి దేశాల్లో కూడా పారిశ్రామిక ప్రమాదాలు జరిగినప్పటికీ, ఈ స్థాయిలో ద్రవ ఉక్కు ల్యాడిల్ పేలిన ఘటనలు అరుదుగా నమోదయ్యాయని తెలిపారు.

మృతుల కుటుంబాలకు మరో కీలక భరోసా ఇస్తూ, ప్రస్తుతం స్టీల్ ప్లాంట్ క్వార్టర్లలో నివసిస్తున్న కుటుంబాలు ఉద్యోగి పదవీ విరమణ వయస్సు వచ్చే వరకు అదే నివాసంలో కొనసాగవచ్చని చెప్పారు. టౌన్‌షిప్ వెలుపల అద్దె ఇళ్లలో ఉంటున్న బాధిత కుటుంబాలు కోరుకుంటే వారికి ప్లాంట్ క్వార్టర్లను కేటాయించే అంశాన్ని కూడా పరిశీలిస్తామని తెలిపారు.

స్టీల్ ప్లాంట్‌లో నెలకొన్న కార్మిక సమస్యలు, యాజమాన్య లోపాలు, భద్రతా ప్రమాణాల అమలుపై త్వరలోనే కార్మిక సంఘాల ప్రతినిధులతో ప్రత్యేక రౌండ్ టేబుల్ సమావేశం నిర్వహిస్తామని పవన్ కళ్యాణ్ వెల్లడించారు. క్షేత్రస్థాయిలో పనిచేస్తున్న కార్మికుల నుంచి నేరుగా అభిప్రాయాలు సేకరించి సమస్యల పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని చెప్పారు.

విశాఖ ఉక్కు కర్మాగారం ప్రభుత్వ రంగ సంస్థగానే కొనసాగాలన్నదే రాష్ట్ర ప్రభుత్వ అభిప్రాయమని ఆయన స్పష్టం చేశారు. నరేంద్ర మోడీ నాయకత్వంలో కేంద్ర ప్రభుత్వం నుంచి అవసరమైన సహకారం లభిస్తుందని ఆశాభావం వ్యక్తం చేశారు.

విశాఖ ఉక్కు అనేది వేలాది మంది త్యాగాల ఫలితంగా ఏర్పడిన సంస్థ అని, దాని పరిరక్షణకు ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్నారు.

అనంతరం పవన్ కళ్యాణ్ విశాఖపట్నంలోని సెవెన్ హిల్స్ హాస్పిటల్ ను సందర్శించి ప్రమాదంలో గాయపడిన కార్మికులను పరామర్శించారు. వారి ఆరోగ్య పరిస్థితిపై వైద్యులను అడిగి తెలుసుకుని, బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని మరోసారి హామీ ఇచ్చారు.

## మాజీ ముఖ్యమంత్రి జగన్ మోహన్ రెడ్డి రాక

విశాఖపట్నం, జూన్ 9 ప్రభాతవార్త



విశాఖ ఉక్కు ప్రమాద బాధితులను పరామర్శించేందుకు బుధవారం మాజీ ముఖ్యమంత్రి జగన్మోహన్ రెడ్డి నగరానికి రానున్నారు. ప్రమాద బాధితులను పరామర్శించి వారికి ధైర్యం చెప్పనున్నారు.

# స్టీల్ ప్లాంట్ ప్రమాదం వెనుక కుట్ర కోణం ఉంది

(7వ పేజీ తరువాయి)

అనంతరం ఆయన మీడియాతో మాట్లాడారు.

టీడీపీ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత స్టీల్ ప్లాంట్‌ను నిర్వీర్యం చేసే ప్రయత్నాలు జరుగుతున్నాయని బొత్స విమర్శించారు. సమర్థులైన అధికారులను బదిలీ చేయడం, యంత్రాల నిర్వహణను నిర్లక్ష్యం చేయడం, ఉద్యోగుల సంఖ్యను తగ్గించడం వల్లే ఈ భారీ ప్రమాదం జరిగిందని అన్నారు. ఇప్పటికే వేలాది మంది శాశ్వత, కాంట్రాక్ట్ ఉద్యోగులను తొలగించారని, బలవంతపు వీఆర్ఎస్ చర్యలను వెంటనే నిలిపివేయాలని డిమాండ్ చేశారు.

ప్రమాదంలో మృతి చెందిన ప్రతి కార్మికుడి కుటుంబానికి ఎల్జీ పాలిమర్స్ ఘటన తరహాలో రూ. కోటి పరిహారం ఇవ్వాలని, కుటుంబ సభ్యుల్లో ఒకరికి శాశ్వత ఉద్యోగం కల్పించాలని బొత్స డిమాండ్ చేశారు. ఈ డిమాండ్లు నెరవేరే వరకు వైఎస్సార్‌సీపీ కార్మికుల పక్షాన నిలిచి రాజీలేని పోరాటం చేస్తుందని స్పష్టం చేశారు.

ప్రమాదంలో గాయపడిన వారిలో కొందరి పరిస్థితి ఇంకా విషమంగానే ఉందని, వారు త్వరగా కోలుకోవాలని ఆకాంక్షించారు. మృతుల కుటుంబాలకు పార్టీ అధినేత వై . ఎస్ . జగన్మోహన్ రెడ్డి తరఫున ప్రగాఢ సానుభూతి తెలియజేశారు.

ఈ సందర్భంగా మాజీ మంత్రి కురసాల కన్నబాబు మాట్లాడుతూ, బాధితులను పరామర్శించేందుకు వచ్చిన మంత్రి నారా లోకేష్ కార్మిక సంఘాల నాయకులపై ఆగ్రహం వ్యక్తం చేయడం దురదృష్టకరమన్నారు. గతంలో ఎల్జీ పాలిమర్స్ ఘటన సమయంలో ప్రభుత్వం బాధితులకు అండగా నిలిచిందని గుర్తుచేశారు.

స్టీల్ ప్లాంట్ ప్రమాద బాధితులను పరామర్శించేందుకు వైఎస్సార్‌సీపీ అధ్యక్షుడు వై . ఎస్. జగన్మోహన్ రెడ్డి బుధవారం విశాఖపట్నం రానున్నారని కురసాల కన్నబాబు వెల్లడించారు. ఆస్పత్రుల్లో చికిత్స పొందుతున్న బాధితులను పరామర్శించి, అనంతరం స్టీల్ ప్లాంట్ కార్మిక సంఘాల నాయకులతో సమావేశం కానున్నట్లు తెలిపారు.

### శోక 'జన' సంద్రం
## కెజీహెచ్ శవాగారం
### మృతుల కుటుంబాల ఓదార్పుకు పార్టీలు పోటా పోటీ

విశాఖపట్నం జూన్ 9 (ప్రభాత వార్త)

స్టీల్ ప్లాంట్ ప్రమాద ఘటన లో అసువులు బాసిన మృతుల బంధువులు, కుటుంబ సభ్యుల రోదనలు ,అధికార కూటమి,ప్రతిపక్ష వైఎస్ఆర్సీపీ వామ పక్ష పార్టీలు , కార్మిక సంఘాల నాయకులు ఓదార్పు లు, పరామర్శ లతో మంగళవారం కెజీహెచ్ మార్చురీ ప్రాంగణం శోక 'జన' సాగరాన్ని తలపించింది. తొ లుత ఈ ప్రమాదం లో తీవ్రంగా గాయపడిన క్షతగాత్రులు చికిత్స పొందుతున్న నగరంలోని కిమ్స్ ఐకాన్, ఎంజీఎం – సెవెన్ హిల్స్ ఆసుపత్రి లను. సందర్శించి అక్కడ భాధితులు ను వారి కుటుంబాలను కలుసుకుని పరామర్శించిన రాజకీయ పార్టీ ల నేతలు చివర గా మధ్యాహ్నం సమయానికి కెజీహెచ్ మార్చురీ కి చేరుకొని అప్పటికే మృతుల శవ పరీక్షల కోసం ఎదురు చూస్తున్న మృతుల బంధువులు కుటుంబ సభ్యులు ను ఓదార్చేందుకు పోటీపడ్డారు. దాంతో మార్చురీ ప్రాంగణం ఏడుపులు పెడ బొబ్బలతో గంభీరంగా మారింది. అధికార కూటమి తరపున ప్రమాద భాదితులు మృతుల కుటుంబాలను రాష్ట్ర మంత్రులు లోకేష్ ఉప ముఖ్య మంత్రి పవన్ కళ్యాణ్,, కేంద్ర ఉక్కు సహాయ మంత్రి శ్రీనివాస వర్మ మంత్రులు అనిత వాసంశెట్టి శుభాష్, గుమ్మడి సంధ్యా రాణి నాదేండ్ల మనోహర్, విశాఖ ఎంపీ శ్రీభారత్, స్థానిక శాసన సభ్యులు గణ బాబు వంశీ కృష్ణ శ్రీనివాస్ సుందర్ పు విజయ కుమార్ టీడీపీ రాష్ట్ర అధ్యక్షులు పల్లా శ్రీనివాస్ తదితరులు పరామర్శిచారు. వైఎస్ఆర్సీపీ నుంచి శాసన మండలి ప్రతి పక్ష నేత బొత్స సత్యనారాయణ మాజీ మంత్రులు కూరసాల కన్నబాబు,జీ. అమరనాథ్ కెకె. రాజు తిప్పల దేవన్ రెడ్డి పరామర్శించి సంతాపాన్నీ తెలిపారు.

# కిమ్స్ ఆస్పత్రిలో క్షతగాత్రులకు పవన్ కల్యాణ్ పరామర్శ!
### వైద్య ఖర్చులన్నీ ప్రభుత్వమే భరిస్తుంది.. బాధితులకు డిప్యూటీ సీఎం భరోసా

గాజువాక,జూన్ 9,ప్రభాతవార్త :

విశాఖ స్టీల్ ప్లాంట్ ప్రమాదంలో తీవ్రంగా గాయపడి ఆస్పత్రిలో చికిత్స పొందుతున్న బాధితులను ఆంధ్రప్రదేశ్ ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ మంగళవారం ఉదయం పరామర్శించారు. నగరంలోని కిమ్స్ ఆసుపత్రికి చేరుకున్న ఆయన.. క్షతగాత్రులను, వారి కుటుంబ సభ్యులను కలిసి ధైర్యం చెప్పారు.

ఈ సందర్భంగా ప్రమాదం జరిగిన తీరును, బాధితుల ఆరోగ్య పరిస్థితిని పవన్ కల్యాణ్ స్వయంగా అడిగి తెలుసుకున్నారు. అనంతరం వారికి అందుతున్న వైద్య సేవలను ఆసుపత్రి వైద్యులతో సమీక్షించారు.

ప్రమాద బాధితులకు అయ్యే వైద్య ఖర్చుల మొత్తాన్ని ప్రభుత్వమే భరిస్తుందని, బాధితుల కుటుంబాలకు అన్ని విధాలా అండగా ఉంటామని ఉపముఖ్యమంత్రి స్పష్టమైన భరోసా ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించాలని వైద్యులను ఆదేశించారు.

డిప్యూటీ సీఎం పర్యటనలో ఆయన వెంట రాష్ట్ర పౌరసరఫరాల శాఖ మంత్రి నాదెండ్ల మనోహర్, విశాఖ సౌత్ నియోజకవర్గ ఎమ్మెల్యే వంశీకృష్ణ శ్రీనివాస్ యాదవ్ తదితరులు ఉన్నారు. వారు కూడా బాధితులను పరామర్శించి, అందుతున్న సహాయక చర్యలను పరిశీలించారు.



# బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాం
### జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్

విశాఖపట్నం, జూన్ 09 (ప్రభాత వార్త )

స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ తెలిపారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన క్రమంలో మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలను వివరించారు. 8వ తేదీ సాయంత్రం స్టీల్ మెల్ట్ షాప్-1లోని మెషిన్ నెం.2 వద్ద లాడిల్ బ్లాస్ట్ ఘటన జరగగా, విధుల్లో ఉన్న 8 మంది కార్మికులు మృతి చెందారని, మరో 6 మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారిని వెంటనే కిమ్స్, సెవెన్ హిల్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులు ప్రమాదం నుంచి బయటపడ్డారని, సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు



అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఇప్పటికే ఏడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామని, మిగిలిన కుటుంబ సభ్యులు చేరుకున్న వెంటనే అన్ని న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసి మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు. బాధిత కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు, ఆర్ఐఎన్ఎల్ తరఫున ప్రకటించిన ఆర్థిక సహాయం, ఇతర సంక్షేమ ప్రయోజనాలు త్వరితగతిన అందేలా చర్యలు తీసుకుంటున్నామని వెల్లడించారు. టెర్మినల్ బెనిఫిట్స్‌తో పాటు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పిల్లలకు ఉచిత విద్య, నివాస సదుపాయం కొనసాగింపు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే నిర్ణయాలను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఇప్పటికే విచారణ ప్రారంభించిందని, భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా అవసరమైన భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అంత్యక్రియలు, రవాణా, వైద్య చికిత్స, ఇతర అవసరాల కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులు ఉన్నారు.

# సిటీ ఆఫ్ డెస్టినీనా.. సిటీ ఆఫ్ డిజాస్టర్సా?

విశాఖ పారిశ్రామిక ప్రాంతంలో మృత్యుఘోష!
దిగ్గజ పరిశ్రమలున్నా 'బర్నింగ్ హాస్పిటల్' కరవు!
సకాలంలో వైద్యం అందక 'గాలిలో కలుస్తున్న' కార్మికుల ప్రాణాలు
ముంబై వెళ్లాలంటే సామాన్యుడికి సాధ్యమేనా?
-యాజమాన్యాల 'కక్కుర్తి'పై కార్మికలోకం ఆగ్రహం!

గాజువాక,జూన్ 9,ప్రభాతవార్త :

*విశాఖపట్నం.. ఉమ్మడి ఆంధ్రప్రదేశ్‌కు ఆర్థిక రాజధాని. కానీ నేడు పారిశ్రామిక కార్మికులకు అది ఉరితాళ్లు బిగిస్తున్న నగరంలా మారుతోంది. గాజువాక, పరవాడ, సింధియా, మింది, వెంకటాపురం.. ఎటు చూసినా ఆకాశాన్ని తాకే చిమినీలు, భారీ పరిశ్రమలు. నవరత్న హోదా కలిగిన హెచ్‌పీసీఎల్, విశాఖ స్టీల్ ప్లాంట్ మొదలుకొని.. భెల్ ఐటీసీ ,హిందుస్థాన్ షిప్‌యార్డ్, ఎన్‌టీపీసీ, ఎల్‌జీ పాలిమర్స్, పరవాడ ఫార్మా సిటీ వరకు ఎన్నో ప్రభుత్వ, ప్రైవేట్ దిగ్గజాలు ఇక్కడ కొలువుదీరాయి. రాత్రి అనక, పగలు అనక మూడు షిఫ్టుల్లో వేలాది మంది శాశ్వత, కాంట్రాక్ట్, అవుట్‌సోర్సింగ్ కార్మికులు తమ రక్తాన్ని స్వేదంగా మార్చి ఈ పరిశ్రమల చక్రాలను నడిపిస్తున్నారు. వీరి నమ్మకం మీదే ఎన్నో కుటుంబాలు బతుకుతున్నాయి. కానీ, ప్రమాదం ముంచుకొస్తే వీరి ప్రాణాలకు గ్యారెంటీ ఇచ్చే నాథుడే లేడు!*

**'ఫ్యాక్టరీ చట్టాలు' కాగితాలకే పరిమితం!...**

నిబంధనల ప్రకారం.. కెమికల్, పెట్రోలియం, ఐరన్ మెల్టింగ్ లాంటి అత్యంత ప్రమాదకర ప్రక్రియలు జరిగే పారిశ్రామిక క్లస్టర్లలో అత్యాధు నిక వసతులు కలిగిన ప్రత్యేక బర్నింగ్ హాస్పిటల్ ఉండటం తప్పనిసరి. ఫ్యాక్టరీ చట్టాలు మొత్తు కుంటున్నా, యాజమాన్యాలు మాత్రం ఈ రూల్స్ ను బేఖాతరు చేస్తున్నాయి. ప్రమాదం జరిగి ఒళ్లు కాలిపోయిన కార్మికుడిని తక్షణమే ఐసోలేషన్ వార్డులకో, ప్లాస్టిక్ సర్జరీ నిపుణుల దగ్గరకో తీసుకెళ్లాల్సింది పోయి.. లాభాల కోసం కొన్ని కార్పొరేట్ ప్రైవేట్ ఆసుపత్రులతో కుదుర్చుకున్న ఒప్పందాల ప్రకారం అక్కడికి తరలిస్తున్నారు. తీరా అక్కడికి వెళ్తే.. కాలిన గాయాలకు తక్షణమే




అందించాల్సిన ప్రత్యేక వైద్య సదుపాయాలు లేక, నిపుణులు అందుబాటులో లేక గోల్డెన్ అవర్ (అత్యంత కీలకమైన సమయం) వృథా అవుతోంది. సరైన వైద్యం సకాలంలో అందక కార్మికులు కళ్లెదుటే ప్రాణాలు వదిలేస్తున్నారు.

**ముంబై వెళ్లాలంటే సామాన్యుడి తరం కాదు!...**

పరిస్థితి మరీ విషమిస్తే ఉన్నతాధికారులనో, రెగ్యులర్ ఉద్యోగులనో ముంబైలోని నేషనల్ బర్న్స్ సెంటర్‌కు ఎయిర్ అంబులెన్స్ ద్వారా తరలిసు _న్నారు. కానీ, ఇది విమాన ప్రయాణంతో కూడిన అత్యంత ఖరీదైన వ్యవహారం. ప్రాణాపాయ స్థితిలో ఉన్న ఒక సాధారణ కాంట్రాక్ట్ లేదా అవుట్‌సోర్సింగ్ కార్మికుడికి ఈ స్థాయి వైద్యం అందించడానికి యాజమాన్యాలు వెనకాడుతున్నా యి. అంతిమంగా స్థానిక కార్పొరేట్ ఆసుపత్రుల్లో 'సాధారణ' చికిత్స పొందుతూ.. ఇన్ఫెక్షన్ల బారిన పడి ప్రాణాలు గాలిలో కలిసిపోతున్నాయి.

**'సిఎస్ఆర్' నిధులు ఏమవుతున్నాయి?....**

ఉమ్మడిగా ఒక బర్నింగ్ హాస్పిటల్‌ను నిర్మించా లంటే ఈ పరిశ్రమలకు పెద్ద ఖర్చేమీ కాదు. ప్రతి ఏటా కార్పొరేట్ సామాజిక బాధ్యత కింద వందల కోట్లు ఖర్చు చేస్తున్నామని బోర్డులు తిప్పే యాజమాన్యాలు.. కార్మికుల ప్రాణాలు కాపాడే హాస్పిటల్ నిర్మాణానికి ఎందుకు వెనకాడుతున్నా యనేది మిలియన్ డాలర్ల ప్రశ్న. తాజా ప్రమాదాలతో కలిపి ఇప్పటివరకు ఈ పారిశ్రామిక ప్రాంతంలో జరిగిన వివిధ ప్రమాదాల్లో సుమారు 200 మందికి పైగా కార్మికులు బలయ్యారు. ఇందులో సగానికి పైగా మరణాలు సకాలంలో సరైన 'బర్న్స్ ట్రీట్‌మెంట్' అందకపోవడం వల్లే జరిగాయని కార్మిక సంఘాల గణాంకాలు స్పష్టం చేస్తున్నాయి.

**ప్రభుత్వాల నిర్లక్ష్యం.. పాలకుల కక్కుర్తి!...**

కార్మికులు ఇంతలా అల్లాడుతున్నా.. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు, సంబంధిత కార్మిక, పరిశ్రమల శాఖల మంత్రులకు పలుమార్లు విన్నవించినా ఫలితం శూన్యం. పాలకుల ఈ మౌనం వెనుక అనేక అనుమానాలు, విమర్శలు వ్యక్తమవుతు న్నాయి. యాజమాన్యాలు ఇచ్చే తాయిలాలకు ప్రజాప్రతినిధులు, అధికారులు కక్కుర్తి పడుతూ, కార్మికుల జీవితాలతో చెలగాటమాడుతున్నారనే ఆందోళన సర్వత్రా వ్యక్తమవుతోంది.

**ఇప్పటికైనా చొరవ చూపాలి..**

విశాఖ పారిశ్రామిక రంగానికి గుండెకాయ లాంటి కార్మికులను కాపాడుకోవాల్సిన బాధ్యత అందరిపైనా ఉంది. ఇప్పటికైనా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు ప్రత్యేక చొరవ చూపాలి. పరిశ్రమల యాజమాన్యాలు, కార్మిక శాఖ సమన్వయంతో విశాఖ పారిశ్రామిక హబ్‌కు అందుబాటులో ఉండేలా.. అన్ని అత్యాధునిక వసతులు, నిపుణులతో కూడిన 'కేంద్ర బర్నింగ్ హాస్పిటల్' ను యుద్ధ ప్రాతిపదికన ఏర్పాటు చేయాలని కార్మిక వర్గాలు స్థానిక ప్రజలు తీవ్రస్థాయిలో డిమాండ్ చేస్తున్నారు.

## 12 వరకు మండల స్థాయి యోగాసన పోటీలు

### ఆయుష్ ఆర్డీడీ డా.శ్రీనివాసులు

విశాఖపట్నం, జూన్ 9,ప్రభాతవార్త

అంతర్జాతీయ యోగా దినోత్సవం (యోగాంధ్ర – 2026) సందర్భంగా ఈ నెల 10వ నుండి 12వ వరకు మండల స్థాయిలో యోగాసన పోటీలు నిర్వహించబడునని ఆయుష్ శాఖ ప్రాంతీయ ఉప సంచాలకులు డా. కె. శ్రీనివాసులు తెలిపారు. 10వ నుండి 18 సంవత్సరాల వారిని బాలుర కేటగిరి గాను, 19 నుండి 35 సంవత్సరాల మధ్య వయస్సు గల వారిని మధ్య వయస్సు కేటగిరీ గాను, 35 సం. పైబడిన వారిని సీనియర్స్‌గా విభజించబడినదని తెలిపారు. సోలో, ప్రణాయామ, గ్రూప్ యోగా, క్విజ్, యోగ స్లోగన్, యోగా ఆసనాలు, యోగా పాటలు, యోగా వ్యాసరచన, షార్ట్ ఫిల్మ్, యోగా ఫోటోగ్రఫీ విభాగాలలో పోటీలు నిర్వహించబడునని తెలిపారు. ఈ పోటీలలో పాల్గొనదలచినవారు తప్పనిసరిగా సంబంధిత స్వర్ణ గ్రామ, వార్డు సచివాలయం ద్వారా పేర్లు నమోదు చేసుకోవాలని తెలిపారు. మండల స్థాయిలో గెలుపొందిన వారు జిల్లా స్థాయి, రాష్ట్ర స్థాయికి ఎంపిక చేయబడుదురని, పోటీలలో పాల్గొనుటకు తప్పనిసరిగా నమోదు చేసుకోవలెనని తెలిపారు. పోటీ జరుగు స్థలాలు, వాటి వివరాలకు యోగా గురు కిరణ్ (9381787878) వారిని సంప్రదించవచ్చునని అయన ప్రకటనలో తెలిపారు.

## ఎస్కేజీఎస్ విద్యార్థులకు ప్రతిభ పురస్కారాలు అందజేత



ఆరిలోవ, జూన్ 9, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక పదో వార్డ్ ఆదర్శనగర్ ప్రాంతంలో ఉన్న శ్రీ కృష్ణ గ్రామర్ స్కూల్ 2025–26 పదో తరగతిలో అత్యధిక మార్కులు సాధించి ప్రతిభ కనబరి చిన విద్యార్థులకు స్కూల్ కరస్పాండెంట్ ముని మోహన్ కృష్ణ ఆధ్వర్యంలో ప్రతిభ పురస్కారాలు అందజేశారు. ఈ కార్యక్రమా నికి ముఖ్యఅతిథిగా ఆర్ జె డి విజయ భాస్కర్ హాజరయ్యారు. అనంతరం ఆయన చేతుల మీదుగా పదో తరగతిలో 550 మార్కులు సాధించిన 69 మంది విద్యార్థులకు బహుమతులు అందజేసి సాల్వాతో సత్కరించి అభినందనలు తెలియజేశారు. 597 మార్కులు సాధించిన కె త్రినాథ్ కు, 595 మార్కులు సాధించిన పి. భరత్ కు బహుమతులతో పాటు పదివేలు నగదును అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు భవిష్యత్తులో ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఉద్దేశంతో ప్రోత్సహిస్తున్నట్లు తెలిపారు. వార్డు మాజీ కార్పొరేటర్లు మద్దిల రామ లక్ష్మి రాజశేఖర్, జగ్గుపల్లి అప్పలరాజు, పాఠశాల ఉపాధ్యాయులు తల్లిదండ్రులు తదితరులు పాల్గొన్నారు.

## అగ్ని ప్రమాద బాధితులకు వైసీపీ శ్రేణులు చేయూత



ఆరిలోవ, జూన్ 9, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవ భగత్ సింగ్ నగర్‌లో నివాసముం టున్న ఎస్.సుమిత్ర, నాగరాజు ఇంటికి సోమ వారం కరెంట్ షార్ట్ సర్క్యూట్ అవడంతో ఇంట్లో ఉన్న సామాగ్రి అగ్నికి పూర్తిగా ఆహుతి అయింది. దీంతో ఆ కుటుంబం రోడ్డును పడటంతో పాటు కట్టుకున్న బట్టల తప్ప సర్వసం కోల్పోయారు. దీంతో వైఎస్ఆర్పిపి 13వ వార్డు అధ్యక్షులు సత్యాల వెంకట్ ఆధ్వర్యంలో రాష్ట్ర ఎస్సీ సెల్ ప్రధాన కార్యదర్శి గుడిపాటి విక్టరీ ఆర్థిక సహాయంతో ఆ కుటుంబీకులను పరామర్శించి నెలకు సరిపడా నిత్యవసర సరుకులు అందజేసి ఆ కుటుంబానికి చేయూతగా నిలిచారు. వీరితో పాటు రాష్ట్ర ఎస్సీ సెల్ విభాగం, రాష్ట్ర అధికారి ప్రతినిధి అల్లంపల్లి రాజబాబు, 13వ వార్డు పరిశీలకుడు వానపల్లి మంగరాజు, సూకి సురేష్, వంకర బాబురావు, శెట్టికామేష్, భవాని, నసీమా బేగం, కాండ్రేగుల వెంకటేశ్వరరావు పాల్గొన్నారు.

## స్టీల్‌ప్లాంట్ బాధితులకు మంత్రి రాజశేఖర్ పరామర్శ



గాజువాక,జూన్ 9,ప్రభాతవార్త

విశాఖ స్టీల్‌ప్లాంట్ ఎస్ఎంఎస్ విభాగంలో జరిగిన ఘోర అగ్ని ప్రమాదంలో గాయపడి నగరంలోని సెవెన్ హిల్స్, కేజీహెచ్ ఆసుపత్రుల్లో చికిత్స పొందుతున్న కార్మికులను, వారి కుటుంబ సభ్యులను ఇంటక్ జాతీయ నాయ కుడు మంత్రి రాజశేఖర్ మంగళవారం పరా మర్శించారు. ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న క్షతగాత్రుల ఆరోగ్య పరిస్థితిని ఆయన వైద్యులను అడిగి తెలుసుకున్నారు. బాధితులకు మెరుగైన వైద్యం అందించాలని కోరారు. అనంతరం క్షతగాత్రుల కుటుంబ సభ్యులతో మాట్లాడి వారికి ధైర్యం చెప్పారు. బాధితులు త్వరగా కోలుకోవాలని తాను భగవంతుడిని ప్రార్థిస్తున్నట్లు ఈ సందర్భంగా ఆయన పేర్కొన్నారు.

### మృతుడికి ఘన నివాళి

అంతకుముందు, కేజీహెచ్‌లో పోస్టుమార్టం అనంతరం కుటుంబ సభ్యులకు అప్పగించిన మృతుడి భౌతికకాయాన్ని మంత్రి రాజశేఖర్ సందర్శించి, పూలమాలలు వేసి ఘన నివాళులర్పించారు. మృతుడి కుటుంబ సభ్యులను ఓదార్చుతూ తన గాఢ సంతాపాన్ని తెలియజేశారు. ప్రమాదానికి గురైన కార్మిక కుటుంబాలను ప్రభుత్వం, స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం అన్ని విధాలా ఆదుకోవాలని ఆయన డిమాండ్ చేశారు.

## బాధిత కుటుంబాలకు అన్ని విధాలుగా సహాయ సహకారాలు అందిస్తున్నాం

### జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్




విశాఖపట్నం, జూన్ 09 ప్రభాతవార్త

స్టీల్ ప్లాంట్‌లో జరిగిన దురదృష్టకర ఘటనలో మృతి చెందిన కార్మికుల కుటుంబాలకు, గాయపడిన వారికి ప్రభుత్వం అన్ని విధాలుగా అండగా నిలుస్తోందని జిల్లా కలెక్టర్ ఎం.అభిషిక్త్ కిశోర్ తెలిపారు. మంగళవారం కేజీహెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబ సభ్యులను ఓదార్చిన క్రమంలో మీడియాతో మాట్లాడిన ఆయన పలు అంశాలను వివరించారు. 08వ తేదీ సాయంత్రం స్టీల్ మెల్ట్ షాప్–1లోని మెషిన్ నెం.2 వద్ద లాడిల్ బ్లాస్ట్ ఘటన జరగగా, విధుల్లో ఉన్న 8 మంది కార్మికులు మృతి చెందారని, మరో 6 మంది తీవ్రంగా గాయపడ్డారని పేర్కొన్నారు. వారిని వెంటనే కిమ్స్, సెవెన్ హిల్స్ సూపర్ స్పెషాలిటీ ఆసుపత్రులకు తరలించి అత్యుత్తమ వైద్య సేవలు అందిస్తున్నామని చెప్పారు. ప్రస్తుతం కిమ్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురు బాధితులు ప్రమాదం నుంచి బయటపడ్డారని, సెవెన్ హిల్స్ ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న ముగ్గురిలో ఒకరి ఆరోగ్య పరిస్థితి నిలకడగా ఉండగా, మరో ఇద్దరి పరిస్థితి విషమంగా ఉందని కలెక్టర్ తెలిపారు. మృతుల కుటుంబాలకు అవసరమైన అన్ని సహాయ సహకారాలు అందిస్తున్నామని, ఇప్పటికే ఏడు మృతదేహాలను కుటుంబ సభ్యులకు అప్పగించామని, మిగిలిన కుటుంబ సభ్యులు చేరుకున్న వెంటనే అన్ని న్యాయపరమైన ప్రక్రియలు పూర్తి చేసి మృతదేహాలను అప్పగిస్తామని చెప్పారు. టెర్మినల్ బెనిఫిట్స్‌తో పాటు రూ.25 లక్షల ఎక్స్‌గ్రేషియా, పిల్లలకు ఉచిత విద్య, నివాస సదుపాయం కొనసాగింపు, కుటుంబ సభ్యుల్లో ఒకరికి ఉద్యోగం కల్పించే నిర్ణయాలను అమలు చేసే దిశగా చర్యలు చేపడుతున్నామన్నారు. ఘటనకు గల కారణాలను తెలుసుకునేందుకు కేంద్ర ప్రభుత్వం నియమించిన ముగ్గురు సభ్యుల విచారణ కమిటీ ఇప్పటికే విచారణ ప్రారంభించిందని అవసరమైన భద్రతా చర్యలపై ప్రత్యేక దృష్టి సారించనున్నట్లు తెలిపారు. బాధిత కుటుంబాల అవసరాలను ఎప్పటికప్పుడు తెలుసుకుంటూ, అంత్యక్రియలు, రవాణా, వైద్య చికిత్స, ఇతర అవసరాల కోసం జిల్లా యంత్రాంగం నిరంతరం అందుబాటులో ఉందని జిల్లా కలెక్టర్ ఎం. అభిషిక్త్ కిశోర్ పేర్కొన్నారు. ఆయనతో పాటు జాయింట్ కలెక్టర్ గొబ్బిళ్ల విద్యాధరి, ఇతర అధికారులు ఉన్నారు.

## కార్డెలియా ఎంప్రెస్ క్రూయిజ్ నౌక రాక

### పర్యాటక అభివృద్ధికి కొత్త అవకాశాలు -ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అధ్యక్షుడు విజయమోహన్



విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త

విశాఖ నుంచి ప్రారంభం కానున్న కార్డెలియా క్రూయిజెస్ సేవలు నగర పర్యాటక రంగానికి కొత్త దిశను చూపనున్నాయని ఏపీ టూర్స్ అండ్ ట్రావెల్స్ అసోసియేషన్ అధ్యక్షుడు కె.విజయమోహన్ తెలిపారు. కార్డెలి యా ఎంప్రెస్ క్రూయిజ్ నౌక రాకతో విశాఖకు క్రూయిజ్ పర్యాటక కేంద్రంగా అంతర్జాతీయ గుర్తింపు లభిం చడంతో పాటు రాష్ట్ర పర్యాటకాభివృద్ధికి కొత్త అవకాశాలు ఏర్పడనున్నాయని పేర్కొన్నారు. ఇక్కడ ద్వారకా నగర్‌లోని సంస్థ కార్యాలయంలో సోమవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆయన క్రూయిజ్ విహారం విశేషాలను మీడియాకు వివరించారు. 692 అడుగుల పొడవు, 11 అంతస్తులు (డెక్స్), 796 కేబిన్స్తో సుమారు 1600 మంది ఒకేసారి ప్రయాణించేలా విలాసవంతమైన కార్నివాల్ క్రూయిజ్ ఈ నెల 22న చెన్నైలో మొదలై 24న విశాఖకు చేరుకుంటుందని తెలిపారు. ఈ పడవ విశాఖ నుంచి చెన్నై 4 ట్రిప్స్, చెన్నై నుంచి విశాఖ 4 ట్రిప్స్, మొత్తం 8 ట్రిప్స్ లో సముద్ర విహారానికి అవకాశం కల్పించినట్లు తెలిపారు.

### క్రూయిజ్ ప్రయాణించే తేదీలు...

మొదటి ట్రిప్...జూన్ 22న చెన్నైలో ప్రారంభమై రెండు రాష్ట్రాల సముద్రంపై ప్రయాణించి ఈ నెల 24న విశాఖకు చేరుకుంటుంది. రెండవ ట్రిప్.... జూన్ 24న విశాఖలో ప్రారంభమై 27న చెన్నై చేరుకుంటుంది. మూడవ ట్రిప్... జూన్ 29న చెన్నైలో ప్రారంభమై జూలై ఒకటో తేదీన విశాఖ చేరుకుంటుంది. నాల్గవ ట్రిప్... జూలై ఒకటో తేదీన విశాఖలో ప్రారంభమై జూలై 4న చెన్నై చేరుకుంటుంది.ఐదవ ట్రిప్...జూలై 6న చెన్నైలో ప్రారంభమై విశాఖ చేరుకుంటుంది. ఆరవ ట్రిప్...జూలై 8న విశాఖలో ప్రారంభమై జూలై 11న చెన్నై చేరుకుంటుంది. ఏడవ ట్రిప్..జూలై 13న చెన్నైలో ప్రారంభమై 15న విశాఖకు చేరుకుంటుంది. ఎనిమిదవ ట్రిప్... జూలై 15న విశాఖలో ప్రారంభమై 18న చెన్నై చేరుకుంటు ందని తెలిపారు. రెండు రాత్రులు ఇద్దరి ప్రయాణానికి సుమారు రూ.48వేలు, మూడు రాత్రులు ఇద్దరి ప్రయాణానికి సుమారు రూ.70వేలు ఉంటుందని తెలిపారు. ఈ ప్రయాణానికి అవసరమైన టికెట్లు అన్ని ట్రావెల్ ఏజెన్సీలలో లభ్యమవుతాయని తెలిపారు. క్రూయిజ్లో బ్రేక్ ఫాస్ట్, లంచ్, డిన్నర్, ఈవెనింగ్ స్నాక్స్ టీ, మిడ్నైట్ బ్రంచ్, అలాగే ఆల్కహాల్, బేవరేజెస్ డ్రింక్ అన్లిమిటెడ్గా ఉచితంగా అందజేయబడుతుందని పేర్కొన్నారు. ఈ విలాసవంతమైన క్రూయిజ్లో అందమైన నాలుగు డైనింగ్ హాల్స్. లైవ్ ఎంటర్టైన్మెంట్ అండ్ షోస్, క్యాసినో, 9 బార్స్ లాంజ్, రాక్ క్లైంబింగ్, గేమింగ్ జోన్, ఓషన్ స్పా, వెల్ నెస్ సెంటర్ ఇలా ఎన్నో సదుపాయాలు ఉంటాయని తెలిపారు. కార్నివాల్ క్రూయిజ్లో విహారం నుంచి అనుభూతిని అందిస్తుందని విజయం మోహన్ తెలిపారు.

## వేడుకగా గంగాదేవి పండుగ... ప్రముఖుల తాకిడితో ఫిషింగ్ హార్బర్లో సందడే సందడి...



విశాఖపట్నం జూన్ 9, ప్రభాతవార్త

రెండు నెలల విరామానంతరం ఈనెల 14వ తేదీ అర్ధరాత్రి 12 గంటలు దాటాక మత్స్య వేట పునః ప్రారంభం కానున్న నేపథ్యంలో మంగళవారం మత్స్యకారులు అత్యంత భక్తిశ్రద్ధలతో గంగాదేవి పండుగను నిర్వహించారు. ఫిషింగ్ హార్బర్ ఆవరణలోని గంగాదేవి ఆలయాన్ని మత్స్యకార మహిళలు, పురుషులు మరియు ఇతర వర్గాల ప్రజలు పెద్ద సంఖ్యలో సందర్శించి గంగాదేవికి పసుపు, కుంకుమలు సమర్పించి మత్స్య పేట ఈ సీజన్లో సజావుగా సాగాలని ప్రకృతి వైపరీత్యాలు నుండి మత్స్యకారులను,ఫిషింగ్ బోట్లను కాపాడాలని మహిళలు అత్యంత భక్తితో గంగాదేవికి ముడుపులు సమర్పించి పూజలు నిర్వహించారు. గంగాదేవిని దర్శించుకునేందుకు మహిళలు పెద్ద సంఖ్యలో బారులు దీరారు. మత్స్యకార మహిళలు మంగళవారం మధ్యాహ్నం సముద్రతీరానికి ఊరేగింపుగా వెళ్లి సముద్రునికి పూజలు చేశారు.ఆంధ్రప్రదేశ్ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జరిగిన ఈ వేడుకల్లో నగర ప్రముఖులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. పార్లమెంట్ సభ్యులు ఎం. శ్రీ భరత్,ఎమ్మెల్యే వంశీ కృష్ణ శ్రీనివాస్,మాజీ ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్ కుమార్,దక్షిణ నియోజకవర్గం తెలుగుదేశం పార్టీ ఇన్చార్జి,ఎన్టీఆర్ వైద్య సేవ చైర్మన్ సీతంరాజు సుధాకర్ మత్స్యశాఖ జాయింట్ డైరెక్టర్ లక్ష్మణరావు తదితరులు గంగాదేవిని దర్శించుకున్నారు. అసోసియేషన్ వారిని ఘనంగా సత్కరించింది ఈ సందర్భంగా ఏర్పాటు చేసిన భక్తి సంగీత గీతాల కార్యక్రమాలు ఎంతగానో అలరించింది గంగాదేవి పండుగలో ఏపీ మెకనైజ్డ్ ఫిషింగ్ బోటు ఆపరేటర్స్ అసోసియేషన్ అధ్యక్షులు మైలపల్లి లక్ష్మణరావు గౌరవ అధ్యక్షులు పి.సి.అప్పారావు,ప్రధాన కార్యదర్శి సురపతి నర్సింగరావు ఉపాధ్యక్షులు పరశురాముడు కార్యదర్శి మున్నం బాలాజీ పాల్గొన్నారు గంగాదేవి పండుగతో ఫిషింగ్ హార్బర్ ఏరియాలో ఉత్సాహపూరిత వాతావరణం నెలకొంది మత్స్యకారులు తండోప తండాలుగా గంగాదేవిని దర్శించుకొని పూజలు నిర్వహించారు. మత్స్యకారులు, బొట్ల యజమానులు గంగాదేవికి మొక్కుబడులు చెల్లించుకున్నారు.

## స్టీల్‌ప్లాంట్ ప్రమాద స్థలాన్ని పరిశీలించిన మంత్రి లోకేష్

### సాంకేతిక కారణాలపై ఉన్నతాధికారులతో సమీక్ష.. సమగ్ర విచారణకు ఆదేశం



గాజువాక, జూన్ 9,ప్రభాతవార్త

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాద స్థలాన్ని రాష్ట్ర ఐటీ, విద్యాశాఖ మంత్రి నారా లోకేష్, విశాఖ ఎంపీ శ్రీ భరత్, ప్రభుత్వ విప్ గణబాబు కలిసి క్షేత్రస్థాయిలో పరిశీలించారు. ప్రమాదం జరిగిన విభాగానికి వెళ్లిన నాయకులు.. అసలు ప్రమాదం ఎలా జరిగింది? దానికి గల సాంకేతిక కారణాలు ఏమిటనే అంశాలను ప్లాంట్ ఉన్నతాధికారులను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్ మాట్లాడుతూ.. స్టీల్‌ప్లాంట్‌లో జరిగిన ప్రమాదంపై తక్షణమే సమగ్ర విచారణ జరిపించాలని యాజమాన్యాన్ని ఆదేశించారు. భవిష్యత్తులో ఇలాంటి దుర్ఘటనలు పునరావృతం కాకుండా ప్లాంట్ వ్యాప్తంగా కఠినమైన భద్రతా ప్రమాణాలు అమలు చేయాలని స్పష్టం చేశారు. కార్మికుల ప్రాణాల కంటే ఏదీ ఎక్కువ కాదని, ప్లాంట్‌లో భద్రతా లోపాలు ఉంటే సహించేది లేదని అధికారులకు తేల్చి చెప్పారు. ఈ పరిశీలనలో ప్లాంట్ ఉన్నతాధికారులు, ప్రజాప్రతినిధులు, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## వైభవంగా కామాక్షమ్మ ఆలయ మహోత్సవం

### అమ్మవారిని దర్శించుకున్న టీడీపీ నేత మాలినాయుడు.. -ఘనంగా అన్నసమారాధన



గాజువాక జూన్ 9,ప్రభాతవార్త

జీవీఎంసీ 62వ వార్డు అల్లూరి సీతారామరాజు కాలనీలోని శ్రీ కామాక్షమ్మ అమ్మవారి ఆలయ వార్షికోత్సవం మంగళవారం భక్తిశ్రద్ధలతో ఘనంగా జరిగింది. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు 62వ వార్డు తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు మజ్జి మాలినాయుడు ఉత్సవాల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకున్నారు. ఆలయానికి విచ్చేసిన ఆయనకు అర్చకులు, కమిటీ సభ్యులు పూర్ణకుంభంతో స్వాగతం పలికారు. మాలినాయుడు అమ్మవారికి ప్రత్యేక పూజలు నిర్వహించి తీర్థప్రసాదాలు స్వీకరించారు.

### భక్తులకు ప్రసాద వితరణ

ఉత్సవాల సందర్భంగా ఆలయ ప్రాంగణంలో భక్తులకు పెద్ద ఎత్తున అన్నసమారాధన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా మాలినాయుడు స్వయంగా పాల్గొని భక్తులకు ప్రసాదాలు వితరణ చేశారు. అమ్మవారి కృపాకటాక్షాలతో వార్డు ప్రజలంతా ఆయురారోగ్యాలతో వర్ధిల్లాలని ఆయన ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో ఆలయ కమిటీ నిర్వాహకులు, స్థానిక కూటమి నాయకులు, పెద్ద సంఖ్యలో మహిళలు, భక్తులు పాల్గొన్నారు.

## శేరీఖండం గ్రామంలో కిషోర్ వికాసంపై తల్లులకు అవగాహన



పద్మనాభం, జూన్ 9, ప్రభాతవార్త

మండలంలో శేరీఖండం గ్రామంలో ఉన్న అంగనవాడీ కేంద్రంలో మంగళవారం ఐసిడిఎస్ పిఒ శైలజ ఆధ్వర్యంలో కిషోర్ వికాసంపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా బాలబాలికలు పోషకాహారం తినడం, బాల్య వివాహాలు, ఎనిమియా, సెల్ ఫోన్లు వాడకుండా ఉండడం కోసం హెల్ప్ లైన్లు గరించి వివరించారు.ఈ కార్యక్రమంలో సూపర వైజర్ పార్వతీ, అంగనవాడీ కార్యకర్త సన్యాసమ్మ,తల్లులు పాల్గొన్నారు.

## ఎలక్టోరల్ మ్యాపింగ్, ప్రత్యేక సవరణ కార్యక్రమంపై బిఎల్వోలకు సూచనలు



పద్మనాభం, జూన్ 9,ప్రభాతవార్త

మండల తహాశీల్దారు కార్యాలయంలో జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు మంగళవారం తహాశీల్దారు డి శైలజ ఎలక్టోరల్ మ్యాపింగ్, ఎస్ఐఆర్‌పై బిఎల్వోలకు, సూపర్వైజర్లకు, రెవిన్యూ సిబ్బందికి పలు సూచనలు ఇచ్చారు. 2002 ఓటర్ల జాబితా ఆధారంగా ఎలక్టోరల్ మ్యాపింగ్ మండల ప్రగతి 85 శాతంగా ఉందని,ఈ ప్రగతిని మరింత మెరుగుపర్చాలని ఆమె అన్నారు. ప్రస్తుతం మండలంలో 6287 ఓటర్ల మ్యాపింగ్ పెండింగ్‌లో ఉందని, రేపటిలోగా పూర్తి చేయాలని ఆమె కోరారు. కొత్త ఓటర్లు ట్యాగ్ చేయటకు ప్రోగ్నీ ఆప్షనను సమర్ధవంతంగా వినియోగించుకోవాలని అన్నారు. బిఎల్వోల పనితీరును సూపరవైజర్లు నిరంతరం పర్యవేక్షించి అవసరమైన మార్గదర్శకాలను అందించాలని అన్నారు.నిర్ణీత గడువులోగా ఈ కార్యక్రమంను పూర్తి చేయాలని కోరారు.

## 12వ వార్డులో నూతన బోరుకు శంకుస్థాపన



ఆరిలోవ, జూన్ 9, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 12వ వార్డు చినగదిలి రాధాకృష్ణ నగర్ కొండవాల ప్రాంతా ప్రజలకు త్రాగునీరు లేక తీవ్ర ఇబ్బందులు పడుతుండడంతో ఆ ప్రాంత ప్రజలందరూ వార్డ్ అధ్యక్షులు ఒమ్మి అప్పలరాజుకు త్రాగునీటి సమస్యను తెలియజేశారు. దీంతో ఆయన స్థానిక ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణ బాబు దృష్టికి తీసుకువెళ్లగా ఆయన వెంటనే స్పందించి అధికారులతో మాట్లాడి నూతన బోరును మంజూరు చేశారు. మంగళవారం ఆ ప్రాంతంలో పూజా కార్యక్రమాలతో శంకుస్థాపన నిర్వహించారు. ఈ కార్యక్రమంలో టిడిపి నాయకులు పోతిన భరత్, అబద్ధం, చంటి, పరదేశి ఆనంద్, సిరియాల కృష్ణ గూడేల ప్రకాష్ బమ్మిడి బాల తదితరులు పాల్గొన్నారు.

## మాటలకు అందని విషాదం

### ప్రమాదానికి యాజమాన్యం పూర్తి బాధ్యత వహించాలి..



మాధవధార, జూన్ 9 ప్రభాతవార్త

కేజీహెచ్ మార్చురీ వద్ద మరణించిన వారి కుటుంబ సభ్యులను బీజేపీ జనతా వారధి కో కన్వీనర్ మూల వెంకటరావు పరామర్శించారు. విశాఖ స్టీల్ ప్లాంట్లో సంభవించిన ఘోర ప్రమాదంలో ప్రాణాలు కోల్పోయిన వారు, శరీరమంతా కాలిపోయి నరకయాతన అనుభవిస్తున్న క్షతగాత్రులను తలచుకుంటేనే గుండెలు బరువెక్కిపోతున్నాయని మూల వెంకట్రావు అన్నారు. మిన్నంటుతున్న బాధిత కుటుంబాల రోదనల సాక్షిగా ఇప్పుడు అతిపెద్ద ప్రభుత్వ రంగ సంస్థ అయిన విశాఖ ఉక్కు పరిశ్రమలో భద్రతా ప్రమాణాల పాటింపుపై అనేక ప్రశ్నలు తలెత్తుతున్నాయన్నారు. పని ప్రదేశాలను సురక్షితం చేయాల్సిన యాజమాన్యం కార్మికులను కుదించడంపై పెట్టే శ్రద్ధలో ఏ కాస్త అయినా పరిశ్రమను సక్రమంగా నిర్వహించడంపై దృష్టి చూపించి ఉంటే ఇంతటి విపత్తు వాటిల్లేదు కాదని, విశాఖ ఉక్కుకు నిపుణులైన మానవ వనరులే బలమన్నారు. అలాంటిది గత రెండేళ్లలో ఉద్యోగులను తొలగించుకుంటూ వస్తున్నారని, ఇటీవల కేంద్ర ప్రభుత్వం 11 వేల కోట్లకు పైగా నిధులు అందిన తర్వాత కూడా పరిశ్రమ నిర్వహణ మెరుగుపరచడానికి తగినంత సొమ్ము చెల్లించలేదన్నారు. ఇలాంటి యాజమాన్య పోకడలే పెను ఉత్పాతానికి కారణమై శ్రమజీవులకు మరణ శాసనంగా రాశాయని మూల వెంకట్రావు తెలిపారు. పని ప్రాంతాల్లో ప్రమాదాలకు ఆస్కారం లేని రీతిలో అత్యున్నత ప్రమాణాలను పాటించాలంటూ 17 ఏళ్ల క్రితమే జాతీయ విధానాన్ని తీసుకువచ్చారని, కానీ ఏం లాభం అందులో ప్రవచించిన ఆదర్శాలన్నీ నీటిపై రాతలుగా మిగిలిపోయిన దుర్భర దుర్భరావస్థలో దేశీయంగా పారిశ్రామిక ప్రమాదాలు విపరీతంగా సంభవిస్తున్నాయన్నారు. లాభాల యావలో భద్రతను పణంగా పెట్టడం, శిక్షణ లేని ఒప్పంద కార్మికులకు కీలక బాధ్యతలు అప్పగించడం ప్రభుత్వం ఉపేక్షించకూడదన్నారు. నిన్నటి హృదయ విదారక దుర్ఘటనపై కూలంకుషంగా విచారణ చేయించి బాధ్యులపై చర్యలు త్వరగా తీసుకోవడంతో పాటు ఇలాంటివి పునరావృతం కాకుండా రక్షణ వ్యవస్థలు ప్రభుత్వం బలోపేతం చేయాలని, అయినవారిని కోల్పోయి పుట్టెడు శోకంలో కూరుకుపోయిన కుటుంబాలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అన్ని రాజకీయ పార్టీల, స్వచ్ఛంద సంస్థలు అండగా నిలవాలని మూల వెంకటరావు ఆశిస్తున్నట్లు తెలిపారు.

## ఉపాధి కూలీల వద్ద ఎన్ఆర్ఈజిఎస్ సిబ్బంది చేతివాటం



పద్మనాభం, జూన్ 9, ప్రభాతవార్త

మండలంలో వివిధ గ్రామాలలో జరుగుతున్న చెరువు పనులలో ఉపాధి కూలీల వద్ద ఎన్ ఆర్ ఈ జి ఎస్ సిబ్బంది చేతివాటం ప్రదర్శించినట్లు జిల్లా పరిషత్ వైస్ చైర్మన్ సుంకర గిరిబాబు, బి తాళ్లవలస ఎంపిటీసీ చందక పైడినాయుడు ఆరోపించారు. మంగళవారం ఎంపీపీ కె రాంబాబు అధ్యక్షతన ఎంపిడిఒ చిన్నారావు ఏర్పాటు చేసిన మండల సర్వసభ్య సమావేశంలో పైడినాయుడు మాట్లడుతూ తాళ్లవలస, తొత్సపేట గ్రామాలలో ఉపాధి కూలీలు ఒక్కొక్కరి నుండి వారానికి వంద రూపాయలు వసూలు చేసి మస్తర్లు వేసి పని చెప్పకుండా వదిలేస్తున్నారని ఆయన ధ్వజమెత్తారు. దీనిపై గ్రామ ప్రజలు కూడా జిల్లా ఉన్నతి అధికారులకి ఫిర్యాదు కూడా చేసారన్నారు. వైస్ చైర్మన్ గిరిబాబు మాట్లాడుతూ మండలం అంతా ఇలాగునే జరుగుతుందని ఆయన మండి పడ్డారు.ఎంపీపీ రాంబాబు మాట్లాడుతూ ఈ విషయమై దర్యాప్తు చేసి,సభ్యులు చెప్పిన సమస్యలు పరిష్కారానికి చర్యలు తీసుకోవాలన్నారు. అనంతుని కొండపైకి శనివారం, ఆదివారం భక్తులు రద్దీ దృష్ట్యా ఆర్ టి సి బస్సులను నడపాలన్నారు. బొత్సపేట గ్రామంలో అస్తవ్యస్తంగా తవ్వేసిన సిసి రోడ్డును యధావిధిగా చేయాలని అధికోరులను ఆదేశించారు.ఈ కార్యక్రమంలో ఎఎంసి చైర్మెన్‌గా రామస్వామినాయుడు, ఎమ్మార్వో డి శైలజ,ఎంపిటీసీలు పాల్గొన్నారు.


వార్త VAARTHA CLASSIFIEDS

CLASSIFIEDS

CHANGE OF NAME

★ I, MEDIKONDA USHA SRI W/O MEDIKONDA NAGAVENDRA RAO, previously called NANDINA USHA R/O 3-32, MEDINARAOPALEM, ELURU, now changed my name from NANDINA USHA to MEDIKONDA USHA SRI. Henceforth I will be called as MEDIKONDA USHA SRI for all purposes. (Ro.No.9795)

★ I, CHOWDAVADA SRINUVASARAO S/O CHOWDAVADA BAGINAIDU previously called CHOWDAVADA SRINIVASARAO R/O 8-99, MAIN STREET, VOMMI, VIZIANAGARAM now changed my name from CHOWDAVADA SRINIVASARAO to CHOWDAVADA SRINUVASARAO. Henceforth I will be called as CHOWDAVADA SRINUVASA RAO for all purposes. (Ro.No.9796)

గమనిక

క్లాసిఫైడ్ ప్రకటనలకు ప్రతిస్పందించే ముందు తగినరీతిలో క్షుణ్ణంగా విచారించుకోవలసిందిగా పాఠకులకు సూచించడమైనది. ప్రకటనదారు చెబుతున్న లేదా చేసుకుంటున్న క్లెయిములతో "వార్త" దినపత్రికకు ఏ విధమైన సంబంధం లేదు.



మహా విశాఖ నగర పాలక సంస్థ

రహదారి అభివృద్ధి ప్రణాళికపై పౌరుల అభ్యంతరాలు సూచనలు

Rc.No. 5/2015/2025/G1/ACP-I/Bheemili Zone, dt: 08-06-2026

కమీషనర్, మహా విశాఖ నగరపాలక సంస్థ, విశాఖపట్నం వారు శ్రీ నరసింహ స్వామి ఆలయ ప్రాంతం మీదుగా SOS జంక్షన్ నుండి పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు ప్రధాన రహదారికి అనుసంధానించే నిమిత్తం 30 అడుగులు గల రహదారిని 66 అడుగులు రహదారిగా అభివృద్ధి చేయుటకు ప్రణాళికను ఆమోదించియున్నారు. ప్రతిపాదిత రహదారి అభివృద్ధిని చూపుతూ రోడ్డు అభివృద్ధి ప్రణాళికను నిబంధనలు అనుసరించి ప్రతిపాదిత శ్రీ నరసింహ స్వామి ఆలయ ప్రాంతం మీదుగా SOS జంక్షన్ నుండి పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు ప్రధాన రహదారికి అనుసంధానించే 66 అడుగులు వెడల్పు గల రహదారి భీమునిపట్నం టౌన్ సర్వే నెంబర్లు 154p, 163p, 170p, 171p, 179p, 182p, 183p, 184p, 185p, 186p, 187p, 188p, 190p, 191p, 192p, 193p, 196p, 201p, 207p, 211p, 212p, 221p, 222p, 223p, 225p, 244p, 254p, 255p, 258p, 259p, 307p, 311p, 313p, 314p, 315p, 341p, 342p, 384p, 584p, 1094p, 1094p, 1095p, 1147p, 1148p, 1092p, 1149p, 1255p, 1496p, 1492p, 1503p, 1509/2p, 1508p, 1521p, 1522p, 1524p, 1523p సదరు రోడ్డు 66 అడుగులుగా ఆమోదం పొందిన మాస్టర్ ప్లాన్.జి.వో.ఎం.ఎస్.నెం.136, తేది.08.11.2021 నందు ప్రతిపాదించియున్నారు.

| S.No | Proposed Road width as per Draft RDP | Right Side | Left Side | Total |
|---|---|---|---|---|
| 1 | 66ft | 54(R1-R54) | 66(L1-L66) | 120 |

అందువల్ల, ప్రజలు తమ అభ్యంతరాలు/ సూచనలు జి.వి.యం.సి. నందు సమర్పించి సమాచారము అందజేయవలసినదిగా కోరడమైనది. దీనికి సంబంధించి శ్రీ నరసింహ స్వామి ఆలయ ప్రాంతం మీదుగా SOS జంక్షన్ నుండి పోలీస్ స్టేషన్ జంక్షన్ వరకు 2.00 కి.మీ పొడవుతో కలుపుతూ 66 అడుగుల వెడల్పు గల మాస్టర్ ప్లాన్ రహదారికి సంబందించిన RDP పై ఆమోదానికి సంబందించి GVMC ద్వారా ఈ నోటిఫికేషన్ వెలువడిన తేది నుండి 15 రోజులలోపు సూచనలు/ అభ్యంతరములు మొదలగునవి లేనట్లయితే రహదారి అభివృద్ధి ప్రణాళిక RDP యొక్క ఆమోదము నిబంధనల ప్రకారము ప్రాసెస్ చేయబడుతుంది.

కమీషనర్,
జి.వి.యం.సి.



కెనరా బ్యాంక్ Canara Bank

ప్రాంతీయ కార్యాలయం : విశాఖపట్నం-I
#9-29-15/7, పద్మావతి టవర్స్, బాలాజీ నగర్, సిరిపురం, విశాఖపట్నం-530003.

ఋణగ్రహీత/హామీదారు/తనఖాదారులకు డిమాండ్ నోటీసు

టు:
1) శ్రీమతి అళ్ల సత్యవతి, భర్త: ఎ. సత్యా రావు, 14-84-1, శారదానగర్, GJ కాలేజ్ దగ్గర, వార్డు 71, GVMC, పెందుర్తి, విశాఖపట్నం, ఆంధ్రప్రదేశ్.
2) శ్రీ కాండ్రేగుల వెంకటేష్, తండ్రి: చిన్నారావు, 12-58, గవర, జగ్గయ్యపాలెం, పెందుర్తి.

డియర్ సర్/మేడమ్,

విషయం: సెక్యూరిటైజేషన్ అండ్ రీకన్‌స్ట్రక్షన్ ఆఫ్ ఫైనాన్షియల్ అసెట్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఆఫ్ సెక్యూరిటీ ఇంటరెస్ట్ చట్టం, 2002 లోని సెక్షన్ 13(2) ప్రకారం డిమాండ్ నోటీసు.

మా కెనరా బ్యాంక్, విశాఖపట్నం అక్కయ్యపాలెం బ్రాంచ్ నుండి శ్రీమతి అళ్ల సత్యవతి వారు పొందిన ఋణసౌకర్యాల వివరములు:

| లోన్ స్వభావం & లోన్ అకౌంట్ నెం. | లోన్ మొత్తం మరియు లోన్ తేది | తేది నాటికి బకాయి మొత్తం వడ్డీతో | వడ్డీ రేటు |
|---|---|---|---|
| OSL-SYNDMORTGAGE-BR A/c No.35877830000057 | 25-05-2015 తేదీన రూ.20,00,000/- | రూ. 3,23,058.19/- | 10.75% |

మాకు తనఖా పెట్టిన వ్యక్తి / వ్యక్తులచే వ్రాసి ఇవ్వబడిన సంబంధిత డాక్యుమెంట్ల ద్వారా ఈ నోటీసును షెడ్యూలులో వివరించిన ఆస్తుల తనఖా ద్వారా పైన తెలిపిన ఋణాలు / ఋణసౌకర్యాలకు తగు విధంగా హామీ కల్పించబడినది. పేర్కొన్న నియమ నిబంధనల ప్రకారం తమ ఋణాలను చెల్లించడంలో పైన తెలిపిన మీరు విఫలమైనందున బ్యాంక్ సదరు ఋణాన్ని 29-05-2026 తేదీన నిరర్ధక ఆస్తి (ఎన్.పి.ఎ) గా వర్గీకరించింది. అందువలన ఈ నోటీసు తేది నుండి 60 రోజులలోగా రూ.3,23,058.19/- (అక్షరాల మూడు లక్షల ఇరవై మూడు వేల యాభై ఎనిమిది రూపాయల పంతొమ్మిది పైసలు మాత్రమే) + తదుపరి వడ్డీ, ఖర్చులు కలిపి మొత్తమును చెల్లించవలసిందిగా కోరుతూ సంబంధిత చట్టంలోని సెక్షన్ 13(2) క్రింద మీకు ఇందుమూలముగా ఈ నోటీసు జారీ చేయుచున్నాము. చెల్లించడంలో విఫలమైతే సదరు చట్టంలోని సెక్షన్ 13(4) క్రింద అన్ని లేదా ఏవేని హక్కును మేము వినియోగించుకుంటాము. ఇంతే కాకుండా మా ముందస్తు సమ్మతి లేకుండా ఏ విధంగానూ షెడ్యూలులో తెలిపిన ఏ సెక్యూర్డ్ ఆస్తులతో ఏ రకంగానూ వ్యవహరించకుండా మీరు నిరోధింపబడుచున్నారు. సదరు చట్టం మరియు/ లేదా అమలులో ఉన్న చట్టం క్రింద లభించే ఏవేని ఇతర హక్కుకు ఎటువంటి ప్రతికూల అభిప్రాయం లేకుండా ఈ నోటీసు ఇవ్వబడింది.

SARFAESI చట్టం నందలి సెక్షన్ 13, సబ్ సెక్షన్ (8) ప్రకారము మీరు తనఖా ఆస్తులను విడిపించుకోవటానికి ఉన్న కాలవ్యవధిని వినియోగించుకోగలరని సూచించడమైనది. మా బ్రాంచ్ రికార్డులో అందుబాటులో ఉన్న మీ చిరునామాకు తిరుగు రశీదుతో కూడిన రిజిష్టర్డ్ పోస్టు ద్వారా డిమాండ్ నోటీసు పంపించడం జరిగింది.

తనఖా / తాకట్టు వుంచిన ఆస్తి యొక్క నిర్దిష్ట వివరాలు దిగువ పేర్కొనబడినవి

ASSET ID: 400087144292 : విశాఖపట్నం జిల్లా, గాజువాక SRO, GVMC యొక్క పరిధి, పెందుర్తి మండలం, సరవ గ్రామం, సర్వే నెం.402/3, 4 నందు విస్తీర్ణం 860 చ॥గ॥లు ఖాళీ స్థలంలో తూర్పు వైపున విస్తీర్ణం 430 చ॥గ॥లు లేదా 359.53 చ॥మీ॥ల స్థలం కలదు. హద్దులు: తూర్పు: అల్లా భులి రాజు గారికి చెందిన భూమి, దక్షిణం: 30 అ॥ల రోడ్డు మరియు ఎ. పైడిశెట్టి గారికి చెందిన ఆస్తి, పడమర: విక్రేత అల్లా సత్యారావు గారికి విక్రయించిన భూమి, ఉత్తరం: అదారి అప్పలనాయుడు మరియు ఇతరుల భూమి. కొలతలు: తూర్పు: 90 అ॥లు లేదా 27.43 మీటర్లు, దక్షిణం: 43 అ॥లు లేదా 13.10 మీటర్లు, పడమర: 90 అ॥లు లేదా 27.43 మీటర్లు, ఉత్తరం: 43 అ॥లు లేదా 13.10 మీటర్లు.

టైటిల్ హోల్డర్: శ్రీమతి అళ్ల సత్యవతి

తేది: 03.06.2026, ప్రదేశం: విశాఖపట్నం సం/– అధీకృత అధికారి, కెనరా బ్యాంక్

## ముగిసిన జ్ఞాన ప్రకాష్ శిక్షణా తరగతులు..

### తరగతులను పరిశీలించిన ఉపవిద్యాశాఖాధికారి" పెన్నాడ అప్పారావు"



నక్కపల్లి, జూన్ 09, ప్రభాతవార్త

ఈనెల నాలుగు నుండి ఒకటి, రెండు తరగతులకు బోధిస్తున్న ఉపాధ్యాయులకు స్థానిక హైస్కూల్ లో నిర్వహిస్తున్న జ్ఞానప్రకాష్ శిక్షణాతరగతులు మంగళవారంతో ముగిశాయి. కోర్స్ కో- ఆర్డినేటర్ వి.బాలాజీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతులను స్థానిక మండలవిద్యాశాఖాధికారులు కే.నరేష్, రుత్తల నాగన్న దొర లు ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తున్నారు మంగళవారం శిక్షణాతరగతులు ముగింపు సందర్భంగా యలమంచిలి డివిజన్ జిల్లా ఉపవిద్యాశాఖాధికారి సందర్శించి ఉపాధ్యాయులకు పలు సూచనలను అందించారు. ఈ ఆరురోజుల తరగతులలో నేర్చుకున్న అంశాలను ఒక్కొక్కరినీ అడిగి తెలుసుకున్నారు.ఈ సందర్భంగా డివైఈవో పి.అప్పారావు మాట్లాడుతూ ప్రతీవిద్యార్థి 3 నుండి 9 సంవత్సరాల వయస్సుగల పిల్లలలో ప్రాథమిక అక్షరాస్యత సంఖ్యాజ్ఞానాన్ని సాధించడం దీని ప్రధాన ఉద్దేశ్యమన్నారు.శిక్షణ తరగతులలో నేర్చుకున్న అంశాల విద్యార్థులలో ప్రతిబింబించాలన్నారు.ఈ విద్యాసంవత్సరం పూర్తయ్యేసరికి ప్రతీ బిడ్డకు చదవడం, రాయడం,ప్రాథమిక గణితనైపుణ్యాలు వచ్చేలా చూడాలని, ఉపాధ్యాయులందరూ అంకితభావంతో పనిచేస్తే ఆశించిన ఫలితాలను సాధిస్తామన్నారు. విద్యాసంవత్సరం ప్రారంభం నుండే పిల్లలు చిన్నచిన్న పదాలను చదవగలగడం, అర్థం చేసుకోవడం, కనీసం నిముషానికి 60 పదాలను అనర్ఘళంగా చదవడం నేర్పాలన్నారు. ముఖ్యంగా పాఠశాలలో చిన్నారులకు ఆనందదాయకమైన వాతావరణంలో ఆట పాటలతో ఆసక్తిదాయకమైన బోధన చేస్తే సత్ఫలితాలు వస్తాయన్నారు.సమగ్రశిక్షా ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఈ తరగతులు సద్వినియోగం చేసుకుంటే మంచి ఫలితాలు సాధించవచ్చున్నారు.ప్రాథమిక స్థాయిలో అభ్యసన ఫలితాలు సాధనకు ఇది దోహదపడుతుందన్నారు.అనంతరం శిక్షణాతరగతుల ఏర్పాట్లపై ఆరా తీశారు. తరగతుల కో-ఆర్డినేటర్ వి.బాలాజీతోపాటు స్థానిక మండలవిద్యాశాఖాధికారులు నరేష్,నాగన్నదొర,స్థానిక హెచ్.ఎమ్. లను ఆయన ప్రత్యేకంగా అభినందించారు. ఈ కార్యక్రమంలో స్టేట్ కీ రిసోర్స్ పర్సన్ నర్సుపల్లి మోహన రావు, నక్కపల్లి,పాయకరావుపేట, రాయవరం మండలాల్లో ఒకటి,రెండు తరగతులు బోధించే ఉపాధ్యాయులు 106 మంది,ఉపాధ్యాయులు ఎన్.వి.ఎస్.ఆచార్యులు, సి.ఆర్.పీలు. దేవి,జ్యోతి,అప్పారావు, శేఖర్, గంగేశ్వరరావు లు వారివెంట ఉన్నారు.

## ఉపాధి కూలీ మృతి



కసింకోట, జూన్ 9, ప్రభాతవార్త

కసింకోట మండలంలో ఉపాధి హామీ పథకం పని ప్రదేశం దగ్గర పనిచేస్తున్న పేరంటాలపాలెం గ్రామానికి చెందిన మండపాక సత్యారావు (67) గ్రామపంచాయతీ నందు పని ప్రదేశంలో ఉదయం ఏడు గంటల 30 నిమిషాలకు పనిచేస్తుండగా సత్యారావు అస్వస్థకు గురవడంతో ఏపీ ఓ ఎం.శ్రీనివాసరావు, వీఆర్పీ చినబాబు అనకాపల్లి ఎన్టీఆర్ హాస్పిటల్‌కి చికిత్స నిమిత్తం ఎన్టీఆర్ హాస్పిటల్‌కి తరలించారు. అక్కడ వైద్యులు సత్యారావుని పరిశీలించగా మృతి చెందినట్లుగా నిర్ధారించారు. అక్కడనుండి మృతుడిని తిరిగి పేరంటాలపాలెం స్వగ్రామైన పేరంటాలపాలెంలో గల మృతుడి కుటుంబ సభ్యులకు అప్పగించారు.

## ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమిస్తే చర్యలు తప్పవు : ట్రాఫిక్ సీఐ వెంకటనారాయణ



అనకాపల్లి జూన్ 9 , ప్రభాతవార్త

ట్రాఫిక్ నిబంధనలు అతిక్రమించిన వారిపై చర్యలు తప్పవని ట్రాఫిక్ సిఐ వెంకటనారాయణ హెచ్చరించారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ తుహిన్ సింహ ఆదేశాల మేరకు అనకాపల్లి డి.ఎస్.పి ఎం శ్రావణి ఉత్తర్వులు మేరకు అనకాపల్లి ట్రాఫిక్ ఇన్స్పెక్టర్ ఎం వెంకట్ నారాయణ అనకాపల్లి పట్టణంలోని గాంధీ కూరగాయల మార్కెట్ నందు మంగళవారం ట్రాఫిక్ నిబంధనలపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మార్కెట్ నందు ఉన్న ప్రజలు స్వయంగా ఎవరికి వారు ట్రాఫిక్ రూల్స్ పాటించి మార్కెట్‌లో ఎటువంటి ట్రాఫిక్ అంతరాయం కలిగించకుండా బాధ్యత తీసుకోవాలని , మార్కెట్ కి వచ్చిపోయే వాహనాలను డీసీఎంఎస్ స్థలం నందు పార్కింగ్ చేసుకోవాలని సూచించారు. ఎవరైనా ట్రాఫిక్ అంతరాయం కలిగించిన యెడల వాహనాల పై కేసులు నమోదు చేస్తామని హెచ్చరించారు. మార్కెట్ లో తోపుడు బళ్ళు, రోడ్డు పక్కన ఉన్న షాపులు యజమానులతో మాట్లాడి ఎవరికీ ఎటువంటి ఇబ్బంది కలగకుండా తమ వ్యాపారాలు చేసుకోవాలని తెలియజేశారు.

## ఘనంగా శ్రీ సోమలమ్మ తల్లి పండుగ మహోత్సవం

కసింకోట, జూన్ 9, ప్రభాతవార్త



మండలంలోని తాళ్లపాలెం శివారు బంగారయ్య పేట గ్రామంలో శ్రీ సోమలమ్మ తల్లి అమ్మవారి పండుగ మహోత్సవం మంగళవారం ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆలయంలో ప్రత్యేక పూజలు నిర్వహించారు. బిజెపి రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొన్నగంటి అప్పారావు, మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షుడు గొంతిన శ్రీనివాసరావు, నైనంసెట్టి రమణారావు, అల్లు రామకృష్ణ తదితరులు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ కార్యక్రమంలో ఉత్సవ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

## అనకాపల్లి జిల్లాలో ఘనంగా మొబైల్ ఫోన్ల రికవరీ మేళా

### రూ.1.65 కోట్ల విలువైన 808 మొబైల్స్ బాధితులకు అందజేసిన జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా



అనకాపల్లి, జూన్ 9, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ ఆధ్వర్యంలో మంగళవారం జిల్లా పోలీసు కార్యాలయంలో 12వ విడత మొబైల్ రికవరీ మేళా అత్యంత ఘనంగా నిర్వహించారు. జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా చేతుల మీదుగా రికవరీ చేసిన సుమారు రూ.1.65 కోట్ల విలువైన ఆపిల్, శాంసంగ్, వివో, రెడ్మీ వంటి వివిధ ప్రముఖ కంపెనీలకు చెందిన 808 మొబైల్ ఫోన్లను వాటి అసలు యజమానులకు అందజేశారు. అనకాపల్లి జిల్లా చరిత్రలోనే ఇంత పెద్ద మొత్తంలో ఒకేసారి మొబైల్ ఫోన్లను స్వాధీనం చేసుకోవడం ఇదే ప్రథమం. సందర్భంగా జిల్లా ఎస్పీ మాట్లాడుతూ సాధారణ ప్రజలకు మొబైల్ అనేది కేవలం ఒక వస్తువు కాదు, వారి జీవితకాల జ్ఞాపకాలు, వ్యక్తిగత సమాచారం అందులోనే ఉంటాయి. ఇటీవల కాలంలో మొబైల్ ఫోన్లు పోయినట్లు వస్తున్న ఫిర్యాదులపై ప్రత్యేక దృష్టి సారించాం. బాధితులకు త్వరితగతిన న్యాయం చేయాలనే లక్ష్యంతో ప్రత్యేక సెల్ (ఐటీ కోర్) ఏర్పాటు చేసి, నిరంతర పర్యవేక్షణ చేయడం వల్లే ఈ అద్భుతమైన ఫలితం సాధ్యమైంది. ఎంతో వ్యయప్రయాసలకోర్చి, సాంకేతిక పరిజ్ఞానంతో ఇతర రాష్ట్రాల నుండి కూడా ఫోన్లను రికవరీ చేసిన పోలీసు సిబ్బందిని మనస్ఫూర్తిగా అభినందించారు. ప్రశంసా పత్రాలు నగదు రివార్డులు అందజేశారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ శ్రీ ఎల్.మోహన్ రావు, ఎస్పీ డిఎస్పి జి.ఆర్.ఆర్.మోహన్, సైబర్ సెల్ ఇన్స్పెక్టర్ కె.సతీష్ కుమార్, ఇన్స్పెక్టర్లు బాలసూర్య రావు, శ్రీనివాసరావు, లక్ష్మి, సేనం రమేష్, పిల్లా రమేష్, ఐటి కోర్ ఎస్ఐ బి.సురేష్ బాబు ఐటీ విభాగపు సిబ్బంది పాల్గొన్నారు.

## రైతులు సిఫార్సు మేర ఎరువులు వినియోగించాలి

### వ్యవసాయ అధికారి ఉమా ప్రసాద్


(నక్కపల్లి/ అడ్డు రోడ్డు ,ప్రభాతవార్త)



ఖేత్ బచావో అభియాన్ ప్రచారంలో భాగముగా ఉద్దండపురములో ఆరోగ్యమైన నేల, అధిక దిగుబడి, అధిక ఆదాయం దిశగా అవగాహన కార్యక్రమాన్ని ఏవో ఉమా ప్రసాద్ అధ్యక్షతన మంగళవారం నిర్వహించారు. ఇందులో భాగముగా నేల ఆరోగ్యాన్ని పరిరక్షించడం, రసాయన ఎరువుల అధిక వినియోగాన్ని తగ్గించడం, నేల పరీక్షల ఆధారంగా ఎరువుల వినియోగాన్ని ప్రోత్సహించడం, సేంద్రీయ, సహజ వ్యవసాయ పద్ధతులను ప్రోత్సాహించడం, రైతుల ఆదాయాన్ని పెంచడం, పర్యావరణాన్ని సంరక్షించడం పై పూర్తిస్థాయిలో వివరించారు. ఈ విధముగా చేయడం వలన భూమి నీ కాపాడటంతో పాటు రైతు ను బలోపేతం చేయవచ్చు అనేది తెలియజేశారు. రైతులకు ఏపిపి ఎయిమ్స్ యాప్ ద్వారా యూరియా, డిఏపీ విక్రయాలు మరియు వెబ్లాండ్ లేని రైతులకు కూడా ఎరువులు అందేలా సాగు చేసే ప్రతీ రైతు కు ఎరువులు అందేలా చర్యలు చేపట్టడం కోసం అవి సూచనలు చేశారు. ఏఈఓ సత్యనారాయణ శ్రీనివాస్, సాయి, వీఏఏ ప్రశాంతి, ఆర్ఎస్ కే సిబ్బంది, పాక్స్ సిబ్బంది, రిటైల్ దారులు, రైతులు పాల్గొన్నారు.

## యోగా టీచర్లకు రేపు ఇంటర్వ్యూలు

(ఎస్ రాయవరం,జూన్ 9, ప్రభాతవార్త )



కొరుప్రోలు ఆయుర్వేదిక్ వైద్యశాలలో యోగా టీచర్లకు గురువారం ఇంటర్వ్యూలు నిర్వహిస్తున్నామని, కొరుప్రోలు ఆయుర్వేదిక ఇన్చార్జ్ డాక్టర్ సుజాత ఒక ప్రకటన తెలియజేశారు. ఆసక్తి గల యోగ టీచర్ (ఇన్స్ట్రక్టర్), ఉంటే గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు ఇంటర్వ్యూలో పాల్గొనవచ్చునన్నారు. పురుషుల్లో విభాగం ఒకరు, స్త్రీ విభాగం ఒకరు అవసరమై ఉన్నారని అన్నారు.ఈ ఇంటర్వ్యూలో పాల్గొనదలచిన వారు ఈ నెంబరుని 87903 63344 సంప్రదించాలన్నారు.



## ఘనంగా ఆంజనేయస్వామి ఆలయ వార్షికోత్సవం

నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

మండలంలోని చిన్న తీనార్ల గ్రామంలో అత్యంత వైభవంగా అభయ ఆంజనేయ స్వామి ఆలయ 21వ వార్షికోత్సవాన్ని మంగళవారం ఆలయ ధర్మకర్త కంబాల అమ్మోరయ్య ఆధ్వర్యంలో ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు అధికారులు దర్శించుకున్నారు ఏవో దెందుకూరు సీతారామరాజు, అడ్డు రోడ్డు సర్కిల్ సీఐ లడ్డు రామకృష్ణ, ఆదర్శ విద్యాసంస్థల అధినేత నల్లపు రాజు సీతారామరాజు తో పాటు చుట్టుపక్కల గ్రామాలకు చెందిన ప్రజలు పాల్గొని పూజలు చేశారు.

## మరణించిన స్టీల్ ప్లాంట్ కార్మికులకు కోటి రూపాయలు ఎక్స్‌గ్రేషియా ఇవ్వాలి: జిల్లా రైతు సంఘం

నక్కపల్లి, ప్రభాతవార్త

విశాఖపట్నం స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మికుల కుటుంబాలకు ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించాలి, గాయాలు అయిన కార్మికుల కు మెరుగైన వైద్యం అందించాలని, వార్కి ఒక్కొక్కరికి యాభై లక్షలు రూపాయలు నష్టపరిహారం చెల్లించాలని ఆంధ్రప్రదేశ్ రైతు సంఘం అనకాపల్లి జిల్లా కమిటీ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. గత ఆరు సంవత్సరాలు క్రితం విశాఖ పట్నం, గోపాలపట్నం వద్ద గల ఎల్.జీ.పాలిమర్స్ ప్రమాదంలో మరణించిన వార్కిగత సంవత్సరం అచ్చుతాపురం ప్రైవేటు ఎసెన్షియల్ ఫార్మా కంపెనీలో జరిగిన ప్రమాదంలో మరణించిన కార్మికులకు కోటి రూపాయలు నష్టపరిహారం చెల్లించారు అలాంటిది ప్రభుత్వ రంగ సంస్థ అయిన స్టీల్ ప్లాంట్ లో ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే జరిగిన ప్రమాదంలో మరణించిన వార్కి ఒక్కొక్కరికి కోటి రూపాయలు నష్టపరిహారం ఎందుకు చెల్లించరని ప్రశ్నించారు. మరణించిన వారి కుటుంబంలో ఒక్కొక్కరికి శాస్వత ప్రాతిపదికన ఉద్యోగం ఇవ్వాలని కోరారు.సరిపడా ఉద్యోగులు, కార్మికుల లేక ప్రస్తుతం పని చేస్తున్న వారు పై అదనపు పని భారం, నాణ్యమైన పరికరాలు లేకనే ప్రమాదం జరిగిందని కార్మికుల తెలుపుతున్న నేపథ్యంలో వెంటనే తొలగించిన కార్మికులను ఉద్యోగంలోకి తీసుకోవాలని, నాణ్యమైన ఉద్యోగులను సరిపడా నియమించాలని డిమాండ్ చేశారు.విశాఖపట్నం స్టీల్ ప్లాంట్ ను ప్రైవేటీకరణ చేసే ప్రతిపాదన రద్దు చేయాలని డిమాండ్ చేశారు.

## ఆర్టీసీ కాంప్లెక్స్ ప్రాంగణంలో ఆర్వో ప్లాంట్‌ను ప్రారంభించిన ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్







ఎలమంచిలి, జూన్ 09, ప్రభాతవార్త

పట్టణములోని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ (ఆర్టీసీ) ఆవరణలో లారస్ కంపెనీ సౌజన్యంతో ఏర్పాటు చేసిన ఆర్ఓ ప్లాంట్ ను సురక్షిత మంచినీటి సరఫరా కేంద్రాన్ని ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ మాట్లాడుతూ ప్రయాణికులకు స్వచ్ఛమైన, సురక్షితమైన తాగునీరు అందించాలనే లక్ష్యంతో ఏర్పాటు చేసినట్లు తెలిపారు. ప్రజా ఆరోగ్యమే పరిరక్షణలో భాగంగా ఇటువంటి సేవా కార్యక్రమాలు ఎంతో ఉపయోగకరమని పేర్కొన్నారు. సామాజిక బాధ్యతతో ముందుకు వచ్చి సదుపాయాన్ని కల్పించిన లారెన్స్ కంపెనీ ప్రతినిధులకు కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో ఆర్టిసి అధికారులు, పట్టణ జనసేన పార్టీ అధ్యక్షుడు బొద్దపు శ్రీనివాసరావు, పిఎసిఎస్ చైర్మన్ గోపి, జనసేన నాయకులు, ఊటకూటి రమేష్ నాయుడు, కొటారు శ్రీనివాసరావు, కర్రీ ఝాన్సీ, లాలం సోమినాయుడు, లవుడు లోవరాజు, లంకా ఉదయ్, బిశెట్టి శివ, రమేష్, కూటమి నాయకులు పాల్గొన్నారు.

## రైతులకు ఇబ్బందులు కలగకుండా అధికారులు సమన్వయంతో పనిచేయాలి

### జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్



అనకాపల్లి, జూన్ 9, ప్రభాతవార్త

జిల్లాలో ఎరువుల లభ్యత, వ్యవసాయ ప్రణాళికల అమలుపై వ్యవసాయ శాఖ అధికారులు నిర్లక్ష్యంగా వ్యవహరించరాదని జిల్లా కలెక్టర్ విజయ క్రిష్ణన్ హెచ్చరించారు. ఎరువుల అంశంపై ఇప్పటి వరకు ప్రత్యేక సమావేశం నిర్వహించకపోవడం, క్షేత్రస్థాయి వెరిఫికేషన్ నివేదికలు సమర్పించడంలో జాప్యం చేయడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. మంగళవారం కలెక్టరేట్ నుండి వీడియో కాన్ఫరెన్స్ ద్వారా వ్యవసాయ శాఖ అధికారులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ, ఎరువుల సరఫరా, పంపిణీ ప్రక్రియలను అధికారులు నిరంతరం పర్యవేక్షించాలని ఆదేశించారు. రైతులకు ఎలాంటి కొరత తలెత్తకుండా ముందస్తు ప్రణాళికతో పనిచేయాలని సూచించారు. లక్ష్యాల సాధనలో ఎలాంటి లోపాలు ఉండకూడదని, అందుబాటులో ఉన్న సిబ్బందిని పూర్తిస్థాయిలో వినియోగించి పనులను వేగవంతం చేయాలని చెప్పారు. ఎరువుల సరఫరాలో శాఖల మధ్య సమన్వయం కీలకమని కలెక్టర్ పేర్కొన్నారు. విశాఖపట్నం నుంచి మునగపాక, కసింకోట వంటి మండలాలకు ఎరువులు చేరిన వెంటనే సంబంధిత అధికారులు తమ పరిధిలోని సహకార సంఘాలు, గోదాములు, ప్రైవేట్ ఎరువుల దుకాణాలకు పంపిణీ జరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. వ్యవసాయ అధికారులు తమ పర్యటన ప్రణాళికలను తహశీల్దార్లు, ఎంపీడీవోలు, సీఎస్‌కే సిబ్బందికి ముందుగానే తెలియజేయాలని సూచించారు. శాఖల మధ్య సమన్వయం లోపిస్తే సహించబోమని కలెక్టర్ హెచ్చరించారు. క్షేత్రస్థాయిలో రైతులకు ఎలాంటి ఇబ్బందులు తలెత్తకుండా అధికారులు అప్రమత్తంగా వ్యవహరించాలని స్పష్టం చేశారు.ఈ సమావేశంలో జాయింట్ కలెక్టర్ శౌర్య మాన్ పటేల్, డి ఆర్ ఓ., వై.సత్యనారాయణ రావు, జిల్లా స్థాయి అధికారులు, వ్యవసాయ శాఖ అధికారులు, మండల స్థాయి సిబ్బంది పాల్గొన్నారు.

## పూడిమడకలో ఉచిత వైద్య శిబిరం

### పిల్లలు, సాధారణ రోగులకు ఆరోగ్య పరీక్షలు - ఉచిత మందుల పంపిణీ

అచ్చుతాపురం, జూన్ 9 ప్రభాతవార్త



మండలంలోని పూడిమడక గ్రామంలో ఇషాన్ పిల్లల ఆసుపత్రి ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత వైద్య శిబిరం నిర్వహించారు. ప్రముఖ శిశు వైద్య నిపుణుడు డా.ధర్మిరెడ్డి వెంకట్ (ఎం.బి.బి.ఎస్., డి.సి.హెచ్., పీజీపియన్) ఆధ్వర్యంలో జరిగిన ఈ శిబిరానికి గ్రామస్తులు విశేష స్పందన చూపారు. శిబిరంలో చిన్నారులు, సాధారణ రోగులకు సమగ్ర ఆరోగ్య పరీక్షలు నిర్వహించి వైద్య సేవలు అందించారు. ఎదుగుదల లోపాలు, జ్వరం, వాంతులు, విరోచనాలు, దగ్గు, జలుబు తదితర ఆరోగ్య సమస్యలతో వచ్చిన వారికి వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులు పంపిణీ చేశారు. రక్తహీనత (అనీమియా) గుర్తింపు కోసం ప్రత్యేక పరీక్షలు చేపట్టి అవసరమైన వైద్య సూచనలు అందించారు. డా. ధర్మిరెడ్డి వెంకట్ మాట్లాడుతూ, పిల్లల ఆరోగ్యమే కుటుంబానికి, సమాజానికి నిజమైన సంపద అని అన్నారు. చిన్నారుల్లో పోషకాహార లోపం, రక్తహీనత, ఎదుగుదల సమస్యలను ప్రారంభ దశలోనే గుర్తించి తగిన చికిత్స అందిస్తే భవిష్యత్తులో ఆరోగ్యవంతమైన జీవనానికి బాటలు పడతాయని పేర్కొన్నారు. తల్లిదండ్రులు పిల్లల ఆరోగ్యంపై నిరంతరం శ్రద్ధ వహిస్తూ సమతుల్య పోషకాహారం అందించాలని సూచించారు. గ్రామీణ ప్రాంత ప్రజలకు నాణ్యమైన వైద్య సేవలు చేరువ చేయాలనే లక్ష్యంతో ఇటువంటి ఉచిత వైద్య శిబిరాలను నిర్వహిస్తున్నట్లు ఆయన తెలిపారు. శిబిరంలో పాల్గొన్న ప్రజలు వైద్యులకు కృతజ్ఞతలు తెలియజేస్తూ, గ్రామీణ ప్రాంతాల్లో ఇలాంటి సేవా కార్యక్రమాలు మరింత విస్తృతంగా నిర్వహించాలని కోరారు.

## చింతకాయలు విజయ్‌ను సత్కరించిన హోంమంత్రి అనిత



(నక్కపల్లి, ప్రభాతవార్త

టిడిపి రాష్ట్ర నాయకత్వం జాతీయ అధ్యక్షులు ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో యువ నాయకుడు చింతకాయల విజయ్‌ను రాజ్యసభ కు పంపించడం పట్ల హర్షం వ్యక్తం చేస్తూ రాష్ట్ర హోం మంత్రి వంగలపూడి అనిత ఘనంగా సత్కరించారు. ఇది ఉత్తరాంధ్రకే ఒక గొప్ప కానుకని అభివర్ణించారు. ఈ సందర్భంగా రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉప ముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్, రాష్ట్ర పార్టీ అధ్యక్షులు పల్లా శ్రీనివాస్, విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ లతోపాటు పార్టీ అధిష్టానానికి కృతజ్ఞతలు తెలిపారు. ఈ మేరకు రాజ్యసభకు ఎన్నికైన చింతకాయల విజయను రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు చాంబర్లో జిల్లా పార్టీ అధ్యక్షులు బత్తుల తాతయ్య బాబు నాయుడు, జిల్లా పార్టీ ప్రధాన కార్యదర్శి లాలం కాశీనాయుడు లు మర్యాదపూర్వకంగా కలిసి శుభాకాంక్షలు తెలిపారు.






## హైకోర్టు స్టేటస్‌కో ఉల్లంఘన..?

### బావనాఋషి స్వామి ఆలయ భూమిలో ప్రహరీ గోడ నిర్మాణంపై వివాదం - రెండుదశాబ్దాలుగా నష్టపరిహారం చెల్లించలేదని ఆలయ కమిటీ ఆరోపణ




అచ్చుతాపురం జూన్ 9 ప్రభాతవార్త

దుప్పితూరు గ్రామంలోని శ్రీ భద్రావతి సమేత బావనా ఋషి స్వామి ఆలయానికి చెందిన భూమిలో ఏపిఐఐసి అధికారులు ప్రహరీ గోడ నిర్మించడంపై వివాదం నెలకొంది. హైకోర్టు యథాస్థితి (స్టేటస్‌కో) ఉత్తర్వులు అమల్లో ఉండగానే గోడ నిర్మాణం చేపట్టారని ఆలయ పరిరక్షణ కమిటీ ఆరోపించింది. ఈ ఘటనపై భక్తులు, పద్మశాలి సంఘాల ప్రతినిధులు ఆందోళన వ్యక్తం చేశారు. ఆలయ కమిటీ సభ్యుల కథనం ప్రకారం, 2004లో ఏపిఐఐసి పరిశ్రమల అభివృద్ధి కోసం ఆలయానికి చెందిన భూమిని భూసేకరణలో భాగంగా తీసుకుంది. అయితే ఇప్పటి వరకు ఆలయానికి ఎలాంటి నష్టపరిహారం చెల్లించలేదని వారు పేర్కొన్నారు. గత నెలలో భూమి చుట్టూ ఐరన్ ఫెన్సింగ్ ఏర్పాటుకు అధికారులు ప్రయత్నించడంతో ఆలయ కమిటీ హైకోర్టును ఆశ్రయించింది. ఈ వ్యవహారంపై విచారణ జరిపిన హైకోర్టు భూమిని యథాస్థితిలో ఉంచాలని ఆదేశాలు జారీ చేసినట్లు కమిటీ సభ్యులు తెలిపారు. అయినప్పటికీ మంగళవారం ఆలయ భూమి చుట్టూ ప్రహరీ గోడ నిర్మాణం చేపట్టారని ఆరోపించారు.

**చర్యలు తీసుకోవాలని డిమాండ్**

హైకోర్టు ఉత్తర్వులను ఉల్లంఘించిన అధికారులపై కోర్టు ధిక్కరణ చర్యలు తీసుకోవాలని ఆలయ కమిటీ డిమాండ్ చేసింది. అలాగే నిర్మించిన ప్రహరీ గోడను తొలగించి భూమిని యథాస్థితికి తీసుకురావాలని కోరింది. భూసేకరణకు సంబంధించి పెండింగ్‌లో ఉన్న నష్టపరిహారాన్ని ప్రస్తుత చట్టాల ప్రకారం వడ్డీతో సహా చెల్లించాలని విజ్ఞప్తి చేసింది. ఈ సందర్భంగా ఆలయ కమిటీ చైర్మన్ మాడెం సూరి అప్పారావు మాట్లాడుతూ, ఆలయ హక్కుల పరిరక్షణ కోసం చట్టబద్ధ పోరాటాన్ని కొనసాగిస్తామని తెలిపారు.

## చెరువుల అభివృద్ధితో గ్రామీణ ప్రగతికి బాటలు

### తంతడి చెరువులో వికసిత్ భారత్ - జీ రామ్ జీ ఉపాధి అమీ పథకం పనుల ప్రారంభం

అచ్చుతాపురం, జూన్ 9 ప్రభాతవార్త



గ్రామీణాభివృద్ధి, జలవనరుల పరిరక్షణ, ఉపాధి కల్పన లక్ష్యాలతో కేంద్ర ప్రభుత్వం ప్రతిష్ఠాత్మకంగా అమలు చేస్తున్న వికసిత్ భారత్- జీ రామ్ జీ ఉపాధి అమీ పథకం పనులను తంతడి పంచాయతీ పరిధిలోని తంతడి చెరువులో మంగళవారం ఘనంగా ప్రారంభించారు. తంతడి, రాజానపాలెం, వాడపాలెం, యాతపాలెం గ్రామాల ప్రజలు, కూటమి నాయకులు, స్థానిక ప్రజాప్రతినిధుల ఆధ్వర్యంలో కార్యక్రమం జరిగింది. చెరువుల పునరుద్ధరణ, భూగర్భ జలాల పెంపు, వ్యవసాయానికి సాగునీటి సౌకర్యాల మెరుగుదల, గ్రామీణ యువతకు ఉపాధి అవకాశాల కల్పన వంటి లక్ష్యాలతో ఈ పనులు చేపట్టినట్లు నాయకులు తెలిపారు. ఈ సందర్భంగా పలువురు మాట్లాడుతూ గ్రామాల అభివృద్ధికి చెరువుల సంరక్షణ ఎంతో కీలకమని పేర్కొన్నారు. ప్రభుత్వం చేపడుతున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గ్రామీణ ఆర్థిక వ్యవస్థకు బలోపేతంగా నిలుస్తాయని అన్నారు. చెరువుల పునరుద్ధరణతో భూగర్భ జలాలు పెరిగి రైతులకు, ప్రజలకు దీర్ఘకాలిక ప్రయోజనాలు చేకూరనున్నాయని వివరించారు. గ్రామాభివృద్ధి, పర్యావరణ పరిరక్షణ, ఉపాధి కల్పన అనే మూడు ప్రధాన లక్ష్యాలను సమన్వయం చేస్తూ చేపడుతున్న ఈ కార్యక్రమానికి స్థానిక ప్రజలు హర్షం వ్యక్తం చేశారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, రాజాన పద్మరాజు అప్పారావు, వంకా కృష్ణారావు, సత్యారావు, సత్యం, దేవుడు,గ్రామ పెద్దలు, మహిళలు, యువత, రైతులు పాల్గొన్నారు.

## ఉపాధి కూలీలకు వాటర్ బాటిళ్లు, హాట్‌బాక్స్‌లు పంపిణీ

( అచ్చుతాపురం జూన్ 9 ప్రభాతవార్త )



మునగపాక మండుతున్న ఎండల్లో ఉపాధి హామీ పనుల్లో శ్రమిస్తున్న కూలీలకు తలవత్తు సాయంగా వైఎస్సార్‌సీపీ నాయకులు ముందుకొచ్చారు. అనకాపల్లి జిల్లా యలమంచిలి నియోజకవర్గం మునగపాక మండల కేంద్రంలో ఉపాధి హామీ పనులు నిర్వహిస్తున్న కూలీలకు వైఎస్సార్‌సీపీ అనకాపల్లి జిల్లా అధ్యక్షుడు, పార్లమెంట్ నియోజకవర్గ సమన్వయకర్త బొడ్డేడ ప్రసాద్ తన సొంత నిధులతో వాటర్ బాటిళ్లు, హాట్‌బాక్స్‌లను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఉపాధి హామీ పనుల ద్వారా గ్రామాభివృద్ధికి తోడ్పడుతూ కుటుంబాలను పోషిస్తున్న కూలీలు సమాజానికి వెన్నెముక వంటివారని పేర్కొన్నారు. ఎండ తీవ్రత పెరుగుతున్న నేపథ్యంలో వారి ఆరోగ్యాన్ని దృష్టిలో ఉంచుకొని ఈ సహాయం అందజేసినట్లు తెలిపారు. శ్రమజీవుల సంక్షేమానికి ఎల్లప్పుడూ అండగా నిలుస్తామని చెప్పారు. కార్యక్రమంలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, గ్రామ పెద్దలు, కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. కూలీలు ఈ సహాయానికి కృతజ్ఞతలు తెలిపారు.

## కొండకర్ల జంక్షన్ వద్ద వాహనాల తనిఖీలు



అచ్చుతాపురం, జూన్ 9 ప్రభాతవార్త

అచ్చుతాపురం-అనకాపల్లి ప్రధాన రహదారిపై ఉన్న కొండకర్ల జంక్షన్ వద్ద మంగళవారం ఉదయం పోలీసులు ముమ్మర వాహనాల తనిఖీలు నిర్వహించారు. ఈ రహదారిలో తరచూ రోడ్డు ప్రమాదాలు జరుగుతున్న నేపథ్యంలో ప్రమాదాల నివారణ చర్యల్లో భాగంగా తనిఖీలు చేపట్టినట్లు పోలీసులు తెలిపారు. హెల్మెట్ లేకుండా ద్విచక్ర వాహనాలు నడిపిన వారిపై, అతివేగంగా ప్రయాణించిన వాహనాలపై, మద్యం సేవించి వాహనాలు నడిపిన వారిపై, డ్రైవింగ్ చేస్తూ మొబైల్ ఫోన్ మాట్లాడిన వారిపై కేసులు నమోదు చేసి జరిమానాలు విధించారు. వాహనదారులు ట్రాఫిక్ నిబంధనలు పాటించి సురక్షితంగా ప్రయాణించాలని పోలీసులు సూచించారు. ఈ తనిఖీలలో ఎస్ఐ సుధాకర్, మహిళా ఎస్ఐ గౌరీతో పాటు పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.

## రిసోర్స్ పర్సన్‌లకు ఘన సత్కారం

నక్కపల్లి, జూన్ 9, ప్రభాతవార్త



ప్రాథమిక పాఠశాలల ఉపాధ్యాయులకు నిర్వహిస్తున్న జ్ఞానప్రకాష్ శిక్షణాతరగతులు నేటితో విజయవంతంగా ముగియడంతో వివిధ మండలాల నుండి వచ్చి శిక్షణ ఇచ్చిన రిసోర్స్ పర్సన్ లను స్థానిక మండలవిద్యాశాఖాధికారులు కే.నరేష్,ఆర్.నాగన్నదొర, కోర్స్ కో -ఆర్డినేటర్ వి.బాలాజీ ఘనంగా సత్కరించారు. సమగ్రశిక్షా విశాఖపట్నం నుండి వచ్చిన జ్ఞాపికలు,శాలువాలతో ఘనంగా సత్కరించారు. వీరిలో స్టేట్ రిసోర్స్ పర్సన్ నర్సుపల్లి మోహనరావు తోపాటు తొమ్మిది మంది రిసోర్స్ పర్సన్ లను వేదమంత్రోచ్చారణల నడుమ ఘనంగా సత్కరించారు.శిక్షణలో నేర్చుకున్న అంశాల అనుగుణంగా పాఠశాలల్లో విద్యార్థులకు బోధించాలన్నారు.

## ఘనంగా వరసిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవం



నక్కపల్లి/ అడ్డురోడ్డు ప్రభాతవార్త

మండలంలోని ఉద్దండ పురం గ్రామంలో శ్రీ వరసిద్ధి వినాయకుని ఆలయ వార్షికోత్సవ కార్యక్రమం మంగళవారం వందలాది మంది భక్తులు నడుమ ఘనంగా నిర్వహించారు ఆలయ ప్రాంగణంలో పూజ కార్యక్రమం నిర్వహించి భక్తులకు ప్రసాదాలు అందజేశారు. ఈ సందర్భంగా స్వామివారిని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కార్యదర్శి వీసం రామకృష్ణ తోపాటు మండల పరిషత్ అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు ,జిల్లా పార్టీ కార్యదర్శి పొడగట్ల పాపారావు, మండల వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు గొర్ల గోవిందు, మాజీ సర్పంచులు పొడగట్ల వెంకటేశ్వరరావు, భార్గవ్ తో పాటు పలువురు దర్శించుకున్నారు.

vsp11:vsp11.qxd 09-06-2026 21:25 Page 1






## మోదకొండమ్మ ఆలయ నిర్వహణపై అపోహలు వద్దు

### ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు స్పష్టీకరణ



పాడేరు,జూన్9, ప్రభాతవార్త:

గిరిజన ఆరాధ్యదైవం పాడేరు మోదకొండ అమ్మవారు ఆలయ నిర్వహణ ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు ఆధ్వర్యంలో జవాబుదారి తనంతో జరుగుతూ వస్తుందని ఆలయ నిర్వహణ పై ఎటువండి అపోహలు ఎవరికి ఉన్నా నేరుగా ఆలయ నిర్వాహకులను సంప్రదిస్తే నిర్వహణ రికార్డులను అందజేస్తామని..గుడి ఆదాయం..ప్రతి ఖర్చుపై రికార్డుల్లో పొందుపరిచి ఉన్నా యని ఆలయ ప్రధాన కార్యదర్శి కిల్లు కోటిబాబు నాయుడు మంగళవారం విడుదల చేసిన ప్రకటనలో స్పష్టం చేసారు.అమ్మవారి ఆలయ నిర్వహణ,ఆదాయం,ఖర్చులు వ్యవహారంలో అనుమానాలు అపోహలు ఉన్న వారు నేరుగా ఆలయ గుమస్తాను సంప్రదించి వివరాలు ఆలయ నిర్వహణ రికార్డులు చూపిస్తారని ఆయన తెలిపారు.పాడేరు శ్రీ మోద కొండమ్మ అమ్మవారు గ్రామదేవత నుండి రాష్ట్రస్థాయి పండుగగా గుర్తింపు పొందినటువంటి శక్తి స్వరూపిని గిరిజన ప్రాంత ఆరాధ్యదైవంగా పేరు గాంచినటువంటి అమ్మవారు పదవ తరగతి పాఠ్యపుస్తకలలో ముద్రయించ బడినటువంటి అమ్మవారి గురించి లేనిపోని అపోహలు ఉన్న యెడలఆలయ లో గుమస్తాలు రికార్డుల ప్రకారము ప్రతి లావాదేవీలు నిర్వహించబడుతుంది నేరుగా ఎవరికైనా రికార్డులు పరిశీలించేటటువంటి హక్కు బాధ్యత ప్రతి భక్తులకు ఉంటుందన్నారు.దయచేసి అటువంటి ఆలోచన ఉన్నట్లయితే ఖచ్చితంగా ఆలయ కమిటీ వారిని సంప్రదిస్తే వారికి గుమస్తాల ద్వారా రికార్డులు పరిశీలించే టటువంటి బాధ్యత తీసుకుంటామన్నారు.అమ్మవారు ఎంతో పేరు ప్రతిష్టలు ఉన్నటు వంటి అమ్మవారిని దేని కోసమో వాడుకొని అమ్మవారి ప్రతిష్టను భంగం కలిగించే విధంగా ఉండకూడదన్నారు. ప్రతినెల అమ్మవారి జీతభత్యాలు, విద్యుత్ బిల్లులు నిమిత్తం 80 నుండి 90 వేల రూపాయలు నిర్వహణ..ఖర్చుఅవుతున్నాయని ప్రధాన కార్యదర్శి కోటిబాబు నాయుడు తెలిపారు.గత ప్రభుత్వాలు హయాంలో కూడా బహిరంగ లావాదేవీలు నిర్వహించడం లేదని అపోహలు ఉన్న వారు గమనించవలసిందిగా ఆయన కోరారు. ఒక్క రూపాయి కైనా ఆలయ కమిటీ ప్రధాన కార్యదర్శి పూర్తి బాధ్యత వహిస్తామని ఆయన స్పష్టం చేసారు.ఆలయ చైర్మన్ నిర్ణయించినటువంటి ఆలయ కమిటీ సమయం ఉన్నంత వరకు ప్రధాన కార్యదర్శిగా పూర్తి బాధ్యత వహిస్తామనికోటిబాబు నాయుడు స్పష్టం చేసారు.నూతన అమ్మవారి ఆలయ కమిటీవచ్చిన సమయం నుండి ఎన్ని అవాంతరాలు వచ్చినా వారానికి మూడు రోజులు అన్న ప్రసాద కార్యక్రమం నిర్వహించడం జరుగుతున్నదని ఆయన తెలియజేసారు.ఏడాదికి మూడు పర్యాయలు అమ్మవారి హుండీ లెక్కింపు కార్యక్రమం నిర్వహించడం జరుగుతుందన్నారు. మూడుసార్లు లెక్కింపులతో వచ్చిన హుండీ ఆదాయంతో మూడు పండగలు చేయవలసి ఉంటుందనీ..మొదటి పండుగ అమ్మవారి శాకాంబరీ పండుగ,.రెండవది అమ్మవారి తీర్థం మహోత్సవాలు,మూడవది అమ్మవారి జాతర పండగ ఇవన్నీటి కూడా అమ్మవారి ఖర్చులతో నిర్వహించడం జరుగుతున్నదని దయచేసి ఆలోచించవలసిందిగా ప్రధాన కార్యదర్శి కోటిబాబు కోరారు. కార్యక్రమంలో ఆలయ కమిటీ సభ్యులు చల్ల రామకృష్ణ,బోనంగి వెంకటరమణ,లకే రత్నాబాయి, కురసా లక్ష్మయ్య, కొణతాల సతీష్ పాల్గొన్నారు.

## మోసాలతో కూటమి ప్రభుత్వ పాలన : ఎమ్మెల్యే




పాడేరు, జూన్ 9, ప్రభాతవార్త:

వెన్నుపోటుకి రెండేళ్లు నిరసన కార్యక్రమంలో భాగంగా మంగళవారం పాడేరు ఎమ్మెల్యే క్యాంప్ కార్యాలయంలో శాసన సభ్యులు, అల్లూరి జిల్లా అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్వర్యంలో వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులతో కలిసి రౌండ్ టేబుల్ సమావేశం మంగళవారం నిర్వహించారు.కూటమి ప్రభుత్వం ఈ రెండేళ్లలో చేసిన మోసాలు ప్రభుత్వ వైఫల్యాలను వివరించారు.సమావేశం అనంతరం నల్ల బెలూన్లు ఎగరేసి నిరసన కార్యక్రమం చేపట్టారు,ఈ కార్యక్రమానికి ఉద్దేశించి ఎమ్మెల్యే మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం రెండేళ్ల పాలనలో ప్రజలకు ఇచ్చిన హామీలు అమలులో విఫలమైందని ప్రభుత్వంపై విమర్శించారు, ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలకు కనీసం నాయకులు పట్టించుకోవడం లేదని మండిపడ్డారు,ప్రజలందరూ గమనించి కూటమి ప్రభుత్వం చేస్తున్న కుట్రలకు, మోసాలకు రాబోయే ఎన్నికల్లో కూటమి ప్రభుత్వానికి తగిన బుద్ధి చెప్పాలని ఆయన పిలుపు నిచ్చారు. ఈ నెల 12వ తేదీన నియోజకవర్గం కేంద్రంలో పాడేరులో నిర్వహించ నున్న ర్యాలీకి పార్టీ నాయకులు, కార్యకర్తలు ప్రజలు పెద్ద ఎత్తున తరలివచ్చి విజయవంతం చేయాలని ఎమ్మెల్యే పిలుపునిచ్చారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు,మాజి డీసీసీబీ చైర్మన్ మినుముల సరస్వతి,జిల్లా మహిళా అధ్యక్షురాలు కురూస పార్వతమ్మ, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, నియోజకవర్గం మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడబారికి సురేష్ కుమార్,మాజీ ఏఎంసి చైర్మన్ లకే రామసత్యవతి, ఎంపీటీసీలు లకే రామకృష్ణ పాత్రుడు,దూసురు సన్యాసి రావు మాజీ సర్పంచులు వనుగు బసవన్న దొర, వంతల బొంజుబాబు,సిరగం దశమూర్తి,నాయకులు కిల్లు కోటిబాబు,బోనంగి రమణ, ముదిలి సుదర్శన్,పాంగి రాజేష్,పాంగి నాగరాజు,పాంగి సూరిబాబు,సీదరి లింగమూర్తి,వంతాల మహేశ్వరరావు మరియు లక్ష్మోజీ, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

## ఎరువుల దుకాణాన్ని పరిశీలించిన ఏడిఏ



దుంబ్రిగుడ, జూన్ 9 ప్రభాతవార్త:

మండలంలోని అరకు సంత బయలులో ప్రభుత్వ అనుసంధానంతో ఉన్నఎరువుల దుకాణాన్ని వ్యవసాయ శాఖ ఏడిఏ వి.మోహన్‌రావు మంగళవారం సందర్శించి తనిఖీ చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ వ్యవసాయం సాగు చేసే రైతులకు ప్రభుత్వ నిబంధనా లకు అనుగుణంగా అందించే నియమాలను పాటించి ఎరువులను పంపిణీ చేయాలని దుకాణ డీలర్లకు సూచించడం జరిగిందన్నారు. ప్రభుత్వం ద్వారా సప్లై చేసిన ఎరువులను సక్రమంగా అర్హులైన రైతులందరికి అందజేయాలనీ ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఆ శాఖ సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

## సీలేరులో 'ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్' 10 సంవత్సరాల వేడుకలు



గూడెం కొత్తవీధి,జూన్ 9 (ప్రభాతవార్త):

“ఆరోగ్యవంతమైన తల్లి, సురక్షితమైన బిడ్డ.. దేశానికి ఉజ్వల భవిష్యత్తు” అనే నినాదంతో సీలేరు ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో ప్రధానమంత్రి సురక్షిత మాతృత్వ అభియాన్ 10 సంవత్సరాల వేడుకలను ఘనంగా నిర్వహించారు. గూడెంకొత్తవీధి మండలం లోని సీలేరు పీహెచ్‌సీ పరిధిలో గల 51 గ్రామాల నుండి వచ్చిన 77 మంది గర్భిణీస్త్రీలకు ఈ సందర్భం గా ఉచిత వైద్య పరీక్షలు నిర్వహించారు. గర్భిణులకు రక్త , మూత్ర పరీక్షలు చేసి, వారికి అవసరమైన ఐరన్, క్యాల్షియం మాత్రలను ఉచితంగా పంపిణీ చేశారు. మాతృత్వ ప్రయాణాన్ని సురక్షితంగా కొనసాగించేందుకు ఈ కార్యక్రమం ఎంతో దోహదపడుతుందని వైద్యులు పేర్కొన్నారు. కార్యక్రమంలో సీలేరు వైద్యాధికారి డాక్టర్ ఓ. శ్రీ సాగర్, హెల్త్ సూపర్‌వైజర్ ఎన్. త్రినాథ్, స్టాఫ్ నర్స్ జే. రాణి, ల్యాబ్ టెక్నీషియన్ వి. శివ, ఫార్మసిస్ట్ జి. సాయికృష్ణ, హెల్త్ అసిస్టెంట్లు పి. రాజుబాబు, సుదర్శన్, ఏఎన్‌ఎంలు ఎం. గౌరమ్మ, కె.వి.ఎన్. కుమారి, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

## అరకులోయలో ఘనంగా బిర్సాముండా 126వ వర్ధంతి



అరకు రూరల్, జూన్ 9, ప్రభాతవార్త :

అల్లూరి జిల్లా అరకు లోయలో గిరిజన పోరాట పితామహుడు ధర్తీ అబా బిర్సా ముండా 126వ వర్ధంతి కార్యక్రమాన్ని ఆదివాసీ గిరిజన సంఘం ఆధ్వర్యంలో అరకు లోయ గిరిజనసంఘం భవనంలో మంగళవారం ఘనంగా నిర్వహించారు.బిర్సా ముండా చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళులర్పించారు.ఆదివాసీ గిరిజన సంఘం మండలం కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు అధ్యక్షతన జరిగిన ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం రాష్ట్ర కార్యదర్శి కిల్లో సురేంద్ర మాట్లాడుతూ బిర్సా ముండా “జల, జంగిల్, జమీన్” అనే నినాదంతో గిరిజన ప్రాంతంలో సర్వ హక్కులు గిరిజనులకే దక్కాలని పోరాడారు.బిర్స ముండా నినాదం నేటికీ గిరిజనుల జీవన హక్కుల పోరాటానికి స్ఫూర్తిగా నిలుస్తోందన్నారు. నాడు బ్రిటిష్ ప్రభుత్వంతో పోరాట ఫలితంగ నేడు గిరిజనులకు ప్రత్యేక చట్టాలు వచ్చాయని, వాటిని అమలు కోసం గిరిజనులు బిర్స ముండా పోరాట స్ఫూర్తితో యువత పోరాడాలిని,అడవి హక్కుల చట్టం, పెసా చట్టం పూర్తిస్థాయిలో అమలు చేయాలని ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు.జిల్లా కార్యదర్శి పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ 25 ఏళ్ల వయసులోనే బ్రిటిష్ సామ్రాజ్యాన్ని గడగడలాడించిన బిర్సా ముండా త్యాగం ప్రతి గిరిజన యువకుడికి స్ఫూర్తి కావాలన్నారు.ఆ స్ఫూర్తితోనే గిరిజన ప్రాంతంలో ఉన్నా నీరు, అడవి, భూమిలను రక్షించుకోవడానికి సంఘటితంగా ఉంటూ హక్కుల సాధనకు పోరాడాలని పిలుపునిచ్చా రు. కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన సంఘం మండల కార్యదర్శి గత్తుం బుజ్జి బాబు నాయకులు కె,రామారా వు ఓ, అప్పలస్వామి టీ,జోషి కె.సుబ్బారావు ఎస్, ఐసు బాబు, గాసి, రాజు, డొంబు, తదితరులు పాల్గొన్నారు.

## మండలంలో బిజెపి నూతన మోర్చాల అధ్యక్షుల నియామకం







గూడెంకొత్తవీధి, జూన్ 9, (ప్రభాతవార్త):

భారతీయ జనతా పార్టీ రాష్ట్ర మరియు జిల్లా అధిష్టానం ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధి మండలంలో వివిధ మోర్చాల నూతన అధ్యక్షులను నియమించినట్లు పార్టీ మండల అధ్యక్షుడు కాకూరు శేఖర్, మండల ఇన్‌ఛార్జ్ మరియు కిసాన్ మోర్చా జిల్లా అధ్యక్షుడు కదుల శ్రీనివాసరావు తెలిపారు. నూతన అధ్యక్షులు కిసాన్ మోర్చా మండల అధ్యక్షుడు లకే రాంబాబు (రాము),యువమోర్చా మండల అధ్యక్షుడు భౌడు సతీష్ దొర, ఓ.బీ.సీ మోర్చా మండల అధ్యక్షుడు చదరం మారిబాబు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ.. నూతనంగా నియమితులైన అధ్యక్షులు రాష్ట్ర, జిల్లా, మండల నాయకత్వంతో సమన్వయం చేసుకుంటూ పార్టీ బలోపేతానికి కృషి చేయాలని పిలుపునిచ్చారు. బిజెపి ఆశయాలకు అనుగుణంగా తమకు అప్పగించిన బాధ్యతలను తూచా తప్పకుండా నిర్వహించాలని వారు ఆకాంక్షించారు.

## పెట్రోలు, డీజీలు, వంటగ్యాస్ రేట్లు పెంపుదలకు సిపిఎం నిరసన




దుంబ్రిగూడ, జూన్ 9, ప్రభాతవార్త:

మండలంలోని అరకు సంతబయలు, పంచాయతీ కార్యాలయం వద్ద నేషనల్ హైవే రోడ్డులో పెట్రోల్ ,డీజిల్, వంటగ్యాస్ పెంపుదలపై సిపిఐఎం పార్టీ దుంబ్రిగూడ మండల నాయకులు పాంగి. సత్యనారయణ ఆద్వర్యంలోని శుక్రవారం నిరసన జరిగింది. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వామపక్ష పార్టీలు పిలుపులో భాగంగా ఈ కార్యక్రమం రాష్ట్ర వ్యాప్తంగా చేపట్టడం జరుగుతుందని చెప్పారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పెట్రోలు, డీజిల్, వంటగ్యాస్ ధరలు పెంచి ప్రజలపై విపరీతంగా భారం మోపుతుందని విమర్శించారు.ప్రపంచంలో ఏ దేశంలో లేనంతగా పెట్రోలియం ఉత్పత్తులపై పన్నులు మన దేశంలో విధిస్తున్నాయి. అలాగే దేశంలో ఏ రాష్ట్రం లో లేనంత ఎక్కువగా పెట్రోల్ పై 35%, డీజిల్ పై27%పన్నులు కూటమి ప్రభుత్వం వసూలు చేయడం దారుణమన్నారు. ఎన్నికలకు ముందు అదనపు పన్నులు తగ్గిస్తామని మాట ఇచ్చిన కూటమి ప్రభుత్వం మోసం చేసిందనీ, ఒక నయా పైసా తగ్గించలేదనీ మండి పడ్డారు. ధరలు విపరీతంగా పెంచడం వలన సామాన్యుల జీవితాలు రోడ్ల మీద పడ్డాయనీ,ఇప్పటికైనా కూటమి ప్రభుత్వం ధరలు తగ్గించాలని డిమాండ్ చేశారు, లేనియెడల దేశ వ్యాప్తంగా ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని చెప్పారు. కార్యక్రమంలో పాంగి. జైరాం, పట్టెదొర. నాగేష్, బురిడీ మహదేవ్, జన్ని. అప్పన్న, తదితరులు పాల్గొన్నారు.

## ఘనంగా ముగిసిన నక్కలపుట్టు అమ్మవారి ఉత్సవాలు





పాడేరు, జూన్ 9, ప్రభాతవార్త:

కిండంగ పంచాయితీ నక్కలపుట్టు గ్రామదేవత మోదకొండమ్మ వారి ఉత్సవాలు మంగళవారంతో ఘనంగా ముగిశాయి. ఈనెల ఏడవ తేదీ నుంచి ప్రారంభమైన అమ్మవారి ఉత్సవాలు మూడు రోజులు పాటు ఘనంగా ఉత్సవ నిర్వాహకులు నిర్వహించారు. చివరి రోజు మంగళవారం నక్కలపూడి జంక్షన్‌లో శతకం పట్టులో కొలువుదీరి ఉన్న అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, ఘటాలకు, పాదాలకు ఉత్సవ కమిటీ అధ్యక్షులు మోస్యాపాలవెల్లి, కొత్తేల త్రినాధ్, గ్రామపెద్దలు బొర్రా నాగరాజు,కర్రి రమణ, లింగేరి విశ్వనాధం ప్రత్యేక పూజలు నిర్వహించి ఉత్సవ విగ్రహానికి, ఘటాలకు, పాదాలకు శతకం పట్టు నుంచి బయటకు తీసుకు వచ్చి శతకంపట్టు నుంచి శిరస్సుపై పెట్టుకో డప్పువాయ్యాలతో నెలవేశాలతో భక్తులతో భారీ ఊరేగింపుగా అమ్మవారి ఆలయం వచ్చి అమ్మవారి ఉత్సవ విగ్రహానికి, ఘటాలకు, పాదాలకు ఆలయంలో ఉంచి ఉత్సవా లకు ముగింపు పలికారు. ఊరేగింపులో గ్రామస్తులు చిన్ని,అప్పలరాజు బాలరాజు, విశ్వనాధ్,పాపారావు భూపాల్,జనపరెడ్డి శ్రీను,వెంకట్, గ్రామస్తులు, భక్తులు అధిక సంఖ్యలో పాల్గొన్నారు.

## రైతు సంక్షేమమే కూటమి ప్రభుత్వ ధ్యేయం

### టిడిపి మండల అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య)

### అన్నదాతలకు విత్తనాలు పంపిణీ కార్యక్రమానికి ముఖ్యఅతిథిగా హాజరు





ముంచంగిపుట్టు, జూన్ 9, (ప్రభాతవార్త):

వ్యవసాయ రంగానికి అత్యంత ప్రాధాన్యతనిస్తూ, రైతుల సంక్షేమమే లక్ష్యంగా కూటమి ప్రభుత్వం పని చేస్తుందని, ముంచంగిపుట్టు మండల టీడీపీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య) అన్నారు.. ముంచం గిపుట్టు మండలం మండల కేంద్రంలో మంగళవారం మండల వ్యవసాయ శాఖ అధికారి గిరిడ మురళీకృష్ణ ఆధ్వర్యంలో ,రాబోయే వానాకాలం వ్యవసా సాగును దృష్టిలో ఉంచుకుని, రాయితీపై స్థానిక రైతులకు నాణ్య మైన విత్తనాలను టిడిపి మండల పార్టీ అధ్యక్షురాలు, కిల్లో సన్యాసమ్మ సంధ్య పార్టీ నాయకుల చేతుల మీదుగా అందజేశారు.ఈ సందర్భంగా సన్యాసమ్మ మాట్లాడుతూ రైతు బాగుంటేనే దేశం బాగుంటుందని, మన రైతన్నలకు ఎలాంటి ఇబ్బందులు రాకూడదనే ఉద్దేశంతోనే ఈ విత్తనాలను కూటమి ప్రభుత్వం సకాలంలో పంపిణీ చేస్తోందని, రాబోయే రోజుల్లో రైతులకు మరింత మేలు జరిగేలా కొత్త పథకాలు తీసుకు వస్తోందాన్ని స్పష్టం చేశారు.రైతే దేశానికి వెన్నుముక అని కూటమి ప్రభుత్వం రైతులకు ఎల్లప్పుడూ అండగా ఉంటుందని, నాణ్యమైన విత్తనాలు అందించి, మంచి దిగుబడులు సాధించడమే కాకుండా రైతులు ఆర్థికంగా అభివృద్ధి చెందడమే కూటమి ప్రభుత్వ లక్ష్యమన్నారు. నాయకులు పేర్కొన్నారు. ప్రజాప్రతినిధులు తమకు సకాలంలో విత్తనాలు అందించడంపై రైతులు హర్షం వ్యక్తం చేశారు. సకాలంలో విత్తనాలు అందడంతో సాగు పనులు వేగవంతం అవుతాయని రైతులు ఆశాభావం వ్యక్తం చేశారు.విత్తనాలు అందుకున్న రైతులు నాయకులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం మండల వ్యవసాయ శాఖ అధికారి గీరడ. మురళీకృష్ణ మాట్లాడుతూ ముంచంగిపుట్టు మండలానికి 2026 ఖరీఫ్ మాసంలో ఎంటియు 1121-300 రకం, ఆర్ జి ఎల్ 2537-380 రకం, ఎం టి యు 1064-110 రకం, ఆర్ ఎన్ ఆర్ 15048-30 రకం, ఎం టియు 1224-80 మొత్తం 950 క్వింటాలకు పైగా ధాన్యం విత్తనాలను సిద్ధం చేసి రైతులకు 90 శాతం రాయితీపై సన్న చిన్న కారు రైతులకు ముందుగా ప్రాధాన్యత ఇస్తూ పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. 2026 ఖరీఫ్ నుంచి ఆన్లైన్ పద్ధతిని ప్రభుత్వం అమలు చేస్తున్నందున ప్రతి రైతు వేలిముద్ర లేదా మొబైల్ ఆధార్ ఓటీపీ తీసుకొని మాత్రమే రైతులకు విత్తనాలు పంపిణీ చేయడం జరుగుతుందన్నారు. ఇప్పటికీ రైతులకి పచ్చి రొట్టె విత్తనాలు జనుము జీలుగు పిల్లి పెసర సుమారు 4700 కేజీలు 90 శాతం రాయితీతో విత్తనాలు పంపిణీ చేయటం జరిగిందని వరి వేసే పొలంలో 30 రోజులు ముందు జీలుగుజనుము కిల్లి పెసర వంటివి 10 నుంచి 20 కేజీల వరకు ఎకరాకు వేసుకొని 30 రోజుల తర్వాత పొలాన్ని కలియ దున్నుకుంటే మట్టిలో పోషకాలు వరి పంటకి సూక్ష్మ జీవులు అధికంగా పెరిగి మొక్కలకు అన్ని పోషకాలు అందుతాయన్నారు. అదేవిధంగా దిగుబడులు ఎక్కువ రావడానికి ఉపయోగపడ తాయన్నారు. ప్రకృతి వ్యవసాయం ద్వారా వివిధ కషాయాలు జీవామృతం, ఘన జీవామృతం ఏపీ సీఎం ఎఫ్ సిబ్బంది రైతుల వద్దకు వెళ్లి వాళ్ళని అవి ఏవిధంగా తయారు చేయాలో కూడా నేర్పించడం జరుగుతుం దన్నారు. పై విధంగా చేయటం వల్ల రైతు యూరియా డిఏపి వేయకుండా ఆర్గానిక్ పద్ధతిలో పంటలు పండించవచ్చన్నారు. ఈ విషయాలను రైతులకు ఆయన వివరించారు. ముంచంగిపుట్టు మండలం టీడీపీ ప్రధాన కార్యదర్శి కొంతేరి జగన్నాథ్, అసెంబ్లీ వైస్ ప్రెసిడెంట్ రాణాసింగి నీలకంఠం పాత్రో, క్లస్టర్ ఇంచార్జులు మజ్జి చిన్ని, బి రామారావు,వైస్ ఎంపీపీ సత్యనా రాయణ, సిపిఎం నేత ఎంఎం శ్రీను, మండల వ్యవసాయ అధికారి మురళీకృష్ణ, ఏపీ సీఎన్ ఎఫ్ సిబ్బంది, వీహెచ్ఏ సూర్య ప్రకాష్, మండల సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, యూనిట్ ఇంచార్జ్ కొండసీమ సింహాచలం,స్థానిక నాయకులు,వెంగడ అక్షయ్‌కుమార్, కార్యకర్తలు, రైతులు పాల్గొన్నారు.

## ప్రభుత్వం పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలి

### సిపిఎం, సిపిఐ ఆధ్వర్యంలో రాస్తారో



పాడేరు,జూన్ 9, ప్రభాతవార్త:

పెంచిన పెట్రోల్, డీజిల్ ధరలను వెంటనే ఉపసంహరించాలని, పన్నులు తగ్గించాలని సిపిఎం అల్లూరి జిల్లా కమిటీ కార్యదర్శి పి. అప్పల నరస డిమాండ్ చేశారు.పాడేరు ఆర్టీసీ కాంప్లెక్స్ సమీపంలో సిపిఎం సిపిఐ ఆధ్వర్యంలో రాస్తాలోకోలు నిర్వహించాము. డీజిల్ పెట్రోల్ ధరలు పెంపుకు నిరసనగా ఆటోను తాడు తో కట్టి లాగుతూ నడిరోడ్డులో నిరసన చేపట్టడం జరిగింది. అనంతరం సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి పి అప్పల నరస మాట్లాడుతూ మే నెలలో కేవలం 11 రోజుల్లోనే మోడీ కేంద్ర ప్రభుత్వం నాలుగు సార్లు పెట్రోల్, డీజిల్ ధరలను పెంచి ప్రజల నడ్డి విరచిందాని,మే 1న లీటర్‌కు రూ.3, మే 19న 90 పైసలు, మే 22న పెట్రోల్‌పై 87 పైసలు, డీజిల్‌పై 91 పైసలు, మే 25న పెట్రోల్‌పై 86 పైసలు, డీజిల్‌పై 83 పైసలు పెంచింది. వాణిజ్య గ్యాస్ ధరను కూడా భారీగా పెంచి చిన్న వ్యాపారులను వీధులపాలు చేసింది. ఇంకా ఆగకుండా లీటర్‌కు రూ.30 వరకు మరిన్ని ధరల పెంపులు చేయాలని కేంద్ర ప్రభుత్వం ప్రయత్నాలు చేస్తున్నట్లు వార్తలు వస్తున్నాయి. తన 12 సంవత్సరాల పాలనా వైఫల్యాలను కప్పిపుచ్చు కోవడానికి ఇరాన్‌పై అమెరికా-ఇజ్రాయిల్ దురాక్రమణ యుద్ధాన్ని సాకుగా చూపి ప్రజలపై కోలుకోలేని భారం మోపుతోం దన్నారు.ఈ యుద్ధం కారణంగా చమురు, ఎరువుల కొరత తీవ్రమైంది. ఖరీఫ్ సీజన్‌లో ఎరువుల ధరలు భారీగా పెరిగి రైతులు ఇబ్బందులు పడుతున్నారు. అమెరికా, ఇజ్రాయిల్ యుద్ధ విధానాలకు మోడీ ప్రధాని గట్టి మద్దతుదారుడు కావడంతో దేశ ఆర్థిక వ్యవస్థ తీవ్రంగా నష్టపోతోంది.2014 తర్వాత అంతర్జాతీయ మార్కెట్‌లో ముడి చమురు ధరలు తగ్గినప్పటికీ, మోడీ ప్రభుత్వం పెట్రోల్, డీజిల్ ధరలను తగ్గించకుండా కార్పొరేట్ కంపెనీలకు వేల కోట్లు లాభాలు కట్టిపెట్టింది. గత 12 సంవత్సరాల్లో పెట్రోల్, డీజిల్ అమ్మకాల ద్వారా ప్రజల నుంచి 65,56,188 కోట్ల రూపాయలులి కొల్లగొట్టింది.మన రాష్ట్రంలోని కేజీ బేసిన్‌లో ఉత్పత్తి అవుతున్న చమురు, గ్యాస్‌లో చట్టబద్ధంగా 50% వాటా రాష్ట్రానికి ఇవ్వాలి. దీని ద్వారా ప్రజలకు చౌక ధరల్లో ఇంధనం అందించవచ్చు. కానీ టీడీపీ-జనసేన-వైసీపీ కూటమి ప్రభుత్వం ఈ హక్కును సాధించ డంలో నిర్లక్ష్యం చేస్తోంది.భవిష్యత్తులో ప్రజావ్యతిరేక విధానాలను వ్యతిరేకించి, పెద్ద సంఖ్యలో పాల్గొని మోడీ ప్రభుత్వానికి బలమైన సందేశం ఇవ్వాలని ప్రజలకు కోరుతున్నాం. సిపిఎం మండల కార్యదర్శి సోమల చిట్టిబాబు అధ్యక్షతన జరిగింది సిపిఐ జిల్లా నాయకులు కూడా రాధాకృష్ణ చంటిబాబు సిపిఎం జిల్లా కమిటీ సభ్యులు వి దాస్ ఎల్ సుందర్రావు, ఆటో జీప్ యూనియన్ నాయకులు ప్రజలు, తదితరులు పాల్గొన్నారు.

## పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పెంపును నిరసిస్తూ ధర్నా




అరకు రూరల్, జూన్ 9, ప్రభాత వార్త :

మండల కేంద్రంలో సిపిఎం మండల కార్యదర్శి కె రామారావు ఆధ్వర్యంలో మంగళవారం పెంచిన పెట్రోల్, డీజిల్, గ్యాస్ ధరల పై అరకులోయ నాలుగు రోడ్డుల జంక్షన్ వద్ద ధర్నా నిర్వహించారు. కార్యక్రమంలో సిపిఎం రాష్ట్ర కమిటీ నాయకులు కిల్లో సురేంద్ర మాట్లాడుతూ ఇరాన్-ఇజ్రాయెల్ యుద్ధం కారణంగా అంతర్జాతీయ ముడిచమురు ధరలు పెరిగాయనే సాకుతో పెట్రోల్, డీజిల్, వంట గ్యాస్ ధరలు విపరీతంగా పెంచడం వలన సామాన్య ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని ఆగ్రహం వ్యక్తం చేశారు. అంతర్జాతీయ మార్కెట్‌లో బ్యారెల్ చమురు ధర 70 యు.ఎస్ డాలర్లు దాటకపోయినా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పన్నుల రూపంలో లక్షల కోట్లు దోచుకుంటున్నాయని విమర్శించారు. యుద్ధం పేరుతో ధరలు పెంచడం ప్రజా వ్యతిరేక చర్య అన్నారు.గిరిజన సంఘం నాయకులు పొద్దు బాలదేవ్ మాట్లాడుతూ పెరిగిన ధరలతో గిరిజన రైతులు ట్రాక్టర్, బోర్ మోటార్లు నడపలేకపోతున్నారని, గ్యాస్ సిలిండర్ కొనలేక వంటకష్టాలు పడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. కావున పెంచిన ధరలు వెంటనే తగ్గించాలని, గ్యాస్ సబ్సిడీ పునరుద్ధరించాలని డిమాండ్ చేశారు. డిమాండ్లు నెరవేర్చకుంటే ఉద్యమాన్ని తీవ్రతరం చేస్తామని హెచ్చరించారు. జి. బుజ్జిబాబు, టి. జోషి, ఎస్. ఐసుబాబు,కె. సుబ్బారావు, అప్పలస్వామి, జి, గాసి, తదితరులు పాల్గొన్నారు.

## ముగిసిన ఎఫ్.ఎల్.ఎన్ శిక్షణ తరగతులు



పాడేరు,జూన్ 9, ప్రభాతవార్త;

అనంతగిరి మండలం శివలింగాపురం గిరిజన సంక్షేమ ఆశ్రమ ఉన్నత పాఠశాలలో ప్రాథమిక పాఠశాల ఉపాధ్యాయులకు 6 రోజులు పాటు నిర్వహించిన ఎఫ్. ఎల్. ఎన్ శిక్షణ తరగతులు ముగింపు సందర్భంగా చివరి రోజు ఐన మంగళవారం డి. ఆర్. పి లు ఐన కె. దారకొండ, జె. శివ, శేఖర్ లను పినకోట, చిలకలగెడ్డ కాంప్లెక్స్ ఉపాధ్యాయులు ఘనంగా సన్మానించారు.. ముఖ్య అతిథులుగా మండల విద్యాశాఖ అధికారులు 1,2 కె.బాలాజీ, బి. బి. నాగేశ్వరావు హాజరయ్యారు. ఈ సందర్భంగా డి. ఆర్. పి ల సేవలను వారు కొనియాడారు.. ఎం.ఇ.ఓ కె. బాలాజీ మాట్లాడుతూ ఉపాధ్యాయులు తమ విధుల పట్ల అంకితభా వంతో పనిచేయాలని అయన కోరారు. ప్రభుత్వం విద్యభివృద్ధికి కోట్లాది రూపాయలు ఖర్చు చేస్తోందని ఐన ఆశించిన ఫలితాలు రావడం లేదని అన్నారు.. ప్రాథమిక విద్య పునాదులు బలంగా ఉంటేనే విద్యార్థుల భవిష్యత్ బాగుంటుందని అయన పేర్కొన్నారు.. ఎంఇ.ఓ. నాగేశ్వరావు మాట్లాడుతూ ఉపాధ్యాయులు అందరు శిక్షణ కార్యక్రమంలో పూర్తి స్థాయిలో పాల్గొని విజయవంతం చేయడం పట్ల అయన సంతోషం వ్యక్తం చేశారు. అనంతరం కె.ఆర్.పి కె. దారకొండ, డి. ఆర్. పి.లు శివ, శేఖర్ మాట్లాడుతూ శిక్షణ కార్యక్రమంలో తమ అనుభవాలను పంచుకొన్నారు.. 6 రోజుల పాటు తమకు సహకరించిన ఉపాధ్యాయులకు కృతజ్ఞతలు తెలిపారు. అనంతరం డి. ఆర్. పి లు గా వ్యవహరించిన దారకొండ, శివ, శేఖర్‌కు మండల విద్యాశాఖ అధికారులు బాలాజీ, నాగేశ్వరావులతో పాటు ఉపాధ్యాయులు దుస్సాలువాలతో ఘనంగా సన్మానించారు. డి. ఆర్. పి ల సేవలను అందరు కొనియాడారు. కార్యక్రమానికి పినకోట ఉపాధ్యాయులు రవికుమార్ అధ్యక్షులుగా వ్యవహరించగా ఉపాధ్యాయులు సోమశేఖర్, పొన్నాలు, కె. రాము, కె. రాజు, శ్రీదేవి, రామలక్ష్మి, పుష్ప, దేవి, అప్పలకొండ, నాగేశ్వర్రావు, సత్యం, రమ్య, డి. సన్యాసిరావు, డి. శ్రీను, అచ్చిబాబు, పడాల్, చిరంజీవి, తదితరులు పాల్గొన్నారు.

## నిత్యావసర సరుకుల పంపిణీకి దరఖాస్తులు ఆహ్వానం



పాడేరు,జూన్ 9, ప్రభాతవార్త:

జి.యమ్.ఆర్.పాలిటెక్నిక్, పాడేరు వసతిగృ హామునకు జూన్ 2026 నుండి మే 2027 వరకు నిత్యావసర సరుకులు, బియ్యం, కూరగాయలు, గుడ్లు, చికెన్ స్టాండర్డు ధరలకు (సంవత్సరమంతా ఒకటే రేటు) సరఫరా చేయుటకు దరఖాస్తులు ఆహ్వానించడమైనదని కళాశాల ప్రిన్సిపాల్ ఎమ్. హరిబాబు తెలిపారు. ఆసక్తిగల వారు జి.యమ్.ఆర్.పాలిటెక్నిక్, పాడేరు కార్యాలయము పని దినాలలో ఉదయం 9.30 నిమి షాలనుండి సాయంత్రం 4.30 నిమిషాల వరకు రూ.100 చెల్లించి దరఖాస్తును 10వ తేదీ నుండి పొందాలన్నారు. దరఖాస్తు చేయువారు తప్పనిసరిగా జి.ఎస్.టి.నెం. కలిగి ఉండవలెనని దరఖాస్తు సమర్పించుటకు ఈ నెల 19 వ తేదీ ఆఖరు అన్నారు. దరఖాస్తులను తిరస్కరించే అధికారము, సక్రమమైన దరఖాస్తులను ఆమోదించే అధికారం ప్రధానాచార్యుల వారికి కలదని పేర్కొన్నారు.

## ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లా ఉచిత న్యాయ సలహాదారునిగా నారాయణరావు రేపాక



అరకులోయ , జూన్ 9, ప్రభాతవార్త :

ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఉచిత న్యాయ సలహాదారునిగా అరకలోయకు చెందిన న్యాయవాది నారాయణరావు రేపాక నియామకం అయ్యారు. ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమం కొరకు ప్రత్యేకంగా ఏర్పాటు చేసిన రాష్ట్ర కమిటీలో అల్లూరి సీతారామరాజు జిల్లాకు సంబంధించి ఉచిత న్యాయ సలహాదారునిగా రేపాక నారాయణరావును ఏపీ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం రాష్ట్ర అధ్యక్షులు సిహెచ్ రవికుమార్ నియామకం చేస్తూ ప్రకటన చేశారు. ఇటీవల సంఘం ఉత్తరాంధ్ర ప్రాంతీయ సమావేశం శృంగవరపు కోట లో జరిగింది. ఈ కార్యక్రమంలో పాల్గొన్న రాష్ట్ర అధ్యక్షులు నాయకులు సిహెచ్ రవికుమార్ , కార్యదర్శి రవికుమార్, కోశాధికారి కోసర్ల రాజా, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు , అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ కాపుగంటి హరిబాబు , విజయనగరం జిల్లా కోఆర్డినేటర్ నాగరాజు , విశాఖపట్నం జిల్లా కోఆర్డినేటర్ గుప్తా, అనకాపల్లి జిల్లా కోఆర్డినేటర్, సుమారు 40 మంది ఆర్యవైశ్య పాత్రికేయులు పాల్గొని భవిష్యత్తు ప్రణాళికలను రూపొందించారు . దీనిలో భాగంగా ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమం కోసం ఉచిత న్యాయ సలహాలను అందించేందుకుగాను జిల్లాకు ఒకరిని చెప్పున న్యాయవాదులను నియమించేందుకు రాష్ట్ర నాయకులు సిహెచ్ రవి కుమార్ నిర్ణయం తీసుకున్నారు. ఈ మేరకు అల్లూరి జిల్లా లో ఉచిత న్యాయ సలహాదారునిగా అరకులోయకి చెందిన నారాయణరావు రేపాక ను ఎంపిక చేసి నియమించారు. ఈ సందర్భంగా న్యాయవాది నారాయణరావు రేపాక మాట్లాడుతూ తనపై రాష్ట్ర నాయకులు ఉంచిన నమ్మకాన్ని వమ్ము చేయకుండా పనిచేస్తానని, న్యాయ పరంగా ఎటువంటి సమస్యలు ఉన్నా తనను అల్లూరి జిల్లా ఆర్యవైశ్య రిపోర్టర్లు సంప్రదించ వచ్చునని చెప్పారు. ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం ఏర్పాటు చేయడం శుభ పరిణామ మని, సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్ నాయకత్వం లో భవిష్యత్తులో సంఘం మరింత ముందుకు వెళ్లాలని ఆకాంక్షించారు. కాగా ఆంధ్రప్రదేశ్ ఆర్యవైశ్య జర్నలిస్టుల సంక్షేమ సంఘం అల్లూరి జిల్లాకు ఉచిత న్యాయ సలహాదారినిగా ఎంపికైన రాపాక నారాయణరావు కు సంఘం రాష్ట్ర అధ్యక్షులు రవికుమార్, కార్యదర్శి రవికుమార్, కోశాధికారి పూసర్ల రాజా, ఉత్తరాంధ్ర కోఆర్డినేటర్ శ్రీనివాసరావు, అల్లూరి జిల్లా కోఆర్డినేటర్ హరిబాబు, జిల్లా రిపోర్టర్లు కొల్ల రమేష్ బాబు, నగేష్, బండి పరమేష్ , గుప్తా తదితరులు తమ శుభాకాంక్షలను తెలియజేశారు.

## ఉపాధి హామీ కూలీలకు మజ్జిగ పంపిణీ



(నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త)

మండలంలోని వేంపాడు గ్రామంలో మంగళవారం ఉదయం ఉపాధి హామీ పని చేస్తున్న కూలీలకు వేసవి దృష్ట్యా ఉంచుకొని టిడిపి నాయకులు మజ్జిగ, బిస్కెట్స్ పంపిణీ చేశారు. ఈ పంపిణీ కార్యక్రమంలో వేంపాడు తెలుగుదేశం పార్టీ నాయకులు కార్యకర్తలతో పాటు ఎంపీటీసీ కుంచే మధు,పార్టీ సమన్వయ కర్త అయినంపూడి అప్పలరాజు, పల్లా రాంబాబు,అయినంపూడి రవి,పార్టీ గ్రామ శాఖ అధ్యక్షులు కల్లేపల్లి వెంకటపతి రాజు,పల్లా నాగరాజు,చైర్మన్ కమిడి బాబూరావు,కాంద్రకోట చిన్న అప్పన్న,దారబాల బుజ్జి, ధేనుమ్ముకొండ సూర్యనారాయణ రాజు,కల్లెపల్లి వరహాలరాజు,కమిడి వెంకటరమణ,సబ్బు రాజు,దొంగల చిన్న, ఇసరపు వినయ్ తదితరులు ఉన్నారు.

## గ్రామాల్లో మంచినీటి సమస్యపై దృష్టి పెట్టండి.. లేకపోతే ఆందోళనే

### అధికారులకు వైకాపా హెచ్చరిక..



నక్కపల్లి ప్రభాతవార్త

మండలంలోని గత నెల రోజుల నుంచి కొన్ని గ్రామాల్లో త్రాగడానికి మంచినీరు లేక ఇబ్బంది పడుతున్నారని ఇటువంటి సమస్య గ్రామాల్లో ఉంటున్నప్పటికీ అధికారులు దృష్టికి వస్తున్నప్పటికీ ఆ సమస్య పరిష్కరించే విషయంలో దృష్టి పెట్టడం లేదని తక్షణమే స్పందించి త్రాగునీటి సమస్య పరిష్కరించకపోతే వైకాపా ఆందోళన చేపడుతుందని రాష్ట్ర వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ కార్యదర్శి విశాఖ దక్షిణ నియోజకవర్గం ఇంచార్జ్ వీసం రామకృష్ణ హెచ్చరించారు. మంగళవారం స్థానిక గ్రామీణ నీటిపారుదల శాఖ కార్యాలయం ఎదుట గ్రామాల్లో త్రాగునీటి సమస్య పరిష్కరించాలని కోరుతూ ఆందోళన చేపట్టారు. గొట్టువాడ ప్రాజెక్టు నుంచి మండలంలోని నక్కపల్లి తో పాటు చిన్నదొడ్డి గళ్ళ, నెల్లిపూడి, చందనాడ, బుచ్చిరాజుపేట, పెద్ద తీనార్ల ,దొండవాక ,అమలాపురం ,బోయపాడు, సిహెచ్చి అగ్రహారం ఈ గ్రామాలకు మంచినీరు రావడంలేదని ఈ గ్రామాల ప్రజలు సుమారు రెండు కిలోమీటర్ల దూరం వెళ్లి నీరు తెచ్చుకుంటున్నారని ఇటువంటి పరిస్థితులు ఎదురైనప్పటికీ స్పందించకపోవడం దారుణమని రామకృష్ణ అధికారుల నిలదీశారు. తక్షణమే అధికారులు స్పందించి ఈ గ్రామాల్లో మంచినీటి సమస్యను పరిష్కరించాలని కోరుతూ ఆర్డబ్ల్యూఎస్ జేఈ కి వినతిపత్రం అందజేశారు. యాదవుల కార్యక్రమంలో మండల పరిషత్ ఉపాధ్యక్షులు వీసంనానాజీ, అదనపు ఉపాధ్యక్షులు వెలగ ఈశ్వరరావు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ మండల శాఖ అధ్యక్షులు గొర్ల గోవిందు, జిల్లా పార్టీ నాయకులు కొప్పిశెట్టి హరిబాబు, మాజీ ఉప సర్పంచ్ వీసం అచ్చిరాజు,విద్యార్థి విభాగం నియోజకవర్గ కన్వీనర్ ఎలమంచిలి చందు, వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు గొడుగుల బంగార్రాజు, దేవవరపు సత్తయ్య ,అల్లాడ కొండబాబు, వెదుళ్ళ రమణ, భార్గవ్, నూకతాత తదితరులు ఉన్నారు.

## స్థానిక సంస్థల ఎన్నికల గెలుపుకు కలిసికట్టుగా పని చేయాలి

### మండల పార్టీ అధ్యక్షులు అమలకంటి అబద్ధం



ఎస్.రాయవరం, జూన్ 9, ప్రభాతవార్త

మండలంలో వెంకటాపురం గ్రామంలో తెలుగుదేశం పార్టీ మండల నాయకులు మంగళవారం సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా తెలుగుదేశం పార్టీ మండల అధ్యక్షుడు అమలకంటి అబద్ధం మాట్లాడుతూ స్థానిక సంస్థల ఎన్నికల గెలుపుకు అందరూ కలిసికట్టుగా పని చేయాలన్నారు. ఇందులో భాగంగా బూత్ కన్వీనర్లకు పలు సూచనలు సలహాలు తెలియజేశారు. ఈ కార్యక్రమంలో క్లస్టర్ ఇన్చార్జిలు తుంపాల నాగేశ్వరరావు, గుర్రం రామకృష్ణ,జిల్లా సెక్రెటరీ వజ్రపు శంకర్రావు, మాజీ సర్పంచులు పి.సూర్యనారాయణ, పడమట సతీష్,మాజీ ఎంపిటిసి బుజ్జి, నియోజకవర్గ యూత్ అధ్యక్షులు సుంకర శ్రీనివాసరావు,పార్టీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## ప్రమాదాల నివారణే ధ్యేయం

### కొక్కిరపల్లి జంక్షన్‌లో 'స్టాప్ అండ్ ఫేస్ వాష్' -ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు... ట్రాఫిక్ ఎస్సై రామకృష్ణ



ఎలమంచిలి, జూన్ 09, ప్రభాతవార్త

రాత్రి వేళల్లో జరిగే రోడ్డు ప్రమాదాల నివారణే ధ్యేయంగా పరవాడ సబ్ డివిజన్ పరిధిలో ప్రత్యేక తనిఖీలు చేపట్టారు. అనకాపల్లి జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు, పరవాడ సబ్ డివిజన్ రాత్రి గస్తీలో భాగంగా కొక్కిరపల్లి జంక్షన్ వద్ద 'స్టాప్ అండ్ ఫేస్ వాష్' కార్యక్రమాన్ని నిర్వహించారు. ట్రాఫిక్ ఎస్ఐ బి.రామకృష్ణ ఆధ్వర్యంలో జరిగిన ఈ తనిఖీల్లో రాత్రి వేళల్లో వాహనాలు నడిపే డ్రైవర్లను వాహనదారులను నిలిపివేసి, వారికి అవగాహన కల్పించారు. రాత్రి సమయంలో డ్రైవర్లు నిద్రమత్తులోకి జారుకోవడం వల్ల ప్రమాదాలు జరిగే అవకాశం ఉన్నందున ఈ వినూత్న కార్యక్రమాన్ని చేపట్టారు. జాతీయ రహదారిపై వెళ్తున్న సుమారు 60 లారీలు, బస్సులు, కార్లు తదితర వాహనాలను నిలిపివేశారు. డ్రైవర్లందరికీ ముఖాలు కడిగించి, నిద్రమత్తుగా అనిపిస్తే కాసేపు వాహనాన్ని పక్కన ఆపి విశ్రాంతి తీసుకోవాలని, ప్రాణాలు అత్యంత విలువైనవని ఎస్ఐ రామకృష్ణ డ్రైవర్లకు సూచించారు. అనంతరం వాహనదారులందరికీ సురక్షితంగా ప్రయాణించమని చెబుతూ వారి గమ్యస్థానాలకు పంపించారు. ఈ కార్యక్రమంలో వాహనదారులు, పోలీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## ఉపాధి శ్రామికులకు యూత్ సభ్యులు ఆధ్వర్యంలో మజ్జిగ ప్యాకెట్లు పంపిణీ



ఎస్ రాయవరం, జూన్ 9, ప్రభాత వార్త

మండలంలో ధర్మవరం అగ్రహారం గ్రామంలో ఉపాధి కూలీలకు గ్రామ యువకులు మజ్జిగ, బిస్కెట్ ప్యాకెట్లు అందజేశారు. ఈ కార్యక్రమంలో రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, యూత్ సభ్యులు పి.సాయి కుమార్, శేషు, ఎస్.సాయి, బి.దుర్గాప్రసాద్,జి.సాయి, జి.ప్రసాద్ తదితరులు పాల్గొన్నారు.

## ఓటరు జాబితాను సమగ్రంగా రూపకల్పన చేయాలి

### ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ



అనకాపల్లి జూన్ 9, ప్రభాతవార్త

ఓటరు జాబితా ను సమగ్రంగా రూపకల్పన చేయాలని మాజీ మంత్రి స్థానిక శాసన సభ్యులు కొణతాల రామకృష్ణ సూచించారు. స్థానిక రింగ్ రోడ్డు జనసేన పార్టీ కార్యాలయంలో జనసేన పార్టీ ముఖ్య నాయకులతో ఆయన మంగళవారం ప్రత్యేక సమావేశం నిర్వహించారు. ఆంధ్రప్రదేశ్‌లో ఓటరు జాబితా తయారీ, సవరణ ప్రక్రియలో బూత్ లెవెల్ ఏజెంట్లు అత్యంత కీలకమైన పాత్ర పోషిస్తారు. ప్రస్తుత కేంద్ర ఎన్నికల సంఘం దేశవ్యాప్తంగా ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన 'స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్' ప్రత్యేక సమగ్ర సవరణ భాగంగా ఏపీలోని నియోజకవర్గస్థాయిలో బిఎల్ఎలను రాజకీయ పార్టీలచే ప్రతి పోలింగ్ బూత్ కు నియమించబడే ముఖ్యమైన ప్రతినిధులు అని తెలియజేశారు. కూటమి పార్టీగా ఒకే నినాదంతో ప్రజల వద్దకు ఈ కార్యక్రమంతో పాల్గొనాలని, వీరు బిఎల్ఓ లకు సహాయకారిగా ఉంటూ, పార్టీ ఓటర్ల ప్రయోజనాలను కాపాడాలని. క్షేత్రస్థాయిలో ఓటరు జాబితా సవరణ, కొత్త ఓటర్ల నమోదు, తప్పులు తొలగింపు, చనిపోయిన వారి ఓట్లను తొలగించడం, డూప్లికేట్ ఓట్లను గుర్తించడం, అర్హులైన కొత్త ఓటర్లను నమోదు చేయించే బాధ్యత వీరిపై ఉంటుందని తెలియజేశారు. ఈ కార్యక్రమంలో నియోజకవర్గ జనసేన ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

## పారిశుధ్య సమస్య పరిష్కరించండి.. వీధుల్లో లైట్లు వేయండి: మహిళలు ఆవేదన



నక్కపల్లి రూరల్, ప్రభాతవార్త

నక్కపల్లి పంచాయతీ పరిధిలో పారిశుధ్య సమస్య అధికంగా ఉందని, తక్షణమే వీధి కాలువల్లో పేరుకుపోయిన పారిశుధ్యం తొలగించాలని ఆయా కాలనీకి చెందిన మహిళలు మంగళవారం అధికారులను కోరారు. కొత్తపేటకు చెందిన చిట్టెమ్మ స్థానిక విలేకర్ల ఎదుట మాట్లాడుతూ వీధిలో లైట్లు వెలగడం లేదని దీంతో ఇప్పటికే చోరీలు ఎక్కువ జరుగుతున్నాయని దీన్ని దృష్టిలో ఉంచుకొని వీధిలో లైట్లు వెలిగేటట్లు చూడాలని ప్రత్యేక అధికారికి విజ్ఞప్తి చేశారు. మాజీ ఉప సర్పంచ్ వీసం రాజు, మాజీ వార్డు సభ్యులు అల్లాడ కొండబాబు, గొడుగుల బంగార్రాజు, దేవవరపు వెంకట సత్యయ్య మాట్లాడుతూ వీధుల్లో కాలువలు దుర్వాసన వస్తుందని, తక్షణమే కాలువలు శుభ్రం చేయాలని కోరారు. వీరి సమస్యపై స్పందించిన పంచాయతీ కార్యదర్శి పివిపి రాజశేఖర్ ఇప్పటికే వీధుల్లో లైట్లు వేయడం జరిగిందని ఎక్కడైతే వెలగటలేదో అక్కడ తక్షణమే లైట్లు వేస్తామని కాలువలను శుభ్రం చేస్తామని చెప్పారు.

## ప్రజా సమస్యలపై వినతులు స్వీకరించిన ఎమ్మెల్యే కొణతాల



అనకాపల్లి జూన్ 9, ప్రభాతవార్త

అనకాపల్లి జనసేన పార్టీ కార్యాలయంలో అనకాపల్లి నియోజకవర్గ ప్రజల నుండి వారి సమస్యలకు సంబంధించిన వినతి పత్రాలను మంగళ వారం మాజీ మంత్రి కొణతాల రామకృష్ణ స్వీకరించారు. ప్రజలు వివరించిన సమస్యలపై సానుకూలంగా స్పందించి సంబంధిత అధికారులతో మాట్లాడి పరిష్కరించే విధంగా చర్యలు తీసుకున్నారు. ప్రజల సమస్యల పరిష్కారానికి జనసేన పార్టీ ఎల్లప్పుడూ అండగా ఉంటుందని ఆయన తెలియజేశారు.

## పోలీస్ అధికారులను సత్కరించిన టిడిపి నాయకులు



నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని ఉపమాక వేంకటేశ్వర స్వామి ఆలయంలో జరిగిన చోరి కేసును నాలుగు రోజులలోనే దర్యాప్తు పూర్తి చేసి నిందితులను పట్టుకొని రికవరీ విషయంలో శ్రమించిన నక్కపల్లి సర్కిల్ సిఐ జూరెడ్డి మురళిలను మండలంలోని ఉపమాక గ్రామానికి చెందిన టిడిపి నాయకులు పిఎసిఎస్ అధ్యక్షులు మాజీ దేవస్థానం చైర్మన్ కొప్పిశెట్టిబుజ్జి ఆధ్వర్యంలో ఘనంగా సత్కరించారు. స్వామి వారి ఆభరణాలు, నగదును రికవరీ చేసే విషయంలో ధైర్య సాహసాలతో వ్యవహరించిన మీకు వెంకటేశ్వర స్వామి తోడుగా ఉంటారని మరింతగా అభివృద్ధి పథంలో నడవాలని బుజ్జి ఆకాంక్షించారు. సీఐ మురళి తో పాటు నక్కపల్లి సర్కిల్ సబ్ ఇన్స్పెక్టర్ సన్నిబాబు, మహిళ సబ్ ఇన్స్పెక్టర్ సాహిబా అంజూమ్‌లను అభినందిస్తూ సత్కరించారు. ఈ విధంగా కష్టపడిన సిబ్బంది ఎక్కడున్నా సమాజం గుర్తిస్తాదని అన్నారు. సత్కరించిన వారిలో ఉపమాక కూటమి నాయకులు స్వామివారి భక్తులు. ఈ సందర్భంగా కొప్పిశెట్టి బుజ్జి మాట్లాడుతూ తక్కువ సమయంలో స్వామి వారికి సంబందించిన 18 లక్షల రూపాయలు విలువైన ఆభరణాలు, నగదును స్వాధీన పరుచుకునే విషయంలో అన్ని కోణాల్లో కష్టపడి పనిచేసిన పోలీసు సిబ్బందికి పేరుపేరునా ధన్యవాదాలు శుభాకాంక్షలు తెలియజేశారు. సత్కరించిన వారిలో కొప్పిశెట్టి శ్రీను, కోరుకొండ వరహాలరావు,యలమంచిలి రమణబాబు, జోగిరాజు, చంద్రరావు, గొర్ల రవి, కొంకిపూడి దొర బాబు, అయినవిల్లి నాగేశ్వరరావు,తోలేటి శ్రీను, కొప్పిశెట్టి వాసు, పాము గణేష్, సుంకర శ్రీను ఉన్నారు.

## మా గ్రామంపై అధికారులు దృష్టి పెట్టండి: వైకాపా నాయకుడు

నక్కపల్లి రూరల్ ,ప్రభాతవార్త

మండలంలోని పెద్ద తీనార్ల శివారు దొండవాక గ్రామంలో తీవ్రమైన మంచినీటి ఎద్దడి ఉందని దానితోపాటు పారిశుధ్య సమస్య అధికంగా ఉందని తక్షణమే ఆ సమస్య పరిష్కరించాలని వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ నాయకులు కొడ లక్ష్మణ అధికారులను కోరారు. మంగళవారం లక్ష్మణ మాట్లాడుతూ గ్రామంలో ప్రజలు చాలా ఇబ్బందులు పడుతున్నారని, ఆ ఇబ్బందులను దృష్టిలో ఉంచుకొని తక్షణమే పరిష్కరించేందుకు కృషి చేయాలని వేసవిలో మంచినీటి సమస్య లేకుండా చూడాలని కోరారు.

## గిరిజన ప్రాంతాల్లో ప్రసవాల భద్రతకు సరికొత్త ముందడుగు

### ఏఎస్ఆర్ జిల్లాలో అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్ సేవలు : జిల్లా కలెక్టర్ టి. నిశాంతి



పాడేరు,జూన్9, ప్రభాతవార్త

జిల్లాలో మాతృ మరణాల నిష్పత్తి, శిశు మరణాల రేటు లను పూర్తిగా సున్నాకు తగ్గించడమే లక్ష్యంగా వైద్య ఆరోగ్య శాఖ కీలక అడుగు వేసేందుకు గాను, గిరిజన ప్రాంతాల్లోని గర్భిణులు, బాలింతలు, నవజాత శిశువులకు అత్యవసర సమయాల్లో మెరుగైన వైద్య సేవలు అందించేందుకు వీలుగా ఒక ప్రత్యేక అడ్వాన్స్‌డ్ లైఫ్ సపోర్ట్ అంబులెన్స్‌ను అందుబాటులోకి తీసుకురావాలని, అందుకు సంబంధించిన అనుమతులపై, ప్రతిపాదించెందుకు సంబంధిత అధికారులు ప్రతిపాదించగా, జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు పాడేరు ప్రభుత్వ సర్వజన ఆసుపత్రి (ఎంసిహెచ్ సెంటర్) సూపరింటెండెంట్ డాక్టర్ కె. సీతారామరాజు ఈ మేరకు సమగ్ర నివేదికను సిద్ధం చేసి కలెక్టర్‌కు సమర్పించారు. మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి, ప్రభుత్వ ఆసుపత్రి ప్రిన్సిపాల్, ఐటీడీఏ ప్రాజెక్ట్ అధికారి తో కలసి సంయుక్తంగా జిల్లా కలెక్టర్ సమీక్షించారు. ఈ అంబులెన్స్ పనితీరుపై జిల్లా వైద్యానికి శాఖ అధికారి, జిజిహెచ్ ప్రిన్సిపల్ వివరించారు. అంబులెన్స్‌లో అందుబాటులో ఉండే అత్యాధునిక వైద్య పరికరాలు, రోగులను ఆసుపత్రికి తరలించే సమయంలోనే అత్యవసర చికిత్స అందించేందుకు వీలుగా ఈ అంబులెన్స్‌లో ఈ కింది పరికరాలను అమర్చనున్నారు. మల్టీపారామీటర్ మానిటర్ డిఫిబ్రిలేటర్ మరియు ట్రాన్స్‌పోర్ట్ వెంటిలేటర్ పెద్దలు, పిల్లలకు సరిపోయేలా లారింగోస్కోప్ సెట్, ఎండోట్రాకియల్ ట్యూబ్స్, అంబు బ్యాగ్స్, సిరంజ్ పంపులు, ఆక్సిజన్ సిలిండర్లు, నెబ్యులైజర్ మెషిన్ మరియు కన్వర్టిబుల్ స్ట్రెచర్, మొట్టమొదటిసారిగా 'మొబైల్ అల్ట్రాసౌండ్' సేవలు, ప్రత్యేకంగా ఈ అంబులెన్స్‌తో పాటు ఒక పోర్టబుల్ అల్ట్రాసౌండ్ మెషిన్ (స్కానింగ్ పరికరం) ను కూడా మంజూరు చేయాలని కోరారు. దీని ద్వారా మారుమూల గిరిజన గ్రామాల్లోనే హై-రిస్క్ గర్భాలు, ఎక్టోపిక్ ప్రెగ్నెన్సీలు, పిండం ఇబ్బందులు నవజాత శిశువుల అత్యవసర సమస్యలను ముందే గుర్తించి, త్వరితగతిన సరైన నిర్ణయం తీసుకోవడానికి వీలవుతుందని, ఈ సరికొత్త సదుపాయం జిల్లా మొత్తానికి ఒక "మొబైల్ ఎమర్జెన్సీ మాతృ మరియు శిశు సంరక్షణ యూనిట్" లా పనిచేస్తుందని, గిరిజన ప్రాంతాల్లోని ప్రతి తల్లికి, బిడ్డకు సురక్షితమైన ఆరోగ్యాన్ని అందించడానికి ఇది ఒక ల్యాండ్‌మార్క్ అడుగు కానుందని పాడేరు ప్రభుత్వ ఆసుపత్రి సూపరింటెండెంట్ జిల్లా కలెక్టర్‌కి వివరించారు. ఈ సమావేశంలో ఐటిడి ప్రాజెక్టు రికవరీ ఆదిత్య వర్మ జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ కృష్ణమూర్తి నాయక్, ప్రభుత్వ ఆసుపత్రి సూపరిండెండెంట్ శ్రీనివాసరావు, డాక్టర్ ఎల్లయ్య తదితరులు పాల్గొన్నారు.

## 10వ తేదీ లోపు జిల్లాలోని అన్ని పాఠశాలల రెడీనెస్, సంసిద్ధతపై పూర్తి వివరాలతో జాబితా సిద్ధం చేయాలి

### జిల్లా కలెక్టర్ టి.నిశాంతి



పాడేరు,జూన్9, ప్రభాతవార్త

జిల్లాలోని గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, మండల పరిషత్, కేజీబీవీ , గురుకుల పాఠశాలల 'స్కూల్ రెడీనెస్' పాఠశాలల సంసిద్ధత పై జిల్లా కలెక్టర్ నిషాంతి. టి, సంబంధిత శాఖల అధికారులతో ఉన్నత స్థాయి సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. మంగళవారం ఉదయం కలెక్టరేట్ సమావేశ మందిరంలో గిరిజన సంక్షేమ, ప్రభుత్వ, మండల పరిషత్, కేజీబీవీ, గురుకులం స్కూలుకు సంబంధించిన అధికారులతో మౌలిక వసతుల కల్పన, స్కూల్ సిద్ధతపై పాడేరు ఐటిడిఏ పివో ఆదిత్య వర్మతో కలిసి సంయుక్తంగా సమీక్షా సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలో ఉన్న స్కూల్స్ వివరాలు, మండలాల వారీగా సంబంధిత అధ్యాపకులతో స్కూల్ రెడీనెస్ సర్టిఫికెట్లను తీసుకోవాలని, పూర్తికాని వాటిపై అధికారులకు పలు కీలక ఆదేశాలు జారీ చేశారు. 10వ తేదీ లోపు జాబితా సిద్ధం కావాలని, రాబోయే 10 వ తేదీ లోపు జిల్లాలో సంసిద్ధంగా ఉన్న పాఠశాలల పూర్తి వివరాలతో కూడిన సమగ్ర జాబితాను తయారు చేయాలని కలెక్టర్ స్పష్టం చేశారు. పాఠశాలల్లో అందుబాటులో ఉన్న పూర్తిస్థాయి మౌలిక వసతుల వివరాలను, అలాగే ఇంకా అసంపూర్తిగా ఉన్న పనుల వివరాలను క్షేత్రస్థాయిలో ఉన్న సంబంధిత ఉపాధ్యాయుల నుండి తక్షణమే సేకరించాలని ఆదేశించారు. నాణ్యతకు ప్రాధాన్యతపై విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా పాఠశాలలు ప్రారంభమయ్యే నాటికి అన్ని వసతులు పూర్తి కావాలని, నిర్లక్ష్యం వహిస్తే కఠిన చర్యలు ఉంటాయని హెచ్చరించారు. ఈ సమీక్షా సమావేశంలో జిల్లా విద్యాశాఖాధికారి(ఎఫ్ ఏసి) చెలయ్య, ఏపిసి ఎస్ ఎస్ ఏ సోమ నాయుడు, ఏపీడబ్ల్యూఓ అఖిల, సెక్టోరల్ అధికారి, ఏ ఎల్ ఎస్ కోఆర్డినేటర్ కూర్మారావు, వివిధ సంక్షేమ శాఖల అధికారులు, గురుకుల విద్యాలయాల సమన్వయకర్తలు ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

## బాల్య వివాహాల నిర్మూలనకు అందరూ కృషి చేయాలి

### ప్రొటెక్షన్ అధికారి దాసరి చంద్రశేఖర్



ఆనందపురం, జూన్ 9, ప్రభాతవార్త

బాల్య వివాహాలు పిల్లల భవిష్యత్తును దెబ్బతీస్తాయని, వాటి నిర్మూలనకు తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు, సమాజం సమిష్టిగా కృషి చేయాలని ప్రొటెక్షన్ అధికారి దాసరి చంద్రశేఖర్ పిలుపునిచ్చారు. మండలంలోని మామిడిలోవ అంగన్‌వాడీ కేంద్రంలో కిశోరి వికాసం కార్యక్రమంలో భాగంగా మంగళ వారం నిర్వహించిన పిల్లల గ్రామసభలో ప్రొటెక్షన్ ఆఫీసర్ (ఇన్‌స్టిట్యూషనల్ కేర్) దాసరి చంద్రశేఖర్ పాల్గొని ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రతి బాలబాలికకు విద్య, ఆరోగ్యం, భద్రత మరియు అభివృద్ధి హక్కులుగా ఉన్నాయని తెలిపారు. బాలికల విద్యకు ప్రాధాన్యత ఇవ్వడంతో పాటు వారి సాధికారత కోసం ప్రతి కుటుంబం బాధ్యత వహించాలని సూచించారు. గ్రామ స్థాయిలో బాలల సమస్యలను గుర్తించి వాటి పరిష్కారానికి పిల్లల గ్రామసభలు సమర్థవంతమైన వేదికలుగా ఉపయోగపడతాయని పేర్కొన్నారు. మిషన్ వాత్సల్య, బాలల సంక్షేమ పథకాలు, చైల్డ్ హెల్ప్‌లైన్ 1098 సేవలను అవసరమైన సందర్భాల్లో వినియోగించుకోవాలని సూచిస్తూ, బాలల హక్కుల పరిరక్షణలో ప్రతి ఒక్కరూ భాగస్వాములు కావాలని ఆయన కోరారు. ఐసీడీఎస్ సూపర్ వైజర్ పి వి వి రత్నం, అంగన్వాడీ కార్యకర్త రత్నం, ఆశా కార్యకర్త లక్ష్మి, తల్లిదండ్రులు, కిశోర బాలికలు పాల్గొన్నారు.

## ఆర్థిక డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన కలిగి ఉండాలి

### డీసీసీబీ డీజీఎం అశోక్ కుమార్



ఆనందపురం, జూన్ 9, ప్రభాతవార్త

ప్రస్తుత డిజిటల్ యుగంలో ప్రతి ఒక్కరూ ఆర్థిక డిజిటల్ అక్షరాస్యతపై అవగాహన పెంపొందించుకోవాలని విశాఖ జిల్లా సహకార కేంద్ర బ్యాంకు (డీసీసీబీ) డీజీఎం అశోక్ కుమార్ అన్నారు. ఆర్థిక డిజిటల్ అక్షరాస్యతపై ఆనందపురం మండలంలోని కుసులువాడలో మంగళవారం నిర్వహించిన అవగాహన కార్యక్రమంలో ఆయన మాట్లాడుతూ ప్రజలు మొబైల్ బ్యాంకింగ్ సేవలను వినియోగించడం, యూపీఐ ద్వారా డబ్బు పంపడం, స్వీకరించడం, ఏటీఎంలు, డెబిట్, క్రెడిట్ కార్డులను సక్రమంగా ఉపయోగించడం వంటి అంశాలపై అవగాహన కలిగి ఉండాలని సూచించారు. విద్యుత్ బిల్లులు, ఇతర చెల్లింపులను ఆన్‌లైన్ ద్వారా సులభంగా నిర్వహించవచ్చని తెలిపారు. డిజిటల్ వాలెట్లు అయిన ఫోన్ పే, గూగుల్ పే, పేటియం వంటి సేవలను బాధ్యతాయుతంగా వినియోగించాలని, బ్యాంకు ఖాతాలు, పొదుపు పథకాలపై సరైన అవగాహన కలిగి ఉండటం అవసరమని పేర్కొన్నారు. ఆన్‌లైన్ మోసాల పట్ల అప్రమత్తంగా ఉండాలని, ముఖ్యంగా ఓటీపీ, పిన్ నంబర్లు, పాస్‌వర్డ్‌లు వంటి గోప్య సమాచారాన్ని ఎట్టి పరిస్థితుల్లోనూ ఇతరులతో పంచుకోవద్దని హెచ్చరించారు. తెలియని వ్యక్తుల నుంచి వచ్చే ఫోన్ కాల్స్, సందేశాలు, లింకుల విషయంలో జాగ్రత్త వహించాలని సూచించారు. ఆనందపురం బ్రాంచ్ మేనేజర్ నాగలక్ష్మి మాట్లాడుతూ డిజిటల్ లావాదేవీల ద్వారా సమయం ఆదా కావడంతో పాటు నగదు వినియోగం తగ్గి పారదర్శకత పెరుగుతుందని, ప్రతి ఒక్కరూ డిజిటల్ బ్యాంకింగ్ సేవలను సద్వినియోగం చేసుకోవాలని పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ సర్పంచ్ మహంతి వెంకటలక్ష్మి శివాజి, డిసిసిబి సూపర్ వైజర్ అనంతకుమార్, ఆనందపురం, వేములవలస, శొంట్యాం బ్యాంకుల సిఈఓలు నారాయణ రావు, దశావతారం, జయరాం, మహిళా సంఘాల సభ్యులు, గ్రామస్తులు పాల్గొన్నారు.

## ప్రైవేటీకరణ కుట్రే స్టీల్ ప్లాంట్ ప్రమాదానికి కారణం

### మృతుల కుటుంబాలకు 1 కోటి పరిహారం, ఉద్యోగం ఇవ్వాలి -జిల్లా కాంగ్రెస్ పార్టీ అధ్యక్షులు హాసిని వర్మ డిమాండ్



విశాఖపట్నం, జూన్ 9, ప్రభాతవార్త

విశాఖ ఉక్కు కర్మాగారంలో సోమవారం జరిగిన పెను ప్రమాదానికి కేంద్ర ప్రభుత్వ ప్రైవేటీకరణ కుట్రే కారణమని విశాఖ జిల్లా కాంగ్రెస్ అధ్యక్షులు అడ్డాల వెంకట వర్మ రాజు 'హాసిని వర్మ' ఆరోపించారు. మంగళవారం కిమ్స్ ఆస్పత్రి వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించిన ఆయన, విశాఖ ఉక్కును ప్రైవేట్ కార్పొరేట్ సంస్థలకు అప్పజెప్పాలనే ఉద్దేశంతో రక్షణ సౌకర్యాలను నిర్లక్ష్యం చేశారని మండిపడ్డారు. దాని ఫలితమే నిన్నటి దుర్ఘటనకు దారితీసిందన్నారు. మృతుల కుటుంబాలకు రూ.కోటి నష్టపరిహారం చెల్లించి, కుటుంబంలో ఒకరికి ఉద్యోగం ఇవ్వాలని వర్మ ప్రభుత్వాన్ని డిమాండ్ చేశారు. ప్రభుత్వం ప్రకటించిన రూ.25 లక్షలు, క్షతగాత్రులకు రూ.10 లక్షల పరిహారం సరిపోదని, క్షతగాత్రులకు రూ.25 లక్షలు ఇచ్చి మెరుగైన వైద్యం అందించాలని కోరారు. ప్రమాదంపై ఉన్నతస్థాయి విచారణ జరిపి భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా తక్షణ చర్యలు తీసుకోవాలని ఆయన డిమాండ్ చేశారు. బాధితులను పరామర్శించేందుకు పోలీసులు అడ్డుకున్న తీరు కూటమి ప్రభుత్వ దౌర్జన్యానికి నిదర్శనమని వర్మ విమర్శించారు. ఈ పరామర్శ కార్యక్రమంలో రాష్ట్ర పీసీ కార్యదర్శి గాదం మహేష్, రాష్ట్ర స్పోర్ట్స్ సెల్ చైర్మన్ జీవీవీ కమలాకర్, తూర్పు, దక్షిణ, భీమిలి నియోజకవర్గ ఇంచార్జిలు ప్రియాంక దండి, కేవీ సూర్యనారాయణ, సవరవిల్లి రామకృష్ణ, జిల్లా మహిళా అధ్యక్షురాలు కందవ గాయత్రి, ఎస్సీ సెల్ కస్తూరి వెంకటరావు, జిల్లా ప్రధాన కార్యదర్శి వంకర ఆనంద్ కుమార్, గాజువాక నాయకులు గవర వెంకటరమణ, జెర్రిపోతుల ముత్యాలనాయుడు, 54వ వార్డు ప్రెసిడెంట్ కొండపల్లి శ్రీనివాసరావు తదితరులు పాల్గొన్నారు.

## ఎఫ్ఎల్ఎన్ సాధనలో ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకం

### ఆర్జేడీ బి.విజయభాస్కర్



ఆనందపురం, జూన్ 9, ప్రభాతవార్త

పునాది అక్షరాస్యత, సంఖ్యాజ్ఞానం (ఎఫ్ఎల్ఎన్) సాధనలో ఒకటి, రెండు తరగతులకు బోధించే ఉపాధ్యాయుల పాత్ర అత్యంత కీలకమని విశాఖ పాఠశాల విద్యా ప్రాంతీయ సంయుక్త సంచాలకులు బి. విజయభాస్కర్ పేర్కొన్నారు. ఆనందపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నిర్వహిస్తున్న ఆరు రోజుల "జ్ఞాన ప్రకాష్-3.0 ఎఫ్ఎల్ఎన్ శిక్షణ కార్యక్రమాన్ని" ఆయన మంగళవారం సందర్శించి ఉపాధ్యాయులను ఉద్దేశించి ప్రసంగించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఒకటి, రెండు తరగతుల విద్యార్థులు తొలిసారిగా పాఠశాల వాతావరణంలోకి అడుగు పెడతారని, వారికి బోధించే ఉపాధ్యాయులు మాతృభావంతో, ఓర్పు, సహనంతో బోధించాలని సూచించారు. ప్రతి విద్యార్థి పునాది అక్షరాస్యతను సాధించేలా కృషి చేయాలని, చదవడం, రాయడం, గణితంలోని చతుర్విధ ప్రక్రియలను నేర్పించి ఉన్నత తరగతుల్లో మెరుగైన విద్యాభ్యాసానికి బలమైన పునాది వేయాలని ఉపాధ్యాయులకు హితవు పలికారు. శిక్షణలో భాగంగా ఉపాధ్యాయులు నేర్చుకున్న అంశాల గురించి అడిగి తెలుసుకున్న ఆయన, టీచర్ హ్యాండ్‌బుక్ వినియోగం, నో బ్యాగ్ డే కార్యకలాపాలు, గణిత గేమ్స్, నూతన పాఠ్యపుస్తకాల బోధనా విధానాలు, బోధన-అభ్యసన పరికరాల తయారీ వంటి అంశాలపై ఉపాధ్యాయుల తో చర్చించారు. ఉపాధ్యాయులు శిక్షణ ద్వారా పొందిన జ్ఞానాన్ని తరగతి గదిలో సమర్థవంతంగా వినియోగిస్తామని హామీ ఇవ్వగా, వారి స్పందనపై ఆయన సంతృప్తి వ్యక్తం చేశారు. శిక్షణ కార్యక్రమం అత్యంత సమర్థవంతంగా నిర్వహించబడిందని ప్రశంసించిన శ్రీ విజయభాస్కర్, గత ఆరు రోజులుగా డైట్ భీమిలిపట్నం అందించిన సహాయ సహకారాలను కూడా పరిశీలించారు. అలాగే కేఆర్పీలు, డీఆర్పీలు నిర్వహించిన బోధనా ప్రదర్శనలను, పాఠాలు చెప్పే విధానాన్ని పరిశీలించి వారితో ముచ్చటించారు. ఈ కార్యక్రమంలో డైట్ ప్రిన్సిపాల్ నాగేశ్వరరావు, అధ్యాపకులు అల్లావుద్దీన్, ఆనందరాజు, పాఠశాల ప్రధానోపాధ్యాయులు కె. కామేశ్వరరావు, మండల విద్యాశాఖ అధికారులు వి. జోగేంద్రనాథ్, కె. గంగరాజు, వేదిక ఇన్‌చార్జి మురళీమోహన్ పట్నాయక్ తదితరులు పాల్గొన్నారు.


## కార్మిక సంఘాలపై లోకేష్, పవన్ వ్యాఖ్యలు సరికాదు

### సిపిఐ రాష్ట్ర కార్యదర్శి జి.ఈశ్వరయ్య

విశాఖపట్నం జూన్ 9, ప్రభాతవార్త

విశాఖ స్టీల్ ప్లాంట్‌లో సోమవారం జరిగిన ఘోర ప్రమాదంపై స్టీల్‌ప్లాంట్ యాజమాన్యం బాధ్యతారహితంగా వ్యవహరిస్తుందని, కూటమి ప్రభుత్వం కూడా స్టీల్ ప్లాంట్ ను నిర్వీర్యం చేసే కుట్రలు చేస్తున్నదని సిపిఐ రాష్ట్ర కార్యదర్శి గుజ్జుల ఈశ్వరయ్య తీవ్రంగా విమర్శించారు. మంత్రులు నారా లోకేష్, పవన్ కళ్యాణ్ కార్మిక సంఘాల నేతలపై చేసిన వ్యాఖ్యలు వెనక్కి తీసుకోవాలని డిమాండ్ చేశారు. ఈ మేరకు ఈశ్వరయ్య మంగళవారం ఒక ప్రకటన విడుదల చేశారు. విశాఖ స్టీల్ ప్లాంట్ దుర్ఘటనలో ప్రాణాలు కోల్పోయిన కార్మిక సోదరులకు సిపిఐ తరపున ఘన నివాళులర్పిస్తూ, వారి కుటుంబ సభ్యులకు తమ సానుభూతిని తెలియజేశారు. మంగళవారం విశాఖ కె.జి.హెచ్ మార్చురీ వద్ద బాధిత కుటుంబాలను పరామర్శించి, వారికి భరోసా కల్పించడంలో కూటమి ప్రభుత్వం, స్టీల్ ప్లాంట్ యాజమాన్యం విఫలమైందన్నారు. ప్రమాదంలో గాయపడి ఆసుపత్రిలో చికిత్స పొందుతున్న వారికి తక్షణమే మెరుగైన ఉచిత వైద్య సేవలు అందించాలని డిమాండ్ చేశారు. స్టీల్ ప్లాంట్ చరిత్రలోనే ఇంతటి పెద్ద ప్రమాదం జరగడం మునుపెన్నడూ లేదని, ఇది ముమ్మాటికి డబుల్ ఇంజన్ సర్కార్ ప్రైవేటీకరణ విధానాలు, యాజమాన్య నిర్లక్ష్యం వల్ల జరిగిన ప్రమాదమేనని ఈశ్వరయ్య ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రమాద తీవ్రత, బాధిత కుటుంబాలకు జరిగిన నష్టాన్ని దృష్టిలో పెట్టుకుని వారికి అండగా నిలవాల్సిందిపోయి చనిపోయిన వారికి రూ. 25 లక్షలు ఇస్తామని చెప్పడం దుర్మార్గమని, బాధిత కుటుంబాల తరపున నిలబడుతున్న వామ పక్ష కార్మిక యూనియన్ నాయకులను మంత్రి నారా లోకేష్ తూలనడటం సమంజసం కాదని అన్నారు. కూటమి ప్రభుత్వం నిర్లక్ష్యం కారణంగానే స్టీల్ ప్లాంట్లో ప్రమాదం జరిగిందని నారా లోకేష్ ను నిలదీసిన కార్మిక సంఘాలకు సమాధానం చెప్పకుండా, మీ కుటుంబంలో ఎవరూ చనిపోలేదు కదా? అంటూ కార్మిక సంఘాల నేతల్ని ఉద్దేశించి నారా లోకేష్ వెటకారంగా మాట్లాడడం దుర్మార్గమన్నారు. 2004 లో సీఎంగా ఉన్న చంద్రబాబు కేంద్రంకు లేఖ రాసి ప్రైవేటీకరణకు బీజం వేశారని గుర్తు చేశారు. డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్ గతంలో విశాఖ ఉక్కు పరిశ్రమ కోసం పోరాడతానని చెప్పి, అధికారంలోకి వచ్చాక కేంద్రం దగ్గర చేతులు కట్టుకుని నోరు మెదపపోవడం అన్యాయమన్నారు. కార్మిక సంఘాలు రాజకీయాలు చేస్తున్నాయంటూ పవన్ కల్యాణ్ చౌకబారు వ్యాఖ్యలు చేయడం మానుకోవాలన్నారు.

## భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదు : మంత్రి వాసంశెట్టి సుభాష్



విశాఖపట్నం, జూన్ 9 ప్రభాతవార్త

భద్రతా చర్యలు సమర్ధవంతంగా నిర్వహించాలని ఎటు వంటి అలసత్వం ఉండకూడదని మంత్రి వాసంశెట్టి సుభాష్ తెలిపారు. మంగళవారం డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్‌తో కలిసి స్టీల్ ప్లాంట్‌లో జరిగిన ఘటన స్థలాన్ని సందర్శించిన కార్మిక శాఖ మంత్రి వాసంశెట్టి సుభాష్ పర్యటించారు. ప్రమాద ఘటనపై అధికారులను అడిగి వివరాలు తెలుసుకున్నారు. బాధిత కార్మికులకు అందుతున్న వైద్య సేవలపై ఆరా తీశారు. ఘటనకు గల కారణాలపై సమగ్ర విచారణ చేపట్టాలని అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. భద్రతా ప్రమాణాల అమలులో ఎలాంటి నిర్లక్ష్యం ఉండకూడదని స్పష్టం చేశారు. బాధిత కుటుంబాలకు ప్రభుత్వం అన్ని విధాలా అండగా ఉంటుందని హామీ ఇచ్చారు. క్షతగాత్రులకు మెరుగైన వైద్యం అందించేందుకు ప్రత్యేక చర్యలు తీసు కోవాలని సూచించారు. భవిష్యత్తులో ఇలాంటి ఘటనలు పునరావృతం కాకుండా కట్టుదిట్టమైన భద్రతా చర్యలు చేపట్టాలని ఆదేశాలు జారీ చేశారు. కార్మికుల సంక్షేమం, భద్రత ప్రభుత్వానికి అత్యంత ప్రాధాన్యమని పేర్కొన్నారు. ప్రమాద ఘటనపై పూర్తి నివేదిక సమర్పించాలని సంబంధిత అధికారులను మంత్రి ఆదేశించారు.

10skl13:10skl13.qxd 09-06-2026 22:04 Page 1



## 12 ఏళ్ల మోడీ అద్భుత పాలన

ఇచ్ఛాపురం జూన్ 9 ప్రభాతవార్త:



స్థానిక వీకేపీ ఫంక్షన్ హల్‌లో బీజేపీ అర్బన్ అధ్యక్షులు సాలిన ఢిల్లీరావు ఆధ్వర్యంలో నెలవారీ కార్యవర్గం సమావేశం జరిగింది. ఈ సమావేశంలో బీజేపీ పార్టీ బలోపేతం గురించి స్థానిక సమస్యలు గురించి అలాగే ప్రధానమంత్రి నరేంద్ర మోడీ 12 సంవత్సరాలు ఏకధాటిగా ప్రధానమంత్రి బాధ్యత దేశ రికార్డులు అధిగమించిన సందర్భంగా చేయబోవు కార్యక్రమం గురించి చర్చిండం జరిగింది. ఈ సమావేశానికి బిజెపి జిల్లా కోశాధికారి వి.క్రిష్ణ ప్రసాద్, జిల్లా యువమోర్చ జనరల్ సెక్రటరీ ధనుష్ రంగా, మిగతా కార్యవర్గం సభ్యులు, కార్యకర్తలు హాజరయ్యారు.

## కొత్తమ్మ తల్లి సన్నిధిలో అన్నదానం



కోటబొమ్మాళి, జూన్ 9 ప్రభాతవార్త :

స్థానిక కొత్తమ్మ తల్లి ఆలయంలో మంగళవారం సుమారు 500 మంది భక్తులకు ఆలయ కార్యనిర్వహణ అధికారి వాకచర్ల రాధాకృష్ణ ఆధ్వర్యంలో అన్నదాన కార్యక్రమం నిర్వహించారు. మంగళవారం కావడంతో చుట్టుపక్కల గ్రామాల ప్రజలు అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. భక్తులకు ఎలాంటి ఇబ్బంది లేకుండా అన్ని సౌకర్యాలు ఆలయ కమిటీ సభ్యులు నిర్వహించారు.

## బిజెపి పాలనలో రూపాయి విలువ క్షీణించింది : చింతా మోహన్

జలుమూరు, జూన్ 9 ప్రభాతవార్త:



కేంద్రంలోని బిజెపి పాలనలో రూపాయి విలువ క్షీణించిందని కేంద్ర మాజీ మంత్రి, సీనియర్ కాంగ్రెస్ నేత డాక్టర్ చింతామోహన్ పేర్కొన్నారు. ఆయన జలుమూరు మండలంలోని సైరిగాం గ్రామంలో ప్రధానంగా ఎస్సీ కాలనీలో ప్రజల ఆర్థిక స్థితిగతులను, సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ముందుగా సైరిగాంలోని అంబేద్కర్ విగ్రహానికి పూలమాలలు వేశారు. కేంద్ర రాజకీయాలతో పాటు రాష్ట్ర రాజకీయాలు కూడా భ్రష్టు పెట్టినట్లు తెలిపారు. డాక్టర్ మన్మోహన్ సింగ్ ప్రధానమంత్రిగా ఉండేటప్పుడు దేశ ఆర్థిక వ్యవస్థ పటిష్టతకు ఎంతగానో చేపట్టారన్నారు. అదేవిధంగా పీవీ నరసింహారావు ప్రధానిగా ఉండేటప్పుడు బంగారం ఎగుమతులు చేసి, విదేశీ మాదకద్రవ్యమును తెచ్చామని గుర్తు చేశారు. ప్రభుత్వ ఆసుపత్రులలో పనిచేసే నర్సులకు మూడు నెలలుగా జీతాలు ఇవ్వలేని పరిస్థితుల్లో ఉందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులు అప్పుల్లో ఉన్నారని, ఇంటి అద్దెలను కట్టుకోలేక, పిల్లలను చదివించలేక అవస్థలు పడుతున్నారన్నారు. కార్యక్రమంలో కాంగ్రెస్ నాయకులు మంత్రి నరసింహమూర్తి, షణ్ముఖరావు, మామిడి సత్యనారాయణ పాల్గొన్నారు.

## ప్రజలను నట్టేట ముంచిన కూటమి ప్రభుత్వం : రెడ్డి శాంతి



పాతపట్నం, జూన్ 9, ప్రభాతవార్త :

గడిచిన రెండేళ్ల కాలంలో తెలుగుదేశం కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో ఘోరంగా విఫలమైందని వైఎసఆర్సీపీ రాష్ట్ర క్రమశిక్షణా కమిటీ సభ్యురాలు, మాజీ ఎమ్మెల్యే రెడ్డి శాంతి విమర్శించారు. పార్టీ అధ్యక్షుడు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు స్థానిక వైఎసఆర్సీపీ క్యాంప్ కార్యాలయంలో మంగళవారం 'వెన్నుపోటుకు రెండేళ్ళు' నిరసన కార్యక్రమాన్ని నిర్వహించారు. నియోజకవర్గ స్థాయి ముఖ్య నాయకులు, కార్యకర్తలు, పార్టీ శ్రేణులతో నిర్వహించిన ఈ సమావేశంలో కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, ముఖ్యంగా యువత, మహిళలు, రైతులకు చేసిన మోసాలపై సుదీర్ఘంగా చర్చించారు. ప్రభుత్వ ప్రజా వ్యతిరేక విధానాలకు నిరసనగా సమావేశానికి హాజరైన నాయకులు నల్ల బ్యాడ్జీలు ధరించి నిరసన తెలియజేశారు. అనంతరం గాల్లోకి నల్ల బెలూన్లను ఎగురవేసి ప్రభుత్వానికి వ్యతిరేకంగా నినాదాలు చేశారు. కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలు, అధికారంలోకి వచ్చాక ప్రజలను వంచించిన తీరును కళ్లకు కట్టేలా క్యాంప్ కార్యాలయంలో ఏర్పాటు చేసిన ఫొటో ఎగ్జిబిషన్‌ను రెడ్డి శాంతి ప్రారంభించారు. ఎన్నికల సమయంలో గుప్పించిన సూపర్ సిక్స్ హామీలను కూటమి ప్రభుత్వం పూర్తిగా అటకెక్కించిందని, జగనన్న పాలనలో ప్రతి ఇంటికీ అందిన సంక్షేమం నేడు కరువైందని దుయ్యబట్టారు. ప్రభుత్వ వైఫల్యాలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్తామని, ప్రజల పక్షాన వైఎసఆర్సీపీ ఎల్లప్పుడూ పోరాడుతుందని ఈ సందర్భంగా ఆమె స్పష్టం చేశారు.

## సీజ్ చేసిన ఇసుక మాయం



### నడిమికెల్లలో రెచ్చిపోతున్న ఇసుక బకాసురులు

### అధికారులకు సవాలు విసురుతున్న ఇసుక మాఫియా

వీరఘట్టం, జూన్ 9, ప్రభాతవార్త :

ఇసుక... ఇసుక ...ఇసుక... ఈ వ్యాపారం మూడు పువ్వులు ఆరు కాయల్లా రోజురోజుకు విస్తరించి, ఇసుక సామ్రాజ్యాన్నే ఏర్పాటు చేసి, ఎంచక్కా రెండు చేతులా కాసులు సంపాదిస్తున్నారు మండలంలోని నడిమికెల్ల ఇసుక బకాసురులు. ఇటీవల పక్కనే ఉన్న నాగావళి నది నుండి ఇష్టానుసారంగా అక్రమంగా ఇసుకను దోసేసి ట్రాక్టర్లతో పెరిగేసి పలుచోట్ల ఎంచక్కా దాచి పెట్టేసారు. అయితే ఈ విషయాన్ని మీడియా అధికారుల దృష్టికి తీసుకు వెళ్లే వారు పరిశీలించి ఆ ఇసుకను సీజ్ చేశారు. అయితే అధికారులు సీజ్ చేసిన ఇసుక నేడు మాయమవ్వడంతో అందరినీ ఆశ్చర్యానికి గురి చేసింది. అధికారులంటే మాకు లెక్కేలేదు అనే బలమైన సందేశాన్ని వారికే సవాలు విసురుతున్నారు ఇసుక మాఫియా గ్యాంగ్. వీరికి అధికారులు అంటే భయం లేదు. చట్టాలంటే గౌరవం లేదు. ఈ మాఫియా ఎంతకి బరితెగిస్తున్నారంటే సీజ్ చేసిన ఇసుకనే మాయం చేశారంటే వారు ఎంతటి ఘనులో ఇట్టే అర్థమవుతుంది. ఇలాగే అధికారులు చూసి చూడనట్లు వదిలేస్తే నాగావళి నదిలోని ఇసుకంతా మాయమవడం ఖాయం. అధికారులు చేవలు పట్టించడం లేదు. రెవెన్యూ శాఖ, పోలీస్ శాఖ సంయుక్తంగా వీరిపై కఠిన చర్యలు చేపడితే గాని వీరి ఆగడాలు ఆగేటట్టు లేదు.

## విధుల్లో అలసత్వం ప్రదర్శించిన బిఎల్వో సస్పెండ్

ఇచ్ఛాపురం, జూన్ 9 ప్రభాతవార్త:

విధుల్లో అలసత్వం ప్రదర్శించిన కవిటి మండలం పెద్ద కర్రివానిపాలెం బిఎల్వో కురిగాని కన్నారావును జిల్లా కలెక్టర్ సస్పెండ్ చేసినట్లు నియోజకవర్గ ఎన్నికల అధికారి బెహరా పద్మావతి తెలిపారని తహశీల్దార్ వెంకటరావు చెప్పారు. పకుసంవర్గ కరం అన్‌లైన్ పని చేస్తున్న ఉన్నారని 132 పోలింగ్ స్టేషన్ బిఎల్వోలు పని చేస్తున్నారు. ఎస్ ఐ ఆర్ లో 95 శాతం లక్ష్యం పూర్తి చేయాలని బి ఎల్ వో లు సూపర్వైజర్లు క్షేత్ర స్థాయిలో పరిశీలన చేయాలని అన్నారు.

## రైతు సేవా కేంద్రాల్లో వరి విత్తనాలు సిద్ధం



పాతపట్నం, జూన్ 9, ప్రభాతవార్త :

మండలంలో ప్రస్తుత ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి రైతులకు పంపిణీ చేసేందుకు ఏడు రకాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ అధికారి కె.సింహాచలం తెలిపారు. స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా ఈ విత్తనాలను రైతులకు అందజేయనున్నట్లు ఆయన పేర్కొన్నారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జనరల్ రైతులకు ప్రతి కేజీ విత్తనాలపై రూ.10 సబ్సిడీ వర్తిస్తుందని, అలాగే గిరిజన రైతులకు 90 శాతం రాయితీపై విత్తనాలను పంపిణీ చేస్తామని వివరించారు. మండలంలో ప్రస్తుతం మొత్తం 2,514 వరి విత్తనాల బస్తాలు అందుబాటులో ఉంచామన్నారు. ఇందులో ఎంటీయూ 1061 రకం 699 బస్తాలు, ఎంటీయూ 1064 రకం 394 బస్తాలు, ఎంటీయూ 1318 రకం 393 బస్తాలు, ఆర్జీఎల్ 2537 రకం 325 బస్తాలు, ఎంటీయూ 7029 రకం 296 బస్తాలు, సాంబా మసూరి 146 బస్తాలు, ఎంటీయూ 1224 రకం 135 బస్తాలు, ఎంటీయూ 1211 రకం 126 బస్తాలు సిద్ధంగా ఉన్నాయని తెలిపారు. ఖరీఫ్ సాగుకు సిద్ధమవుతున్న మండలంలోని రైతులు ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని, తమకు కావలసిన విత్తనాలను స్థానిక రైతు సేవా కేంద్రాల ద్వారా సకాలంలో పొంది సాగును ప్రారంభించాలని సింహాచలం కోరారు.

## మల్లికార్జున కాలనీలో సమస్యల పరిష్కారం చేసిన కమిషనర్

రాజాం, జూన్ 9, ప్రభాతవార్త:



రాజాం మున్సిపాలిటీ పరిధి మల్లికార్జున కాలనీలో గత ఎన్నో సంవత్సరాలుగా ప్రజలు ఎదుర్కొంటున్న డ్రైనేజీ, రహదారి సమస్యలకు శాశ్వత పరిష్కారం కల్పించేందుకు రాజాం మున్సిపాలిటీ ప్రత్యేక చర్యలు చేపడుతోంది. ఈ అభివృద్ధి పనులకు మార్గం సుగమం చేయుటకు ముందస్తుగా సంబంధిత ప్రాంతంలో ఉన్న అన్ని ఆక్రమణలను తొలగించడం జరిగింది. ప్రతిపాదిత కాలువ , రహదారి నిర్మాణ పనుల అంచనాలు సిద్ధం చేసి, పరిపాలనా అనుమతుల కోసం సంబంధిత శాఖలకు పంపించడం జరుగుతోంది. ఈ పనులు పూర్తయిన అనంతరం కాలనీవాసులు ఎన్నో సంవత్సరాలుగా ఎదుర్కొంటున్న ఇబ్బందులకు శాశ్వత పరిష్కారం లభించనుంది. కార్యక్రమంలో మున్సిపల్ కమిషనర్ ఆదేశాల మేరకు పట్టణ ప్రణాళిక అధికారి డి.తేజేశ్వరరావు, శాస్త్రి, వార్డు ప్రణాళిక కార్యదర్శులు, మున్సిపల్ సిబ్బంది పాల్గొని సంబంధిత ప్రాంతంలోని అక్రమ ఆక్రమణలను తొలగించారు.

## క్షేత్ర సహాయకురాలిపై వచ్చిన అభియోగాలపై అధికారుల విచారణ

పాతపట్నం, జూన్ 9, ప్రభాతవార్త:



మండలంలోని బూరగాం గ్రామ క్షేత్ర సహాయకురాలు (ఫీల్డ్ అసిస్టెంట్) కుమారి పొలైపై స్థానికులు ఇచ్చిన వివిధ అభియోగాలపై ఉన్నతాధికారులు మంగళవారం విచారణ చేపట్టారు. డ్వామా పీడీ బి.లవరాజు, అడిషనల్ పీడీ పంచాది రాధా, క్లస్టర్ ఏపీడీ మద్ది శైలజ, ఏవో తిరుపతి పట్నాయక్‌లతో కూడిన అధికారుల బృందం పరిశీలన చేశారు. ఉపాధి హామీ సిబ్బందితో కలిసి ఆరోపణలకు సంబంధించిన రికార్డులను క్షుణ్ణంగా పరిశీలించారు. విచారణ అనంతరం పూర్తి నివేదికను ఉన్నతాధికారులకు సమర్పించనున్నట్లు వారు తెలిపారు.

## 82 రైతు బజార్లలో పైనాపిల్ విక్రయాలకు అవకాశం



సీతంపేట, జూన్ 9, ప్రభాతవార్త:

82 రైతు బజార్లలో గిరిజన రైతులకు పైనాపిల్ విక్రయాలకు అవకాశం కల్పించడం జరిగిందని ప్రాజెక్ట్ అధికారి పవర్ స్వప్నిల్ జగన్నాథ్ మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. సీతంపేట, ఐటీడీఏ పరిధిలో పైనాపిల్ పంటను సాగు చేస్తున్న గిరిజన రైతులు, రైతు ఉత్పత్తిదారుల సంఘాలు స్వయం సహాయక సంఘాల సభ్యులకు విస్తృత మార్కెటింగ్ అవకాశాలు కల్పించేందుకు ప్రత్యేక చర్యలు చేపట్టినట్లు తెలిపారు. గిరిజన రైతులు పండించిన నాణ్యమైన పైనాపిల్ పండ్లకు సరైన గిట్టుబాటు ధర లభించేలా పార్వతీపురం మన్యం, శ్రీకాకుళం, విజయనగరం, విశాఖపట్నం, కాకినాడ, రాజమండ్రి, ఏలూరు విజయవాడ నగరాల్లో ఉన్న రైతు బజార్లలో నేరుగా విక్రయాలు నిర్వహించుకునే అవకాశాన్ని కల్పిస్తున్నట్లు వెల్లడించారు. జూన్ 2026 నుండి ఆగస్టు 2026 వరకు రైతు బజార్‌లో అమ్ముకోవడానికి వెసులుబాటు కల్పించడం జరిగిందన్నారు. మధ్యవర్తుల ప్రమేయం లేకుండా రైతులు తమ పండ్లను నేరుగా వినియోగదారులకు విక్రయించడం ద్వారా అధిక ఆదాయం పొందే అవకాశం ఉంటుందని పేర్కొన్నారు.

## కొత్తూరులో ఉచిత మెగా వైద్యశిబిరం

కొత్తూరు, జూన్ 9 (ప్రభాతవార్త):



మండలంలో రిటైర్డ్ అయిన విశ్రాంతి ఉద్యోగుల సంఘం మరియు శ్రీకాకుళం కిమ్స్ ఫౌండేషన్ రీసెర్చ్ సెంటర్ వారి ఆధ్వర్యంలో స్థానిక శ్రీవెంకటేశ్వర కళ్యాణ మండపంలో ఉచిత వైద్య శిబిరం నిర్వహించబడింది. ఈ కార్యక్రమాన్ని మండల వైస్ ఎంపీపీ, టీడీపీ సీనియర్ నాయకులు లోతుగెడ్డ తులసి వరప్రసాద్ ముఖ్య అతిథిగా పాల్గొని ఈ కార్యక్రమాన్ని ప్రారంభించారు. ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ భవిష్యత్తులోనూ ప్రజల ఆరోగ్యం కోసం ఇటువంటి మరిన్ని సేవా కార్యక్రమాలను చేపడతామని పేర్కొన్నారు. ఈ శిబిరంలో కిమ్స్ ఆసుపత్రికి చెందిన నిపుణులైన వైద్య బృందం రోగులకు ఉచితంగా వైద్య పరీక్షలు నిర్వహించి, వారి ఆరోగ్య సమస్యలకు అనుగుణంగా మందులను ఉచితంగా పంపిణీ చేశారు. గ్రామీణ ప్రాంత ప్రజల కోసం ఇటువంటి మెగా వైద్య శిబిరాన్ని ఏర్పాటు చేయడం పట్ల లబ్ధిదారులు, స్థానిక రోగులు హర్షం వ్యక్తం చేస్తూ నిర్వాహకులకు ధన్యవాదాలు తెలియజేశారు. కొత్తూరు మాజీ సర్పంచ్ ఎల్.లక్ష్మీనారాయణ నాయుడు, బోర శ్రీరాములు, కర్లెమ్మ మాజీ సర్పంచ్ పడాల వెంకటకృష్ణ, తెలుగుదేశం నాయకులు పడాల నాగభూషణం, రిటైర్డ్ ఉద్యోగులు ఎద్దు గోపాల్ దాస్ నాయుడు, శెట్టి బానోజీరావు, పొగిరి రవి, ఎన్ని తిరుపతిరావు మొదలైన వారు పాల్గొన్నారు.

## సత్యసాయి ఆశీస్సులతో పలు సేవా ఆధ్యాత్మిక కార్యక్రమాలు



నరసన్నపేట, జూన్ 9 ప్రభాతవార్త:

భగవాన్ శ్రీ సత్య సాయి బాబా వారి దివ్య అనుగ్రహ ఆశీస్సులతో నరసన్నపేట స్థానిక మారుతీ నగర్ సత్యసాయి సేవా సమితి ఆధ్వర్యంలో నరసన్నపేట ఉమెన్స్ హెల్పింగ్ హ్యాండ్స్ సంస్థ మహిళలు మరియు పుంబకర్ షో రూమ్ వారి సౌజన్యంతో హిరమండలం జోన్ గూనభద్ర సత్యసాయి భజన మండలిలో మంగళవారం 11 మంది గర్భిణీ స్త్రీలకు సీమంతాలు, 40 మంది నారాయణలకు ఆహార పొట్లాలు, 20 మంది అర్హులైన నారాయణలకు చెప్పులు మరియు 50 మంది చిన్నారులకు నూతన వస్త్రాలు పంపిణీ సేవ చేయటం జరిగినది. ఈ కార్యక్రమంలో జిల్లా పూర్వపు మహిళా సేవాదళ్ కన్వీనర్ అమ్మాయమ్మ, హారిక, కృష్ణవేణి, మెండ కృష్ణవేణి మరియు మహిళలు పాల్గొన్నారు.

## అభివృద్ధి వికేంద్రీకరణే లక్ష్యం : ఎమ్మెల్యే కూన

ఆమదాలవలస, జూన్ 9 (ప్రభాతవార్త) :



అభివృద్ధి వికేంద్రీకరణ లక్ష్యంగా స్థానిక యువతకు ఉద్యోగ అవకాశాలు కలుగుతాయని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం పొందూరు మండలంలో వెంకటరాయుని గూడెం గ్రామంలో రూ.10.45 కోట్ల వ్యయంతో నిర్మించనున్న ఎంఎసఎంఈ పార్కుకు కేంద్రమంత్రి కింజరాపు రామ్మోహన్ నాయుడు, మంత్రి కొండపల్లి శ్రీనివాస్‌తో కలిసి ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ శంకుస్థాపన చేశారు. అనంతరం నిర్వహించిన సభలో వారు మాట్లాడుతూ జిల్లాలో ఎంఎసఎంఈ పార్కుల ఏర్పాటుతో స్థానిక యువతకు ఉపాధి అవకాశాలు పెరుగుతాయని, వలసలను గణనీయంగా తగ్గించవచ్చని అన్నారు. అభివృద్ధిని వికేంద్రీకరించడం, ఉపాధిని ప్రజలకు చేరువ చేయడం లక్ష్యముగా ప్రధాని నరేంద్ర మోడీ, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, ఉపముఖ్యమంత్రి పవన్ కళ్యాణ్ నాయకత్వంలో రాష్ట్రములోని 175 నియోజకవర్గాల్లో ఎమ్మెస్ ఎం ఈ పార్కులను ఏర్పాటు చేస్తున్నట్లు వెల్లడించారు. ప్రతి ఇంటి నుంచి ఒక పారిశ్రామికవేత్తను తయారు చేయాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు లక్ష్యమని చెప్పారు. గతంలో శ్రీకాకుళం జిల్లాకు పరిశ్రమల రావు అనే అభిప్రాయానికి ముగింపు పలుకుతూ ఎం ఎస్ ఎం ఈ పార్కులు ద్వారా జిల్లాలో కొత్త పారిశ్రామిక యుగానికి శ్రీకారం చుడుతున్నామని పేర్కొన్నారు. జనసేన నియోజకవర్గం ఇంచార్జ్ పేడాడ రామ్మోహన్రావు, మండల పార్టీ నాయకులు చిగురుపల్లి రామ్మోహన్రావు, సీపాన శ్రీ రంగనాయకులు,అన్నేపు రాము, తమ్మినేని అమర్నాథ్, నాని, ఎండ అప్పలనాయుడు,బుడుమూరు సీతారాం,ఎండ భీష్మ, తదితరులు పాల్గొన్నారు.

## విత్తన గులికలపై అవగాహన




కంచిలి, జూన్ 9, ప్రభాతవార్త:

కంచిలి మండలం, తలతంపర గ్రామంలో విత్తన గులికలపై అవగాహన కల్పిస్తూ రైతులు సమక్షంలో విత్తన గులికలపై అవగాహన విఏఏ పవిత్ర మేడం ఆధ్వర్యంలో విత్తన గులికలు తయారుచేసి కాంపక్ట్ బ్లాకు ఐదుగురు రైతులు పొలాల్లో బెందాళం కన్నయ్య, బెందాళం శంకరరావు, బెందాళం అరుణ, బెందాళం కేదారి, బెందాళం సర్వేశ్వరరావు బల్లేని శివాజీ, బల్లేడు సత్యం కొబ్బరి జీడీ తోటలో లైన్ షోయింగ్ పద్ధతిలో రైతులుతో ఈ విత్తన గుళికలు వేయించడం జరిగింది. ఈ విధముగా విత్తన గులికలు చేసి వేయడం వలన సాధారణ వర్షపాతం కంటే తక్కువ వర్షపాతం పడిన విత్తనం మొలకలు వస్తాయి మరియు ఈ విత్తనాలు ఎలాంటి ఎండ టైంలో వేసిన విత్తనం పాడవకుండా భూమిలో ఎటువంటి నష్టము కలగకుండా భూమిలో నిక్షేపంగా ఉంటాయి వర్షాలు పడినప్పుడు మొలకశాతం బాగా వస్తుందని, తక్కువ వర్షపాతం వలన రైతుకు ఏదో ఒక పంట వలన ఆదాయం వస్తుందని నిరంతరము భూమిని పచ్చని పంటలతో కప్పి ఉంటుందని భూమిలో తేమశాతం ఉంటుందని మరియు భూమిలో జీవవైవిద్యం పెరుగుతుందని రైతులకు ప్రకృతి వ్యవసాయ సిబ్బంది వివరించడం జరిగింది. గ్రామపెద్దలు, రైతులు లీడ్ ఫార్మర్స్ అంపురం యూనిట్ ఐ సి ఆర్ పి లు శ్రీదేవి రేవతి విజయలక్ష్మి శాంతి రోజా లీడ్ ఫార్మర్ వేణు హాజరయ్యారు.

## 950 క్వింటాల వరి విత్తనాలు సిద్ధం

వీరఘట్టం, జూన్ 9, ప్రభాతవార్త:




ఖరీఫ్ సీజన్‌కు సంబంధించి మండలంలో 950 క్వింటాల వరి విత్తనాలు సిద్ధంగా ఉన్నాయని మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య సోమవారం విలేకరులకు తెలిపారు. ఎం టి యు1064 రకం 665 క్వింటాలు, ఎం టి యు 1121 రకం 77 క్వింటాలు, ఆర్ జి ఎల్ 2537 రకం 148 క్వింటాలు, ఎం టి యు 1224 రకం 3 క్వింటాలు, ఎం టి యు 7029 రకం 9 క్వింటాలు, బిపిటి 5204 రకం 49 క్వింటాలు వరి విత్తనాలు రైతులకు విక్రయించేందుకు సిద్ధంగా ఉన్నాయన్నారు. ఒక క్వింటా వరి విత్తనాలు ధర 4300 కాగా ఇందులో ప్రభుత్వ సబ్సిడీ రూపంలో వెయ్యి రూపాయలు మినహాయించి రైతులు 3300 చెల్లించవలసి ఉంటుందని ఆమె వివరించారు. విత్తనాలు మండలంలోని ఆర్.బి ఎస్ కేంద్రాల్లో సిద్ధంగా ఉన్నాయన్నారు.

## ఒడిస్సా మద్యం బాటిళ్ళతో పట్టుబడిన వ్యక్తికి జైలు

పాతపట్నం, జూన్ 9 ప్రభాతవార్త:

ఒడిస్సా రాష్ట్రం నుండి ఒడిశా మద్యం బాట్లను ఆంధ్రప్రదేశ్‌కు తీసుకుని వచ్చి పట్టుబడిన వటుకుల్ల శంకరరావుకి పాతపట్నం జూనియర్ సివిల్ జడ్జ్ ఎం.రోషిణి ఆరు నెలల పదిహేను రోజుల జైలు శిక్ష విధించినట్లు ప్రొహిబిషన్ అండ్ ఎక్సైజ్ ఇన్‌స్పెక్టర్ కోట కృష్ణారావు ఓ ప్రకటన ద్వారా తెలిపారు. ఈ కేసును 2022వ సంవత్సరం అక్టోబర్ నెలలో అప్పటి స్పెషల్ ఎన్‌ఫోర్స్‌మెంట్ బ్యూరో సబ్ ఇన్‌స్పెక్టర్ దస్తగిరి కేసు నమోదు చేయగా, తాము ఛార్జ్ షీట్ ఫైల్ చేయడమైనదని కృష్ణారావు పేర్కొన్నారు.

# శ్రీకాకుళం వార్త



## ఓటర్ల జాబితా ప్రక్రియ పారదర్శకంగా జరగాలి

### ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి





వంగర, జూన్ 9, ప్రభాతవార్త:

ఓటర్ల జాబితా ప్రక్రియ అత్యంత పారదర్శకంగా నిర్వహించాలని రాజాం నియోజకవర్గం ఎన్నికల అధికారి వెంకట్ రెడ్డి తెలిపారు. మండలంలోని స్థానిక మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం ఎస్.ఐ.ఆర్ పై ఒక్కరోజు శిక్షణ కార్యక్రమంను సూపర్వైజర్లకు మరియు బూత్ లెవెల్ ఆఫీసర్లకు నిర్వహించారు. ఈ శిక్షణలో ఆయన పాల్గొని మాట్లాడుతూ ఈ నెల 15వ తారీకు నుండి ప్రారంభమయ్యే ఇంటింటా ఎస్.ఐ.ఆర్ సర్వేలో ఓటర్ జాబితాలో భాగంగా పారదర్శంగా సర్వే నిర్వహించి, 2025 ఓటర్ల జాబితాకు, రెండు ఓటర్ జాబితా ఉన్న ఓటర్ యొక్క వ్యత్యాసం గమనించి ఓటర్ హౌస్ హోల్డ్ మ్యాప్ చేయాలని అయన సూచించారు. కార్యక్రమంలో తహసిల్దార్ పిన్నింటి రామారావు, ఏఎసఓలు, సూపర్వైజర్లు, బిఎల్వోస్, ఆరఐలు ఈశ్వరరావు, రామారావు, ప్రవీన్ ఆఫీస్ సిబ్బంది పాల్గొన్నారు.

## గర్భిణీలు ప్రభుత్వ ఆసుపత్రి సేవలు వినియోగించుకోవాలి

రాజాం, జూన్ 9 ప్రభాతవార్త



గర్భిణీలు క్రమం తప్పకుండా వైద్య పరీక్షలు ప్రభుత్వ ఆసుపత్రిలో పొందాలని బొబ్బిలి ఎమ్మెల్యే ఆర్.వి.ఎస్. కె కె రంగారావు (బేబీ నాయిన) అన్నారు. స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రం, తెర్లాంలో తన స్వంత నిధులతో తన తండ్రి ఆర్ వి జి కె రంగారావు పేరున నిర్మించిన పేషంట్స్ వెయిటింగ్ ప్రాంగణాన్ని బేబీ నాయిన, బుడా చైర్మన్ తెంటు లక్ష్మనాయుడు ప్రారంభించారు. ఈ సందర్భంగా ప్రధాన మంత్రి సురక్షిత మాతృవ అభియాన్ కార్యక్రమంలో భాగంగా వైద్యపరీక్షలు కొరకు విచ్చేసిన గర్భిణీలతో మాట్లాడుతూ ప్రభుత్వం గర్భిణీలకు కల్పిస్తున్న అన్ని సదుపాయాలు సద్వినియోగం చేసుకోవాలని, మంచి పోషకారం తీసుకోవడం ద్వారా ఆరోగ్యాన్ని మెరుగుపరచుకోవాలని సూచించారు. ఆనంతరం సభను ఉదేశించి మాట్లాడుతూ వైద్యులు, సిబ్బంది ప్రజలకు మంచి సేవలను అందించాలని సిబ్బందిని కోరారు. వైద్యాధికారి డాక్టర్ రెడ్డి స్వాతి ఆసుపత్రిలోని సమస్యలను బేబీ నాయిన దృష్టికి తీసుకొని రాగా, సంబంధిత ఇంజనీరింగ్ అధికారులతో సంప్రదించి నిర్మాణ అంచనాలను వేయించాలని కోరారు. ఈ రోజు కార్యక్రమంలో భాగంగా విచ్చేసిన 45 మంది గర్భిణీలకు డాక్టర్ స్వాతి, డాక్టర్ కుషాల్ చైతన్య బీపీ, షుగర్, హిమోగ్లోబిన్ వంటి పలు వైద్య పరీక్షలు నిర్వహించి తీసుకోవలసిన ఆరోగ్య పరమైన జాగ్రత్తలు తెలియజేశారు.ఆనంతరం ప్రతినెల ఈ కార్యక్రమంలో భాగంగా స్థానిక శాసన సభ్యులు బేబీ నాయిన సహకారంతో స్వచ్ఛందంగా గర్భిణీల కొరకు ప్రత్యేకంగా ఏర్పాటుచేసిన పోషకాహారం అందజేశారు.ఈ కార్యక్రమంలో పర్యవేక్షక సిబ్బంది, మిడ్ లెవెల్ హెల్త్ పర్సన్స్, ఆరోగ్య కార్యకర్తలు, ఇతర కార్యాలయ సిబ్బంది పాల్గొని సేవలు అందించారు. స్థానిక ఏఎంసీ చైర్మన్ నర్సుపల్లి వెంకట నాయుడు, మండల టీడీపీ అధ్యక్షులు వెంకటేష్, జనసేన మండల అధ్యక్షులు మరడాన రవి, బీజేపీ మండల అధ్యక్షులు గొల్లపూడి సాయికుమార్, ఎంపిడిఓ ఆర్.రాంబాబు, తహసిల్దార్ ఆర్.ధనం, తదితరులు పాల్గొన్నారు.

## నీలమణి దుర్గమ్మవారి వార్షికోత్సవంలో ఎమ్మెల్యే



పాతపట్నం, జూన్ 9 ప్రభాతవార్త:

మండలంలోని సీతారాంపల్లి గ్రామదేవత శ్రీ నీలమణి దుర్గా అమ్మవారి వార్షికోత్సవ మహోత్సవాలు ఘనంగా నిర్వహించబడ్డాయి. ఆలయ కమిటీ సభ్యుల ఆహ్వానం మేరకు ఎమ్మెల్యే మామిడి గోవిందరావు వేడుకల్లో పాల్గొని అమ్మవారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. గ్రామ ప్రజలు సుఖసంతోషాలతో ఉండాల ని, గ్రామాలు అన్ని విధాలా అభివృద్ధి చెందాలని అమ్మవారిని ప్రార్థించారు. అనంతరం ఆలయ కమిటీ సభ్యులు ఎమ్మెల్యేను ఘనంగా సత్కరించారు. కార్యక్రమంలో కూటమి నాయకులు, కార్యకర్తలు, భక్తులు పాల్గొన్నారు.

## దుర్వాసన మధ్య విద్యాభ్యాసం



కొత్తూరు, జూన్ 9 ప్రభాతవార్త

మండలంలోని నివగాం గ్రామంలో గల మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల-1 సమీపంలో ఉన్న కాలువలు అధ్వాన్న స్థితిలో ఉండటంతో విద్యార్థులు, స్థానికులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారు. రాష్ట్రవ్యాప్తంగా ప్రభుత్వ పాఠశాలలను పరిశుభ్రత, పచ్చదనం మరియు మెరుగైన వాతావరణంతో అభివృద్ధి చేస్తున్నామని అధికారులు చెబుతున్న నేపథ్యంలో, ఈ పాఠశాల పరిసరాల పరిస్థితి మాత్రం భిన్నంగా కనిపిస్తోంది. కాలువల్లో మురుగు నీరు నిల్వ ఉండటం వల్ల తీవ్ర దుర్వాసన వ్యాపిస్తోంది. దీంతో చిన్నారులు ఆ దుర్వాసనను భరిస్తూనే ప్రతిరోజూ పాఠశాలకు వెళ్లాల్సిన పరిస్థితి నెలకొంది. ప్రస్తుతం వేసవి కాలంలోనే ఈ ప్రాంతం ఇంత దయనీయంగా ఉండగా, రానున్న వర్షాకాలంలో పరిస్థితి మరింత విషమించే అవకాశం ఉందని గ్రామస్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. జూన్ 12వ తేదీ నుంచి పాఠశాలలు తిరిగి ప్రారంభం కానున్న నేపథ్యంలో, గ్రామ పంచాయతీ అధికారులు మరియు ప్రజాప్రతినిధులు వెంటనే స్పందించి కాలువల సమస్యను శాశ్వతంగా పరిష్కరించాలని గ్రామస్థులు కోరుతున్నారు. విద్యార్థుల ఆరోగ్యం, పరిశుభ్రమైన విద్యా వాతావరణం దృష్ట్యా తక్షణ చర్యలు తీసుకోవాలని వారు విజ్ఞప్తి చేస్తున్నారు.

## పెంచిన పెట్రోల్ గ్యాస్, డీజల్ ధరలను వెంటనే తగ్గించాలి




### వామపక్షాల డిమాండ్

ప్రభాతవార్త, పలాస

కేంద్ర రాష్ట్ర ప్రభుత్వాలు పెంచిన డీజిల్ పెట్రోల్ వంట గ్యాస్ ధరలు వెంటనే ఉపసంహరించుకోవాలని లేకపోతే దశల వారి ఉద్యమాలు ఉధృతం చేస్తామని సిపిఎం పార్టీ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు కె మోహనరావు,సిపిఎం స్థానిక నాయకులు యన్. గణపతి సిపిఐ జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు లండ వెంకటరమణ మండల నాయకులు సిపిఐ యం యల్ లిబరేషన్ నాయకులు టి సన్యాసి రావు, మద్దిలి రామారావు, న్యూ డెమోక్రసీ నాయకులు జుత్తు వీరాస్వామి,మద్దిలి వినోద్ కుమార్ , సిపిఐ యంయల్ జనశక్తి నాయకులు కోనేరు రమేష్ లు హెచ్చరించారు. పెట్రోల్ డీజిల్ ధర తగ్గించాలని కోరుతూ వామపక్షాల ఆధ్వర్యంలో కాశీబుగ్గ రామాలయం వద్ద నుండి రాస్తారోకో కోసం ర్యాలీగా వెళ్తున్న సందర్భంగా పాత బస్టాండ్ వద్ద పోలీసులు అడ్డుకోవడంతో ఉద్యమకారులకి పోలీసులకు మధ్య తోపులాట వాగ్వాధం జరిగింది. కార్యక్రమంలో వామపక్ష నాయకులు టి అజయ్ కుమార్, టి రాజు బి ప్రసాద్, వి కృష్ణారావు, యన్ ఢిల్లేశ్వరి జె భాగ్యలక్ష్మి వి ముకుందరావు,కె దుష్యంత్, జి జగదీశ్వరరావు, పి నాగేశ్వరరావు, వి పాపయ్య జి బాలకృష్ణ వివిధ ప్రజా సంఘాల నాయకులు యం నిర్మల, కె సుహాసిని, పి భూదేవి, బి శశిరేఖ, జ్యోతి, రేవతి, పుష్ప సుందరి, తదితరులు పాల్గొన్నారు

## విద్యార్థులను కూడా మోసం చేస్తున్న కూటమి ప్రభుత్వం

ప్రభాతవార్త, పలాస



హామీలను అమలు చేయకుండా మోసం చేసిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై ఉద్యమాలు చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని అఖిల భారత విద్యార్థి సమాఖ్య (ఏఐఎస్ఎఫ్) నాయకులు హెచ్చరించారు.ఏఐఎస్ఎఫ్ జిల్లా జనరల్ బాడీ సమావేశం పలాసలో నిర్వహించారు.ఈ సమావేశానికి ముఖ్య అతిథులుగా ఏఐఎస్ఎఫ్ రాష్ట్ర అధ్యక్షుడు గుజ్జుల వలరాజు,రాష్ట్ర సహాయ కార్యదర్శి నాగభూషణం హాజరయ్యారు. ఈసందర్భంగా వారు మాట్లాడుతూ ప్రభుత్వ విద్యను బలోపేతం చేయాల్సిన కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు విద్యారంగాన్ని కార్పొరేట్ సంస్థలకు అప్పగిస్తున్నాయని విమర్శించారు.ప్రభుత్వ విద్యాసంస్థల్లో మౌలిక వసతులు కల్పించడంలో విఫలమైన పాలకులు విద్యార్థులను కేవలం ఓటు బ్యాంకుగా ఉపయోగిస్తున్నారని ఆరోపించారు.విద్య ఖర్చులు రోజురోజుకు పెరుగుతున్నాయని, సాధారణ కుటుంబాలపై భారీ ఆర్థిక భారం పడుతోందన్నారు. ప్రభుత్వ విద్య,వైద్యం,ఉపాధి అవకాశాలను పెంచాల్సిన ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాలకు అనుకూలంగా వ్యవహరి స్తోందని విమర్శించారు. కార్యక్రమంలో ఏఐవైఎఫ్ రాష్ట్ర సహాయ కార్యదర్శి కె. శ్రీనివాస్, ఏఐఎస్ఎఫ్ జిల్లా అధ్యక్షుడు సోమశేఖర్,జిల్లా కార్యదర్శి రవి,జిల్లా ఉపాధ్యక్షులు సాయి,కార్తీక్,కౌశిక్,సహాయ కార్యదర్శులు వేణు,జయ,ప్రశాంత్,హర్షవర్ధన్ పాల్గొన్నారు.

10 -6Pg9th cheli wed.qxd:10 -6Pg9th cheli wed.qxd 1/1/02 5:47 AM Page 1



# గోధుమ నిగారింపు



ముఖాన్ని మెరిసేలా చేయగలిగే యాంటీ ఆక్సిడెంట్లు మరెన్నో పోషకాలు గోధుమ పిండిలో మెండుగా ఉంటాయి. మరి దీన్ని సౌందర్య సాధనంగా ఎలా ఉపయోగించాలో చూద్దామా... చర్మం మెరుపు తగ్గినప్పుడు లేదా మృదుత్వం దూరమైనప్పుడు గోధుమ పిండికి మరొక పదార్థాన్ని కలిపిన మిశ్రమంతో సమస్యను తరిమే యొచ్చు. రెండు టేబుల్ స్పూన్ల మెత్తని గోధుమపిండి, టేబుల్‌స్పూన్ తాజా మిల్క్ క్రీమ్ తీసుకోవాలి. దానికి తగినంత గులాబీ నీటిని కలపాలి. ఈ మిశ్రమాన్ని ముఖానికి పూత వేసి పావుగంట ఆరనివ్వాలి. ఆపై గోరువెచ్చని నీటితో శుభ్రంచేస్తే చాలు. ఇలా వారానికి రెండుసార్లు చేస్తే మెనోపాజ్ దగ్గరపడుతున్నప్పుడు ఎదురయ్యే పిగ్మెంటేషన్ సమస్య, అలాగే ఎండవల్ల ఏర్పడే మచ్చలకు నివారణ దొరుకుతుంది. చర్మ పీహెచ్ స్థాయి లను సమన్వయం చేసి స్కిన్‌టోన్‌ను మెరుగుపరుస్తుంది. మృతకణాలను తొలగించడమే కాదు, మాయిశ్చరైజర్ పనిచేసి డ్రైప్యాచ్‌లను దూరం చేస్తుంది.

**మచ్చలు దూరం...** రెండు టేబుల్ స్పూన్ల చొప్పున గోధుమపిండి, పెరుగు తీసుకుని టేబుల్‌స్పూన్ తేనె, తగినన్ని నీళ్లు కలపాలి. ముఖాన్ని శుభ్రంగా ఈ మిశ్రమాన్ని రాసి పదినిమిషాలపాటు ఆరనివ్వాలి. ఆపై కడిగేస్తే సరి. చర్మం తేమగా, మృదువుగా మారుతుంది. ముఖంపై గీతలను తగ్గిస్తుంది. అలాగే రెండు టేబుల్ స్పూన్ల గోధుమ పిండికి చిటికెడు పసుపు, అయిదారుచుక్కల నిమ్మరసాన్ని కలిపి ముఖానికి అప్లై చేయాలి. పావుగంట తర్వాత కడగాలి. ఎండవల్ల లేదా వయసురీత్యావచ్చే మచ్చలు, పిగ్మంటేషన్ మార్క్స్ దూరమవుతాయి. ముఖం మెరుస్తుంది.

# ఆత్మ విశ్వాసంతో ముందుకు !



కొంత మంది అమ్మాయిలు ఆఫీసులో బాధ్యతలన్నీ సక్రమంగా నిర్వర్తిస్తారు. ప్రాజెక్టు పనులన్నీ సమయానికి పూర్తి చేస్తారు. అయినా తను సరిగ్గా పనిచేయలేదని బాధపడుతారు. సామర్థ్యాన్ని ప్రదర్శించలేక పోతున్నా అనుకుంటూ కుంగుబాటుకు గురవుతారు. ఇంపోస్టర్ సింద్రోమ్‌గా పిలిచే ఈ సమస్య నుంచి బయట పడటానికి నిపుణులేం చెబుతు న్నారంటే.. మనలోనే ఎక్కువ.. ఆఫీసు పనుల్లో తాము చెప్పినంత గొప్పగా ఫలితాలను చూపించలేక పోతు న్నామనే ఆలోచన, వేదన మగవారికన్నా మహిళల్లోనే ఎక్కువగా ఉంటుందట. ఈ సింద్రోమ్ ఉన్నా వారు సరిగ్గా పనిచేయక పోయినా ఎందుకు తమను ఉద్యోగం నుంచి తీయడం లేదు అని ఆలోచిస్తుంటా రట. అయితే ఇదేమీ మానసిక అనారోగ్యం కాదని, అందరిలోనూ అప్పుడప్పుడూ కనిపించే సమస్యే అంటున్నారు నిపుణులు. ఇటు వంటి ఆలోచనల నుంచి స్వీయ ప్రయత్నంతో తేలిగ్గానే బయట పడొచ్చంటున్నారు.

**గుర్తించలేక..** ఈ సమస్య ఉన్నవారు తమలోని ప్రతిభ, నైపుణ్యాలను గుర్తించ లేరు. ఇతరుల అంచనాలకు తగ్గట్లు జీవించలేకపోతున్నామనే వేదన కూడా వీరిని వెంటాడుతుంది. ఇందుకు ఆ మహిళలు పెరిగిన వాతావరణం, బాల్యంలో ఎదుర్కొన్న అనుభవాలు కూడా కారణం కావొచ్చు అంటున్నారు మానసిక నిపుణులు. అలాగే పని చేసే చోట లింగవివక్ష, ఆడవాళ్లు ఎక్కువ పనిచేయలేరంటూ తక్కువ బాధ్యతలు అప్పజెప్పడం వంటివీ వారిలో ఇంపోస్టర్ సింద్రోమ్‌కు దారి తీస్తాయట.

**బయట పడొచ్చు....** మనల్ని ప్రభావితం చేస్తున్న భావోద్వేగాలను ముందుగా గుర్తించాలి. గతంలో సాధించిన విజయాలను వరసగా పుస్తకంగా రాయడం ద్వారా అది మన 'పరఫార్మెన్స్ ట్రీ'గా మారుతుంది. అప్పుడప్పుడు దాన్ని పునఃపరిశీలన చేస్తుంటే ఆ విజయాలన్నీ మన ప్రత్యేకతను గుర్తుచేస్తుంటాయి. స్వీయ ప్రశంస నేర్చుకుంటే ఆత్మవిశ్వాసాన్ని పెంపొందించుకోవచ్చు. అలాగే భావోద్వేగాలను అదుపులో ఉంచుకోవడానికి ధ్యానం యోగా వంటివి చేస్తే క్రమంగా ఈ సమస్యను దూరంగా ఉండొచ్చు.

యవ్వనంలోలా ఉండాలని ఏ మహిళకు ఉండదు చెప్పండి. కానీ కొంతమంది ఏళ్లు గడిచినా చిన్న వాళ్లలా కనిపిస్తే.. కొందరినేమో త్వరగా వృద్ధాప్యం పలకరి స్తుంది. ఇది వారి వంశ పారంపర్యమేమో అను కుంటాం. కానీ కొన్ని జీవన సూత్రాలు పాటిస్తే ఎవరైనా వయసును తగ్గించుకోవచ్చు అంటున్నారు నిపుణులు. అవేంటంటే..

**చన్నీటి స్నానం :** సీజన్ ఏదైనాచల్లటి నీళ్లతో స్నానం చేస్తే వచ్చే లాభాలు అనేకం. ఇది మెటబాలిజాన్ని పెంచటమే కాదు. రక్త ప్రసర ణనూ వృద్ధి చేస్తుంది. చర్మాన్ని ఆరోగ్యంగా ఉంచి, యవ్వనంగా కనిపించేలా చేస్తుంది.

# జీవన సూత్రాలు పాటిస్తే..



**ఉపవాసం..** కొన్ని ప్రత్యేక సందర్భాల్లో ఉపవాసం ఉంటూనే ఉంటాం. వారంలో ఒక రోజు తప్పనిసరి చేసుకోండి. జీర్ణవ్యవస్థకు ఇలా అప్పుడప్పుడే విశ్రాంతినిస్తే.. చర్మంలో కొత్త కణాల వృద్ధి జరుగుతుంది. దీంతో వృద్ధాప్య ఛాయలూ త్వరగా ఏర్పడవు. అలానే మైండ్‌ఫుల్ ఈటింగ్.. అంటే తినే ప్రతి ముద్దనీ ఆస్వాదిస్తూ తినాలి. ఇదీ మనల్ని నిత్యయవ్వనంగా ఉంచుతుంది.

**కళలతో..** మీకు డ్యాన్స్ చేసే అలవాటు ఉందా లేదా సంగీత వాద్యా లేమైనా వాయించ గలరా? లేదంటే నేర్చుకోండి. ఎందుకంటే క్రమం తప్పకుండా నాట్యం చేసేవాళ్లు శారీరకంగానే కాదు.. మానసికంగానూ ఫిట్‌గా తయారవు తారు. ఇక సంగీతంలో ప్రవేశం ఉంటే.. కాగ్నిటివ్ సామర్థ్యం పెరిగి, కొత్త ఆలోచనలకీ ఆస్కారం ఉంటుంది.

**కృతజ్ఞతలు చెప్పండి..** ఈ తీరు ఆశావహ దృక్పథాన్ని ఏర్పరుస్తుంది. ఉత్సాహంగా ఉరకలు వేసే మనసు యవ్వనానికి ప్రతీకే కదా! పోనీ ఒత్తిడి లేకపోయినా ఆ ప్రభావం శరీరం మీద సానుకూల ప్రభావం చూపుతుంది. ఇదీ మేలు చేసేదే! అందుకే ఎప్పుడూ నవ్వుతూ ఉండండి. కొత్త పరిచయాలు ఏర్పరచుకోండి. నలుగురితోనూ మంచి బంధాలు వారి ఆయుష్షు పెరగటమే కాదు. వృద్ధాప్యమూ త్వరగా దరిచేరదట.

# తాజాగా పల్లీ పౌడర్



ఇడ్లీ, వడ, దోశ ఇలా ఏ టిఫిన్ చేసినా.. అందులోకి పల్లీ పచ్చడి ఉండాల్సిందే. అప్పటికప్పుడు చట్నీ చేయాల్సిన పని లేకుండా రెడీమేడ్గా ఉందనుకోండి. సగం పని తగ్గినట్లే అందుకోసం ముందుగానే పౌడర్ చేసిపెట్టుకోవచ్చు. ఈ ఇన్‌స్టంట్ పల్లీ చట్నీ కోసం.. పల్లీలు అర కప్పు, పుట్నాలపప్పు ముప్పావు కప్పు, ఆవాలు, మినపప్పు, జీలకర్ర చెంచా చొప్పున, కారం ముప్పావు చెంచా, ఉప్పు రుచికి తగినంత నూనె, ఎండుమిర్చి 8, వెల్లుల్లి తరుగు చెంచా, కరివేపాకు రెండు రెబ్బలు, రెండు రెబ్బలు, చింతపండు కడాయిలో పల్లీలను వేయించి పళ్లెంలోకి తీయాలి. తర్వాత పుట్నాలపప్పు, వెల్లుల్లి, ఆరు ఎండుమిర్చిలను వేయించాలి. అందులో చింతపండు వేసి.. తేమ పోయేదాకా వేయించి తీయాలి. అన్నీ చల్లారాక మిక్సీ జార్లో వేసి గ్రైండ్ చేయాలి. కడాయిలో నూనె కాకనిచ్చి.. ఆవాలు, మినప్పప్పు, జీలకర్ర, మిగిలిన ఎండుమిర్చి, కరివేపాకు లను ఒక్కొక్కటిగా వేయాలి. అవి వేగాక, గ్రైండ్ చేసిన పొడి జతచేసి కలియ తిప్పుతూ ఒక నిమిషం వేయించాలి. చల్లారిన తర్వాత తడిలేని గాలి చొరబడని సీసాలో భద్రం చేసుకోవాలి. అవసర మైన ప్పుడు తగినంత పొడిని కాసిని వేడినీళ్లలో కలిపామంటే.. రోజూ చేయాల్సిన శ్రమ తప్పుతుంది. తాజా పల్లీ చట్నీ తిన్నట్టే ఉంటుంది.





# అడుగేద్దాము !

వేసవి సెలవుల్లో పిల్లలకు ఆడింది ఆట, పాడింది పాట. ఎండరా... బయటికి వెళ్లొ ద్దన్నా వినకుండా ఆటలంటూ పరుగెడతారు. ఇంట్లోనే ఉంచా లంటే ఈ ఆటను ప్రయత్నిం చండి. మూడు వరుసల్లో పాదాలు, చేతి గుర్తులు మార్చి మార్చి ఉంటాయి. వాటి ఆధారంగా పిల్లలు ముందుకు సాగాలి. ఒక పాదం ఉండాల్సిన చోట రెండు పాదాలు పెట్టినా... కుడిచేతి స్థానంలో ఎడమ చేతిని ఉంచినా... ఇలా ఎక్కడ తప్పుచేసినా ఆట ఆగిపోతుంది. మళ్లీ మొదటినుంచి రావాలి. ఒక్కరు లేదా ఎందరున్నా దీన్ని ఆడొచ్చు. పొరపాటు చేయకుండా ఎవరు ముగిస్తే వాళ్లే విజేత చార్ట్స్, కాగితాలతో సొంతంగా ప్రయత్నించొచ్చు. అంత ఓపిక లేదంటే ఆన్‌లైన్‌లో వెతికేయండి... హ్యాండ్ అండ్ ఫీట్ మ్యాట్లు, కటింగ్స్ రెడీగా దొరికే స్తున్నాయి. వాటినైనా తెప్పించుకోవచ్చు. ట్రైంపస్ గానే భావించకండి. ఇదో మంచి వ్యాయామం కూడా: బ్యాలెన్సింగ్, మోటా ర్స్కిల్స్, కళ్ల శరీరం సమన్వ యం, ఫోకస్ పెరగడం వంటి ఎన్నో ప్రయోజనాలూ ఉన్నాయి. ఈ సెలవుల్లో ప్రయత్నించి చూడండి.

# ఆత్మశుద్ధికి ప్రతీక

గణపతికి గుంజీలు తీయడం అనేది కేవలం ఒక సంప్రదాయం కాదు; అది మన అహంకారాన్ని తగ్గించి, భక్తిని పెంచే ఆధ్యాత్మిక సాధన. విఘ్నాలను తొలగించే విఘ్నేశ్వరుని స్మరిస్తూ, వినయంతో గుంజీలు తీసినప్పుడు మన జీవితంలో జ్ఞానం, విజయం, శాంతి, శుభఫలితాలు కలుగుతాయని భక్తుల విశ్వాసం. గుంజీలు అనగా రెండు చేతులను క్రాస్‌గా ఉంచి చెవులను పట్టుకుని కూర్చొని లేవడం. దీనిని కొన్నిచోట్ల 'తొప్పుకరణం' అని కూడా పిలుస్తారు. గణపతి ఆలయాలలో భక్తులు ఈ విధంగా గుంజీలు తీసి స్వామివారికి నమస్కరిస్తారు. ఇది కేవలం శారీరక వ్యాయామం మాత్రమే కాదు; భక్తి, వినయం, పశ్చాత్తాపం మరియు ఆత్మశుద్ధికి ప్రతీకగా భావించబడుతుంది. గుంజీలు తీయడం ద్వారా భక్తుడు తన అహంకారాన్ని విడిచిపెట్టి భగవంతుని ముందు వినయంతో నిలుస్తాడు. 'తెలిసో తెలియకో చేసిన తప్పులను క్షమించండి' అనే భావనతో గణపతిని ప్రార్థిస్తాడు. ఈ ఆచారం మనలోని దుర్గుణాలను తొలగించి, సద్గుణాలను పెంపొందించాలనే సంకల్పాన్ని సూచిస్తుంది. నిజమైన పశ్చాత్తాపం, వినయం, శరణాగతి ఉన్నప్పుడు గణనాథుడు తన భక్తుల కోరికలను అనుగ్రహిస్తాడని శాస్త్రాలు చెబుతున్నాయి. ఒక పురాణ కథనం ప్రకారం, శ్రీ మహావిష్ణువు గణపతిని సరదాగా ఆటపట్టించడానికి ప్రయత్నించగా, గణపతి ఆయన సుదర్శన చక్రాన్ని మింగాడని చెబుతారు. దానిని తిరిగి పొందడానికి విష్ణువు తన రెండు చేతులను చెవుల వద్ద ఉంచి విచిత్రమైన హావభావాలు చేశాడు. వాటిని చూసి గణపతి నవ్వగా చక్రం బయటకు వచ్చింది. అప్పటి నుండి గణపతిని ప్రసన్నం చేయడానికి గుంజీలు తీయడం ఒక ఆచారంగా మారిందని విశ్వసిస్తారు. ఆధునిక పరిశోధనల ప్రకారం కూడా గుంజీలు తీయడం వల్ల శరీరానికి, మెదడుకు కొంత మేలు కలుగుతుందని భావిస్తారు. చెవులను పట్టుకుని కూర్చొని లేవడం వల్ల ఏకాగ్రత పెరగడం, రక్త ప్రసరణ మెరుగుపడటం, శారీరక చురుకుదనం పెరగడం వంటి ప్రయోజనాలు ఉండవచ్చని చెబుతారు. అందుకే దీనిని కొందరు "సూపర్ బ్రెయిన్ యోగా" అని కూడా పిలుస్తారు.

# తెర

## టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026' జ్యూరీ చైర్ పర్సన్‌గా ఇంద్రజ



మొదటి 5 మంది విజేతలకు బహుమతులు
మొదటి విజేతకు రూ.10 వేలు, రెండో విజేతకు రూ.7500, మూడో విజేతకు రూ.5 వేలు జూన్ 13వ తేదీ వరకు ఉచితంగా ఎంట్రీలను పంపే అవకాశం
జూన్ 21న హైదరాబాద్ లో అవార్డ్స్ ప్రధానోత్సవం

చిత్ర పరిశ్రమలో న్యూ యంగ్ టాలెంట్ ను ప్రోత్సహించేందుకు తెలంగాణ ఫిలిం ఛాంబర్ ఆఫ్ కామర్స్ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 ను ప్రకటించిన సంగతి తెలిసిందే. ఈ ఫెస్టివల్ కు భారీగా ఎంట్రీలు వస్తున్నట్లు ఈ రోజు హైదరాబాద్ లో జరిగిన ప్రెస్ మీట్‌లో డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ తెలిపారు. ఈ అవార్డుల కమిటీ జ్యూరీకి ఛైర్ పర్సన్ గా నటి ఇంద్రజను ఎంపిక చేసినట్లు ఆయన వెల్లడించారు. దాదాపు 30 కేటగిరీల్లో మొదటి ఐదుగురు విజేతలకు అవార్డ్స్ ఇసామని, మొదటి ముగ్గురు విజేతలకు అవార్డ్స్ తో పాటు నగదు బహుమతి కూడా అందిస్తామని డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ ప్రకటించారు. కర్ణాటక, తమిళనాడు వంటి ఇతర రాష్ట్రాల నుంచి కూడా తెలుగు వాళ్లు తమ షార్ట్ ఫిలింస్ పంపవచ్చని ఆయన అన్నారు. ఈ రోజు జరిగిన ప్రెస్ మీట్ లోటీఎఫ్ సీసీ ఛైర్మన్ డా. ప్రతాని రామకృష్ణ గౌడ్ మాట్లాడుతూ ఇండస్ట్రీ మీద ఎన్నో ఆశలతో రోజూ కొత్త వారు వస్తున్నారు. వారికి తమ కంటెంట్ ను ఎలా ప్రదర్శించాలి, టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 జ్యూరీ ఛైర్ పర్సన్ నటి ఇంద్రజ మాట్లాడుతూ టీఎఫ్ సీసీ షార్ట్ ఫిలిం ఫెస్టివల్ అవార్డ్స్ 2026 నిర్వహణ ద్వారా కొత్త వాళ్లను ప్రోత్సహించేందుకు రామకృష్ణ గౌడ్ గొప్ప పని చేస్తున్నారు.

## 'ఓజీ టూర్' కాన్సర్ట్ మ్యాజికల్ అనుభూతిని అందించబోతోంది..



ప్రేక్షకులు అద్భుతమైన మ్యూవీ జిక్, డ్యాన్స్, విజువల్ ఎఫెక్ట్స్‌తో కూడిన గ్రాండ్ ఎంటర్‌టైన్‌మెంట్‌ను ఆస్వాదించబోతున్నారు. మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్ సెన్సేషనల్ మ్యూజిక్ డైరెక్టర్ ఎస్.ఎస్. తమన్, ఏసీటీసీ ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న ఓజీ టూర్ ఇండియా మెగా మ్యూజికల్ ఈవెంట్ జూన్ 13న హైదరాబాద్‌లోని బౌల్డర్ హిల్స్‌లో గ్రాండ్ గా జరగనుంది. సంగీత ప్రియులకు ఓ ప్రత్యేక అనుభూతిని అందించనున్న ఈ మ్యూజికల్ ఈవెంట్‌కు సంబంధించిన వివరాలను తెలియజేస్తూ నిర్వాహకులు ప్రెస్ మీట్ నిర్వహించారు. ప్రెస్ మీట్‌లో ఎస్.ఎస్. తమన్ మాట్లాడుతూ... ఓజీ సినిమా అప్రిషియేషన్ సెల బ్రేషన్‌ను కొనసాగిస్తూ 'ఓజీ టూర్ ఇండియా'ను నిర్వహిస్తున్నాం. హైదరాబాద్‌లో తొలిసారిగా ఈ ఈవెంట్ నిర్వహించడం ఆనందంగా ఉంది. అనిరుధ్ 'హుకుం టూర్' ఎంతటి ప్రభావాన్ని చూపిందో, మనకు 'ఓజీ టూర్' కూడా అంతటి బలాన్ని ఇచ్చింది. ఎక్కడ చూసినా 'ఓజీ' మ్యూజిక్ వినిపిస్తోంది. ఆ సెలబ్రేషన్‌ను ఒక ఐకాన్‌గా తీసుకుని ఈ కాన్సర్ట్‌ను రూపొందించాం. ఏసీటీసీ ఈవెంట్స్‌తో కలిసి ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నాం. సినిమా వేడుకల్లో మీ అందరినీ కలుస్తూనే ఉంటాను. కానీ తొలిసారి ఇలా వ్యక్తిగతంగా 'ఓజీ టూర్ ఇండియా' ద్వారా కలవడం చాలా ఆనందంగా ఉంది. జూన్ 13న హైదరాబాద్‌లో, జూలై 11న బెంగళూరులో, ఆగస్టు 15న చెన్నైలో, సెప్టెంబర్ 25న వైజాగ్‌లో ఈవెంట్లు నిర్వహిస్తున్నాం. నేను చేసే ప్రతి షో ద్వారా వచ్చే రెమ్యునరేషన్‌ను ఎప్పుడూ చారిటీకి అందిస్తుంటాను. ఈ షోకు సంబంధించిన వివరాలను కూడా కార్యక్రమం పూర్తైన తర్వాత వెల్లడిస్తాను. తెలుగు, తమిళ, కన్నడ భాషల్లో నేను చేసిన సూపర్ హిట్ పాటలను ఎంపిక చేసి, అద్భుతమైన కొరియోగ్రఫీతో ప్రేక్షకుల ముందుకు తీసుకొస్తున్నాం. ఈ ఈవెంట్‌లో అందరి హీరోల పాటలు ఉంటాయి. ఇలాంటి లైవ్ షోలు చేయడం వల్ల ప్రేక్షకులతో ప్రత్యక్ష అనుబంధం పెరుగుతుంది. ఏ పాటలకు ఎలా స్పందిస్తు న్నారో తెలుసుకోవడం భవిష్యత్ ప్రాజెక్టులకు కూడా ఎంతో ఉపయోగపడుతుంది. ఈ కాన్సర్ట్ పూర్తిగా మ్యాజికల్‌గా ఉండబోతోంది. మా ప్లేలిస్ట్ చూస్తుంటే మాకే ఎనర్జీ వస్తోంది. ఫైర్‌వర్క్స్, ఎల్ఈడీ స్క్రీన్స్, 3డీ ఎఫెక్ట్స్, డాన్స్ పెర్ఫార్మెన్స్‌లు అన్నీ అద్భుతంగా ఉంటాయి.

## 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' టీజర్, ట్రైలర్ లాంచ్



తెలుగు సిల్వర్ స్క్రీన్‌పైకి బ్యూటీఫుల్ యూత్ ఫుల్ లవ్ స్టోరీ రాబోతోంది. మోహన్ సిద్ధి, మహన్, శృతి శంకర్ హీరోహీరోయిన్లుగా, రమేష్ చెరుకూరు దర్శకత్వంలో, సావిత్రమ్మ నిర్మాణంలో, ఎగ్జిక్యూటివ్ ప్రొడ్యూసర్స్ వి. సాంబశివరావు మరియు వేణు గోపాల చారి సారథ్యం లో తెరకెక్కుతున్న చిత్రం 'సిద్ధుగాడి లవ్ స్టోరీ' ప్రముఖ సినీ దర్శకులు, నిర్మాతలు, నటుల సమక్షంలో 'సిద్ధుగాడి లవ్ స్టోర్థీ చిత్ర టీజర్, ట్రైలర్‌ను ఘనంగా ఆవిష్కరించారు. ప్రసాద్ ల్యాబ్‌లోజరిగిన ట్రైలర్ విడుదల కార్యక్రమంలో ప్రముఖ దర్శకులు ఎ. కోదండరామిరెడ్డి, బి. గోపాల్, దామోదర ప్రసాద్, తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య, దర్శకులు వి. సముద్ర, రామ్ ప్రసాద్, నటుడునిర్మాత అశోక్ కుమార్, నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్, రాజేందర్ ప్రసాద్ తదితరులు ముఖ్య అతిథులుగా పాల్గొని చిత్ర యూనిట్‌కు శుభాకాంక్షలు తెలిపారు. నిర్మాతల మండలి కార్యదర్శి ప్రసన్న కుమార్ మాట్లాడుతూ, పవన్ కళ్యాణ్ డైలాగ్‌లో వచ్చిన సిద్ధు.. సిద్ధార్థ్ రాయ్ ఎంతగా ప్రేక్షకులకు కనెక్ట్ అయిందో, అదే విధంగా ఈ సినిమా కూడా ప్రేక్షకులకు బాగా చేరువ అవుతుందని నమ్ముతున్నాను తెలుగు సినీ దర్శకుల సంఘం అధ్యక్షుడు వి.ఎన్. ఆదిత్య మాట్లాడుతూ, ఈ చిత్రాన్ని ఆశీర్వదించేందుకు వచ్చిన సినీ పెద్దలందరికీ ధన్యవాదాలు. ప్రముఖ నిర్మాత దామోదర ప్రసాద్ మాట్లాడుతూ, గత పదేళ్లుగా ఎంతో మంది ఎన్ఆర్ఐలు సినీ పరిశ్రమలోకి వస్తున్నారు. అలాంటి వారిలో రమేష్ గారు కూడా ఒకరు. దర్శకుడు వి. సముద్ర మాట్లాడుతూ, ఇలాంటి మంచి ప్రయత్నాలు తప్పకుండా ప్రేక్షకుల ఆదరణ పొందాలి. నిర్మాత ఇంకా ఎన్నో సినిమాలు నిర్మించాలని కోరుకుంటున్నాను

## 'స్లమ్ డాగ్' టీజర్ లాంచ్ ఈవెంట్‌లో విజయ్ సేతుపతి



'స్లమ్ డాగ్' లో పవర్ ఫుల్, యూనిక్ విజయ్ సేతుపతిని చూస్తారు. జెన్జీ యూత్ ఈ సినిమాని ఫ్యామిలీతో కలసి చూడాలని కోరుతున్నాను. డైరెక్టర్ పూరి జగన్నాథ్‌విజయ్ సేతుపతి, పూరీ జగన్నాథ్ మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా 'స్లమ్ డాగ్' పవర్‌ఫుల్ టీజర్ లాంచ్‌డాషింగ్ డైరెక్టర్ పూరి జగన్నాథ్, వెర్సటైల్ హీరో విజయ్ సేతుపతి మోస్ట్ ఎవైటెడ్ యాక్షన్‌డ్రామా 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్'. ఈ చిత్రంపై అన్ని భాషల ప్రేక్షకులలోనూ భారీ అంచనాలు నెలకొన్నాయి. ఆసక్తికరమైన టైటిల్, ఆకట్టుకునే ఫస్ట్‌లుక్ పోస్టర్‌ను ప్రకటించినప్పటి నుంచే ఈ చిత్రం మంచి బజ్ నెలకొంది. ఖిఖిఒక్క వాన పడితే కాకుల్లా చెట్ల కింద దాక్కునే జీవితాలు మావి. అలాంటి మా బతుకులతో ఆడుకుంటే నేనెందుకు వదులుతానుఖి అనే పవర్ ఫుల్ డైలాగ్ తో మొదలైన టీజర్ అదిరిపోయింది. విభిన్నమైన పాత్రలు, తనదైన శైలిలో కథలను ఆవిష్కరించడంలో పేరుగాంచిన పూరి జగన్నాథ్, ఈసారి కూడా విజయ్ సేతుపతి కోసం ఒక ప్రత్యేకమైన పాత్రను సృష్టించారు. విజయ్ సేతుపతి దృష్టి లోపం ఉన్న బిచ్చగాడి పాత్రలో అద్భుతంగా ఒదిగి పోయారు. అదే సమయంలో ఆ పాత్రలోని హీరోయిజాన్ని కూడా అద్భుతంగా ప్రజెంట్ చేశారు. సాంకేతికంగా కూడా టీజర్ ఆకట్టుకుం టుంది. సినిమాటోగ్రాఫర్ సామ్ కె. నాయుడు చిత్రానికి రా, గ్రిటీ విజువల్ టెక్స్చర్‌తో పాటు స్టైలిష్ ప్రెజెంటేషన్‌ను అందించారు. 'స్లమ్ డాగ్' 33 టెంపుల్ రోడ్థ్ టీజర్ సినిమా వరల్డ్ ని, ఆసక్తికరమైన పాత్రలను పరిచయం చేయడమే కాకుండా, కథలోని ప్రధాన మిస్టరీని తెలుసుకోవాలనే ఉత్కంఠను ప్రేక్షకుల్లో పెంచడంలో విజయవంతమైంది.

## 'పెద్ది' థ్యాంక్ యూ మీట్‌లో చిత్ర బృందం



మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ లేటెస్ట్ సెన్సేషనల్ బ్లాక్‌బస్టర్ 'పెద్ది' బుచ్చి బాబు సానా దర్శకత్వంలో, మైత్రి మూవీ మేకర్స్, సుకుమార్ రైటింగ్స్ సమర్పణలో వృద్ధి సినిమాస్ బ్యానర్‌పై వెంకట సతీష్ కిలారు ప్రతిష్టాత్మకంగా నిర్మించారు. జూన్ 4న ప్రపంచవ్యాప్తంగా ఘనంగా విడుదలైన ఈ చిత్రం ప్రేక్షకులు, విమర్శకుల ప్రశంసలు అందుకుని రికార్డ్ బ్రేకింగ్ కలెక్షన్లతో సంచలన విజయాన్ని సాధించింది. మెగా పవర్ స్టార్ రామ్ చరణ్ మాట్లాడుతూ... ప్రేక్షకులు, అభిమానులు, మీడియా మిత్రులు అందరికీ మనస్ఫూర్తిగా థ్యాంక్యూ చెప్పడానికి ఇక్కడికి వచ్చాను. ఇష్టపడి, ప్రేమిస్తూ ఒక పని చేస్తూ ఇంకా చెప్పాలంటే నాకు తెలిసిన పని చేస్తూ ఇంత ప్రేమను పొందడం సర్ప్రైజింగ్‌గా వుంది. ఇది ఎవరో పుష్ చేస్తే చేసిన సినిమా కాదు. బుచ్చిబాబు చెప్పిన కథను నమ్మి ఈ సినిమా చేసినందుకు నాకు ఎంతో సంతృప్తిగా ఉంది. జగపతిబాబు మాట్లాడుతూ... పెద్ది ఆడాడు... పోరాడాడు... గెలిచాడు. రిలీజ్ అయిన తర్వాత కూడా మళ్లీ పోరాడాల్సి వచ్చింది. మళ్లీ గెలిచాడు. 300 కోట్లు, 400 కోట్లు అనేది పక్కన పెడితే, ఈ సినిమా ఎంత పెద్ద విజయం అనేది 300 రూపాయల టికెట్ కొన్న ప్రేక్ష కుడే దాన్ని నిర్ణయిస్తాడు. ప్రేక్షకుల చేతిలో అంత పవర్ ఉంది. డైరెక్టర్ బుచ్చిబాబు సానా మాట్లాడుతూ... ఈ సినిమాను ఇంత ఘన విజయం చేసిన ప్రేక్షకులందరికీ ధన్యవాదాలు. ఒక మంచి కథను చెప్పాలనే ఉద్దేశంతో నేను, చరణ్ మీ ముందుకు వచ్చాం. మైత్రి మూవీ మేకర్స్ నిర్మాత రవిశంకర్ మాట్లాడుతూ... రామ్‌చరణ్‌కి, సతీష్‌కి, అందరికీ పేరుపేరునా నమస్కారం. ప్రసాద్ మల్టీప్లెక్స్‌లోపెద్ది రెండోసారి చూసినప్పుడు మొదటిసారి కలిగిన భావోద్వేగాలే మళ్లీ కలిగాయి.

## 'ఒక కోర్టు కేస్' జూలై 17న విడుదల



'ఒక కోర్టు కేస్' జూలై 17న విడుదల ప్రేమ, విరహం, మోసం వంటి అంశాల చుట్టూ ఇప్పటికే టాలీవుడ్‌లో ఎన్నో సినిమాలు వచ్చినప్పటికీ, ప్రేమలో మోసపోయిన ఓ యువకుడు తనకు జరిగిన అన్యాయానికి న్యాయం కోరుతూ కోర్టును ఆశ్రయించడం అనే వినూత్న కథాంశంతో తెరకెక్కుతున్న చిత్రం 'ఒక కోర్టు కేస్'.ఓపెన్ ఐస్ ఎంటర్‌టైన్‌మెంట్ పతాకంపై నాగేష్ పూడి, ముకేష్ పూడి సమర్పణలో, అండమాన్‌కు చెందిన యువ దర్శకుడు గణేష్ పూడి కథ, స్క్రీన్‌ప్లే అందిస్తూ స్వయంగా దర్శకత్వం వహించి నిర్మించిన ఈ చిత్ర టీజర్‌ను ప్రముఖ హీరో శ్రీకాంత్ ఆవిష్కరించారు. ఈ సందర్భంగా శ్రీకాంత్ మాట్లాడుతూ.. 'టీజర్ చాలా ఆసక్తికరంగా ఉంది. ప్రస్తుతం యువతకు దగ్గరగా ఉండే అంశాన్ని దర్శకుడు కొత్త కోణంలో చూపించే ప్రయత్నం చేశారు. ప్రేమలో జరిగే సంఘటనలను లీగల్ డ్రామాగా మలచడం ఆసక్తికరంగా అనిపించింది. టీజర్‌లో ప్రతి షాట్ ప్రేక్షకుల్లో ఉత్కంఠను పెంచేలా ఉంది. గణేష్ పూడి, చిత్ర యూనిట్‌కు నా అభినందనలు. సినిమా మంచి విజయాన్ని సాధించాలని కోరుకుంటు న్నాను" అని అన్నారు. దర్శకుడు, నిర్మాత గణేష్ పూడి మాట్లాడుతూ.. మా సినిమా టీజర్‌ను శ్రీకాంత్ గారు విడుదల చేసి, చిత్ర బృందాన్ని అభినందించడం ఎంతో ఆనందంగా ఉంది. ఆయనకు మా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి ప్రేమికుడికి తన ప్రేమ కోసం పోరాడే హక్కు ఉంద్థి అనే క్యాప్షన్‌తో విడుదల చేసిన టీజర్‌కు ఇప్పటికే అద్భుతమైన స్పందన లభిస్తోంది.

10vzm15:10vzm15.qxd 09-06-2026 22:41 Page 1



## డోలీమోతలు లేకుండా రహదారి నిర్మాణం పూర్తిచేయాలి



సాలూరు, జూన్ 9, ప్రభాతవార్త :

సాలూరు మండలం బొడ్డపాడు రోడ్డు నిర్మాణంలో నాణ్యత ప్రమాణాలు పాటించాలని అలాగే రిటర్నింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టాలని కోరుతూ సీపీఎం మండల కార్యదర్శి మ.రి. శ్రీనివాసరావు ఆధ్వర్యంలో మంగళవారం గిరిజనులు నిరసణ చేపట్టారు. అనంతరం ఆయన మాట్లాడుతూ గిరిజనుల డోలీమోతలు ప్రధాన సమస్యగా మూలవలస నుండి బొడ్డపాడుకు సుమారు 80 లక్షలతో కిలోమీటర్ వరకు బీటీ రోడ్డు పనులు ప్రారంభించి మధ్యలో ఆపేశారని ఆరోపించారు.అలాగే కాలువల రిటర్నింగ్ వాల్స్ ఇంకా కల్వర్టులు లేకపోవడం వలన ఇటీవల వర్షం కారణంగా బీటీరోడ్డు కొట్టుకుపోయిందని తెలిపారు. అంతేకాకుండా ఐటీడీఏ అధికారులకు తెలియచేసిన ఇప్పటి వరకు కల్వర్ట్, రిటర్నింగ్ వాల్స్ నిర్మాణం చేపట్టలేదిని విమర్శించారు. ఇప్పటికైనా రోడ్డు నిర్మాణం వేగవంతం చేసి నాణ్యత ప్రమాణాలు పాటించాలని డిమాండ్ చేశారు.కమిటీ సభ్యులు చినబాబు,శ్రీను,బాల, తదితరులు పాల్గొన్నారు.

## రూ. 5 లక్షలు సహాయం అందించిన ఎమ్మెల్యే



రామభద్రపురం,జూన్ 9,ప్రభాత వార్త :

చింతలవలస గ్రామానికి చెందిన వ్యక్తి విద్యుత్ షాక్‌తో మరణించాడు. అతని పేరు ముచ్చుపల్లి శ్రీను ఈ కుటుంబానికి నష్ట పరిహారం ఎమ్మెల్యే బేబీనాయన ఇప్పించి కుటుంబాన్ని ఆదుకున్నారు. చింతలవలస గ్రామానికి చెందిన ముచ్చుపల్లి శ్రీను అదే గ్రామంలో ఒక సిమెంటు గోడౌన్లో డైలీ లేబర్ పనిచేసుకుంటూ జీవనం సాగిస్తున్నారు. గత ఏడాది ప్రమాదవశాత్తు విద్యుత్ తీగ తగిలి మృతిచెందాడు. గ్రామ పెద్దలు నుండి విషయం తెలుసుకున్న ఎమ్మెల్యే ఆర్.వీ.ఎస్.కె.కె.రంగారావు (బేబీనాయన) విద్యుత్ శాఖ అధికారు లతో మాట్లాడి ముచ్చుపల్లి శ్రీను కుటుంబానికి రూ.5 లక్షల నష్టపరిహారం వచ్చేలా కృషి చేసారు. బొబ్బిలి కోటలో ముచ్చుపల్లి శ్రీను భార్య ముచ్చుపల్లి మంగ ఎమ్మెల్యే చెక్కును అందజేశారు.

## అంగన్వాడీ చదువు పూర్తయి ఒకటో తరగతికి వెళ్తున్న చిన్నారులు




దత్తిరాజేరు, జూన్ 9, ప్రభాతవార్త :

మండల పరిధిలో గల పాచలవలస అంగన్వాడీ 2 సెంటర్ నుండి ఇద్దరు పిల్లలు అంగన్వాడి చదువు పూర్తిచేసి ప్రభుత్వ పాఠశాలలో ఒకటో తరగతికి పంపించడం జరిగిందని అంగన్వాడి కార్యకర్త డి సుజాత అన్నారు. సి డీ పీ ఓ మరియు సూపర్వైజర్ ఆదేశాలతో అంగన్వాడీ బడిలో ఐదు సంవత్సరాలు పూర్తయిన పిల్లలను తల్లిదండ్రులుప్రభుత్వ పాఠశాలకు ఒకటో తరగతిలో చదివించాలన్నారు. ఇద్దరు విద్యార్థులకు బదిలీ సర్టిఫికెట్ తల్లిదండ్రుల సమక్షంలో ఇచ్చామన్నారు అంగన్వాడీ కేంద్రంలో గ్రాడ్యుఏషన్ డే ను ఘనంగా నిర్వహించారు. చిన్నారుల వేషధారణలు పలువురిని ఆకర్షింపచేశాయన్నారు. అంగన్వాడీ సేవలను తల్లిదండ్రులు సంతృప్తి వ్యక్తం చేశారు. ఆయా ఉమ తల్లిదండ్రులు పాల్గొన్నారు.

## పంచాయతీ, రెవెన్యూ యంత్రాంగం అప్రమత్తంగా ఉండాలి



పాచిపెంట, జూన్ 9 ప్రభాతవార్త:

మండలంలో గల గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ చెరువులు ఆక్రమణ గురి కాకుండా రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది సమన్వయంగా పనిచేసే చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో స్పష్టం చేశారు. మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయంసర్వేలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు. అలాగే ఏపీఓ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువులు అక్రమనకు గురి కాకుండా, అలాగే అక్రమనకు గురైన చెరువులు వెంటనే బౌండ్రి ట్రెంచ్ లు త్రవ్వి చెరువు లను రక్షంచి పంటపొలాలు నీరు అందించే ఏర్పాటు చేయాలని, ప్రతీ పంచాయతీ లో వున్నా సర్వేర్లందరు కూడా, చెరువులు కు బౌండ్రి లను గుర్తించి, పెగ్ మార్క్ ఇచ్చి, ఉపాధి హామీ పథకం లో ట్రెంచ్లు త్రావ్వించాలని, అలాగే బౌండ్రిలో మొక్కలు వేసి భవిష్యత్తులో అక్రమణ జరగకుండా గమనించాలని తెలిపారు. కార్యక్రమం 15 రోజులలో జరగాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలని వివరించారు. దీనిలో ఇరిగేషన్,ఉపాధిహామీ, రెవిన్యూ, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పనిచేయాలని కోరారు.

## ఘనంగా కిశోరి వికాసం అవగాహన ముగింపు సదస్సు




శృంగవరపుకోట,జూన్ 9,ప్రభాతవార్త :

మహిళాభివృద్ధి,శిశు సంక్షేమ శాఖ ఐసీడీఎస్ ఎస్.కోట ప్రాజెక్టు ఆధ్వర్యంలో నిర్వహిస్తున్న సమ్మర్ క్యాంపియన్ కిశోరి వికాసం కార్యక్రమం మంగళవారంతో ఘనంగా ముగిసింది. మండలంలోని క్రిష్ణాపురం గ్రామంలో అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం ఆధ్వర్యంలో బాలలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు.బాల్య వివాహాల నిరోదం,బాలికల బద్రత,విద్య ప్రోత్సాహం,మత్తు పదార్థాలకు దూరంగా ఉండాలని,చట్టాలపై అవగాహన వంటి ప్రాముఖ్యత గురించి ఆమె బాలలకు వివరించారు.అనంతరం గ్రామంలో ర్యాలీ కార్యక్రమం చేపట్టారు.కార్యక్రమంలో అంగన్వాడీ కార్యకర్తలు,బాలలు పాల్గొన్నారు.

## రైతు సమస్యలు త్వరగా పరిష్కరించాలి : ఎమ్మెల్సీ



శృంగవరపుకోట,జూన్ 9,ప్రభాతవార్త:

జిందాల్ రైతుల సమస్యల పట్ల గౌరవ హోంమంత్రి సానుకూలంగా స్పందించారని సమస్యలన్నీ త్వరగా పరిష్కారమైతే ముఖ్యమంత్రి గారిని తామే స్వయంగా ఆహ్వానించి భూమి పూజకు స్వాగతిస్తామని ఎమ్మెల్సీ ఇందుకూరి రఘురాజు తెలిపారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ రైతుల సమస్యలన్నింటినీ హోం మంత్రి క్షుణ్ణంగా విన్నారని ప్రభుత్వం అలాగే జిందాల్ కంపెనీ యాజమాన్యంతో మాట్లాడి సమస్యల పరిష్కారానికి మార్గాలు చూస్తామని పూర్తి బాధ్యత తీసుకుంటామని హామీ ఇచ్చినట్లు ఎమ్మెల్సీ తెలిపారు.రైతులకు చేరాల్సిన ప్రతి రూపాయి సకాలంలో చేరిపోతే తామంతా కలిసి భూమి పూజకు ముఖ్యమంత్రిను ఘన స్వాగతం పలుకుతామని స్పష్టం చేశారు.

## జిల్లాలో అభివృద్ధి ప్రాజెక్టుల భూసేకరణ వేగవంతం చేయాలి

### - కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి ఆదేశం



విజయనగరం, జూన్ 9, ప్రభాతవార్త :

జిల్లాలో వివిధ అభివృద్ధి ప్రాజెక్టుల నిర్మాణాలకు అవసరమైన భూసేకరణ ప్రక్రియను వేగవంతంగా పూర్తి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్. రాంసుందర్ రెడ్డి రెవెన్యూ అధికారులను ఆదేశించారు.జిల్లాలో అమలవుతున్న వివిధ అభివృద్ధి ప్రాజెక్టులకు సంబంధించిన భూసేకరణ పనుల పురోగతిపై మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో సంబంధిత శాఖల అధికారులతో జిల్లా కలెక్టర్ సమీక్ష సమావేశం నిర్వహించారు.ఈ సందర్భంగా జిల్లాలోని రహదారులు, పారిశ్రామిక పార్కులు, సాగునీటి ప్రాజెక్టులు మరియు ఇతర ప్రభుత్వ ప్రాధాన్యతా ప్రాజెక్టులకు అవసరమైన భూముల సేకరణ స్థితిగతులను శాఖల వారీగా సమీక్షించారు. తారకరామ తీర్థసాగర్, తోటపల్లి ప్రాజెక్టులు, జాతీయ రహదారులు, మూడో రైల్వే లైన్, కొత్తవలస--విజయనగరం నాలుగో రైల్వే లైన్, ఉత్తరాంధ్ర సుజల స్రవంతి తదితర ప్రాజెక్టుల భూసేకరణ పురోగతిని కలెక్టర్ సమీక్షించారు. సమావేశంలో డిఆర్వో సిహెచ్ సత్తిబాబు, ఆర్‌డిఓ సుధాసాగర్, ఎస్‌డీసీలు, ఆర్ అండ్ బి, ఇరిగేషన్, జాతీయ రహదారులు, రైల్వే శాఖల అధికారులు, తహసీల్దార్లు, మున్సిపల్ కమిషనర్లు, ఎల్‌ఏ యూనిట్ల డీటీలు పాల్గొన్నారు.

## 8 అడుగుల నాగుసర్పాన్ని చంపిన ఉపాధి కూలీలు

దత్తిరాజేరు, జూన్ 9, ప్రభాతవార్త:

భూపాల రాజపురం కోట్ల చెరువు నుంచి కేశవసాగరం చెరువు మధ్య గల సాగునీటి కాలువ పనులును ఉపాధి వేతన దారులు చేస్తుండగా 8 అడుగులు పొడవు ఉన్న నాగు సర్పం కనిపించడంతో వెంటనే విషసర్పాన్ని కర్రతో కొట్టి చంపేసామన్నారు వెంటనే వేతనదారులు ఊపిరి పీల్చుకొని పనులు ప్రారంభించారు.

## అక్రమంగా తరలిస్తున్న పశువులు సీజ్ లారీ డ్రైవర్ అరెస్ట్

రామభద్రపురం, జూన్ 9, ప్రభాత వార్త :

రామభద్రపురం స్థానిక మండలంలో ఈరోజు ఉదయం 6 గంటల సమయంలో చిన్నమ్మ తల్లి గుడి వద్ద లో ఏపీ39ఖట0339 గల లారీలో 32 ఎద్దులను అక్రమంగా తరలిస్తుండగా రామభద్రపురం పోలీస్ స్టేషన్ ఎస్ఐ వి జ్ఞానప్రసాద్ రావు , వారి సిబ్బంది కలసి పట్టుకొని సదరు లారీ డ్రైవర్ పై కేసు నమోదు చేసి లారీ ను , ఎద్దులను సీజ్ చేసి ఎద్దులను కొండకింగువ గ్రామంలో ఉన్న గోశాలకు తరలించినట్లు ఎస్ఐ చెప్పిరి.

## మద్యం తాగి వాహనం నడిపితే జరిమానా, జైలు శిక్ష



పాచిపెంట, జూన్ 9, ప్రభాతవార్త :

మద్యం మత్తులో వాహనాలు నడిపితే చట్టరీత్యా జైలు శిక్షతోపాటు (అపరాధ రుసుము) జరిమానాలు తప్పవని పాచిపెంట ఎస్సై ఎల్. అర్జున్ హెచ్చరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పాచిపెంట పోలీస్ స్టేషన్ పరిధిలో మద్యం సేవించి వాహనాలు నడుపుతూ పట్టుబడి కేసు నమోదైన ఐదుగురు వ్యక్తుల ను నేడు అనగా మంగళవారం సాలూరు కోర్టులో ఒక వ్యక్తికి 10000 జరిమానా, మరో వ్యక్తికి మూడు రోజులు జైలు శిక్ష, మిగతా ముగ్గురు వ్యక్తులకు ఏడు రోజుల జైలు శిక్ష విధిస్తూ తీర్పును విధించినట్లు ఎస్ఐ తెలిపారు. అలాగే నిబంధన ప్రకారం మోటర్ చట్టం ప్రకారం నిబంధనలు విధిగా పాటించాలని హెల్మెట్ తో పాటు వాహనదారులు ఒరిజినల్ పత్రాలు వాహనం నడిపే ప్రతి ఒక్కరి దగ్గర ఉంచాలని కోరారు. కారు ట్రక్కర్లు నడిపినప్పుడు సీట్ బెల్ట్ కచ్చితంగా ధరించాలని కోరారు. వాహనాలు నడిపిన వ్యక్తులు పరిమిత మించి వాహనాలు నడిపితే చర్యలు తప్పని హెచ్చరించారు.

## పామాయిల్, కోకో తోటల్లో గజరాజుల స్వైరవిహారం

### వెలగవలస గ్రామసమీపం ఏనుగులగుంపు సంచారం



సాలూరు, జూన్ 9, ప్రభాతవార్త :

సాలూరు మండలం గ్రామల సమీపంలో సంచరిస్తున్న ఏనుగుల గుంపు విధ్వంసం సృష్టిస్తూ పామఆయిల్, కొబ్బరితోటలు, జామ, అరటి రైతులకు అపారనష్టం కలిగిస్తున్నాయని సమాచారం.అంతేకాకుండా అక్కడ రైతుల పొలంలో ఉన్న వాటర్ బోర్లు,పంపు సెట్టులను గజరాజులు ద్వంసం చేస్తున్నాయని తెలుస్తుంది. దీంతో ముంగివానివలస, గంగన్నదరవలస, వెలగవలస,తోటల్లో పనులు చేస్తున్న కూలీలు ఏనుగులు భయంతో పనులలకు వెళ్లడం మానేస్తున్నారు.అలాగే గ్రామాల ప్రజలు ఎప్పుడు ఏం జరుగుతుందోనని ఆందోళన చెందుతున్నారు. మంగళవారం వెలగవలస గ్రామం సమీపం తోటల్లో 5 పెద్ద ఏనుగులు 3 గున్న ఏనుగులు సంచరిస్తున్నాయని ఫారెస్ట్ రేంజర్ తవిటినాయుడు స్థానిక విలేకరులకు తెలిపారు. అలాగే ప్రజలకు ఎటువంటి ప్రాణ నష్టం జరగకుండా ఎమ్మార్వో, పోలీస్ దృష్టికి తీసుకువెళ్లి బిఎన్ఎస్ కొత్తచట్టం ప్రకారం 153 (2) సెక్షన్ మధ్యాహ్నం 3 నుండి మరుసటి రోజు ఉదయం 8 వరకు అమలు చేయడమే కాకుండా ఎలిఫెంట్ ట్రకర్స్ తో మోనట్రరింగ్ చేస్తున్నామని స్పష్టం చేశారు. అంతేకాకుండా అక్కడ రైతుల పొలాల్లో, తోటల్లో ధ్వంసం అవడంతో అప్లికేషన్ ఫామ్ అందజేశామని దానిని వ్యవసాయశాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్తే గవర్నమెంట్ ద్వారా రైతుకు నష్ట పరిహారం ఇప్పిస్తారని క్లారిటీ ఇచ్చారు.అలాగే ఏనుగుల గుంపును దారిమళ్లించి అడవుల్లోకి వెళ్లేవిధంగా చూడాలని రూరల్ ప్రాంత ప్రజలు కోరుతున్నారు.

## ప్రభుత్వ సేవలపై ప్రజా సానుకూలత పెంచాలి

### కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి

విజయనగరం, జూన్ 9, ప్రభాతవార్త:

ప్రభుత్వం అందిస్తున్న సేవలపై ప్రజలనుంచి సానుకూలత పెంపొందించేందుకు ప్రతీఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ ఎస్.రాంసుందర్ రెడ్డి అధికారులను ఆదేశించారు. ప్రజలనుంచి తక్కువ సానుకూలత వ్యక్తమవుతున్న కొన్ని ప్రభుత్వ సేవలకు సంబంధించి, ఆ సేవలను అందిస్తున్న కొన్ని ప్రాంతాలకు చెందిన క్షేత్రస్థాయి ఉద్యోగులు, ఆయాశాఖాధిపతులతో తమ ఛాంబర్లో మంగళవారం సమీక్షా సమావేశాన్ని నిర్వహించారు. పారిశుధ్యం, ఎన్‌టిఆర్ భరోసా పింఛన్ల పంపిణీ, మున్సిపాల్టీలు, గ్రామీణ ప్రాంతాల్లో త్రాగునీటి సరఫరా, వీధి దీపాల నిర్వహణ, అన్న క్యాంటీన్ల నిర్వహణ తదితర అంశాలను సమీక్షిస్తూ, ఆయా మండలాల అధికారులను ప్రశ్నించారు. అందిస్తున్న సేవలను మెరుగు పరచడమే కాకుండా, ఐవిఆర్ఎస్ ద్వారా అడిగే ప్రశ్నలపైనా ప్రజలకు అవగాహన కల్పించాలని కోరారు. కొన్నిచోట్ల సేవలు మెరుగ్గానే ఉన్నప్పటికీ, ప్రజల్లో అవగాహన లేకపోవడం వల్ల, తప్పు సమాధానం చెప్పడం జరుగుతోందని, దీనిని తొలగించాలని సూచించారు. సమావేశంలో డిఆర్ఓ సిహెచ్ సత్తిబాబు, జెడ్‌పి సిఈఓ నాగలక్ష్మి, డిఆర్‌డిఏ పిడి శ్రీనివాస పాణి, ఆర్‌డబ్ల్యూఎస్ ఎస్ఈ కవిత, డిపిఓ మల్లికార్జునరావు, మున్సిపల్ కమిషనర్లు, ఎంపిడిఓలు పాల్గొన్నారు.

## ఇరుపార్టీల దృష్టి అంతా సర్ పైనే

### కేడర్‌ని అప్రమత్తం చేస్తున్న కిమిడి, బొత్స

గరివిడి, జూన్ 9, ప్రభాత వార్త:


స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ (సర్) పైనే టిడిపి, వైకాపా పార్టీలు దృష్టి పెట్టాయి. కేడర్ అంతా సర్ పై అప్రమత్తంగా ఉండాలని ఇరుపార్టీల నాయకులు దిశా నిర్దేశం చేస్తున్నారు. ప్రధానంగా ఓట్లు తొలగింపు జరిగే ప్రమాదం ఉందని వారు సర్ పై దృష్టి కేంద్రీకరించేందుకు కారణంగా కనిపిస్తోంది. గరివిడి లో నిర్వహించిన వైకాపా సమావేశంలో శాసనమండలి విపక్ష నేత బొత్స సత్యనారాయణ కార్యకర్తలు తో మాట్లాడుతూ స్పెషల్ ఇంటెన్సివ్ రివిజన్ పైనే దృష్టి పెట్టాలని సూచించారు. ఓట్లు తొలగి పోతే ప్రమాదం లో పడతామని ఆయన హెచ్చరించారు. స్టాలిన్ తన సొంత నియోజకవర్గం లో ఓటమి పాలయ్యారని, అలాగే బెంగాల్ లో మమతా బెనర్జీ కూడా సర్ ప్రభావంతో ఓడి పోయారని బొత్స సత్యనారాయణ ఉదహరించారు. ప్రతీ ఒక్కరూ ఒక ఉద్యమం లా ఓట్లు కాపాడుకోవాలని ఆయన క్యాడర్ కి ఉద్భోదించారు.అలాగే చీపురుపల్లి లో టిడిపి సమావేశంలో చీపురుపల్లి ఎమ్మెల్యే కిమిడి కళా వెంకట రావు సర్ పై అప్రమత్తంగా ఉండాలని టిడిపి నాయకులు కి తెలిపారు. ఓట్లు విషయంలో ప్రతీ ఒక్కరూ జాగ్రత్త పాటించాలని అన్ని స్థాయిల క్యాడర్ కి కళా సూచించారు. ఇరు పార్టీ ల నేతలు ఈ నెల 15 నుండి జరిగే సర్ కార్యక్రమం పై దృష్టి పెట్టడం లో ప్రధానంగా ఓట్లు కోసమే ననేది తేటతెల్లమవుతోంది . ఓటు విలువ గుర్తెరిగిన నేతలు అవి పొందేక్రమం లో వాటిని కోల్పోకుండా జాగ్రత్త పడుతున్నారనేది తేటతెల్లమవుతోంది.

## ఇళ్ల స్థలాలు పరిశీలించిన పీడీ

దత్తిరాజేరు, జూన్ 9, ప్రభాతవార్త :

మండలంలోని పెదకాద కొండమీద ఎస్సీలకు కేటాయించిన ఇల్లు స్థలాలను హౌసింగ్ పీడీ మురళీమోహన్ డి ఈ సత్యనారాయణ కలిసిమంగళవారం పరిశీలించారు గత వైసిపి ప్రభుత్వంలో ఇల్లు స్థలాలు మంజూరు చేశారు. అందులో భాగంగా ఎస్సీలకు ఇల్లు స్థలాలు మంజూరు చేయగా అందులో కొంతమంది అర్హులైన ఎస్సీలకు ఇల్లు స్థలాలు మంజూరు చేయకపోగా వారు కోర్టును ఆశ్రయించడంతో స్థలాల నిలుపుదల చేయడం జరిగిందన్నారు. విషయాన్ని బాధితులు రాష్ట్ర మంత్రి కొండపల్లి శ్రీనివాస్ ఆశ్రయించగా ఆయన హౌసింగ్ పిడికి చెప్పడంతో వెంటనే ఆయన స్పందించి ఇళ్ల స్థలాలను పరిశీలించడం జరిగిందన్నారు. ఆయన వెంట మండల హౌసింగ్ ఏ ఈ రాజేష్ పాల్గొన్నారు.


## ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ నిర్మాణానికి శంకుస్థాపన : మంత్రి



సాలూరు జూన్ 9 ప్రభాతవార్త :

సాలూరు పట్టణ బైపాస్ రోడ్డులో బుడా ఆధ్వర్యంలో రూ.8 కోట్ల 61 లక్షల వ్యయంతో చేపట్టనున్న ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ నిర్మాణ పనులకు మంగళవారం మంత్రి గుమ్మిడి సంధ్యారాణి చేతులు మీదుగా శంకుస్థాపన చేశారు. అనంతరం అక్కడ ఏర్పాటు చేసిన సభలో మాట్లాడుతు రాష్ట్ర ప్రభుత్వం ప్రజలకు మెరుగైన జీవన ప్రమాణాలు కల్పించేందుకు పట్టణ ప్రాంతాల్లో ఆధునిక మౌలిక సదుపాయాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తోందని స్పష్టం చేశారు.అలాగే ఎన్టీఆర్ స్మార్ట్ టౌన్షిప్ పట్టణ అభివృద్ధికి కొత్త ఊపిరి పోసే ప్రాజెక్టుగా నిలుస్తుందనని క్లారిటీ ఇచ్చారు.అంతేకాకుండా ఈ టౌన్షిప్ ద్వారా ప్రజలకు ప్రణాళికాబద్ధమైన నివాస వసతులు,రహదారులు,తాగునీటి సౌకర్యం,విద్యుత్,డ్రైనేజీ వంటి మౌలిక సదుపాయాలు అందుబాటులోకి వస్తాయని మంత్రి సంధ్యారాణి తెలిపారు. బుడా చైర్మన్ తెంటు లక్ష్మణ్ణాయుడు,కమీషనర్ టిటి రత్నకుమార్,టీడీపీ నాయకులు కార్యకర్తలు పాల్గొన్నారు.

## చెరువులు ఆక్రమణకు గురి కాకుండా అప్రమత్తంగా ఉండాలి



పాచిపెంట, జూన్ 9, ప్రభాతవార్త:

మండలంలో గల గ్రామపంచాయతీ పరిధిలో ప్రభుత్వ చెరువులు ఆక్రమణ గురి కాకుండా రెవెన్యూ, పంచాయతీ, సిబ్బంది సమన్వయంగా పనిచేసే చెరువులను రక్షించుకోవాల్సిన బాధ్యత ప్రతి ఒక్కరిపై ఉందని డిప్యూటీ ఎంపీడీవో స్పష్టం చేశారు. మండల కేంద్రమైన పాచిపెంట మండల పరిషత్ కార్యాలయంలో మంగళవారం సచివాలయంసర్వేలతో సమావేశం ఏర్పాటు చేశారు. ఈ సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లా కలెక్టర్ ఆదేశాల మేరకు సమావేశం ఏర్పాటు చేసినట్లు తెలిపారు.అలాగే ఏపీఓ కే శ్రీనివాసరావు మాట్లాడుతూ చెరువులు అక్రమనకు గురి కాకుండా, అలాగే అక్రమనకు గురైన చెరువులు వెంటనే బౌండ్రి ట్రెంచ్ లు త్రవ్వి చెరువు లను రక్షంచి పంటపొలాలు నీరు అందించే ఏర్పాటు చేయాలని, ప్రతీ పంచాయతీ లో వున్నా సర్వేర్లందరు కూడా, చెరువులు కు బౌండ్రి లను గుర్తించి, పెగ్ మార్క్ ఇచ్చి, ఉపాధి హామీ పథకం లో ట్రెంచ్లు త్రావ్వించాలని, అలాగే బౌండ్రిలో మొక్కలు వేసి భవిష్యత్తులో అక్రమణ జరగకుండా గమనించాలని తెలిపారు . ఈ కార్యక్రమం 15 రోజులలో జరగాలని జిల్లా కలెక్టర్ ఆదేశాలని వివరించారు. దీనిలో ఇరిగేషన్,ఉపాధిహామీ, రెవిన్యూ, పంచాయతీ సిబ్బంది సమన్వయంతో పని చేయాలని కోరారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

## ఒక్క చుక్క... జీవితాంతం రక్షణ

విజయనగరం, జూన్ 9:ప్రభాతవార్త:

జిల్లాలో జూన్ 28న నిర్వహించనున్న జాతీయ పల్స్ పోలియో కార్యక్రమాన్ని ప్రజల భాగస్వామ్యంతో విజయవంతం చేయాలని జిల్లా వైద్య ఆరోగ్య శాఖాధికారి డాక్టర్ జీవన్ రాణి పిలుపునిచ్చారు.ఈ మేరకు జిల్లా వైద్య ఆరోగ్య శాఖ కార్యాలయంలో నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ఐదేళ్లలోపు ఏ చిన్నారి కూడా పోలియో చుక్కలు తీసుకోకుండా మిగిలిపోకూడదని స్పష్టం చేశారు. పోలియో నిర్మూలనలో దేశం సాధించిన విజయాలను కొనసాగించేందుకు ప్రతి ఒక్కరి సహకారం అవసరమని పేర్కొన్నారు.జిల్లా వ్యాప్తంగా 118 పోలియో బూత్‌లు, 2360 మంది సిబ్బందితో కూడిన బృందాలు, 66 మొబైల్ టీమ్‌లు, 21 ట్రాన్సిట్ టీమ్‌లను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. గ్రామీణ ప్రాంతాలు, పట్టణాలు, వలస కార్మికుల నివాస ప్రాంతాలు, బస్టాండ్లు, రైల్వే స్టేషన్లు వంటి ప్రాంతాల్లో ప్రత్యేక దృష్టి సారించి ప్రతి చిన్నారికి పోలియో చుక్కలు అందజేయనున్నట్లు చెప్పారు.పాఠశాలలు, అంగన్‌వాడీ కేంద్రాలు, గ్రామ సచివాలయాలు, స్వచ్ఛంద సంస్థల సహకారంతో విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. విద్యార్థుల ద్వారా పోస్టర్లు, ర్యాలీలు, సృజనాత్మక ప్రచార కార్యక్రమాలు చేపట్టి పల్స్ పోలియోపై ప్రజల్లో మరింత చైతన్యం తీసుకురావాలని సూచించారు.”పోలియో రహిత సమాజ నిర్మాణం మనందరి బాధ్యత. జూన్ 28న జరిగే కార్యక్రమంలో ప్రతి తల్లిదండ్రి తమ ఐదేళ్లలోపు చిన్నారులకు తప్పనిసరిగా పోలియో చుక్కలు వేయించాలని” డాక్టర్ జీవన్ రాణి విజ్ఞప్తి చేశారు.ఈ సమావేశంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి డాక్టర్ అచ్యుత్కుమారి జిల్లా క్షయ నివారణాధికారి డాక్టర్ రాణి వైద్యాధికారులు, మండల వైద్య ఆరోగ్య అధికారులు, ప్రోగ్రాం అధికారులు ఆరోగ్య సిబ్బంది మరియు సంబంధిత శాఖల అధికారులు పాల్గొన్నారు.

## పెదపెంకిని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దడమే లక్ష్యం : కలెక్టర్



బలిజిపేట, జూన్ 9, ప్రభాతవార్త :

రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి జిల్లా పర్యటన నేపథ్యంలో బలిజిపేట మండలం పెదపెంకి గ్రామాన్ని ఒక అద్భుతమైన ఆదర్శ గ్రామంగా (మోడల్ విలేజ్) ప్రపంచానికి చూపించేందుకు ప్రతి ఒక్క అధికారి పూర్తి బాధ్యతతో పనిచేయాలని జిల్లా కలెక్టర్ డా. ఎన్.ప్రభాకరరెడ్డి స్పష్టం చేశారు. ఈ ప్రాజెక్టును ప్రతిష్టాత్మకంగా తీసుకొని, అన్ని శాఖల అధికారులు తమ పూర్తి శక్తినంతా ధారపోసి పనులను విజయవంతం చేయాలని పిలుపునిచ్చారు. పెదపెంకిని మోడల్ విలేజ్‌గా తీర్చిదిద్దేందుకు 20వ తేదీ డెడ్ లైన్ అని, కావున అన్ని పనుల్లో మరింత వేగం పెంచాలని తెలిపారు. పండగ వాతావరణం కనిపించేలా గ్రామం ముస్తాబు కావాలన్నారు.

## “వెన్నుపోటుకు రెండేళ్లు”




బొబ్బిలి, జూన్ 9 ప్రభాతవార్త:

మాజీ ముఖ్యమంత్రి వర్యులు, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జాతీయ అధ్యక్షులు వైఎస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు రాష్ట్రవ్యాప్తంగా నిర్వహిస్తున్న “వెన్నుపోటుకు రెండేళ్లు” కార్యక్రమంలో భాగంగా విజయనగరం జిల్లా బొబ్బిలి పట్టణంలోని సూర్య రెసిడెన్సీలో వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నాయకులు, కార్యకర్తలతో విస్తృత స్థాయి సమావేశం(ఇండోర్ మీటింగ్) నిర్వహించబడింది.ఈ సమావేశం బొబ్బిలి మాజీ శాసనసభ్యులు శంబంగి వెంకట చిన అప్పలనాయుడు అధ్యక్షతన జరిగింది. ఈ సమావేశానికి ముఖ్య అతిథిగా గౌరవ విజయనగరం జిల్లా జడ్పీ చైర్మన్, వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ జిల్లా అధ్యక్షులు మరియు భీమిలి నియోజకవర్గ సమన్వయకర్త మజ్జి శ్రీనివాసరావు (చిన్న శ్రీను) పాల్గొన్నారు. ఈ సందర్భంగా శంబంగి మాట్లాడుతూ”కూటమి ప్రభుత్వ వైఫల్యాలు, అమలు కాని హామీలు, నిరుద్యోగ యువత ఎదుర్కొంటున్న ఇబ్బందులు, రైతులు, మహిళలు, విద్యార్థుల సమస్యలను ప్రజల్లోకి బలంగా తీసుకెళ్లాల్సిన అవసరం ఉంది. ‘వెన్నుపోటుకు రెండేళ్లు’ కార్యక్రమం ద్వారా రాష్ట్ర ప్రజలకు వాస్తవాలను వివరించి, ప్రభుత్వం చేసిన మోసాలను ఎండగట్టాలి.”బూత్ స్థాయి ప్రాధాన్యతపై మాట్లాడుతూ: “పార్టీ విజయానికి బూత్ స్థాయి కార్యకర్తలే వెన్నెముక. ప్రతి ఓటరుతో మమేకమై పార్టీ సిద్ధాంతాలు, ప్రజా సంక్షేమ కార్యక్రమాలను ఇంటింటికీ తీసుకెళ్లాలి. ఎన్నికల్లో గెలుపు బూత్ స్థాయి నిర్వహణపైనే ఆధారపడి ఉంటుందన్నారు.ఈ సందర్భంగా చిన్న శ్రీను గారు మాట్లాడుతూ “గత రెండేళ్లుగా రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం ప్రజలకు ఇచ్చిన హామీలను అమలు చేయడంలో పూర్తిగా విఫలమైంది. ఎన్నికల సమయంలో ఇచ్చిన సూపర్ సిక్స్ వంటి హామీలను విస్మరించి ప్రజలను మోసం చేస్తూ, సంక్షేమ పథకాలను నిర్వీర్యం చేస్తోంది.” పై దిశానిర్దేశం: “ఓటర్ల ప్రత్యేక సమగ్ర సవరణ కార్యక్రమాన్ని సమర్థవంతంగా నిర్వహిస్తూ, అర్హులైన ప్రతి ఒక్కరి పేరును ఓటరు జాబితాలో నమోదు చేయించాలి. ఎటువంటి పొరపాట్లు జరగకుండా బూత్ లెవెల్ ఏజెంట్లు (దీూాం) జాగ్రత్తలు తీసుకోవాలని అన్నారు. ఈ సమావేశంలో బొబ్బిలి అసెంబ్లీ నియోజకవర్గ పరిశీలకులు రొంగలి జగన్నాథ నాయుడు వైఎస్ఆర్సిపి స్టేట్ ఎగ్జిక్యూటివ్ కమిటీ నెంబర్ శ్రీ ఇంటి గోపాలరావు , రాజాం నియోజకవర్గ ఇంచార్జ్ కె.వి సూర్యనారాయణరాజు వైఎస్ఆర్సిపి స్టేట్ డాక్టర్స్ వింగ్ జనరల్ సెక్రటరీ డాబొత్స కాశి నాయుడు రాష్ట్ర వైఎస్ఆర్సిపి బీ.సీ సెల్ జనరల్ సెక్రటరీ,మాజీ ~ావీజ చైర్మన్ బొమ్మి శ్రీనివాస రావు గారు, స్టేట్ వైఎస్ఆర్సిపి సెల్ జాయింట్ సెక్రటరీ రాజాన చిన్నయ్య విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి పార్టీ ప్రెసిడెంట్ చొక్కాపూ లక్ష్మణరావు విజయనగరం జిల్లా వైఎస్ఆర్సిపి జనరల్ సెక్రటరీ శంబంగి వేణుగోపాల్ నాయుడు మరియు మాజీ ఎంపీటీసీలు, జడ్పీటీసీలు,బొబ్బిలి నియోజకవర్గ నాలుగు మండలాల మరియు పట్టణ అధ్యక్షులు,పార్టీ నాయకులు, ప్రజాప్రతినిధులు, మాజీ ప్రజాప్రతినిధులు, అనుబంధ విభాగాల ప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

## సంక్షేమ అంశాలపై ఆరా : ఎమ్మెల్యే లోకం నాగమాధవి



విజయనగరం, జూన్ 9, ప్రభాత వార్త :

భోగాపురం మండలం రావాడ పంచాయతీలో నిర్వహిస్తున్న మహాత్మా గాంధీ జాతీయ గ్రామీణ ఉపాధి హామీ పథకం (ఎంఎన్ఆర్ఈజీఎస్) పనులను నెల్లిమర్ల ఎమ్మెల్యే లోకం నాగ మాధవి పరిశీలించారు. ఈ సందర్భంగా ఉపాధి హామీ పనుల్లో పాల్గొంటున్న శ్రామికులను కలుసుకుని వారి సమస్యలు, పని పరిస్థితులు, సంక్షేమ అంశాలపై ఆరా తీశారు.శ్రామికులతో ఆత్మీయంగా మాట్లాడిన ఎమ్మెల్యే, ప్రభుత్వం కల్పిస్తున్న ఉపాధి అవకాశాలను సద్వినియోగం చేసుకోవాలని సూచించారు. పనుల నిర్వహణలో ఎదురవుతున్న ఇబ్బందులను తెలుసుకుని, వాటిని సంబంధిత అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి చర్యలు తీసుకుంటామని హామీ ఇచ్చారు.గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ఉపాధి హామీ పథకం కీలకమని పేర్కొన్న ఆమె, శ్రామికుల సంక్షేమం, గ్రామీణ మౌలిక సదుపాయాల మెరుగుదల మరియు ప్రజలకు స్థిరమైన జీవనోపాధి అవకాశాలు కల్పించడం కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు.కార్యక్రమంలో స్థానిక ప్రజాప్రతినిధులు, అధికారులు, పార్టీ నాయకులు, గ్రామస్థులు పాల్గొన్నారు.

## మీ భూమి - మీ హక్కు కార్యక్రమం

విజయనగరం, జూన్ 9, ప్రభాత వార్త :

భోగాపురం మండలం చాకివలస గ్రామంలో నిర్వహించిన “మీ భూమి -- మీ హక్కు” కార్యక్రమంలో ఏపీ మార్క్‌ఫెడ్ చైర్మన్ మరియు నెల్లిమర్ల టీడీపీ ఇంచార్జి కర్రోతు బంగార్రాజు పాల్గొని రైతులకు పట్టాదారు పాస్ పుస్తకాలను పంపిణీ చేశారు.ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, రైతుల భూ హక్కులకు పూర్తి భద్రత కల్పించడమే రాష్ట్ర ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని తెలిపారు. భూముల యాజమాన్య హక్కులను పారదర్శకంగా నమోదు చేసి, రైతులకు ఎలాంటి ఇబ్బందులు లేకుండా సేవలు అందించేందుకు ప్రభుత్వం ప్రత్యేక చర్యలు చేపడుతోందన్నారు.రైతుల సంక్షేమం, వ్యవసాయాభివృద్ధికి ప్రభుత్వం కట్టుబడి ఉందని పేర్కొన్న ఆయన, భూ సమస్యల పరిష్కారానికి పలు సంస్కరణలు అమలు చేస్తున్నట్లు తెలిపారు. పట్టాదారు పాస్ పుస్తకాల పంపిణీతో రైతులకు తమ భూములపై పూర్తి హక్కులు లభించడంతో పాటు, ప్రభుత్వ పథకాల ప్రయోజనాలు మరింత సులభంగా అందుతాయని చెప్పారు.కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు కర్రోతు సత్యనారాయణ, పార్లమెంట్ అధికార ప్రతినిధి నీలాపు అప్పలరామిరెడ్డి, క్లస్టర్ ఇంచార్జి దాసరి అప్పలస్వామి, మండల పార్టీ ఉపాధ్యక్షులు కోలా రామసూరి, ముంజేరు ఎంపీటీసీ పిడుగు వెంకట సత్యం, టీడీపీ నాయకులు సరగడ తోగులురెడ్డి, లంక సత్యనారాయణ, యువత అధ్యక్షులు మౌళి వర్మ, మాజీ సర్పంచ్ లెంక రాము, పార్టీ కార్యకర్తలు, రైతులు, గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

# ముక్కోణపు సిరీస్‌లో
# భారత్-ఎ శుభారంభం



తిలక్, రుతురాజ్ సూపర్

**దంబుల్లా:** శ్రీలంకలో జరుగుతున్న ముక్కోణపు వన్డే సిరీస్‌లో భారత్-ఎ శుభారంభం చేసింది. ఉత్కంఠ భరిత పోరులో అతిథ్య శ్రీలంక-ఎపై 8 పరుగుల స్వల్ప తేడాతో గెలుపొందింది. 49వ ఓవర్‌లో అర్షద్ ఖాన్ అద్భుత బౌలింగ్‌లో శ్రీలంకను కట్టడి చేశాడు. రెండు వికెట్లతో పాటు ఓ రనౌట్‌తో గెలుపును భారత్ వైపు మరల్చాడు. ఒత్తిడిలోనూ అద్భుత లైన్ లండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్ కేవలం ఒక పరుగు మాత్రమే ఇచ్చాడు.

టాస్ నెగ్గి బ్యాటింగ్‌కు దిగిన భారత్-ఎ ఆరంభంలో తడబడింది. స్టార్టింగ్‌లో వరుసగా బౌండరీలు బాదుతూ ఊపుమీద కనిపించిన వైభవ్.. కేవలం 12 బంతుల్లో 14 రన్స్ మాత్రమే చేసి అవుట్ అయ్యాడు. మరో ఓపెనర్ ప్రభ్‌సిమ్రాన్ సింగ్(2) కూడా నిరాశపరచడంతో భారత్-ఎ 16 పరుగులకే రెండు వికెట్లు కోల్పోయింది. ప్రియాన్స్ ఆర్య(32 బంతుల్లో 32) క్రీజ్‌లో ఉన్నంత సేపు ధాటిగా ఆడాడు. బంతికో పరుగు చొప్పు 32 రన్స్ చేశాడు. కానీ దురదృష్టవశాత్తూ 13వ ఓవర్ వద్ద రనౌట్ కావడంతో భారత్ 69 పరుగులకే 3 కీలక వికెట్లు కోల్పోయి కష్టాల్లో పడింది.

**కెప్టెన్ తిలక్, రుతురాజ్ క్లాస్**

ఈ దశలో రుతురాజ్ గైక్వాడ్(114 బంతుల్లో 101; 6 ఫోర్లు, 3 సిక్స్‌లు)తో కెప్టెన్ తిలక్ వర్మ(97 బంతుల్లో 60; 2 ఫోర్లు, ఓ సిక్స్) జతకూడిన తర్వాత ఇన్నింగ్స్ స్వరూపమే మారిపోయింది. కష్టాల్లో ఉన్న జట్టును ఆదుకున్నారు. పిచ్ కండిషన్స్ అర్థం చేసుకుంటూ మొదట్లో కాస్త నెమ్మదిగా బ్యాటింగ్ స్టార్ట్ చేసిన రుతురాజ్.. ఆ తర్వాత కెప్టెన్ తిలక్ వర్మతో కలిసి ఇన్నింగ్స్‌ను బిల్డ్ చేశాడు. స్కోరును చూస్తుండగానే 100, 150, 200 దాటించారు. శ్రీలంక బౌలర్లను ధీటుగా ఎదుర్కొంటూ రుతురాజ్ సెంచరీ పూర్తి చేశాడు. నాలుగో వికెట్‌కు 150 పరుగుల భారీ భాగస్వామ్యం అందించి అవుటయ్యాడు. కాసేపటికే అద్భుతమైన హాఫ్ సెంచరీతో కెప్టెన్సీ ఇన్నింగ్స్ ఆడిన తిలక్ వర్మ కూడా మొహమ్మద్ షిరాజ్ బౌలింగ్‌లో క్లీన్ బౌల్డ్ అయి వెనుదిరిగాడు.

**స్లాగ్ ఓవర్లలో సూర్యాంశ్, బదోనీ మెరుపులు**

స్లాగ్ ఓవర్లలో ఆయూష్ బదోనీ(18 బంతుల్లో 24), సూర్యాంశ్ షెడ్జ(14 బంతుల్లో 26) లంక బౌలర్లపై బ్యాట్ ఝులిపించారు. ఈ ఇద్దరూ వేగంగా ఆడుతూ స్కోరు బోర్డును పరిగెత్తించారు. దీంతో భారత్-ఎ నిర్ణీత 50 ఓవర్లు ముగిసేసరికి 6 వికెట్లు కోల్పోయి 277 పరుగులు చేసింది.

**ఆరంభంలో లంకేయుల అదుర్స్**

278పరుగుల లక్ష్యంతో బ్యాటింగ్ చేసిన శ్రీలంక-ఏ48.5ఓవర్లలో 269 పరుగులకు ఆలౌటైంది. ఓపెనర్ అవిష్క ఫెర్నాండో(45), ఫస్ట్ డౌన్ సదీర సమరవిక్రమ(46) రాణించారు. కెప్టెన్ సహన్ అరాచ్చిగే(72 బంతుల్లో 74) ధాటిగా ఆడుతూ లంకకు గెలుపు ఆశలు కలిగించారు. ఈ దశలో కంబోజ్ అద్భుత బంతితో సహన్‌ను క్లీన్ బౌల్డ్ చేశాడు. భారత బౌలర్లు కట్టుదిట్టంగా బౌలింగ్ చేసి చేయడంతో లంక మిడిలార్డర్ పూర్తిగా చేతులెత్తేసింది. వనుజా సహన్ మెరుపులతో లంక విజయానికి చేరువయింది.

చివరి రెండు ఓవర్లలో పది పరుగులు చేయాల్సిన దశలో అర్షద్ ఖాన్ మ్యాచ్ స్వరూపాన్నే పూర్తిగా మార్చేశాడు. ఒత్తిడిలోనూ అద్భుతమైన లైన్ అండ్ లెంగ్త్‌తో బౌలింగ్ చేసిన అర్షద్.. ఆ ఓవర్లో కేవలం ఒక్కటంటే ఒక్క పరుగు మాత్రమే ఇచ్చి.. 2 కీలక వికెట్లు పడగొట్టడంతో పాటు ఒక రనౌట్ చేసి లంక పతనాన్ని శాసించాడు. దీంతో భారత్-ఎ జట్టు 8 పరుగుల తేడాతో సంచలన విజయాన్ని నమోదు చేసుకుంది.

# 24 యేళ్ల నిరీక్షణకు తెరపడేనా?

**హాట్ ఫేవరెట్లలో ఒకటిగా బ్రెజిల్ *గ్రూప్-సిలో గట్టి పోటీ *ప్రమాదకర జట్టుగా మొరాకో**

*ప్రపంచం మొత్తం ఎదురుచూస్తున్న మెగా ఈవెంట్ రానే వచ్చింది. రేపటి నుంచి సాకర్ ప్రపంచకప్ ఆరంభం కానుంది. ఆడుతున్నది 48 జట్లే అయినా... మిలియన్ల మంది చూపంతా దీనిపైనే. జూలై 19 వరకు ఈ సాకర్ సంబరం ఫుట్‌బాల్ అభిమానులను ఉర్రూతలూగించనుంది. ఫిఫా ప్రపంచకప్‌లో పలు మేటి జట్లున్నా అందరి చూపు సాంబా టీమ్‌పైనే.అత్యధికంగా 5సార్లు సాకర్ ప్రపంచకప్‌ను బ్రెజిల్ అందుకుంది. చివరిసారి 2002లో ప్రపంచకప్ విజేతగా నిలిచింది. దాదాపు 24 ఏళ్లుగా బ్రెజిల్ ను ట్రోఫీ ఊరిస్తోంది. ఈసారి సుదీర్ఘ నిరీక్షణకు తెరదించాలని సాంబా టీమ్ ఫోకస్ పెట్టింది.*



(వార్త క్రీడా విభాగం)

ఫిఫా ప్రపంచకప్ గ్రూప్-సిలో బ్రెజిల్ జట్టు పోటీపడుతోంది. ఫుట్‌బాల్ ప్రపంచకప్‌లో ఆసక్తికర గ్రూపుల్లో ఇది ఒకటి. అయిదుసార్లు ఛాంపియన్ బ్రెజిల్ ఇందులో ఉండడమేకారణం. గ్రూస్-సిలోని మిగతా జట్లు మొరాకో, హైతి, స్కాట్లాండ్. 2022లో సెమీఫైనల్‌కు దూసుకెళ్లిన మొరాకోను తక్కువ అంచనా వేయలేం. కూనలు స్కాట్లాండ్, హైతి కూడా తమదైన రోజున సంచలనాలు సృష్టించగలవు.

ఫిఫా ర్యాంకింగ్స్ ఆరో స్థానంలో ఉన్న బ్రెజిల్.. గ్రూపులో హాట్ ఫేవరెట్‌గా బరిలోకి దిగుతున్నది. అయితే ఈసారి ప్రపంచకప్ క్వాలిఫయింగ్ టోర్నీలో బ్రెజిల్ కష్టపడాల్సి వచ్చింది. మెగా టోర్నీకి అర్హత సాధిస్తుందా లేదా అన్న అనుమానాల నేపథ్యంలో.. కోచ్ మార్పు ఆ జట్టుకు ఎంతో మేలు చేసింది. కార్లో అన్సెలోటి బాధ్యతలు స్వీకరించాక.. ఆఖరి నాలుగు క్వాలిఫయింగ్ మ్యాచ్‌ల్లో మూడు గెలిచిన బ్రెజిల్ ప్రపంచకప్‌నకు అర్హత సాధించింది. జట్టు ప్రపంచకప్‌లోనూ మెరుగైన ప్రదర్శన చేస్తుందని అభిమానులు ఆశలు పెట్టుకున్నారు.

**స్టార్ అట్రాక్షన్‌గా నెయ్‌మార్**

మార్కినోస్ సారథ్యంలోని బ్రెజిల్ గ్రూపులో అగ్రస్థానంలో నిలిచేఅవకాశాలు మెండుగా ఉన్నాయి. బలమైన జట్టుగా ఎదిగిన మొరాకో నుంచి గట్టి పోటీ ఎదురయ్యే అవకాశముంది. హైతి, స్కాట్లాండ్‌ల నుంచి పెద్దగా ప్రతిఘటన ఎదురు కాకపోవచ్చు. అయితే టోర్నీ ముంగిట స్టార్ ఆటగాడు నెయ్‌మార్ గాయపడడం ఆ జట్టుకు పెద్ద ఎదురుదెబ్బే. తొలి కొన్ని మ్యాచ్‌లకు నెయ్‌మార్ అందుబాటులో ఉండడం లేదు. అయినా బ్రెజిల్ యువ ఆటగాళ్లతో కళకళలాడుతోంది. విన్సియస్ జూనియర్, మార్కినోస్, నెయ్‌మార్, రాఫినా, ఎండ్రిక్, మార్టినెలిబ్రెజిల్ జట్టులో కీలక ఆటగాళ్లు. ప్రస్తుత ప్రపంచకప్‌లో సాంబా జట్టు ఎక్కువ మంది యువ ఆటగాళ్లతో బరిలో దిగుతున్నా.. అభిమానుల ఆశలు మాత్రం వెటరన్ స్టార్ నెయ్‌మార్‌పైనే ఉన్నాయి.

**మొరాకో నుంచి అసలు పోటీ**

మొరాకో ప్రమాదకర జట్టుగా ఎదిగింది. 2018 వరకు నాలుగుసార్లు మాత్రమే ప్రపంచకప్‌నకు అర్హత సాధించిన మొరాకో... 2022లో అంచనాలను తలకిందులు చేస్తూ సంచలన ప్రదర్శనతో ఆశ్చర్యంలో ముంచెత్తింది. క్వార్టర్‌ఫైనల్లో బలమైన పోర్చుగల్‌కు షాకిస్తూ.. సెమీఫైనల్‌కు దూసుకెళ్లింది. ఫిఫా ప్రపంచకప్‌లో సెమీస్ చేరిన తొలి ఆఫ్రికా జట్టుగా చరిత్ర సృష్టించింది. ఈసారి కూడా క్వాలిఫికేషన్‌లో మెరుగైన ప్రదర్శన చేసి, గ్రూప్ విజేతగా నిలిచిన మొరాకోపై మంచి అంచనాలే ఉన్నాయి. మొరాకో జట్టులో అచ్రాఫ్ హాకిమి, బ్రహీమ్ దియాజ్, సొఫ్యాన్ అమ్రాబాత్ కీలక ఆటగాళ్లుగా ఉన్నారు.

## ఐర్లాండ్, ఇంగ్లండ్ టీ20లకు టీమిండియాలో కీలక మార్పు
# సిరాజ్ ఔట్, ప్రసిద్ధ్ కృష్ణ ఇన్




**ముంబై:** ఐర్లాండ్, ఇంగ్లాండ్ టూర్ కోసం ప్రకటించిన టీమిండియా జట్టులో కీలక మార్పు జరిగింది. హైదరాబాద్ ఎక్స్‌ప్రెస్ మహ్మద్ సిరాజ్‌కు విశ్రాంతి కల్పించింది. అతని స్థానంలో టీ20లకు ప్రసిద్ధ్ కృష్ణను ఎంపిక చేసింది. సుదీర్ఘ అంతర్జాతీయ సీజన్ ముందున్న నేపథ్యంలో సిరాజ్‌పై వర్క్‌లోడ్ తగ్గించేందుకు అతనికి విశ్రాంతి కల్పించినట్లు బీసీసీఐ వెల్లడించింది. రెండు సిరీస్‌లకు సిరాజ్ స్థానంలో ప్రసిద్ధ్ కృష్ణ ఆడనున్నట్లు బీసీసీఐ కార్యదర్శి దేవజిత్ సైకియా తెలిపారు. శ్రేయస్ అయ్యర్ కెప్టెన్‌గా, తిలక్ వైస్ కెప్టెన్‌గా జట్టును ముందుకు నడిపించనున్నారు.యువఆటగాళ్లకు అవకాశం దక్కింది.

**షెడ్యూల్ విడుదల**

ఐర్లాండ్, ఇంగ్లాండ్ పర్యటనలకు సంబంధించిన అధికారిక షెడ్యూల్ కూడా విడుదలైంది. జూన్ 26న ఐర్లాండ్‌తో మొదటి టీ20 మ్యాచ్ ఆడనుంది. ఆ తర్వాత జూన్ 28న రెండో టీ20 మ్యాచ్ జరగనుంది. ఐర్లాండ్ పర్యటన ముగిసిన వెంటనే జూలై 1 నుంచి ఇంగ్లాండ్‌తో అసలైన సిరీస్ ప్రారంభం కానుంది. ఈ పర్యటనలో భాగంగా ఇంగ్లాండ్ జట్టుతో టీమిండియా ఐదు మ్యాచ్‌ల టీ20 సిరీస్‌లో తలపడనుంది.

**భారత పూర్తి జట్టు**

శ్రేయస్ అయ్యర్ (కెప్టెన్), అభిషేక్ శర్మ, సంజు శాంసన్ (వికెట్ కీపర్), ఇషాన్ కిషన్ (వికెట్ కీపర్), శివమ్ దూబే, తిలక్ వర్మ (వైస్ కెప్టెన్), నితీశ్ కుమార్ రెడ్డి, అక్షర్ పటేల్, వాషింగ్టన్ సుందర్, వరుణ్ చక్రవర్తి, రవి బిష్ణోయ్, హర్షిత్ రాణా, అర్ష్‌దీప్ సింగ్, ప్రిన్స్ యాదవ్, వైభవ్ సూర్యవంశీ, ప్రసిద్ధ్ కృష్ణ.

# ఆసీస్ ఓపెన్ టైటిల్‌పై సింధూ ఫోకస్



**సిడ్నీ:** ఈ సీజన్లో అయిదు నెలలు పూర్తయినా భారత బ్యాడ్మింటన్ స్టార్ పీవీ సింధూ టైటిల్ సాధించడంలో విఫలమవుతోంది. సింగపూర్, థాయ్‌లాండ్ ఓపెన్లలో క్వార్టర్స్‌లో ఓడిన సింధు.. ఇండోనేసియా ఓపెన్లో రెండో రౌండ్లో ఇంటిముఖం పట్టింది. దీంతో మంగళవారం ప్రారంభమైన ఆసీస్ ఓపెన్లో మరోసారి టైటిల్ కోసం సింధు బరిలో దిగుతోంది.

ఈ టోర్నీలో ఆమె ఎలాంటి ప్రదర్శన చేస్తుందో చూడాలి. మహిళల సింగిల్స్ తొలి రౌండ్లో లూసియా కాస్టిల్లో (పెరూ)తో సింధూ తలపడనుంది. మరో తొలి రౌండ్ పోరులో హాన్ గ్జియాన్ (చైనా)తో ఇషారాణి బారువా పోటీపడనుంది. చియాన్ (చైనీస్ తైపీ)తో తన్వి శర్మ.. ఒకుహార (జపాన్)తో అన్మోల్.. వాంగ్ లింగ్ (మలేసియా)తో ఆకర్షి కశ్యప్ పోటీపడనున్నారు. పురుషుల సింగిల్స్‌లో మో జాకీ (ఇండోనేసియా)తో ప్రణయ్, జస్టిన్ హో (మలేసియా)తో కిరణ్ జార్జ్ తొలి రౌండ్ మ్యాచ్‌లు ఆడతారు. పురుషుల డబుల్స్‌లో హరిహరన్ అర్జున్, అచ్యుతాదిత్య రావుఅర్జున్ రెడ్డి, మిక్స్‌డ్ డబుల్స్‌లో ధ్రువ్ కపిలతనీషా క్రాస్టో జోడీ ఈ టోర్నీలో తలపడతాయి.

# ఒత్తిడిలోనే పసిడి, వెండి ఫ్యూచర్లు
# స్పాట్‌గోల్డ్ ఔన్స్‌కు 4300 డాలర్లు




**న్యూఢిల్లీ,జూన్ 9:** అమెరికా ఫెడరల్ రిజర్వ్ కఠిన ద్రవ్య విధానాన్ని కొనసాగించే అవకాశాలను పెంచుతున్న నేపథ్యంలో సమీప కాలంలో బంగారం ధరలు ఒత్తిడిలోనే కొనసాగే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ అంచనావేసింది. ఇరాన్-ఇజ్రాయెల్ మధ్య కాల్పుల విరమణ ఒప్పందం కుదరడంతో పశ్చిమ ఆసియాలో భౌగోళిక ఉద్రిక్తతలు తగ్గినప్పటికీ, పెట్టుబడిదారులు ఇప్పుడు అమెరికా ద్రవ్యోల్బణ గణాంకాలు మరియు ఫెడరల్ ఓపెన్ మార్కెట్ కమిటీ సమావేశంపై దృష్టి సారించారు. మంగళవారం స్పాట్ గోల్డ్ ఔన్సుకు 4,300 డాలర్లకు పైగా స్థిరంగా కొనసాగింది. ముడి చమురు ధరలు తగ్గడం, ఇంధన ఆధారిత ద్రవ్యోల్బణ ఆందోళనలు సడలడం బంగారానికి మద్దతు ఇచ్చాయి. అమెరికా కార్మిక మార్కెట్ బలంగా ఉండటంతో డాలర్ మరియు ట్రెజరీ బాండ్ యీల్డ్స్ పెరిగాయి. ఫెడ్ వడ్డీ రేట్లను ఎక్కువ కాలం ఉన్నత స్థాయిలో కొనసాగించే అవకాశాలపై అంచనాలు బలపడ్డాయి. ప్రస్తుతం మార్కెట్లు డిసెంబర్‌లో వడ్డీ రేటు పెంపుకు సుమారు 70 శాతం అవకాశాన్ని అంచనా వేస్తున్నాయి.కోటక్ సెక్యూరిటీస్ ప్రకారం, ఎంసీఎక్స్ గోల్డ్ ఆగస్టు ఫ్యూచర్స్‌కు రూ.1,53,649 వద్ద కీలక మద్దతు ఉంది. ఈ స్థాయి కంటే దిగువకు పడితే ధరలు రూ.1,53,092 వరకు, ఆ తర్వాత రూ.1,51,290 వరకు తగ్గే అవకాశం ఉంది. మరోవైపు, పైస్థాయిలో రూ.1,55,451 వద్ద ప్రతిఘటన ఉండగా,తదుపరి ప్రతిఘటన స్థాయిలు రూ.1,56,008 మరియు రూ.1,57,810గా ఉన్నాయి. స్పాట్ గోల్డ్‌కు ఔన్సుకు 4,296.5 డాలర్లు, 4,274.8 డాలర్లు, 4,204.8 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 4,366.5 డాలర్లు, 4,388.2 డాలర్లు, 4,458.2 డాలర్ల వద్ద ప్రతిఘటన కనిపిస్తుందని తెలిపింది. వెండి ధరలు మెరుగైన మార్కెట్ సెంటిమెంట్ కారణంగా ఔన్సుకు 68 డాలర్లకు పైగా చేరాయి. మద్దతు స్థాయిలు బలహీనపడితే వెండి ధరలు కూడా ఒత్తిడికి లోనయ్యే అవకాశం ఉందని కోటక్ సెక్యూరిటీస్ హెచ్చరించింది. స్పాట్ సిల్వర్‌కు 67.18 డాలర్లు, 66.43 డాలర్లు, 64.01 డాలర్ల వద్ద మద్దతు ఉండగా, 69.60 డాలర్లు, 70.35 డాలర్లు, 72.77 డాలర్ల వద్ద ప్రతిఘటన ఉండొచ్చునిఅంచనావేసింది. ఎంసీఎక్స్ సిల్వర్ జూలై ఫ్యూచర్స్‌కు రూ.2,42,937, రూ.2,40,928, రూ.2,34,422 వద్ద మద్దతు స్థాయిలు ఉండగా, రూ.2,49,442, రూ.2,51,452, రూ.2,57,958 వద్ద ప్రతిఘటన స్థాయిలున్నట్లు అంచనావేసింది.

## ధరల పెంపుతోనే ఆయిల్ కంపెనీలకు నష్టాల రికవరీ

**న్యూఢిల్లీ, జూన్ 9:**పశ్చిమాసియా యుద్ధంతో ఏర్పడిన ఇంధన కొరత వల్ల చమురు మార్కెటింగ్ కంపెనీలకు ఈ 78 రోజుల్లో ఎదురయిన రూ.1.23 లక్షలకోట్ల భర్తీకోసం కేంద్రం పెట్రోలు,డీజిల్‌పై సుంకాలను రద్దుచేసింది. కస్టమర్లపై ఎక్కువ భారం పడకుండా ముందు ఆయిల్‌కంపెనీలకు ఈ సుంకాల రద్దుతో కొంతమేర నష్టం రికవరీచేసిందనినిపుణులు పేర్కొంటున్నారు. గతనెల చివరినాటి వరకూ ఉన్న డేటానుచూస్తే ఆయిల్‌మార్కెటింగ్ కంపెనీలు రోజుకు రూ.600 కోట్లమేర నష్టం భరిస్తున్నట్లు తేలింది. నాలుగుసార్లు పెట్రోలు, డీజిల్‌ధరలు పెంచడంవల్ల ఈ నష్టం కొంతమేర భర్తీ అయిందని తెలుస్తోంది. పెట్రోడీజిల్ ధరలను పెంచడంవల్లనే ఎదురవుతున్న రూ.1.23లక్షల కోట్లనష్టాన్ని భర్తీచేయగలిగామని పెట్రోలియం కార్యదర్శి సుజాత శర్మ అన్నారు. ఇంధన ధరలు పెంపునకు ముందు రోజుకు రూ.1000 కోట్లు నష్టం ఓఎంసిలు ఎదుర్కొన్నట్లు తేలింది. మేచివరివారంలోనే ఇంధన ధరలను లీటరుకు రూ.2.7 చొప్పున పెంచింది. ఈచర్య మార్కెటింగ్‌కంపెనీల నష్టాలను 44శాతం మేర తగ్గించగలిగింది. నాలుగుదశలుగా మే 15,19,23,25 తేదీల్లో పెట్రోలు డీజిల్‌లపై ధరలు పెంచారు.హార్ముజ్‌లో సమస్యలు, ఉద్రిక్తతలు కొనసాగుతున్నా భారత్ ఇంధన సరఫరాకు ఎలాంటి ఇబ్బందులువేలని సుజాత శర్మ వెల్లడించారు. ఫిబ్రవరి8 నుంచి ప్రారంభం అయిన పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్ల భారత్‌లో వివిధ రంగాలపై ప్రభావం పడిందన్నారు. అయితేప్రభుత్వ చర్యలవల్ల నష్టాల భారం రోజుకు రూ.750క ఓట్లకు తగ్గాయని అన్నారు. ఇక గ్యాస్‌సరఫరాలో ఎలాంటి అంతరాయాలు లేకుండా నిరాఘాటంగా పెంచాలని ఆయిల్‌కంపెనీలకకు ఆదేశాలిచ్చినట్లు తెలిపారు.

# టెక్నాలజీ,బ్యాంకింగ్ షేర్ల మద్దతు
# లాభాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ




**ముంబై, జూన్ 9:** అంతర్జాతీయ మార్కెట్లలో సానుకూల సంకేతాలు, ముడి చమురు ధరల తగ్గుదల, బ్యాంకింగ్ షేర్లలో బలమైన కొనుగోళ్లతో దేశీయ ఈక్విటీ మార్కెట్లు మంగళవారం తిరిగి లాభాల బాట పట్టాయి.ఇజ్రాయెల్-ఇరాన్ మధ్య ఉద్రిక్తతలు తగ్గుముఖం పట్టడంతో బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 93 డాలర్ల దిగువకు చేరింది. దీంతో ద్రవ్యోల్బణం, భారత దిగుమతి వ్యయాలపై ఉన్న ఆందోళనలు తగ్గాయి.ప్రపంచ మార్కెట్లలో టెక్నాలజీ షేర్లు కోలుకోవడంతో పెట్టుబడిదారుల సెంటిమెంట్ మెరుగుపడింది. మరోవైపు, విదేశీ కరెన్సీ నిధుల సమీకరణకు సంబంధించి రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ఫారెక్స్ స్వాప్ కార్యాచరణ బ్యాంకింగ్ రంగానికి ఊతమివ్వడంతోబ్యాంకింగ్, ఫైనాన్షియల్ సర్వీసెస్ షేర్లలో కొనుగోళ్లు పెరిగాయి.

రోజంతా లాభాల్లో ట్రేడైన మార్కెట్లో సెన్సెక్స్ 394.50 పాయింట్లు పెరిగి 73,918.76 వద్ద ముగిసింది. నిఫ్టీ 119.10 పాయింట్లు లాభపడి 23,242.10 వద్ద స్థిరపడింది. గత రెండు సెషన్లలో నిఫ్టీ 1.25 శాతం క్షీణించింది. నిఫ్టీ పెరుగుదలకు ప్రధానంగా స్టేట్ బ్యాంక్ ఆఫ్ ఇండియా 2.11, ఐసీఐసీఐ బ్యాంక్ 1.98, యాక్సిస్ బ్యాంక్ 1.92 షేర్లు మద్దతు ఇచ్చాయి.బీఎస్ఈ మిడ్‌క్యాప్ సూచీ 1.24 శాతం, స్మాల్‌క్యాప్ సూచీ 1.39 శాతం చొప్పున పెరిగాయి. బీఎస్ఈలో 2,782 షేర్లు లాభపడగా, 1,423 షేర్లు నష్టపోయాయి. 207 షేర్లలో ఎలాంటి మార్పు లేదు. విదేశీ మారక మార్కెట్లో రూపాయి డాలర్‌తో పోలిస్తే స్వల్పంగా బలహీనపడింది. రూపాయి విలువ డాలర్‌కు 95.41 వద్ద ట్రేడైంది.ఎంసీఎక్స్‌లో ఆగస్టు 2026 గోల్డ్ ఫ్యూచర్స్ ధరలు 0.01 శాతం పెరిగి 10 గ్రాములకు రూ.1,54,789కు చేరాయి. అమెరికా 10 ఏళ్ల బాండ్ యీల్డ్ 4.558 శాతానికి చేరింది.బ్రెంట్ క్రూడ్ ధర బ్యారెల్‌కు 1.74 డాలర్లు లేదా 1.85 శాతం తగ్గి 92.51 డాలర్లకు చేరింది.

మోతీలాల్ ఓస్వాల్ ఫైనాన్షియల్ సర్వీసెస్ షేరు 5.25 పెరిగిది. హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ కంపెనీలో 0.30 వాటా కొనుగోలు చేసింది. యాపిల్ ఐఓఎస్ సాఫ్ట్‌వేర్ అప్‌డేట్లు ప్రకటించడంతో రెడింగ్టన్ షేరు 4.69 పెరిగింది.ఆయే ఫైనాన్స్ 15మిలియన్ డాలర్ల వరకు ఎన్సీడీల ద్వారా నిధుల సమీకరణకు అనుమతి ఇవ్వడంతో షేరు 8.68 ఎగిసింది. జేఎన్‌కే ఇండియా యూఏఈ సంస్థ నుంచి రూ.100300 కోట్ల మధ్య విలువైన భారీ ఆర్డర్ పొందడంతో 15.70 లాభపడింది.

గ్రాసిమ్ ఇండస్ట్రీస్ కర్ణాటకలో లయోసెల్ ఫైబర్ సామర్థ్య విస్తరణకు రూ.3,094 కోట్ల పెట్టుబడి ప్రకటించడంతో 1.49పెరిగింది. అవాంటెల్‌కు డీఆర్డీవో నుంచి రూ.9.94 కోట్ల ఆర్డర్ లభించడంతో 4.35 పెరిగింది.

వీఏ టెక్ వాబాగ్ యూఏఈలో అజ్మాన్ సెవేజ్ బయోరిఫైనరీ ప్రాజెక్టు కాంట్రాక్టు దక్కించుకోవడంతో 2.72లాభపడింది. హెక్సాగన్ న్యూట్రిషన్ ఐపీఓకు భారీ స్పందన లభించింది. జూన్ 9 సాయంత్రం 4:25 గంటల వరకు ఈ ఇష్యూకు 52.89 రెట్లు సబ్‌స్క్రిప్షన్ నమోదైంది. మొత్తం 2.16 కోట్ల షేర్లకు గాను 114.24 కోట్ల షేర్లకు బిడ్లు వచ్చాయి. షేరు ధర బ్యాండ్‌ను రూ.4245 మధ్య నిర్ణయించారు.

## భారత్ ఆర్థికవృద్ధి 6.4శాతం మాత్రమే: ఫిట్చ్ రేటింగ్స్


**ముంబయి,జూన్ 9:** అంతర్జాతీయ రేటింగ్స్ సంస్థ ఫిట్చ్ రేటింగ్స్ భారత్ జిడిపి వృద్ధిరేటును తగ్గించింది. ప్రస్తుత ఆర్థిక సంవత్సరంలో 6.7 నుంచి 6.4శాతంగా మాత్రమే ఉంటుందని తెలిపింది.అమెరికా ఇరాన్ యుద్ధం ఆర్థికవ్యవస్థను కొంతమేర ఒత్తిడికి గురిచేసిందని, సెప్టెంబరు, డిసెంబరు త్రైమాసికాల్లో ఆర్థికవృద్ధి మందగమనంతో ఉందని ఫిట్చ్ వెల్లడించింది. 2027 ఆర్థికసంవత్సరంలో కూడా 7.4శాతంనుంచి తగ్గుతుందని అంచనావేసింది.ధరల పెరుగుదల,వాస్తవరాబడుల్లో కోత, వినియోగదారుల వ్యయంలో క్షీణత వంటివి కొంతకారణం అయ్యాయి. జిడిపి వృద్ధి 2027లో 6.4శాతంగా మాత్రమే ఉంటుందని ఫిట్చ్ అంచనావేసింది. దేశీయ డిమాండ్ ఒక్కటే వృద్ధికి ఆస్కారంగా నిలిచింది. దిగుమతులు తగ్గినట్లయితే ఆర్థికవృద్ధి పెరుగుదలకు కొంత దోహదంచేసినట్లవుతుంది. బాహ్య డిమాండ్‌నుంచి వచ్చే వృద్ధికూడా కొంతమేర జిడిపికి కీలకం అవుతుందని ఫిట్చ్ రేటింగ్స్ తన జూన్ గ్లోబల్ ఎకనమిక్ ఔట్‌లుక్‌లో వెల్లడించింది.గతవారంలో ఆర్‌బిఐ కూడా భారత్ వృద్ధిరేటును ప్రస్తుత ఆర్తిక సంవత్సరంలో 6.6శాతంగ ఆమాత్రమే ఉంటుందని వెల్లడించింది. ద్రవ్యోల్బణం కూడా 5.1శాతంగా పెరుగుతుందని తెలిపిన సంగతి తెలిసిందే.కేవలం పశ్చిమాసియా ఉద్రిక్తతలవల్లనే ఇంధన ధరలు ఇటీవలి కాలంలో 4నుంచి 5శాతంవరకూ పెరిగాయని,దీనివల్ల ధరల పెరుగుదల ఆర్థిక వృద్ధికి బ్రేకులు వేసినట్లు అభిప్రాయపడింది.వినియోగ వ్యయం పెరిగితే, ఇంధన ధరలు కొంతమేర సద్దుమణిగిన పక్షంలో పెట్టుబడులు పెరిగి వృద్ధిరేటు6.7శాతంగా ఉంటుందని అంచనావేసింది. 2029 ఆర్థికసంవత్సరానికి మాత్రం 6.4శాతం వృద్ధి ఉండవచ్చని కూడా ఫిట్చ్ రేటింగ్స్ ప్రకటించింది.

## రూపాయి స్థిరీకరణ చర్యలతో 65 బిలియన్ డాలర్ల రాక

**ముంబయి,జూన్9:**రిజర్వుబ్యాంకు ఇటీవలికాలంలో రూపాయి కట్టడికి చేపట్టిన కార్యాచరణ కారణంగా భారత్‌కు 55నుంచి 65 బిలియన్ డాలర్ల పెట్టుబడులు వచ్చే అవకాశాలు పెరిగాయని తెలుస్తోంది. రూపాయి స్థిరీకరణతోపాటు దేశ చెల్లింపుల సమతుల్యతను మిగులులోకి తీసుకురావడంద్వారా పెట్టుబడులను ఆకర్షించగలుగుతున్నదని ఎస్‌బిఐ రీసెర్చి నివేదిక ఉటంకించింది. ఆర్బీఐ సమన్వయంతో చేపట్టిన కార్యా చరణతో రూపాయి స్థిరపడిందని, డెట్‌మార్కెట్‌కు ఊతం ఇచ్చిందని, విదేశీ మూలధన వనరులు స్థిరంగా సమకూరేవిధంగా ఆర్బీఐ చర్యలు ఉన్నాయని ఎస్బీఐ ఎకోరాప్ నివేదికలో ఉటంకించింది. చూన్‌నెల మానిటరీ పాలసీ సమీక్షను చూస్తే ఆర్బీఐ విదేశీ మూలధన వనరులు సమీకరించుడానికి అనేక చర్యలు చేపట్టింది. పెట్టుబడులపరిమితులను పెంచింది. దీనివల్ల దేశ బ్యాలెన్స్‌ఆఫ్ పేమెంట్స్ పటిష్టం అయినట్లు ఎస్‌బిఐ నివేదికలో ప్రస్తావించింది. రాయితీలతోకూడిన ఫారెక్స్ స్వాప్‌వల్ల విదేశీ వాణిజ్య రుణాలకు ప్రోత్సాహకాలు కూడా ఇచ్చినట్లయింది. బ్యాంకులు కూడా మూడు, ఐదేళ్లకాలానికి ఎఫ్‌సిఎన్ఆర్ బి డిపాజిట్లుసేకరించుకునేందుకు వెసులుబాటు ఇచ్చింది. 55నుంచి 65బిలియన్‌డాలర్ల రాకవల్ల 2027 ఆర్థిక సంవత్సరంలో బ్యాంకింగ్ వ్యవస్థలోకి డిపాజిట్ల వృద్ధి మరింత పెరుగుతుందనిఎకోరాప్ నివేదికలో ప్రస్తావించింది. 14.5 నుంచి 15వాతం వరకూ డిపాజిట్ల వృద్ధి ఉంటుంది.



## ఒక్కరోజులోనే ఈక్విటీలనుంచి
## 4566.03 కోట్ల ఎఫ్‌పిఐలు వెనక్కి!



**ముంబై, జూన్ 9:** భారతీయ ఈక్విటీ మార్కెట్లో విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారులు వరుసగా పదో ట్రేడింగ్ రోజున పెట్టుబడులు విత్‌డ్రాచేసుకున్నారు. భారతీయ రిజర్వ్ బ్యాంక్ ప్రభుత్వ సెక్యూరిటీల పెట్టుబడి పరిమితులపై సడలింపులు ప్రకటించినప్పటికీ, మంగళవారం ఒక్కరోజే ఎఫ్‌పీఐలు రూ.4,566.03 కోట్ల విలువైన షేర్లను విక్రయించారు.ఇక దేశీయ సంస్థాగత పెట్టుబడిదారులు మాత్రం కొనుగోళ్లను కొనసాగిస్తూ రూ.6,159.48 కోట్ల విలువైన ఈక్విటీలను కొనుగోలు చేశారు. జూన్ నెలలో ఇప్పటివరకు ఎఫ్‌పీఐలు రూ.56,384 కోట్ల మేర నికరంగా పెట్టుబడులను ఉపసంహరించుకోగా, 2026 సంవత్సరంలో మొత్తం విక్రయాల విలువ రూ.2.81 లక్షల కోట్లకు చేరింది.2026లో ఫిబ్రవరి నెల మినహా ప్రతి నెలలోనూ ఎఫ్‌పీఐలు భారతీయ షేర్లను నికరంగా విక్రయించారు. జనవరిలో రూ.35,962 కోట్ల విలువైన షేర్లను విక్రయించగా, ఫిబ్రవరిలో అంతర్జాతీయ ఆర్థిక పరిస్థితులు మెరుగుపడటంతో రూ.22,615 కోట్ల పెట్టుబడులు పెట్టారు. పశ్చిమ ఆసియాలో ఉద్రిక్తతలు పెరగడంతో ప్రపంచ మార్కెట్లలో రిస్క్ పెరగడంతో ఎఫ్‌పీఐలు మళ్లీ విక్రయాల బాట పట్టారు. మార్చిలో రికార్డు స్థాయిలో రూ.1.18 లక్షల కోట్ల ఈక్విటీలను విక్రయించగా, ఏప్రిల్‌లో రూ.60,847 కోట్ల మేర వాటాలను అమ్మేశారు.ఇదిలా ఉండగా, భారతీయ రిజర్వ్ బ్యాంక్ 2027 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విదేశీ పోర్ట్‌ఫోలియో పెట్టుబడిదారుల ప్రభుత్వ సెక్యూరిటీలు మరియు రాష్ట్ర అభివృద్ధి రుణపత్రాల్లో పెట్టుబడి పరిమితులను ఇటీవల ప్రకటించింది.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at Flat.No. 22, G Block ,Industrial park Auto Nagar , Gajuwaka, Visakhapatnam-530 012, Phones:2706784,2706785,2706786,2706787,2706622, Fax: 2706522, RNI No.64864/96, Editor : *Damerla Sai Baba, *Responsible for selection of News under the PRB Act. Regd.No. H/SD/337/12-14.